

musings
నరేష్ నున్నా



నరేష్ నున్నా

# AME

Facebook Musings

## BY NARESH NUNNA

(nareshnunna@gmail.com, Cell : +91 984 9009 776)

Cover illustration : Moshe Dayan

Title Letters : Raju Epuri

First Edition : April 2017

Copies : 500

e-book : Kinige.com

Sole Distributors:
Vishalandra Book House All Branches

Printing & Publishers
**CHINUKU Publications**
Gandhinagar, Vijayawada – 520 003
Cell : 98481 32208

Price : Rs. 120/-

నా ఉషకి

# నైరూప్య సమయాలు- నిర్దిష్ట సందర్భాలు!

*(ఓ కృతజ్ఞతకి అటు... ఇటు)*

ఏదైనా రచన ఒక పుస్తకంగా అచ్చుకు నోచుకుంటున్నప్పుడు, ఆ కార్యానికి కారణాలను ఎంచడం, కృతజ్ఞతాంజలి ఘటించడం ఆనవాయితి. కానీ, కార్యాకారణాలనే మూసలోకి ఇరికించడానికి ఎంతమాత్రం మనస్కరించని నా యీ మొత్తం పుస్తకమే ఒక 'ఎకనాలెడ్జిమెంట్' అనబడే ఉపకారస్మృతి అయినప్పుడు, ఆ 'ఆనవాయితీ' కనీసం కవళికలైనా మార్చుకోకుండా, subject- predicate పేటికలో కొయ్యబారిన విశుద్ధ వాక్యంలా ఉండాలా? వీల్లేదు!

జగల్లీల సాక్షాత్కారం జరిగిన బ్రహ్మానందంలో మహాకవి కాళిదాసు నోట శ్యామలాదండకం పలికింది. అది కావ్యానికి ప్రొలోగ్ కాదు, దానికదే కావ్యం; భావోద్వేగం- మహోద్రేకమే ఆద్యంతాలైన మహత్కావ్యం! సృజనతో ఎంతమాత్రం పొంతన లేని, కేవలం ఉద్వేగ సంబంధిగా ఉదాహరణవంటి నా సమాంతరానుభవం చెబుతాను : ఫేస్‌బుక్ లోకంలో 'ఆమె' ఎదురవ్వడం- ఇంతక్రితం అన్నానే- 'సాక్షాత్కారం'!. 'జననాంతర సౌహృదాని..'ని జ్ఞప్తి చేసే అనుభవం! కాలానికి తెలిసిన అన్ని ప్రమాణాలూ కురచవని అనిపించే జన్మజన్మాల బంధం ఉందనుకుంటున్న ఆ మరువపు సాధు సురభిళ సాంధ్య సమీరాల ఉషస్సుతో 'నీ (కేవల) పరిచయానికి నిండా ఓ ఏడాది' (మాత్రమే) అని అదే ఫేస్‌బుక్ 'వాస్తవాలు' చెబుతుంటే ఎంత రగిలిపోతుంది? అటువంటి రజోయాతనల్ని, తమోతాపాలన్నింటినీ కూర్చిన ఈ సంకలనానికి ఆముఖం- ఫక్తు ఊరూ- పేరు- చిరునామాల చిట్టానా? ఆ తెలుసనుకున్న - తెలిసీతెలియని- తెలిసే అవకాశమే లేని ఆ అనేకానేక 'ఆమె'ల పేర్లు చెప్పాలని ఉబలాటపడినా, అసలేమైనా తెలుసా నాకు నిజంగా?

***

నా పాలిట కవిసమయాల్లాంటి ఆ అనామికల్ని వదిలేసి, ఈ పుస్తకప్రచురణకి సందర్భాల వంటి కొందరు సన్నిహితుల్ని ఇక తలుచుకుంటాను-

బావమరిది సుధీర్ ఆప్తమిత్రుడు, నాకూ అంతే ఆప్తుడైన (నా ఫేసుబుక్కు రాతలు పుస్తకంగా రావాలని పదే పదే కోరుకున్న) రాజా ముత్యాల; ప్రవాసం అంటే అది దూరానికి సంబంధించిందని కాదని పదే పదే గుర్తుచేసే శ్రీయుతులు ప్రసాద్ కునిశెట్టి, డా. ఇస్మాయిల్ సుహైల్ పెనుగొండ, సాహితీ మిత్రులు ప్రసాద్ చెరసాల, విన్నకోట రవిశంకర్, రవీంద్ర వీరెల్లి, శివ సోమయాజుల గార్లు, ఇక్కడ ఆత్మబంధువులు శ్రీ పరకాల ప్రభాకర్, శ్రీ వావిలాల రామలింగం, శ్రీ ఫణికుమార్ (ఐ ఏ ఎస్), శ్రీ కల్లూరి భాస్కరం, శ్రీ జయంతి శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త శ్రీ వి.ఎస్.ఆర్. మూర్తి, శ్రీ ఈమని శివనాగిరెడ్డి, శ్రీ కందుల రమేష్, శ్రీ బి.కె.ఈశ్వర్, శ్రీ దుర్గం రవీందర్, తమ్ముడు రవికిరణ్ నున్నా, బావ చింతకింది శ్రీనివాసరావు, బావమరుదులు గోపీచంద్ భట్టారం, సతీష్ తోట, ముందుమాట రాసిచ్చిన రాణీ శివశంకర శర్మ గారు, చేదోడువాదోడుగా ఉండే ఆర్టిస్ట్ ఈపూరి రాజు గారు, ముఖచిత్రకారుడు మోషే డయాన్, పేజ్ లే ఔట్ చేసిన సత్తార్, ముద్రణ బాధ్యతలు ప్రేమతో స్వీకరించిన 'చినుకు' సంపాదకులు నండూరి రాజగోపాల్ గారు!

# దొంతర


హేతువు అనే పెంజీకటికవ్వల

ఏ వైపూ ఎండ కాయని గోడ మీద...

ఆమె... విశాఖ! 19

A Friend After A Saga Of Gender Sensitivity! 23

ఓ సుమధ్య... ఆమె వెనక నా oriental నడక!! 28

Her Bewitching Smile Heals Me, But... 33

రాఖీ పున్నమి-ఒకానొక పెను జ్ఞాపకం 36

ఏమి చూసి మోహిస్తివి? 42

చొక్కి చంద్రాభరణపు సొమ్ములువెట్టెనా? 46

ఓ అనామిక మరణం 48

జగల్లీలకి నే వెలిగించే Reciprocal దీపం- దీపావళి 51

దురుసు సొగసు-రెండు ఆక్సిడెంట్లు 55

గళన్మంగళ పంతువరాళి! 58

Her Birth Day and Riddle of Chocolates! 60

I Await HER B'Day! 66

రక్తోజ్వల ముక్తి క్షణం! 68

నీవెంత నెరజాణవౌరా... 71

ఆమె నా 'Signature' Tune! 73

ఆ పగలు రేయిగా... 74

I Know HER Through The Ages! 75

ఆమె ఓ అభిషేక ప్రియ! 77

Between the idea.... And the reality! 79

నీ జ్వరం నేను 82

My dear, I don't give a damn 84

రమ్మౌ జోగిని ఈ రామ సుందరి 86

She Pats Me, My Life Is Done! 89

Her WedLock! 92

సొంపుగా చాచవే నీ సోగ కరము! 95

ముది నాపసాని ముందు నా ముదిగారం 97

She Is The Ocean! 99

నిన్ను స్మరిస్తే... 104

కృష్ణం వందే జగద్గురుం 105

My Banyan's B'Day! 115

Daughter& Dad: More Than A Passing Resemblance! 119

ఝరీ ఝర్ఝరీ ప్రహర్షం! 123

Falling in Love with YOU, many a time! 125

Paint the town PINK, it's my daughter's B Day! 128

Who Are You? 130

కానుకలేమి నేనివ్వగలను 133

బంగారు పతిమవు.... పాలవెల్లి కూతురవు! 135

A Star Danced & Under That Was She Born 138

నా కొరకు చెమ్మగిల్లే నయనం 142

She's Outgrown My Lap! 144

నాన్న అంటేనే గాయం 147

Proposal Day: వలపు నలుపో తెలుపో? 148

కడగనివ్వు చెలీ! నీ క్షమాపాదాలు 152

# హేతువు అనే పెంజీకటికవ్వల

'నిజమే విష్ణువు అలంకార వ్యామోహితుడే. అంతా పైపైన వ్యవహారం. ఫోర్‌ప్లే మల్లే. శివుడు అలాకాదు అభిషేక ప్రియః శివః మొత్తంగా తడిసిపోవాలి. నిండారా మునిగిపోవాలి. వాటమైన ముద్దు గాఢమైన కౌగిలి. తీక్షణమైన తాపం, తీవ్రమైన మోహం.. తనువెల్లా కాగిపోవాలి, నిలువెల్లా కరిగిపోవాలి... అదే సత్యం, శివం, సుందరం'.

యిదిగో యిలా రాస్తూ 'అభిషేక ప్రియ' అనే పదబంధాన్ని సృష్టించగల తాత్వికుడు నరేష్ నున్నా.

నరేష్‌లోని ప్రత్యేకత యేమిటంటే, తన ప్రపంచాన్నే ఆవిష్కరిస్తాడు. తన పరిధిలోనే తిరుగుతాడు భూమిలాగే. దానిలోనే సత్యం, శివం, సుందరం. అణువులోనే బ్రహ్మాండాన్ని చూపుతాడు. అంతా వ్యక్తిగతం, అదే విశాల విశ్వం. కూపస్థ మండూకం కాదు, కూపస్థ విశ్వం.

నిజానికి పరిధుల్లోనే వైశాల్యం సాధ్యం. అందుకే తండ్రి, భార్య, తన కూతుర్లూ, 'మధ్యే మధ్యే పానీయం సమర్పయామి'లా వ్యామోహాల వెంట పరుగెత్తి పరుగెత్తి తిరిగి గూటికి చేరుకొనే హృదయం... ఇదే నరేష్.

తండ్రి హేతువాది, ఆయనది వైరభక్తి అంటాడు. అంటే దేవుడంటే పడదు. గుడిలోకి అడుగుపెట్టడం పాపం. దైవ నిందలోని అహేతుకతని గుర్తించిన బుద్ధిశాలి నరేష్. అంతేకాదు సంప్రదాయ ధిక్కారం మిగిల్చిన శూన్యం, వెలితి విసుగు తెప్పిస్తాయి. ఐతే తండ్రి కృష్ణాష్టమి రోజున జన్మించాడు. పేరు రాధాకృష్ణమూర్తి. కృష్ణుని గురించి ఆసక్తి తండ్రి పేరు నుంచి, తండ్రి గురించి చెప్పిన కొన్ని కథనాల నుంచి మొదలవ్వడం విశేషం. 'కృష్ణం వందే జగద్గురుం' అనేంత కృష్ణభక్తి. తన తండ్రి పుట్టినరోజే కృష్ణాష్టమి కావడం దగ్గరి నుంచి మొదలౌతుంది. గానం, లాస్యం, కవిత్వం ముప్పిరిగొన్న శ్రీ జయదేవ భణిత మిద మద్భుత కేశవ కేళీ రహస్యం.. కళా విముఖులైన హేతువాద మూర్ఖులకే కాదు. ఆ

శిష్ట ధార్మిక నైతికాధములకీ బోధపడే అవకాశమే లేదని తేలిపోయింది అని బహుముఖాల అజ్ఞానాన్నీ అరసికతనీ బయటపెడ్తాడు. కృష్ణుని రాసలీలలలో శృంగారం లేదని నిరూపించడానికి ప్రవచనకారులు పడే పాట్లని యెద్దేవా చేస్తాడు. అభిషేకాన్ని రసాభిషేకంగా చూసిన వాడు కదా మరి.

పడమటి నుంచి తూర్పుకి నిరంతరాయంగా దిగుమతి అయ్యే సంకర భావాలతోనే ఆడది ఆటవస్తువయ్యింది, అంగడి సరుకయ్యింది అంటారు నరేష్. ప్రబంధాలు కావ్యాల్లోని అంగాంగ వర్ణనల్లో ఆమె పట్ల తన్మయత్వం వుందే కాని పడమటి దొరలు చూపించే చులకన లేదు అంటాడు అంతేకాదు దిగంబర కవుల్లోని స్త్రీ శరీర నిందని నిలదీస్తాడు.

మొత్తంగా హేతువాద శుష్కత్వం, ఆధ్యాత్మిక ప్రవచనాల్లో నీరస నపుంసకత్వం, ఆధునికుల అనార్ద్రత, రసహీనత యివన్నీ వొకే తానులోని గుడ్డలే. అదే పడమటి దొరల నుంచి వచ్చిన దృష్టి మార్పు.

యీ రసహీనతని పురాణాన్నీ జీవితాన్నీ ఏకం చేసిన తాదాత్మ్య శైలితో అధిగమిస్తాడు నరేష్.

కామినీ కాయకాంతారే

కుచదుర్గమ పర్వతే

మా సంచర మనః పార్థ

తత్రాస్తే స్మరతస్కరః

స్త్రీ శరీరమనే గహనారణ్యంలో కుచ పర్వతాలపై మనస్సా సంచరించకు. అక్కడ మన్మథుడనే బడాచోర్ వున్నాడు అనే సుభాషితంలో 'మా'ని తొలగించేశాడు నరేష్. అంటే స్వేచ్ఛగా సంచరించమని మనస్సుకి కళ్లాలు వదిలేశాడు.

ఎవరు మాత్రం సంచరించరు, కాని యెవరు తెగిస్తారు రాయడానికి, ఎవరు మర్యాదని పోగొట్టుకుంటారు. కాని పక్షిలా ఎక్కడెక్కడో సంచరించి, తిరిగి గూటికి చేరుకొంటుంది మనస్సు, అంటే కుటుంబం దగ్గరికి.

నిజానికి నేను యింతవరకు రాసినది తూచ్. నిజానికి రాయవలసినది రాయకుండా నేనే దారితప్పి పోయాను. మిత్రుడు చంద్ర (భువనగిరి చంద్రశేఖర్) అనేవాడు– 'నరేష్ ఎక్కడెక్కడో మానసిక విహారం చేసి, మనో వాక్కాయాలతో భార్య పాదాల దగ్గరికి భద్రంగా చేరుకొంటాడు' అని. నిజానికి నరేష్ సతీమణి గురించి రాసిన మాటలే చాలా గొప్పగా వుంటాయి, అలాగే తన కుమార్తెల గురించి రాసిన మాటలు కూడా. కుటుంబ వ్యవస్థలోని మాధుర్యం యీయన వచనాల్లో స్పష్టమౌతుంది.

తన తండ్రి హేతువాదాన్ని నరేష్ తిరస్కరించాడు. ఎక్కువగా హేతువాదం

విఫలమయ్యేది కుటుంబం దగ్గరే. పెళ్లి, కుటుంబం కన్న అహేతుకమైన విషయాలు ఏముంటాయి? వొకే కప్పు కింద వొకే వ్యక్తితో జీవితాంతం కలిసి వుండడంలో ఏ లాజిక్ పనిచేస్తుంది? పైగా మనస్సు ఏమాత్రం చెదరని మోనోగమీ భారం కూడా నెత్తిమీద. ఇది ఎద్దు మెడమీద కాడిలాంటిదే. కానీ సంసారంలో ఆనందం వుంది. సంతోషం వుంది. ప్రేమ అంటే ఏమిటి? భార్య, పిల్లలూ సంసారమే కదా? పరుగెత్తే, చలించే మనస్సుకీ సంసారానికీ లంకె కుదర్చడం ఎలా? యీ ప్రశ్నకి యెక్కడా సమాధానం లేదు.

నరేష్ కూడా సమాధానం యివ్వడు. కానీ అత్తవారి వూరికి ఉషగారితో కలసి వెళ్లడం, ఉషగారూ గ్రామీణుల అనుబంధం, అక్కడి వాతావరణం యివన్నీ నరేష్ అంతరంగంతో కలిసిపోయి ఏకాకృతిగా దర్శనమిస్తాయి. కానీ యీ పత్నీవ్రతం నరేష్‌లోని కృష్ణుడ్ని మాయం చేయదు. జయదేవ అష్టపదులతో, అన్నమయ్య కీర్తనలతో, మధుర శృంగార భావనలతో చిత్త చాంచల్యంతో అతనిలోని చెదిరిపోయే తత్వం 'రసోవైసః' అన్నట్లు సాక్షాత్కరిస్తుంది. అంతేకాని వెంపర్లాటగా మిగిలిపోదు. అందువల్ల వాక్యం రసాత్మకంగా మారిపోతుంది.

ప్రమాదంలో ముద్దుల కూతురు గాయపడినప్పుడు రాసిన వాక్యాలు నరేష్‌లోని ప్రేమనీ, కరుణనీ అతి సహజంగా వ్యక్తం చేస్తాయి. అనేకచోట్ల మనుషులని మనం యిలా ప్రేమించగలమా అనిపిస్తుంది.

చిరకాలం జర్నలిస్టుగా పనిచేసినా జర్నలిజం ఛాయలు అతనిలోని కవినీ భావుకుడ్నీ తాకడానికి సాహసించలేక పోయాయి. తండ్రి నుంచి వచ్చిన హేతువాదం దగ్గరి నుంచి, జర్నలిజం దాకా ఏవీ అతడ్ని కాలబద్ధుడ్ని చేయలేకపోయాయి. వర్తమానమనే వూబిలోకి కూరుకుపోయేలా చేయలేకపోయాయి. కారణం తల్లి ప్రభావం కావచ్చు. అంతేనా 'భావస్థిరాణి జననాంతర సౌహృదాని' (కాళిదాసు) హృదయంలో నాటుకుపోయిన జన్మజన్మల స్నేహ ప్రేమబీజాలు కావచ్చు. మూగమనసులో నాగేశ్వరరావు పాడుబడిన భవంతి చుట్టూ ఆందోళనగా తచ్చాడ్తాడు, తన గత జన్మ ప్రేయసిని పలవరిస్తూ. ఎవరు ఎందుకు ఎలా రూపుదిద్దుకుంటారో ఎవరు చెప్పగలరు?

'నేను హిందువునెట్లైత' అనే కంచ ఐలయ్య ప్రశ్నని లోతుగా అనిపించే ఉపరితలాంశం అంటాడు నరేష్. ఎందుకంటే కృష్ణుడు అతని దృష్టిలో వొక సంస్కృత పురాణ పాత్ర కాదు. జీవిత సారం. చారిత్రక పురుషులకన్న పురాణ పురుషులే ఎక్కువ ప్రభావితం చేస్తారు అంటాడు రామ్‌మనోహర్ లోహియా. నిజమే కాని అలాంటి ప్రభావాలకి గురవ్వాలంటే కాలానికి ఎదురీదాలి నరేష్‌లా. అందుకే తండ్రికి ఎదురీదుతాడు. తండ్రి గురించి యిలా ప్రకటిస్తాడు నరేష్ –

"వంశ వృక్షంలో ఆయన (తండ్రి) వొక చెడబుట్టిన శాఖ, లేదా చెడ పెరిగిన ఉప శాఖ. ఆ 'తేడా' కొమ్మకి పట్టిన చీడలు ఎన్నో. ఎంఎన్ రాయ్ రాడికల్ హ్యూమనిజం

కొన్ని పాళ్లు, గోరా నాస్తికత్వం మరికొన్ని పాళ్లూ కలగలసి, హేతువాదంతో చెట్టాపట్టాలేసుకొని హేతివాదం పొలిమేరల్లో ఆగిపోయిన వ్యవహారం ఆయనది. అష్టాదశ పురాణాలు, ఇతిహాసాలు, ముఖ్యంగా భగవద్గీత స్పెషలిస్టు అమ్మ – పరమ భక్తురాలేగానీ కొన్ని సైద్ధాంతిక ఘర్షణల ఫలితంగా సాపేక్షంగా ఇంట్లో ఆధ్యాత్మిక వాతావరణం ఒకించుక తక్కువే'.

హేతువాదం, నాస్తికత్వం ఆధిపత్యానికి ముగింపేమీ కాదు. సరికొత్త ఆరంభం మాత్రమే. ఆధిపత్య స్వరంలోని ప్రధాన లోపం ఏమిటంటే – కళావిహీనత. జాగ్రత్తగా గమనిస్తే పురాణాల్లో, ప్రబంధాల్లో స్త్రీల స్వరమే గొప్ప తార్కికతనీ, సౌందర్యాన్నీ కలుపుకొని దృఢంగా పలుకుతుంది. సీత రాముడ్ని అనేక విషయాల్లో ప్రశ్నిస్తుంది. అతని ఆధిపత్యాన్ని నిలదీస్తుంది వాల్మీకి రామాయణంలో. అలాగే వరూధిని ప్రవరుడ్ని 'బుద్ధి జాడ్య జనితోన్మాదుల్ కదా శ్రోత్రియుల్' అంటూ వెటకారం చేస్తుంది. శృంగారంలోని అద్వైతాన్ని శాస్త్రీయంగా వివరించి రస అద్వైతాన్ని బోధిస్తుంది. అన్నిచోట్ల రాముడైనా ప్రవరుడైనా సమాధానం చాలా సంక్షిప్తం, అరసికం 'అది ధర్మం కాదు' అని. ధర్మం అంటే లోకరీతి. సాంఖ్యతత్వం బోధిస్తున్నది కూడా. ప్రకృతి (స్త్రీ) పరిణామ శీలం, డైనమిక్. పురుషుడు నిర్లిప్తుడు, పాసివ్. అందుకే పురాణ స్త్రీలలో డైనమిజం కనిపిస్తుంది. శాస్త్ర చర్చలో శంకరాచార్యులు మండనమిశ్రుడ్ని ఓడిస్తాడు. ఉభయభారతి కామశాస్త్రంలో ప్రశ్నించి, శంకరుడ్ని అనుభవ జ్ఞానం లేనివాడిగా థీయరీని పట్టుకొని వేళ్లాడే వాడిగా ధ్రువపరుస్తుంది.

పురుషుడు తన అపజయాన్ని లోకం తనకి యిచ్చిన అధికార స్వరంతో 'ధర్మం' అనే రెండు అక్షరాలతో కప్పిపుచ్చుకొంటాడు. 'విగ్రహవాన్ ధర్మః' అని తనని స్థాపించుకొంటాడు. ఆధునిక కాలంలో 'హేతువాదం' ఆధునిక సన్యాసంగా అధికారాన్ని స్థాపించుకొంటుంది. హేతువాదం ఆధునిక పితృస్వామ్య అధికార స్వరం. దాన్ని తనలోని అర్ధనారీశ్వర తత్వంతో ఎదుర్కొంటాడు నరేష్.

నిజానికి హేతువాదానికి ఆధునిక యుగంలో చాలా విస్తృతి ఉంది. వివేకానందకీ రావిపూడి వెంకటాద్రి గారికీ తేడా యేమీ లేదు. వివేకానంద ఆధ్యాత్మిక ముసుగు వేసుకొన్న హేతువాది. ఆధ్యాత్మిక అనుభవాన్ని సైన్స్ ప్రయోగంతో పోల్చడం ద్వారా ఆధునిక కార్యకారణ సంబంధానికే బలం చేకూర్చాడు వివేకానంద. ఫలితం పాశ్చాత్య యాంత్రిక నాగరికతకి తిరుగులేని సమ్మతి లభించడం. దాంతో ఊహాశక్తి చచ్చింది. వినాయకుడి కథలో ప్లాస్టిక్ సర్జరీని వెతకడమే సంస్కృతీ, సంప్రదాయంగా గణుతికెక్కింది.

ఇటువంటి భ్రష్ట స్థితిలో నాగమణిని వెతుకుతూ బయల్దేరుతాడు నరేష్.

***'చైతన్యుడు పూరీవెళ్లి అక్కడ సాగర తరంగాల వినీల సౌందర్యం చూసి భ్రమసి అదుగో నా కృష్ణుడు అని కేకవేసి సముద్రంలో దూకాడట.***

*'తరువాత'*

*'జ్ఞాపకం లేదు. కానీ బయటకు వచ్చాడా లేదా అనేది అప్రస్తుతం. ఇక్కడ మనం గమనించవలసినది అతని హృదయావేశం, భావోద్రేకం. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సముద్రంలోకి దూకేట్టు చేసిన కాల్పనిక 'సూక్ష్మశక్తి'.*

*దానిని నేను నాగమణి అంటాను. మన జానపద కథలు వినలేదా ఉత్తమ జాతికి చెందిన సర్పాల శిరస్సుపైన వయస్సు వచ్చాక మణి ఆవిర్భవిస్తుందట. స్వీయ కాంతితో విరాజిల్లే ఆ అనర్ఘ మహామణిలో ఎన్నో అద్భుత శక్తులుంటాయట. అలాంటి మణికోసం వెదుకుతూ ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. కానీ కట్టుకథలో తప్ప అది ఎవరికీ కనిపించదు. ప్రతి ఒక్కని జీవితంలోనూ ఒక నాగమణి వుంటుంది. అతను దానికోసం వెతుకుతూనే వుంటాడు. ఆ వెతుకులాట లేకపోతే జీవితానికి అర్థం లేదు. ఆ వెతకటంలోనే అతని జీవితం సార్థకమవుతుంది. అదే అతని జీవితానికర్థం'.*

యివి బైరాగి కథలోని మాటలు. తాను కూడా నాగమణి కోసం అన్వేషిస్తున్న వాడినేనని స్పష్టం చేస్తాడు నరేష్. ఎవరికీ కనిపించని, వెతకటమే పరమార్థంగా గల గమ్యం కాని గమ్యం, అనిర్వచనీయం. క్షణికమై శాశ్వతమైన బ్రహ్మానుభవం, జగత్తంతా కృష్ణలీల, తృష్ణలీల అనిపిస్తుంది, యీ హేతువాది కుమారుని కవితాత్మక వచనాలు పఠిస్తుంటే.

**– రాణి శివశంకర శర్మ**

◆◆ ◆◆

# ఏ వైపూ ఎండ కాయని గోడ మీద...

ఆమెని చూస్తే ఏమనిపిస్తుందంటే, ఊహూ... వాక్యనిర్మాణమే తప్పు. వాక్య రచనావిషయకంగా దోషం కాదు గానీ, భావప్రక్రియానుసారిగా పొరబాటు. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే– అసంకల్పితంగా దొర్లిన అబద్ధం! 'ఆమె'ని చూస్తే– చూస్తూనే ఉండిపోవడం తప్ప ఏమైనా తోచే, పాలుబోయే అవకాశమే లేదు. పోనీ కష్టం మీద తల తిప్పుకుంటే, చూపు మరల్చుకోగలిగితే అప్పుడేమని అనిపిస్తుందంటే, అప్పుడు కూడా ఇంకేమీ అనిపించే వీల్లేదు, తనని ఎప్పుడెప్పుడు చూస్తానా అన్న తహతహ తప్ప!

'అందమధికముసేయు నైక్యములు...' అని అన్నమయ్య! అయితే అది– ఆమె విషయంలో పూర్తిగా ఒట్టిమాట!!

'ఆమె' అందంలో– అలవిమాలిన అతిలోకత్వం ఉంది, అందరాని అందలం వంటి అస్మిత ఉంటుంది, తారకల్ని తాపడం చేసిన వరమాలని సైతం వద్దనే తలబిరుసు తారాడుతుంది. ఆధునికత ఐహికంగా అంటించిన సర్వ సమానత్వ భ్రాంతి సహించని సమ్మోహనత్వముంది.

అందుకే– 'అందమధికముసేయు నైక్యములు...' 'ఆమె' విషయంలో ఒప్పుకోను.

ఇంతకీ 'ఆమె' ఎవరని నిలదీస్తే, తత్తరపడి ముందటి పేజీల 'యెలుగు నీడల వైపు వేలు సూపింతు'!

◆◆ ◆◆

ఫేసుబుక్కులో నా పోస్టులేవో కొన్ని చూసి, పనిగట్టుకొని వాటికి కొంత సాహిత్య స్థాయి కల్పించడానికి ప్రయత్నిస్తున్నట్టు అనిపిస్తున్నాయి అన్నాడు మెహర్. మేము చాలా అరుదుగా కలుస్తాము; అప్పుడు కూడా తనకి బాబు పుట్టినప్పటి నా courteous visit. దానికి తోడు, రాతలో ఎంత కరాఖండిగా ఉంటాడో, వ్యక్తిగతంగా అంతకంత మొహమాటంగా ఉంటాడు మెహర్, మరీ ముఖ్యంగా నాలా వయసు ద్వారానైనా ఆధిక్యత ఉన్నవారితో. అటువంటి మోమాటపు స్థితిలో కూడా నా ఫేసుబుక్కు రాతల్లో పన్నాగం ఉన్నట్టు అనిపిస్తుందన్నాడనేసరికి ఉలిక్కిపడ్డాను. Introspective తడబాటైతే ఎంతమాత్రం లేదుగానీ, నా రాతల్లో ప్రయత్న ప్రమేయం ఉందనే అపోహ అతనికి, అక్షరం పట్ల అమిత వ్యామోహగ్రస్తుడైన ఆ యువ సృజనకారుడికి ఎందుకు కలిగింది? అతనికి సంజాయిషీ

ఇచ్చానా, లేదా అన్నది అంత ముఖ్యం కాదు గానీ, ఎంతమందిని విడివిడిగా కలిసి చెప్పుకోవాలి? అందుకే, ఇక్కడిలా–

అవును రాసింది గోడ మీదే. అదేమీ– రిక్కించిన చెవులున్న గోడ కాదు, బంగారప్పళ్లేలకి చేరుపు కాగల గోడ కాదు, గోళ్లతో గీకితే ఎంచక్కా సున్నం అంటించే గోడ కాదు, విడదీస్తూనే ముడివేసే విరోధోక్తి వంటి (Robert Frost's) Mending Wall కూడా కాదు, స్వపీడన రత్యావేశం (masochism)తో గుద్దుకునే పింగాణీ నుదురుని భళ్లున బద్దలు చేసే కరకు రాతి గోడ కాదు. అదొక ఫేసుబుక్కు గోడ!

వాన్ గో తన చెవి కోసేసుకుని ఆకాశాని కతికించినప్పట్నుంచి గోడకి ఓ వేపే ఎండ కాస్తుందని కదూ అంటారు ఇస్మాయిల్ గారు. గోడకి రెండు వేపులా ఎండ కాయించాలనుకుని ఆనక విఫలయత్నం చేస్తాడో కుర్రాడు (వాన్ గో చెవి– రాత్రి వచ్చిన రహస్యపు వాన). అయితే, నేను రాసిన గోడ– ఏ వైపూ ఎండ కాయనే కాయని మార్క్ జుకెర్‌బర్గ్ అనే నేటి తరం కుర్రాడు కట్టిన గోడ!!

ఆ గోడ మీద చిట్లి, చీలి, చితికిపోతున్న కోట్లాది డిజిటల్ ఏకాణుజీవుల narcissistic గ్రాఫిటీల్లో నా రాత కూడా ఒకానొకటే అయినా, ఇతరేతర genres లో ఏ నిబద్ధతతో ఐతే కట్టుబడి ఉంటానో, ఈ ఫేస్‌బుక్ మ్యూజింగ్స్‌కి కూడా పొల్లుపోకుండా అలానే ఉన్నాను. రాయడానికి ముందు వాటికెలా మానసికంగా సిద్ధమవుతానో, అనుకూల పరిసరాలకి పాకులాడుతానో, నిత్యనైమిత్తికాల వెంపర్లాటని నూరునూతుల లోతు చీకట్లో పూడ్చేసే రాత్రిళ్లలో చమురు కాగడా దివిటీల్నెలా వెలిగిస్తానో, నాలో నేను జీవించే పరమ సోమరి ఘడియలతో విలువైన కాలాన్నెలా కాల్చేస్తానో... అన్నీ ఫేసుబుక్కు రాతల యాతనలోనూ పడ్డాను. కృత్యాద్యవస్థలో కూడా తేడా లేదు. నా మీద ఆపేక్షతో మెహర్ సందేహపడినట్టు– యీ నా ఫేసుబుక్కు రాతల్లో ప్రయత్నం లేదు, పన్నాగం అంతకంటే లేదని మనవి.

ఇకపోతే, సాధారణంగా పరిష్కారాల మీద ఏమంత ఆసక్తి చూపని నేను, సమస్యల దాటవేతకే చూస్తాను. నా రాతలేవైనా అటువంటి దాటవేతలే. లోలోన ఎప్పటికప్పుడు అంతకంతకీ పెరిగిపోతున్న ఉద్వేగాల గాలిబుడగ కలిగించే మహాపీడనం నుంచి తప్పించుకునేందుకు చిన్న గుండుసూదితో చిల్లు పెట్టడం వంటిది నా అక్షరోద్గారం. బహుశా అందుకేనేమో, ఆ లేఖనకి చాలా తొందరగానే పరాయినైపోతాను. నా రచన పట్ల నాకు కలిగే ఏవగింపు గమనిస్తే, Filial cannibalism వంటి జంతు లక్షణం బహుశా నాలో దాగి ఉందేమో అని కొన్నిసార్లు ఉలిక్కిపడుతుంటాను. కానీ, ఈ ఫేసుబుక్కు రాతల విషయంలో నాకే అంతుబట్టని ఒక అపూర్వమైన అనుభవం ఏమిటంటే– వాటి పట్ల తరగని వ్యామోహం. ఎందుకిలా అన్న నాకు నేను పదే పదే వేసుకున్న ప్రశ్నకి ఈ మధ్య జవాబు తోచింది. బరువు దించేసుకొని తేలికపడే సాంత్వన కోసం రాసినప్పటికీ, మరీ నిష్కామంగా ఏమీ ఉండిపోను. అది చదవబడాలనుకుంటాను. ఎక్కువమంది చదవాలని

ఉండదు గానీ, కొందరు మాత్రం తప్పక చూడాలని తీవ్రంగా కోరుకుంటాను. అటువంటి నా 'కొందరి'లో ఒకడైన సౌదా ఇటీవల కలిసినప్పుడు అడిగారు– 'ఈ మధ్య ఏమీ రాస్తున్నట్టు లేదే?'

ఆ ప్రశ్నతో నా లోపల ప్రశ్నకి సమాధానం తెలిసిపోయింది. నేను ఎవరితో చదవబడాలని ఆశిస్తానో, ఆ 'కొందరు' ఈ virtual మాధ్యమ లోకాలకి ఔట్ సైడర్స్, గ్రహాంతర వాసులు! రెండు భిన్న ప్రపంచాల్లో ఉన్న నాకూ, వారికీ మధ్య ప్రసారం లేదన్న అప్రియమైన నిజం నిలకడగా నిలిచి ఉంది కాబట్టే, నా రాతల మీద మోజు ఇంకా చావలేదన్నమాట. ఎక్కడైనా అచ్చు అయితే, నా 'కొందరు' చదివే ఉంటారులెమ్మన్న అరకొర ఆశకి కూడా అవకాశం ఉండదు– డిజిటల్ మీడియాలో పోస్టు విషయంలో. నేనిలా అనడం– నా 2,800 మంది నా ఫేసుబుక్కు మిత్రుల్ని, అందులో కనీసం ఒక క్లిక్కుతోనైనా ప్రతిస్పందించే కనీసం పాతిక శాతం (700 మంది)ని, వీరిలో తరుచూ ఫీడ్‌బ్యాక్ అందించే పాతిక శాతం (175) శ్రేయోభిలాషుల్ని అవమానించినట్టు దయచేసి భావించవద్దు. నిజానికి ఫేసుబుక్కు మిత్రుల (ముఖ్యంగా మిత్రురాళ్ల) నుంచి నేనెంతో స్ఫూర్తి పొందాను, ఎక్కడెక్కడ ఉన్నా ఎందరో నాపైన వర్షించిన అభిమానంలో నిలువెల్లా తడిసి ముద్దయ్యాను. కొందరి పేర్లు, వారి నుంచి నేను పొందినదీ సంక్షిప్తంగా ప్రస్తావించినా అదొక్కటే ఇంతకు మించిన పుస్తకమౌతుంది. కాబట్టి, అంత ఆత్మీయులైన వీరందరినీ తోసుకొని, దాటుకొని, వాళ్లెవరో 'కొందరి' వెన్ను చరుపుల కోసం వెంపర్లాడటంగా యీ నా పుస్తక ప్రచురణని చూడవద్దని విన్నపం. ఇలా వర్గీకరణ... శ్రేణీకరణ వివక్షలేమిటి? ఏమిటా కొందరి గొప్ప? మాకంటే ఎందుకు.... ఎలా భిన్నం? అని పోట్లాట వద్దని కూడా విజ్ఞప్తి. నా 'కొందరి' లో ఒకానొకడైన కవి గాలి నాసరరెడ్డి ఇలా అంటాడు ('అయినా అలాగే ఒకానొక మనిషి' అనే కవితలో): "అతను నగ్నత్వాన్ని ప్రేమించాడు;/ అయినా పశుపక్ష్యాదుల్లా/దుస్తులు ధరించకుండా ఉండలేదు// గూళ్లలో మిగిలిన రంగుల ఈకలూ,/ఈదలేని సముద్రాల విరుచుకపడే కెరటాలూ/ ఇంకా అనేకానేకం/ అతణ్ణి కలవరపెట్టాయి// అద్దానికీ ఆకాశానికీ మధ్య/ అతనేవో కవితలల్లుకున్నాడు/ వ్యాధులతో, బోధపడని రహస్యాలతో/ అధికంగా బాధపడ్డాడు// దురదపుట్టినప్పుడు/ అతను కూడా గోక్కునేవాడు/ పుట్టినందుకు/ అతను కూడా మరణించాడు". నా ఈతిబాధలు, వ్యాధులు, జరామరణ దు:ఖాలతో సాపత్యం ఉన్నంత మాత్రాన ఆ 'అతను'ని నాలా ఒకానొక మనిషి అనుకోలేను. ఆ 'అతను'లు కొందరు నా రాతలు చూడకపోతేనేం అని సరిపుచ్చుకోలేను. అందుకే, నిష్ఠూరాల్ని వెరవక అచ్చులో ఈ పొత్తం!

◆◆ ◆◆

ఇక నా సహచరి ఉషకి ఈ పుస్తకం అంకితమివ్వడం మీద కూడా సంజాయిషీ చెప్పాల్సి ఉంది. అంకితం చేయడమనే పూర్తి వ్యక్తిగత విషయానికి కూడా వివరణ ఇవ్వాల్సి రావడానికి కారణం– ఈ పుస్తకపు ఇతివృత్తం. ఈ ఒక్క పుస్తకానికే కాదు, ఇంతవరకూ నా మొత్తం రాతల్లో థీమ్– ఆమె! తల్లి... చెల్లి అంటూ గొప్ప మానవీయ మాయతో కాకుండా, 'ఆమె' ఇతివృత్తమై ఎదురయ్యిందా, 'ఆమె'కి శీలపరీక్ష, (మగ) రచయిత మెడలో నైతిక వర్ణానికి సాటైన ముదురెరుపు స్కార్లెట్ లెటర్– A!

"ఇంట గెలిచి కా నీవు యింక రచ్చ గెలిచేది/ వెంటనే ఆనతీరాదా వినవలె నేను" అని వెంకన్నని ఆటపట్టిస్తాడో కీర్తనలో అన్నమయ్య. ఇంట గెలిస్తే కదా, బయిట సంగతి. ఆమెతో నీ పాట్లు భలే వినాలనుంది. నా విషయంలో ఇది రివర్స్ కేసు. నా వర్ణమాలలోని తొలి అక్షరం– అ– అంటే అపార్థం కాబట్టి, రచ్చ గెలుపు కాదు, అంతా రచ్చ రచ్చే. రాజపూజ్యం– 0, అవమానం 10! వెంకన్నకి ఆమెతో పాట్లు, మా ఇంట నాతో ఆమెకి పాట్లు. నా రాత కోతల ఆగడాల్ని సహించి, భరించి క్షమించడానికంటే ఎంతో ఎగువన ప్రేమించే తన గురించి లోన పుటల్లో చెప్పేశాను కాబట్టి, అతివ్యాప్తి దోషానికి పాల్పడకుండా ఇక్కడితో ముగిస్తున్నాను, తన పుట్టిన రోజు (జనవరి 26) కానుకగా ఈ పుస్తకం అంకితం ఇచ్చిన కీర్తి నాకు, అంకితం స్వీకరించిన అపకీర్తి తనకూ దక్కిస్తూ–

**నరేష్**

**(26.01.17)**

◆◆ ◆◆

# ఆమె... విశాఖ!

ఉష, పిల్లలతో కలిసి సాయంత్రం వైజాగ్ వెళ్తున్నా... నిన్న మిగిల్చిన గుర్తుల స్మరణలో కాదు, నా ప్రియమైన బావమరిది నిశ్చితార్థమనే కౌటుంబిక వేడుక కోసం.

వైజాగ్ వెళ్ల బోతున్నాను అన్న ఆలోచన –నన్ను మొత్తంగా ఒక మెట్టు పైన నిలబెట్టే ఉద్వేగస్థితికి ఎగదోస్తుంది. విశాఖతో ముడిపడిన కొన్ని అతి ముఖ్యమైన అంశాలలో ఆమె తలపు ఒకటి.

మా చిన్నోడు (ప్రహర్ష) పుట్టిన (2001 మే 18) నెలకే నాకు వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయ్యింది. న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో జాయినింగు రిపోర్ట్ ఇచ్చిన రోజే – మాధవధార అన్న పేరులో ధార గట్టిన మధుర మాధవత్వం మీద మరులుగొన్నాను. అయినా, అన్నిటికీ అనుకూలంగా ఉంటుందనిపించే సీతమ్మధారలో ఇల్లుతీసుకొని, ఇల్లు షిఫ్టింగ్ బాధ్యతలు తమ్ముడు కిరణ్‌కి అప్పగించి, ఆనక ప్రశాంతంగా ఆలుబిడ్డలతో సహా నూతన (కిరాయి) గృహప్రవేశం చేశాను. మా పెద్దోడు పింకి (నైమిష)ని సీతమ్మధారలోనే వశిష్ట విద్యాభవన్ అనే స్కూల్‌లో చేర్పించాము.

పింకి గాడ్ని స్కూల్లో దింపేటప్పుడు, ఎప్పుడైనా ఒకసారి కనిపించేదామె, వాళ్ళ అమ్మాయిని కూడా అదే స్కూల్ దగ్గర దిగబెడుతూ. ఆ పాపది హయ్యర్ స్టాండర్డ్, బహుశా ఏ సెవెన్త్ క్లాస్ అయ్యుండొచ్చు.

ఏడుమల్లెలెత్తు అంటే బరువు అని స్ఫురించనట్టు ఆమె ఎత్తు కొట్టొచ్చినట్టు కనబడేది, ఏళ్లతో ఎదుగుతున్న నాజూకుతనం వల్ల . స్వీయసౌందర్య భారంతో కొంచెం సొలిసి వొరిగినట్టు అనిపించడం వల్ల నా అంత ఎత్తే అనిపించేది గానీ, నాకన్నా మరో పిడికిలి ఉండొచ్చు. వయసు నా అంతే ఉండొచ్చు. Complexion దాగుడుమూతల్ని అంత త్వరగా పసిగట్టలేని నేను కూడా

చటుక్కున తనది చామనచాయ అని పోల్చుకున్నాను. వర్చస్సు కి సంబంధించి జాతివివక్షకి దారితీయాల్సిన ఆ 'దిగువ తరగతి..' మేని చాయ– ఇంద్రనీలానికి కర్పూరం అంటుకున్నట్టు మెరవడం వల్లనే నాకు తెలిసిందే తప్ప మరొక కారణం కాదు. 'రెండు కళ్లు, ఒక ముక్కు..' అంటూ మనిషి గుర్తులు చెబితే నవ్వుతాం గాని, ఆమెని చూశాక అలా చెప్పడం నవ్వాల్సిన విషయం కాదని బోధపడింది. ఊపిరి కష్టమైనప్పుడు తప్ప ముక్కు ఉందన్న విషయం స్ఫురణకి రాని నేను, కన్ను, ముక్కు, చెవి, పెదవి..... వంటి అవయవాల అస్తిత్వాన్ని ఒక విలాసగరిమతో చాటి చెప్పడంలోని విలువ అర్థం చేసుకున్నాను. వడ్రంగి, కలనేతకాడు, శిల్పి వంటి వారికి మాత్రమే తెలివిడిలోకి వచ్చే లాస్య రూప విశేషాలు నా బోటి అతి సామాన్యుడికి కూడా తెలిసిరావడం మించి, వాటి గురించి చెప్పలేను.

ఎప్పుడో అరుదుగా వేగుచుక్క పొడిచినట్టు కనిపించేది. అటువంటి ఒకానొక అరుదైన సందర్భంలో కొన్ని నెలల తర్వాత ఆమె మా పింకిని పలకరించడం దూరం నుంచి చూసి ఆశ్చర్యపడ్డాను. ఎంతమందిలో అయినా ముద్దులొలుకుతూ (నా పోలికలు అనివార్యంగా ఉన్నప్పటికీ) అందంగా మెరిసిపోయే నా పింకితల్లిని పలకరించడంలో విశేషం లేకపోయినా, పరిచయానికి వీలైన ఏ సాకులకీ అవకాశమివ్వక తగు దూరంలో ఉంచేసే ఆమె గురించి ఏమైనా తెలుస్తుందేమో అన్న ఆత్రంలో మా అమ్మాయిని అడిగాను – 'అమ్మ (పెద్దమ్మని మేము 'అమ్మ' అని పిలుస్తాము) ఏమంటుందిరా తల్లులూ..' అని. ఆంటీ అనడం సహజమే గానీ, ఈ 'అమ్మ' అపశబ్దం వింతగా వినిపించి, నా ఐదేళ్ల ఆరింద కూతురు నన్నే ఎదురు ప్రశ్నలు వేసింది, రెండేళ్లకే అతి స్పష్టంగా మాట్లాడేసిన గడుగ్గాయితనంతో. ఏదోలా తప్పించుకున్నాక చెప్పింది: ఆంటీ డాన్స్ స్కూల్ దగ్గర కలుస్తారని.

మా అమ్మాయిని సాయంత్రాలు ప్రముఖ నాట్య కళాకారులు శ్రీ రుక్మాజీ రావు గారి దగ్గరకి పంపించే వాళ్ళం. అక్కడకి వాళ్ళ అమ్మాయిని కూడా తెస్తారట ఆమె. సాయంత్రాలు నేను విధుల్లో విధిగా బందీని కాబట్టి ఆమెని అక్కడ కలిసే అవకాశమే లేదు.

నా దురదృష్టాల పరంపర ఈ విధంగా ఉండగానే, ఏడాది గిర్రున తిరిగి, స్కూల్ annual function వచ్చింది. ఫంక్షన్‌కి ముందు స్కూల్ వాళ్ళు పేరెంట్స్‌కి కూడా ఏవో పోటీలు పెట్టారని చెప్పింది మా అమ్మాయి. మర్యాదస్తులైన ఈ పేరంట్ల ముఠాకి దూరంగా ఉండే నేను, ఆ గుంపులో ఒక గోవిందయ్యగా అందులో పాలుపంచుకోవాలా...? ప్రసక్తే లేదు. కానీ, మా పింకీ పట్టు పట్టడంతో, తన ఆజ్ఞకి ఎదురు చెప్పలేని బలహీనతతో ఆఫీసుకి సెలవు పెట్టి, లేని పెద్దరికాలు, గాంభీర్యాలు భుజాన వేసుకొని, మా ఉషతో పాటు వెళ్ళాను స్కూల్ గ్రౌండ్‌కి. స్కూల్ నిర్వాహకురాలు చాలా ధీమాగా కనిపించారు, ఏదో ఘనకార్యం చేయబోతున్నట్టు. ఏం పోటీలు పెడతారో ఖర్మ అనుకుంటూ, 'నేను

ప్రేక్షకుల్లో ఉంటానండి' అన్నాను సదరు ప్రిన్సిపాల్‌తో. కూడదంటే కూడదన్నారు ప్రిన్సిపాలు గారు. ముందు జంటలని విడదీసారు. ముగ్గుర్ని random గా ఏరి జట్లు చేశారు. అప్పుడు చూశాను... నా నీలోత్పలని! నన్ను ఆమె ఉన్న జట్టులో (కాకతాళీయంగా అయినా సరే) కలిపిన ప్రిన్సిపాల్ మేడం గారు చేస్తున్నది ఆషామాషీ మహత్కార్యం కాదని నాకు వెంటనే తేలిపోయింది. పొడిచిన వేగుచుక్క అయాచితంగా దిగి వచ్చింది. ఇక తథాస్తు దేవతల ఉనికి గురించి అనుమానం లేదు, వారెలా ఉంటారన్నది నాకిప్పుడు అసలు ఒక ప్రశ్నే కాదు. మళ్ళీ కళ్ళ నిండుగా (ఆ రోజుకి) చివరిసారిగా ప్రిన్సిపాల్ గారిని చూసి, ఇక నా కృష్ణరజని బృందంలో చేరిపోయాను. మా బృందగానంలో మరో వయసుడిగిన అపస్వరం ఉన్నా నేను అంతగా పట్టించుకోలేదు.

నా ఐకాంతిక వాళ్లాయన్ని కూడా ఏ జట్టులోనో కలిపి ఉంటారు, ఆమె చేయి ఊపి 'ఆల్ ద బెస్ట్' అంటున్న వైపు పొరబాటున కూడా తలతిప్పి చూడలేదు. ఆమె అంతటి దానికి సహచరుడైన వాడు ఆమె స్థాయికి సరితూగి నట్టు ఉంటే ఒక బాధ, తేలిపోయినట్టు ఉంటే మరో బాధ... అందుకే అటుదిక్కు చూడనే చూడలేదు.

పోటీలు చాలా చిత్రంగా ఉన్నాయి. ఒక్కొక్క జట్టుకీ పాప్‌కార్న్, సూది, దారం ఇచ్చారు. జట్టులో ఉన్న మగవాళ్ళని ఎన్ని ఎక్కువ పాప్‌కార్న్ ఆభరణాలతో ఎంత తక్కువ సేపట్లో అలంకరించి పంపితే అన్ని ఎక్కువ మార్కులు.

'స్టార్ట్' అన్న తర్వాత, భూమ్యాకాశాల మధ్య ఒక అల్లిక జిగిబిగిని సృష్టిస్తున్న ఆమె వేళ్ళ లాఘవం చూసి తీరాలి. పాపిడి బిళ్ళ, లోలాకులు, భుజకీర్తులు, కంఠాభరణాలు, వడ్డాణం లేదా మొలతాడు... ఏవేవో చేసేస్తూ, నన్ను బొమ్మలా తిప్పుతూ అలంకరించేసి, ముందుకి నెట్టినంత పని చేసింది. అందులో మా జట్టే విజేత.

ఆ తర్వాత సైగలతో ఏవో భావాల్ని convey చేయగలగడం. ఆమె సంజ్ఞలకి లేనిపోని వందల వేల అర్థాలని తగిలించుకుంటూ కొత్త త్రిశంకు సీమల్లోకి తప్పిపోయిన నేను అట్టర్ ఫెయిల్ అయ్యాను. దాంతో స్కోర్ కొంచెం మందగించింది.

ఓటమి సహించని ఆ ధీర లలితకి నిస్పృహ కలిగించిన గిల్టీ వల్ల మరి కొన్ని అంశాలలో మెరుగవ్వాలని కొన్ని తీర్మానాలు చేసుకున్నాను. ఆ తర్వాత పోటీ నా తీర్మానాలెంత దుర్బలమో చాటి చెప్పాయి. నిర్వాహకులు కొన్ని

తెలుగు సినిమా పాటలు ప్లే చేస్తారు. అందులో ఉన్న ఇంగ్లీషు మాటల్ని కాగితం మీద రాసివ్వాలి. చకచకా రాయడమే కాకుండా, ఎక్కువ రాయగలిగిన వారు విజేతలు. “నరేష్ (తన పేరు చెబుతుందేమో అన్న ఆశతో అడక్కుండానే నా పేరు చెప్పాను) మీరు జర్నలిస్టులు కాబట్టి మీరే రాయండి “అందామె, జర్నలిస్టులకి రాయడం వచ్చన్న జగద్విదిత అపోహతో. ఏవేవో పాటలు వస్తున్నాయి.. హలో డాక్టర్ హార్టు మిస్సాయే... పల్సు చూస్తే ఫాస్టు బీటాయే... ...

....... నేను వేగంగా రాయలేక పోతున్నానని నా మీదకి ఒరిగి ‘రాయండి నరేష్ ...’ అంటూ ప్రోత్సహిస్తోంది.

ఉలిమొనలు తాకి, నిన్నటి– రేపటి జ్ఞాపకాల జమిలికి ఝల్లుమన్న రాయిలా మారిపోయాను. శిల వేళ్ల చివరి కలాన్ని లాగేసుకొని నా మీదనుంచే లిఖించేసిందామె మా గెలుపుని.

గెలుపోటములనే కెరటాలు ఏవి తాకినా నీటి చెమ్మ కూడా అంటని ఒక అలౌకిక అనుభవ ప్రమాణాలు అందుకునే ఎత్తుకి నన్ను చేర్చిందామె.

చివరికి మా జట్టే గెలిచి, నిర్ణేతల దగ్గర ఆమె అభినందనలు అందుకోడానికి వెళ్ళినప్పుడు నేను వయసు మరిచి చప్పట్లతో హోరెత్తించి, వేరే జట్టులో ఉన్న మా ఉషకి కూడ చిర్రెత్తించాను. మళ్ళీ అకడమిక్ ఇయర్ మొదలయ్యాక ఆమె నాకు కనిపించలేదు. ఆ మరుసటి సంవత్సరం మేము కూడా వైజాగ్ నుంచి వచ్చేశాము. తను ఎవరో, తన పేరేమిటో ... అన్న ప్రశ్నలు నాకెప్పుడూ ఎదురవ్వలేదు. ఎందుకంటే, వైజాగ్ లానే నాకు ఆమె అపరిచిత కాదు గనుక...

**(10 .8. 2013)**

◆◆ ◆◆

# A Friend After A Saga Of Gender Sensitivity!

**మే 7, 2014: నేను, తను ఫేసుబుక్కు నేస్తాలమయ్యాం!**

అనేకానేక అతి సాధారణమైన రోజువారీ రొటీన్ పనుల్లో ఒకానొకటిగా, నోటీస్ చేయడానికి కనీసం ఒక రెప్పపాటు సమయాన్ని కూడా నోచుకోని సంఘటనగా ఇది దొర్లిపోవచ్చు.

కానీ, దీని వెనక పదేళ్ల పైచిలుకు తపన, యాతన ఉన్నాయి.

తపన అంటే – తిన్నని తిన్నెల ఒడిని ఎగసే అలలై అవిశ్రాంతంగా కలగనడం;

యాతన అంటే– యదార్థాన్ని బోలిన గండశిలలు ఉలుకు పలుకూ లేకుండా తీరం పొడవునా తిష్ట వేయడం!

◆◆ ◆◆

**సుమారు పదేళ్ల క్రితం–** దక్కన్ క్రానికల్ గుంటూరు స్టాఫ్ రిపోర్టర్‌గా ఉన్న ఒకానొక ఉదయం:

రోజూలానే చిన్నాడి diapers మార్చి, తాజా న్యూస్ పేపర్లని సైతం napkins గా చేయాలన్న తన ఆగడాన్ని వేరే లక్ష్యాల దిశగా మళ్లిస్తూ, ఎప్పట్లానే పత్రికాపఠనంలో భాగంగా 'ద హిందూ' తిరగేస్తున్నాను. కొత్తగా విడుదలైన ఒక పరభాషా చిత్రం మీద సమీక్ష. చదవాలన్న ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్ల ఏవో కొన్ని వాక్యాల్ని random గా చూశాను: లేత గుమ్మడి తీగ నూగు తాకినట్టు కొన్ని వాక్యాలు Goosebumps ని రేపడం వల్ల రివ్యూ చదివాను ఆసాంతం. అదేం సినిమానో గుర్తులేదు, కాకపోతే ఒక ప్రేమ కథ.

ఆ రివ్యూ ఎంత candid గా ఉందంటే, చాలీచాలని తామరాకు

పొట్లాంలోంచి మరుమల్లెలు జారిపోకుండా కట్టిన దారంలా ఉంది, అంతే కాదు, అసలా పూలు పిగిలిపోడానికి దారం ఒత్తిడే కారణమేమో అని అపార్థం చేసుకునేలా ఉంది. అప్పుడు చూశాను byline – Ziya Us Salam!

తొలి చూపులో ప్రేమలాగా, తొలి తలపులో వలపు– జియా– ఆ పేరే మంత్రంలా తోచింది.

ఆ మెత్తని వాక్యపు దొంతర్ల మధ్య reading between the lines వంటి అకర్మక క్రియతో జియా చిద్రూపాన్ని, మూర్తిమత్వాన్ని అంచనా వేయడానికి సిద్ధం కావడం ఒక తొలి అడుగు.

◆◆ ◆◆

అప్పట్నుంచి క్రమం తప్పకుండా జియా రాసే వన్నీ చదువుతుండేవాడ్ని. శీర్షం కనబడని శిఖరాలు, లోతులు తేలని అగాథాల మధ్య అమేయంగా విస్తరించిన స్త్రీత్వాన్ని దర్శించడానికి ఆమె నిమ్నోన్నతాల్నే ఆసరా చేసుకుంటున్న మగకీటకాల అల్పత్వాల్ని వెక్కిరించినట్టే ఉండేవి జియా రాతలు.

ఆమె నుంచి నేను తరుచూ జారిపోయేవాడ్ని, పారిపోయాననుకుంటూనే దొరికిపోయేవాడ్ని. నేను కళ్లు మూసుకుంటే, లోకంతో పాటు ఆమే నన్ను చూడటంలేదులెమ్మని నమ్మబలుకునేవాడ్ని. ఇదంతా జియా బొమ్మ గీసుకునే క్రమంలో నా తొలినాళ్ల తొట్రుబాటు. చిత్రలేఖనంలో ఓనమాలు కూడా తెలియని నన్ను, నా లోన చిత్రాల కోసం సేకరించే రంగులు ఏఏ వర్ణాల మిశ్రమమో ఎంత చేయితిరిగిన ఆర్టిస్ట్ కూడా కనిపెట్టలేడని మిడిసిపడేలా ఎగదోసింది జియా. ఆ తిమురుతోనే రంగుల సేకరణకి క్రమేణా జియా అక్షరాల్ని దాటి నా nostalgic ఇసుక డొంకల్లోకి పరాకుగానే దారితప్పాను.

నేనెరిగిన మొదటి సాయిబుల పిల్ల – పప్పి, నా చిన్ననాటి నేస్తురాలు! మా చీరాల సదాశివరావు గారి ఆస్పత్రి దగ్గర్లో ఒకే వీధి వాళ్లం. పప్పీ వాళ్లది పెద్ద కుటుంబం– ఆరుగురు అమ్మాయిల్లో తను ఐదవది; ఇంకా ఐదుగురు అన్నదమ్ములు (నలుగురు అన్నలు, ఒక తమ్ముడు). వీళ్లు కాకుండా మరో ముగ్గురు పురిట్లోనే పోయారని, ఆ పోయిన పిల్లల గురించి అత్త (పప్పీ వాళ్ల అమ్మ) అప్పుడప్పుడూ బాధపడుతుంటే తెలిసింది. అబ్బాయిలందరికీ అ అక్షరం కలిసేలా అన్సర్, అష్పాక్, అల్తాఫ్ ... అని పేర్లు పెట్టారు, ఆడపిల్లలకి 'షా'తో మొదలయ్యేలా షాహీన్,షామీమ్. ఆఖరి పిల్లని షబ్బు అని పిలిచేవాడ్ని. పేర్లు తెలిసిన వీళ్లెవ్వరూ నా friends కాదు; కానీ,ఎంతో దగ్గరైన పప్పీ పేరేమిటో తెలియదు.

జియా గమ్మత్తుగా నాలోకి నడిచొచ్చిన వైనాన్ని పింజారినై నన్ను నేనే ఏకుతున్నప్పుడు పప్పీ గుర్తుకురావడం నా మటుకు నాకు అసంబద్ధం, అసందర్భం ఎంతమాత్రం కాదు. ఇళ్ల మధ్య ఎడం కంటే, ఆచారాలూ అలవాట్ల మధ్య ఎక్కువగా ఉన్న దూరాల్ని ఎంతో సునాయాసంగా దాటించిన పప్పీ, అప్పుడప్పుడే తెలిసొస్తున్న ఆడ– మగ అంతరాల మీద

అంగ చాపుతున్న నా చేయి వదిలేసింది, తొలి సిగ్గుల మొగ్గలా ముకుళించి. ఆడపిల్ల పెద్దమనిషి కావడమే తెలిసీతెలియని రోజుల్లో, తన తమ్ముడికి జరిపే అటువంటి వేడుకకే పిలిచింది. 'మేనమామ పంచెలు పెట్టడంలాంటిదా' అని అడిగినప్పుడు ceremony of circumcision ని తనకి తెలిసిన పదాల్లో చెప్పలేని పప్పి పచ్చని నరాల బుగ్గలమీద చిందులు తొక్కిన క్రొన్నెత్తురు, కాలాలు దూకి మళ్లీ ముంచెత్తడమే– జియా.

పప్పీ మొదలుగా... నా జ్ఞాపకాల తోటలో విరబూసిన తురక చామంతులు ఒక్కొక్కటీ ఒక్కో తొడిమకి గుచ్చిన గుల్దస్తాలా, గుట్టుగా దాచేసుకున్న గుబాళింపులా మోహరించడమే– జియా.

'ద హిందూ' నిండా మిత్రులే కాబట్టి వాళ్ల కొలీగ్ జియా ఎప్పుడు? ఎక్కడ? పుట్టింది? పెరిగింది – వంటి చొప్పదంటు వివరాలు కనుక్కోవడం పెద్ద కష్టమేమీ కాదు; abyssal ప్రేమల్లో పడి, మోహార్ణవాల్లో మునిగి, ఎవర్ని? ఎప్పుడు? వలచింది? వరించింది– వంటి ప్రశ్నలకి జవాబులు కూడా దొరికేస్తాయి. కానీ, నిజానికా సమాచారం నాకు అక్కర్లేదు; ఎందుకంటే, జియా ఏమిటో వాళ్లందరికన్నా నాకే ఎక్కువ తెలుసు కనక!

'జియా ఎలా ఉంటుంది?' అన్నది తెలుసుకోవడం ఒక్కటే నా ఆరాటం. నా కంటికి నేను తేల్చుకొని, నా ఆదుర్దా నేను తీర్చుకోవల్సిందే తప్ప, ఎంతటి వారైనా వేరొకరు నాకు చేయగల్గిన సాయం లేదు కాబట్టి, తొలి sweet rendezvous కోసం కుదుర్చుకున్నాను, సీమా సమయాల అవధులూ వ్యవధులూ లేని ఒక tryst with destiny!

◆◆ ◆◆

పిటిఐ (ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా) న్యూఢిల్లీలో ఉద్యోగమొచ్చి, ఉషనీ, పిల్లల్నీ గుంటూరులోనే వదిలేసి, కొత్తగా మొలిచిన రెక్కలతో ఢిల్లీ ఎగిరెళ్లాను.

ఢిల్లీ అంటే ఎవరికేమిటో గానీ, నాకు మాత్రం రెండే రెండు ప్రాంతాలు: చలనాచలన స్థితుల్లో, గమనాగమన గతుల్లో, ఒదిగి ఒత్తిగిల్లి, ఎగసి వ్యాపించి జియా ఆవర్తించిన భాగం; అది పోను మిగిలిన భౌగోళిక అవశేషం. నేను పని చేసే పిటిఐ బిల్డింగ్ జఘనానికి ఐమూలగా ఉండే ఐఎన్ఎస్ (ఇండియన్ న్యూస్ పేపర్స్ సొసైటీ) బిల్డింగ్‌లోని అనేకానేక గూళ్లలో ఒక గిజిగాడి గూడు 'ద హిందూ' న్యూఢిల్లీ ఆఫీసని తెలుసు నాకు. గట్టిగా వంద గజాల దూరం కూడా లేదు నాకు, నా జియాకి మధ్య. కానీ, ఈస్ట్ ఢిల్లీ – దిల్షాద్ గార్డెన్స్ లో ఉంటున్న తమ్ముడి ఇంటి నుంచి పార్లమెంటుకి కూతవేటు దూరంలో ఉండే పిటిఐ బిల్డింగ్‌కి నేను చేసే ప్రయాణాల్లో, అక్కడ నుంచి పిటిఐ బిల్డింగ్

కేంద్రంగా కొట్టే చక్కర్లలో – ఏది జియా మదనోత్సవ మహోల్లాస సామ్రాజ్యమో, ఏది మిగులు తగులు కాంక్రీట్ కీకారణ్యమో సాపేక్షాలు సరిచూసుకుంటూ, తారతమ్యాలు తిరగేసుకుంటూ తిరగడం, ఇంకా ఇంకా ఏదో ముందుందని ఊరించే మహత్తరానుభవం. మైళ్లకొద్దీ సాగే ఈ ఆరాటాల దారుల్లో తారసిల్లే ముఖాల్లో జియాని వేనవేల రూపాల్లో ఊహించి, చిత్రించి, చివరికి చెరిపేస్తూ నాలుగు నెలలు గడిపాను. ఇకపై అంతకు మించి వేచి ఉండలేక, ఒక రోజు ముహూర్తం నిర్ణయించుకున్నాను జియాలో తొలి కలయికల మధురానుభూతికి.

◆◆ ◆◆

మామూలుగానే నా వయసుకి కొంచెం తక్కువగానే కనిపిస్తాను (అప్పుడైతే మరీనూ). అయినా, ఇంకొంచెం ఎక్కువ యవ్వనంతో కనిపించాలని తమ్ముడి టీషర్టుతో మరికొన్ని వేషాలేసి, ఏ పుట్టలో ఏ పాముందోలెమ్మని, AXE effect ని అంత తేలిగ్గా కొట్టిపడేయకుండా కాసింత కొట్టుకొని వెళ్ళాను, ఐఎన్ఎస్ భవనంలో 'ద హిందూ' ఆఫీసుకి. లిఫ్టులో వెళ్తే నా కర్మకాలి 'stuck అయితే' అన్న భయంతో మెట్లమీద నడిచాను. మెట్టుకొక టన్ను చొప్పున పెరిగిపోతున్న గుండెకాయని మోసుకుంటూ పట్టుమని పాతిక కూడా లేని మెట్లని పది నిమిషాలపైనే ఎక్కాను. ముఖాన్ని మూసిన ముచ్చెమట్లని అరచేత్తోనే తుడుచుకుంటూ, సగం మూసిన తలుపు తోసుకొని లోనికి వెళ్లడంతోనే ఎదురుగా ఒక స్త్రీమూర్తి, గోడ మేకుకి అనాలోచితంగా వేలాడదీసిన తైలవర్ణచిత్రంలా. నాకు మల్లే వయసు దాచే ప్రయత్నాలు చేసినా వీలుగాక ఓడిన గుర్తులు అవనతమైన wrinkles గా. ముదురు గోధుమ రంగు ఫలితకేశాల్ని రెల్లు పొదలుగా మెడలు వంచి క్లిప్ పెట్టింది. కిందపెదవి జారి ఉండటంతో పాటు, దాని అంచుని దాటి అంటిన ముదురెరుపు లిప్ స్టిక్ వికారాన్ని మరికొన్ని రెట్లు పెంచుతుంది.

కొంపదీసి తను నా జియా కాదు గదా....

ఆ ఆలోచనకే మరింకేమీ మాట్లాడ బుద్ధి కాలేదు, 'ఏం కావాల'ని తను అడుగుతున్నా కూడా.

తప్పించుకునే వీల్లేక, దేవుడి మీద భారం వేసి, అతి కష్టం మీద గొంతు పెకల్చుకొని 'జియా' అని మాత్రం గొణగగలిగాను.

తను వినబడనట్టు రెట్టించింది.

ఏదో మొండి తెగింపుతో ఈ సారి గట్టిగా పఠించాను నా మంత్రం– Ziya Us Salam.

ఆమె ఇంగ్లీషులో చెప్పింది– "అతను సాయంత్రం వస్తాడు. అతనితోనే పని ఉందా? నేను అతనికి inform చేయొచ్చా." మధ్య మధ్యలో 'అతను' అనే జెండర్ వేపమండలు కట్టిన నూలుతాడు లాంటి వాక్యం– నన్ను ఆపాదమస్తకం చుట్టేసింది. నా కాళ్ల కింద

భూమి తొలుచుకుపోతోంది. ఆమె 'అతను' అని ఒత్తి ఒత్తి పలికిన ప్రతి సారీ ఆ శబ్దం ఒక కబోది గబ్బిలంగా తలని తాటిస్తూ వెళ్లిపోతున్న గగుర్పాటు.

Ziya అంటే ఆమె కాదా?

◆◆ ◆◆

ఆ తర్వాత ఎంత కాలానికి తేరుకున్నానో చెప్పలేను గానీ, నన్ను నేను Ziya అనే పేరు నుంచి చాలా దూరం విసిరేసుకున్నాను.

◆◆ ◆◆

**మే 7, 2014:** సీనియర్ జర్నలిస్టు ఎ. శాయిశేఖర్ ఫేసుబుక్కులో పెట్టిన ఒక postకి Ziya Us Salam 'like' కొట్టడం చూసి, పాత భంగపాటునంతా Confess చేస్తూ జియాకి మెసేజ్ పెట్టాను. అది చదివాక, అతను సస్నేహపూర్వకంగా friend request పంపించాడు, నా గొడవని acknowledge చేస్తూ.

ఆ తర్వాత చెప్పడానికి మరేమీ లేదు, మేమిద్దరం ఫేసుబుక్కు మిత్రులమయ్యామంతే...!

◆◆ ◆◆

**(08.05.2014)**

## ఓ సుమధ్య... చక్రజఘున.... వరారోహ!

# ఆమె వెనక నా oriental నడక!!

***ఆమె! ఆ వెనక నేను!!***

ఎంత దూరం?

***తెలీదు...***

ఎంత సేపు?

***తెలీదు....***

ఏం కావాలి?

***తెలీదు.... ఆమె..... వెనక నేను- అంతే!***

ఆమె ఎవరు?

***తెలీదు....***

పోనీ నువ్వు ఎవడివోయ్?

***తెలీదు....***

ఆ! తెలీదా? నువ్వెవరో నీకు తెలియదా?

***నిజంగానే తెలీదు. బుజ్జాయిని ఎత్తుకెళ్తుంటే కనిపించని పాశాలు లాక్కెళ్లే గంగిగోవునా? ఏ మానులూ, మద్దులూ అడ్డం పడినా ఆగక దొర్లుకుపోయే రాతి రోలునా? సుఖలాలసల వెంట పర్వులెట్టిన** FrancisThompson **నా, లేకపోతే, తన వెంటబడిన** Hound of Heaven **నా? కార్యం వెన్నంటిన కారణాన్నా? గగన జఘున సంధ్యారుణిమల వెనక చీకటి రాత్రినా.... ...... తెలీదు, నిజంగానే తెలీదు!***

మరేం తెలుసు నీకు?

***అలలు కడిగిన అనాచ్ఛాదిత తీరాన్ని పక్కటడుగుల ఎంద్రకాయనై దాటేయాలన్న ఎడతెగని యాత్రలు తెలుసు.***

***జారుముడి రవికల అనావృత ఆకాశాన్ని రెప్పలు సాచిన దిష్టిపిట్టనై దాచేయాలన్న తెంపులేని పంతాలు తెలుసు.***

***మొయిళ్లు దాచిన ముచ్చెలిగుంటలో చక్కిలిగిలినై నిక్కి, చెమట చిత్తడుల నడుముపాయలో కాళ్లు కదలని చీమనై చిక్కి, ఆమె తమలపాకు వెన్ను ఈనె నూగులో అంటుపేనునై నక్కి... సుక్కడం తెలుసు.***

***జగడపు చనువుల జంట తబలాల మీద జడగంటల దరువుకి కళ్లు రిక్కించడం తెలుసు. స్థిరాస్థిరంగా చలిస్తున్న కార్మబ్బుల కథక్ నాట్య విళంబలయకి కన్రెప్పల తొందర తాళం తెలుసు.***

***ఎంకి ఒక్కత్తే 'పెక్కు నీవులు' ఐనట్టు, పెక్కు ఎంకి పదుచులు నాకు ఒక్క ఆమే!***

ఇంక ఆపేసేయ్. కొంగు కనిపిస్తే చాలు చొంగ కార్చుకుంటూ వెళ్లిపోతుంటావ్. అలాగని, మిడ్డీల్నీ, అరకొర చడ్డీల్నీ cultural disparity వల్ల వదిలేస్తావా.... పాపం! అటువంటి భేదభావం లేని విశాలమైన అంగలార్పు నీది. చిత్తకార్తెలు చిన్నబోయే కక్కుర్తి!

***ఒద్దొద్దు... అలా నోటికొచ్చినట్టు తిట్టకు! ముక్కూమొఖం తెలియని తన వెనక వెళ్తున్న యావలో ఎలమి కంటే యాతనే ఎక్కువ.***

అవున్లే...ముక్కూమొఖం చూడాలి.... bakku-shan అనో, butterface అనో ఎక్కిరించి కొక్కిరించాలి..

***ఆగాగు– ఈ అభిప్రాయాన్ని..... కాదు కాదు.... ఈ అపోహని తుడిచేయడానికి ఒక వివరణ ఇవ్వాల్సిందే–***

◆◆ ◆◆

గత్యంతరం లేని గతుకుల దారుల తొడతొక్కిడిలో నలిగిపోతుంటానా.... రోజువారీ చావురేవుల్లో చర్వితచర్వణంగా పడిపోతుంటానా... అనుకోకుండా రాలిపడ్డ వానచుక్క కంటిపొరల్ని కమ్మేసినట్టు ఎవరో ఒకామె కనిపిస్తుంది నా ముందు నడిచిపోతూ. పగుళ్లు లేని పసిడి పాదాలు పిలవని పేరంటాలకి కొత్త దారులు పరుస్తాయి. వాలుజడల కరినాగు కనిపించని కాట్లు వేస్తుంది. అంతే– ముంచుకొచ్చే కాలం చిందరలు, కొంప ముంచే పని తొందరలు.... ఒక్కసారిగా ఒరిగిపోతాయి.

అంత క్రితమూ ఆమె వెనకే ఉన్నాను, క్రితం తర్వాత కూడా తన వెనకే ఉన్నాను. అంతకు ముందు ఆమె లేదు, తర్వాత ఆమె తప్ప మరేమీ లేదు!

ఇలా వెనకబడి అగమ్యంగా వెళ్లడంలో తెగని పేచీలున్నాయి, తగని

పీకులాటలున్నాయి. ఆమె వెనక పడుతున్నట్టు– సభ్యతాసంస్కారాల కేటగిరీ కింద– 'నీ వయసేంటి.... నీ చిల్లర వేషాలేంటి...' వంటి కామెంట్లతో పొడిచే పలుగాకుల లోకానికి ఎంతమాత్రం దొరికిపోకూడదు; ప్రైవసీ కారణాల వల్ల ఆమెకి అర్థం కాకూడదు, కనీసం– తనకి అర్థంకాదులెమ్మని నమ్మడమో, నటించడమో చేయాలి; వీటన్నింటినీ మించి, ఈ నిమ్నోన్నతాల silhouette ముఖం ఎలా ఉంటుందో ఎన్నో ఊహలు పోవాలి. వివర్ణాలే తప్ప ఏ వర్ణాలూ, టూత్ బ్రష్‌లు తప్ప Acrylic కుంచెలు గానీ, గోడక్కొట్టే సున్నాలు తప్ప కాన్వాస్ మీద పెయింటింగులు తెలియని నా లోపల నాకే తెలియని చిత్రకారులు, మహాశిల్పులు చెలరేగి నా ఊహలకి చిత్రిక పట్టి ఏవో కొన్ని బొమ్మలేస్తారు, లేదా చెక్కుతారు. ఊహల్లోంచి పుట్టిన ఈ ముఖాలతో ఆమె అసలు ముఖాన్ని త్రైపారు వేసి చూడాలి. కానీ, అలా చూడాలంటే, ముందు లోన గింజులాటని దాటాలి. నేను ఊహించుకున్న ముఖానికీ, అసలు ముఖానికీ పొంతనే లేకపోతే? ఆ ఆలోచనే భరించరానిదిగా ఉంటుంది. సౌందర్యానికి సంబంధించి నా దగ్గర నాకు తగ్గట్టుగా ఉన్న tools పరిమితుల వల్ల, అందాన్ని సూత్రిస్తూ వేసే బేరీజుల వల్ల కూడా ఆమె అసలు ముఖానికీ, ఊహలకీ పొంతనే లేకపోతే తట్టుకోగలనా? అంతటి sinning flesh కి ఎంతమాత్రం match అవ్వని saintly నవ్వుల innocent face కనిపించినా కూడా contextual గా తల్లడిల్లుతాను. అందుకే ఎక్కువసార్లు ఆమె ముఖం చూడకుండా వెళ్లిపోతాను, చూడవల్సిన అనివార్య పరిస్థితులు దాపురిస్తే ఆ దరిదాపుల్లోంచి పారిపోతాను.

ఈ సంఘర్షణ అర్థంగాక, ఆ రాపిడి రగిలించే హిమజ్వాలల సెగ ఎరగక, ఆమె వెనకబడటం మహా సౌఖ్యమన్నట్టు– తన ఈసునసూయల్ని వేరే పొగగొట్టాల్లోంచి ఉద్గారిస్తుంటుంది కుళ్లుమోతు లోకం. ఈ వెనక నడకల కర్మయోగం వికటించి పట్టుబడుతామేమో అనుకున్నప్పుడు అత్యవసర పరిస్థితుల్లో– పల్లాన నీళ్లు తాగుతున్న జింకపిల్లని– 'అంతా నీ వల్లే కలుషితం అవుతుంద'ని తోడేలులా అదరగణ్ణం చేయాల్సి ఉండొచ్చు. అయినంతమాత్రాన మగవాడిగా advantageous ఎగువ మెట్టు మీదేమీ లేనెప్పుడూ. ఆమె అస్తిత్వం అసలు ఉన్నదే నన్ను అలరించడానికి, నేను వినోదించడానికి, నాకు సరెండర్ కావడానికి అన్న మగ దురహంకారం లేదు.

కానీ, bakku-shan, butter-face వంటి పదాలు, వాటి మూలాలు male-chauvinistic. Bakku-shan అంటే వెనక నుంచి చూస్తే బాగుండి, ముందు వికారంగా ఉండే అమ్మాయి. Butter face అంటే ఒళ్లంతా సెక్సీగా ఉండి, ముఖం మాత్రం వికారంగా ఉండే అమ్మాయి.

అందంగా ఉన్నారనడంలో ఆరాధన ఉందే గానీ, అందంగా లేరనడంలో మాత్రం అమానవీయత ఉంది. పదిమంది గుంపులో నలుగురు నచ్చితే, తర్కశాస్త్రం ప్రకారం మిగతా ఆరుగురు బాగోలేదని అర్థం కావొచ్చు. అయితే, సౌందర్యశాస్త్రం ప్రకారం అది తప్పు! 2–3 నిష్పత్తి అని, 40–60 శాతాలని లెక్కలేసే గణితశాస్త్రం కాదు సౌందర్యశాస్త్రం! అసలు

సౌందర్య- శాస్త్రం అనే పదబంధమే ఒక విరోధాభాస. మన Indian aesthetics – ఒక్క భారతీయ మాత్రమే కాదు- మన తూర్పు దేశాల aestheticsలో అమానవీయతకి చోటే లేదు. 'స్త్రీ'కి ఉన్న పర్యాయపదాలన్నింటికీ etymology ఆమె శరీరమే కావొచ్చు. ప్రాచీన కావ్యాలన్నీ జక్కవచంటి... నితంబిని... భగిని... వరారోహ... కృశమధ్యమ... చక్రజఘన... గుబ్బలాడుల రస స్వేదంలో తడిసి, నాని, చివికిపోయి ఉండొచ్చు. కానీ, ఆ అంగాంగ వర్ణనలో ఆమె పట్ల తన్మయం ఉందే తప్ప, పడమటి దొరలు చూపించే చులకన లేదు; పాశ్చాత్య సాహిత్యంలో ఉన్న farting దుర్గంధం లేదు (ఆ దుర్వాసన వెయ్యేవంతైనా తెలియాలంటే పాశ్చాత్య సాహిత్యాన్ని మధించక పోయినా, కనీసం – Albert Mordell రాసిన 'The erotic motive in literature', Roy P. Basler రచన Sex, Symbolism, and Psychology in Literature చదివి తీరాలి).

అలనాటి లండన్ మహానగరంలో Highbury Barn, Haymarket, Vauxhall, Cremorne వీధుల్లో స్త్రీ –కేవలం మాంసం ముద్ద; మన మెరక వీధులు, సానివాడల్లోలా కళామూర్తి కాదు. కాల్పనికంగా కొంచెం మెరమెచ్చులకి పోతే– A Thing of Beauty! వస్తువు కాబట్టే ఆ విషయలోలత్వం, వినిమయతత్వం! Ernest Christopher Dowson, Cholmondeley-Pennell, Coventry K D Patmore వంటి అశ్లీల కవులే కాదు, భావ, అభావ కవులు ఎవరిదైనా–

'కాపి కపోల తలే మిలితా లపితుం కిమపి శ్రుతి మూలే చారు చుచుంబ నితంబినీ దయితం పులకై రనుకూలే' అన్న భక్త జయదేవుని వివశ పరవశ దృష్టి– విస్తీర్ణోగురురాయ మశేషాం వసుమతీం నితంబ ప్రాగ్భారః శ్తగాయతి లఘుత్వం నయతిచ. అని సాక్షాత్ జగల్లీలనే స్తుతించిన ఆది శంకరుల వారి ఆధ్యాత్మిక దృష్టి– మరుని బండ్లకండ్ల మహిమలు పిరుదులు సరిబాదములు జలజపు సొంపులు అని సంకీర్తించిన అన్నమయ్య సౌందర్య దృష్టి occidental రాజ్యాల్లో ఏ దేశకాలాల్లో లేవు.

Bakku-shan ప్రాచ్య పదమేగా అనడానికి లేదు. అది జపనీస్ పదంగా గుర్తిస్తున్నప్పటికీ, 20వ శతాబ్దం రెండవ దశకంలో Emperor Shôwa గా ప్రసిద్ధుడైన Hirohito హయాంలో రెండు విదేశీ భాషల నుంచి derive అయిన సంకర పదమే Bakku-shan. ఇంగ్లీషు 'back' నుంచి bakku, German 'schön' (అందమైనది) నుంచి shan లని తీసుకొని Bakku-shan పదం తయారయ్యింది. ఆ మాటకొస్తే, మనకి కూడ colonial కంపుకొట్టే ఇటువంటి

సంకర పదాలు లేకపోలేదు.

పడమటి నుంచి తూర్పుకి నిరంతరాయంగా దిగుమతి అయ్యే ఈ సంకర భావాలతోనే– 'ఆడది ఆటవస్తువయ్యింది, అంగడిసరుకయ్యింది...'. అంటూ monolithic మగ దురహంకార దృష్టిని universal గా అంటగడుతుంటారు. '....ప్రేయసి మెల్లకన్నుల మీద పద్యాలు అల్లుతున్నారు' అని 'యోగ్యతాపత్రం'లో చలం గారు అన్న context వేరు. కానీ, oriental- occidental తేడాలు అర్థం గాని తన బుద్ధి జనిత ఆధునికతా జాడ్యాలతో మన దిగంబర కవి అంటున్నాడిలా – "ప్రబంధాంగనల తొడలు తాటి మొద్దులు/ తాకితే కాళ్ళు విరగొట్టు/ కుచములు ఎవరూ ఎక్కని పర్వతాగ్రములు/ తలను ఢీకొని బ్రద్దలు కొట్టు'!"

మళ్లీ ఆమె వెన్నంటిన నా oriental నడకల దగ్గరికి వస్తే–

తన వెంట నీడనై తచ్చాడుతూ తాదాత్మ్యం తారాస్థాయికి చేరుకొని ఏమీ చేయలేని, ఏం చేయాలో పాలుపోని బేలత్వం– అనే స్థితికి చేరుకుంటాను. ఆమెకి మరింత సాగిలపడే oriental స్థితి నాదైతే, Bakku-shan, Butter head, Dot Ass, Double R వంటి పదాలతో ఆమెని హీనపరిచే పరాయి occidental విష సంస్కృతితో పోలిక తెచ్చి అవమానిస్తావేం నన్ను!

◆◆ ◆◆

**(05.11.2014)**

# Her Bewitching Smile Heals Me, But…….

ఎన్నికల వేళ నాకు తెలియకుండానే నన్నెక్కువ ఆకర్షించిన వాక్యం– 'తాట తీస్తా'

ఈ వాక్య ప్రయోగం అంతకు మునుపు విననిదీ కాదు, అలాగని దానికి కొత్త అర్థాలు తోడయ్యాయనీ కాదు. కానీ, అన్ని పార్టీల నాయకులు, స్థాయీభేదాలు లేకుండా ప్రత్యర్థుల్ని ఈ వాక్యంతో బెదిరించడం చూసి, లేదా విని, ఆ వాక్యం– రేపు రానున్న ప్రజాస్వామిక మహోదయం కోసం కట్టిన స్వాగత తోరణంలా తోచింది.

అయితే, తాట తీయడం, తొక్క ఒలవడం, చర్మం పెరకడం … ఆషామాషీ విషయాలు కావనీ, వాటికి చాలా నైపుణ్యం, చాకచక్యం, ఒడుపు ఉండాలని కంచె ఐలయ్య గారి వంటి subaltern studies లో నిష్ణాతులైన వారు హెచ్చరించే అవకాశం ఉంది.

బహూశా వీటి గురించి అవసరం కంటే ఎక్కువ ఆలోచిస్తున్నానేమో, లేదా ఇది నా అనుభవంలోకి తేవాలన్నది దైవసంకల్పమో గానీ… మే 10, 2014 శనివారం మిట్టమధ్యాహ్నం 12.30 జరిగిందొక సంఘటన:

**ఘటనకి క్రితం ముందు:**

ఎప్పట్లానే ఎవరో తరుముకొస్తున్నట్లు, లేదా కాలాల్ని క్షణాలతో, దూరాల్ని మిల్లీమీటర్లతో కొలిచే లెక్కల మాష్టారిలా శరవేగంతో నేను నా బైక్ మీద రోడ్ నెంబర్ 10 వాలున దూసుకొస్తున్నాను. Sub-lane నుంచి, యవ్వనాల బులపాటతో దూసుకొచ్చిన కారుని చూసి సడన్ బ్రేక్ వేశాను.

**క్రితం తర్వాత:**

కారు ఒడుపుగా వెళ్లిపోయింది, వెనకేమి జరిగిందో గమనించకుండానే. నా బైక్ కూడా కారుని అనుసరించింది; కానీ చక్రాల మీద కాకుండా రోడ్డు

మీద పొరాడుతూ అనుసరించాలని ప్రయత్నించింది. అంతకు ముందు వర్షం వల్ల కొట్టుకొచ్చిన సన్న గులకరాళ్ల శకలాలు బైకుతో పాటు పొరాడిన నా మోచేతి, మోకాళ్ళ తాట తీసాయి.

పక్కటెముకల పంజరం నేల గుద్దుకొని వాయుస్థంభనని అభ్యాసం చేయిస్తున్న గమ్మత్తైన అనుభవంలో తాట రేగిన వైనాన్ని తరిచి చూద్దామనుకుంటే నెత్తురు ముద్దైన ముంజేయి అందుకు వీలుకల్పిస్తేనా...

◆◆ ◆◆

పేరుకు తగ్గట్టు స్టార్ హాస్పిటల్ స్టార్ మర్యాదలే. ఉన్న జబ్బునీ, రోగాన్నీ ద్విగుళం, బహుళం చేసిన భావన కల్పిస్తూ ఎమర్జన్సీ వార్డులో లేనిపోని మర్యాదలు.

మండుటెండలోంచి మండుతూ రక్తమోడుతూ లోనికొచ్చానా... చప్పున కమ్మిన చల్లదనం. సెంట్రల్ ఏసీ వల్ల అనుకుంటే పొరబాటే; ఒక్క చిర్నవ్వుతో వేయి ఉదకమండలాలు కల్పిస్తూ... ఆమె!

నీలాకాశం రంగు బట్టల్లో నీలిగోరింట పువ్వుల్లా ఉన్న నర్సింగ్ మలయాళీ పిల్లలకి behaviourial sciencesకి సంబంధించి అనుకుంటా, క్లాసులు తీసుకొంటుంది– ఆ నందివర్ధనం.

ఒక పక్క నాలో ధైర్యాన్ని ఔన్సులకొద్దీ నింపే ప్రయత్నం చేస్తూ, మరో పక్క నర్సింగ్ పిల్లలకి గాయాల నా దేహాన్ని ఒక ప్రయోగశాల చేసిందా కెందామర.

నిజం చెప్పొద్దూ– 'మీరు కొంచెం ఓర్చుకోవాలి...' అన్న ముందస్తు ముదిగారపు హెచ్చరిక చేసిందే గానీ, మూడు సమాంతర రేఖలుగా కుడి చేయి పొడవునా తాట రేగిన గాయాలు నెత్తురు రంగు విదుల్చుకొని కొత్త వర్ణాల మెరిసినప్పుడు, ఆమె సుతారంగా రాసిన టింక్చర్ నవనీతంలా తోచి, హంసతూలిక వంటి ఆమె అభయ హస్తాన్ని తాకితే sexual abuse and assault నేరారోపణ చేస్తారేమోనన్న జంకుతోనే బిర్రబిగుసుకుపోయాను.

◆◆ ◆◆

ఏదిఏమైనా, ఆ చంద్రగంటికి నేనంటే ఒక ప్రత్యేకమైన ఆసక్తి కలిగిందేమో అన్న శంక అప్పుడప్పుడే పుట్టీ– పెరిగి – పెద్దదైపోయింది. కేవలం ఫార్మల్ గా అడిగే పేరు వంటి వివరాలతో ఆగలేదామె. Matrimonial వాళ్లు అడిగే వివరాలకి కొంచెం అటుఇటుగా అడిగింది. 'Married?' అన్న ప్రశ్నని వేయలేక వేసిందని నా మధురోహ.

ఆ టెస్టులూ, ఈ పరీక్షలూ, ఎక్సరేలు, ఈసీజీ వగైరాలు అయిపోయి, మూడున్నర వేల రూపాయల బిల్లుతో పాటు చాంతాడంత prescription చేతిలో పెడుతూ నన్ను discharge చేస్తూ ఇలా అందామె: "మీది MLC (Medico-Legal Case) కావడం వల్ల అన్ని వివరాలు అడిగాను".

అంతే తప్ప మరే ఉద్దేశం లేదని చెప్పకనే చెబుతుందా? లేక మొక్కై వంగనిది మానై వంగదని తన ఆసక్తిని మొగ్గగానే తుంచేసుకునే ప్రయత్నమా..?

...ఇలా ఆలోచించుకుంటూ, నాకు నచ్చిన కారణాలు ఆపాదించుకుంటూ బైటపడుతుంటే... ఆమె వెనక్కి పిలుస్తుందంటూ కబురు–

తుంచేసుకోవాలని అనుకుంటుందే గానీ, అది అంత తేలిక కాదని బోధపరుస్తున్న లోన పెనుగులాటకి పర్యవసానమే బహుశా ఈ పిలుపు!

చరిత్రలో లీలా మానస చోరుల అంశ ఒక గోరోజనంలా ఆవహించి మళ్ళీ ఎమర్జన్సీ వార్డులో నా కోసం ఎదురు చూస్తున్న ఆ కనకాంబరాన్ని కలిసాను, ఏమి చెబుతుందోనన్న ఉత్కంఠతో–

"మీరు వచ్చాక చేసిన Tetvac (Tetanus Toxoid Vaccine) ఇంజెక్షన్, డ్రగ్స్ ఈ వార్డు మెడికల్ కిట్‌లోంచి వాడాము. వాటికి 34 రూపీస్ అయ్యాయి. అవి పే చేసి వెళ్లండి. ఆ విషయం మర్చిపోయాను, అందుకే మిమ్మల్ని వెనక్కి పిలవాల్సి వచ్చింది.."

– రేగిన తాట మీద గొడ్డుకారం చల్లినట్టు, గుచ్చిన చోటే మళ్ళీ మళ్ళీ బల్లెం వంటి సూదులు గుచ్చిన ఫీలింగ్, ఆ తెల్లగన్నేరు మాటలకి!

**(13.05.2014)**

# రాఖీపున్నమి-ఒకానొక పెను జ్ఞాపకం

## Prologue

“అన్నయ్యా!”

...ఒక్కసారిగా ఆ పిలుపుకి ఉలిక్కిపడ్డాను. కాసేపు ‘నన్ను కాదులే’ అని మభ్యపెట్టుకున్నాను. పుండు మీద మళ్లీ మళ్లీ గుచ్చే ముక్కులాంటి నోటితో నా వంకే చూస్తున్న ఆ చీమకళ్లలో ‘మెల్ల’ ఏమైనా ఉందేమోనని ఆశగా వెదికాను. తప్పించుకునే మార్గం లేక, ఆ పిలుపుల నైలాన్ తాళ్ల వలలో చిక్కి విలవిలలాడాను.

కొత్త (అద్దె) ఇంటికి మారి పట్టుమని పదిరోజులు కూడా కాలేదే, కనీసం ఈ రోజు రాఖీ పున్నమి కూడా కాదే... అంటూ సాగిన నా అంతర్మథనం అనబడే లోన గడబిడ గురించి తెలియాలంటే, నా కురచదనమూ, ఇరుకుదనమూ ముందుగా తెలియాల్సిందే...

◆◆ ◆◆

రక్షాబంధన్ అనబడే రాఖీ పౌర్ణమి నా లోగిలిలో విరగకాసిన సందర్భాలు చాలా అరుదు.

నాకు ఒక్కడే తమ్ముడు, నా తర్వాత 8 ఏళ్ళకి పుట్టాడు, ఇక చెల్లెళ్లు లేరు. మా కజిన్లు ఉన్నారు గానీ, నా కంటే 15,20 ఏళ్లు చిన్న వాళ్లు. రాఖీ కట్టడం అనే సంప్రదాయం మా కోస్తా ప్రాంతాలకి తెలిసేటప్పటికి నేనా నేలకి ప్రవాసిని అయిపోయాను. ఇప్పుడన్నీ ఖర్చులేని ఆశీర్వచనాలే (రాత్రే యుఎస్‌లో ఉన్న చెల్లి e- రాఖీ పంపితే, నేను e- దీవెనలు తిరిగి పంపించాను కూడా).

తోడబుట్టినవాళ్లు లేకపోవడం, ఆ పేగుపాశం గాజురజను కలిపి చేసిన ట్వైన్ దారంలా లాగకపోవడం వల్ల ఆ అనుబంధంలోని గొప్పదనం నాకు అర్థం కావడం లేదేమో. బహుశా ఆ సున్నితత్వ లేమి కారణంగానేమో, మన సంస్కృతి, సంప్రదాయాలకి అచ్చమైన దర్పణాలైన మన తెలుగు సినిమాలలో... ‘అన్నయ్య సన్నిధి అదే నాకు పెన్నిధి / కనిపించని

దైవమే ఆ కనులలోన ఉన్నది'; 'ఇంటి పంట చిన్నారి చెల్లి మాకంటి పాప బంగారు తల్లి / ఈ చోట ఉన్నా ఏచోట ఉన్నా ఎదలోన నిన్నే కొలిచేను అన్నా...'; ఒక కొమ్మకు పూచిన పువ్వులం అనురాగం మనదేలే / ఒక గూటిని వెలిగిన దివ్వెలం మమకారం మనదేలే'; 'మల్లెతీగకు పందిరి ఓలే... నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా...' అంటూ అంతులేని మాటలుగా, పాటలుగా పొంగిపొర్లే ఆ అనుబంధాలు నన్ను బెంబేలు పెడతాయి చిన్నప్పటి నుంచి. ఈ అనుభవసాంద్రతకి చలించని చెమ్మగిల్లని నన్ను నేను అద్దంలో చూసుకుంటాను, నా ఒక్కగానొక్క తమ్ముడు, కజిన్ చెల్లెళ్లతో నా సంబంధ, సాన్నిహిత్యాల్ని మళ్లీ మళ్లీ తరిచి మరీ అనుమానంగా.

Confession బాక్సు ముందు చెప్పుకోవల్సి వస్తే మాత్రం, కొన్ని నిజాలు చెప్పక తప్పదు.

చిన్నప్పుడు, మా శాంతా కాన్వెంట్ (చీరాల) లో చేయించిన pledge లో All Indians are my brothers and sisters అని పలకడానికి కూడా నేను సందేహించాననే చెప్పాలి. అక్కలుగా, చెల్లెళ్లుగా పనిగట్టుకొని చూడటంలో ఏదో మెలిక ఉందని, ముడులు తీయలేని నాకు అదొక చిక్కుముడిని బహు నైతికంగా వేస్తుందని తెలిసిపోయింది ఆనాడే. కానీ విధివశాత్తూ నాకు చాలా మంది సోదరీమణులు ఆపాదించబడేవారు. మా వీఆర్ఎస్ & వైఆర్ఎన్ కాలేజ్ పంతులుగారు –వెంకట్రామయ్యగారి అమ్మాయి కృష్ణకుమారి మా క్లాసుమేటు (ఇంటర్లో), చాలా అందంగా ఉండేది. నా ఖర్మ కాలి తనకీ నాకూ పోలికలు ఉండేవి (పచ్చని ఎడమ చెంపమీద, పెదవి పైన కుడి వైపు ఇద్దరికీ ఒకే చోట పుట్టుమచ్చలు ఉండేవి, సినిమాలో కవల పిల్లలకి మల్లే). దాంతో నేనెందరికో బామ్మర్దిని. 'ఒరే... మీ సిస్టరు... (అక్క అనేంత పెద్దది కాదు, చెల్లి అనాలంటే, నేనంత పెద్దగా కనిపించను...) ..' అని మొదలుపెట్టేవాడు ప్రతి ఫ్రెండు గాడిద. హైద్రాబాదు నుంచి బదిలీ మీద వచ్చిన తెల్ల శీను వాళ్ళింటికి వెళ్లినప్పుడు అలవాటుగా 'బామ్మర్ది' అని పిలుస్తుంటే, వాడి ముగ్గురు చెల్లెళ్లూ కొత్త లంకెలకి కంగుతినడం ఒక చిన్న కొసమెరుపు.

తెల్ల శీను, హమీద్, శ్యాము, రమణ వంటి క్లాసుమేట్లు రోజూ రైల్వే స్టేషన్‌కి ఠంచనుగా వెళ్తుండేవారు, 'నీ సిస్టర్స్ ఉంటార్రా బోల్డుమంది...' అంటూ నాతో. నా అక్కలు, చెల్లెళ్లు నాకు బొత్తిగా తెలియకపోతే బాగుండదని ఒకేఒకసారి వెళ్లాను వారి వెనక. సైటు కొట్టడం, వెకిలి కామెంట్లు చేయడంతో వాళ్ల సాయంత్రపు విధులు ముగియడంలేదు. ట్రైను కదిలాక, కిటికీల దగ్గర కూర్చొని అప్పటివరకూ ఈ కోతిమూకల ఆగడాల్ని భరించిన అమ్మాయిల

బుగ్గల్ని పుణికి, గిల్లి, ఏ దూర ప్రాంతాలకో వెళ్తున్న వాళ్లని ఆ హఠాత్ అఘాయిత్యాలతో కలవరపెట్టడం, భయపెట్టడం, దాంతో ఏదో సాధించినట్టు రాక్షసానందం పొందటం చూసి షాక్ అయ్యాను. అక్క, చెల్లి అనుబంధాలు తెలియక, అమ్మాయిని కేవల శారీరక దృష్టితో చూసే అల్లుల్లో ఒకడైన నేను కూడా, ఆడపిల్లలు ఎండ సోకితే కందిపోతారని, పూవు తగిలితే నలిగిపోతారని, కాళ్లకి మట్టంటకుండా అరిచేతులు పరవాలని అనుకుంటాను కదా; అక్కలు చెల్లెళ్లు ఉన్న వాళ్లు ఆడపిల్లల్ని లోకువచేస్తూ కామెంట్లు చేయడం, అలా రైలు బోగీల వెంట తెగబడి దాడి చేయడం ఏమిటని అర్థంగాక, నా ప్రశ్నలకి బదులుగా వాళ్ల దగ్గర 'అదరగణ్ణం' తప్ప మరేమీ లేక మా బావామర్దుల బంధం అలా అర్ధాంతరంగా ముగిసిపోయింది.

◆◆ ◆◆

ఆ తర్వాత, అటువంటి బావల వల్ల అంటగట్టబడే బలవంతపు అక్కా చెల్లెళ్ల బారిన పడకుండా కాలం వెళ్ళదీస్తున్న నాకు, రాఖీకి సంబంధించి ఎదురైన ఒక భీతావహ అనుభవం:

అప్పుడు ఒక కన్‌స్ట్రక్షన్ కంపనీలో ఇంజనీర్‌గా చేస్తూ (1991), నా తొలి school of primitive passions వంటి కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ (కెపిహెచ్‌బి) కాలనీలో ఉండేవాడిని. మా రూము కింద ఒక ముచ్చటైన జంట ఉండేది. జంట అంటే భార్యా భర్తలని కాదు. ఆమె భార్యే ఒకరికి, ఇతను బ్యాచులర్. ఆమె భర్త అటు ఐడిఎ బొల్లారం వైపు ఏదో ఫ్యాక్టరీలో మరేదో పని, రాత్రులూ, పగళ్లూ వరస డ్యూటీలు చేస్తుండే వాడు; ఇక్కడ ఈమె తన నెర నేస్తకాడుతో కలిసి అవిరామ ప్రణయ యాత్రలో ఉండేది.

ఆమెకి సంబంధించిన ఆనవాలు చెప్పాలంటే మొదట చెప్పవలసింది ఆమె నవ్వు గురించి. ఒడ్డు తట్టేంతవరకూ విస్తరించడం ఆపని కోనేటి అలలా ఉండేది ఆమె నవ్వు. ఇరుగుపొరుగు రాళ్లు పడి అలజడి పెరిగితే, నదురూ బెదురూ లేని నవ్వులు మరింత తరగలెత్తేవి. గట్టిగా జానాబెత్తెడు కూడా ఉండని జడ; కానీ మందమైన నొక్కుల జుట్టు కావడం వల్ల వందల జలపాతాల్ని పేనినట్టు ఎంత అల్లికో. తన గురించి ఏ రకంగా తెలిసినవారికైనా, ఏమీ తెలియనివారికైనా ఒకేలా కనిపించడమే ఆమె అందానికి ఉన్న ప్రత్యేకత. ఎవరికోసమో అన్నట్టు ఉండకపోవడమే కాదు, తన ఏ దేహాంగమైనా దేనినో ఆశిస్తుందని, అంగలారుస్తుందని అన్న ఆలోచనే కలగదు. మరి తన అవసరం, అవసరం వల్ల కంటిజీరల్లోకి కుంకుమ పూవులై పూచే ఆహ్వానం... తొలిసారి అతనికెలా అర్థమయ్యాయో నాకు బోధపడలేదు. అతను బాగానే ఉండేవాడు. కానీ, చదువుసంధ్యలు (అకడమిక్ మాత్రమే కాదు) లేని ఒట్టి ఫూల్. గొప్ప మాటకారి కూడా కాదు. తెలివితేటలు మోకాళ్లలో ఉన్నా, కొందరు లీలా మానస చోర విద్యలో నిష్ణాతులుగా ఉంటారు. పోనీ అలా సరిపుచ్చుకోవడానికి కూడా తగడు. అందుకే, ఆమెకీ, అతనికీ జట్టు ఎలా కుదిరిందో

లెక్క తేలేది కాదు. వాళ్ల జుగల్‌బందీకి గోడ చాటు నైతిక మద్దతులే కాకుండా, వాళ్ల ఏకాంతానికి బాహాటమైన సహకారాలూ అందించడం వల్ల ఆమె నాతో అప్పుడప్పుడూ తన గోడు చెప్పుకునేది. నా వరకు నాకైతే ఆ సంజాయిషీలు అక్కర్లేదు, వాళ్లాయన మీద నా తొలిచూపు చికాకులు మరింత చిక్కనౌడానికి.

ఎక్కడ ఏ సంప్రదాయక శక్తులు స్వైరవిహారం చేశాయో గానీ, ఏ పరువు ప్రతిష్ఠలు వీరంగం వేశాయో గానీ, ఒడిదుడుకుల్లేని ఆ రస నౌకాయానానికి అవాంతరం వచ్చిపడింది. గుంపు గురవయ్యల్లో ఒకడిగా, మంద గొర్రెల్లో ఒకానొకటిగా అనిపించే ఎత్తుపళ్ల మొగుడు మగాడై, బంటు కాస్త 'దండ' నాయకుడై, మందిని కూడగట్టి మాస్ హీరో అయ్యాడు.

దెబ్బలకి కమిలి అతను, రోషంతో కంది ఆమె! వాళ్ల మెడలు వంచి, రాఖీలే కళ్లేలుగా స్వారీ చేస్తూ పెద్దమనుషులు. ఆమె చేత అతనికి బలవంతంగా రాఖీ కట్టించడం ద్వారా ఆ తాయెత్తు మహిమ మొదటిసారి నా మెదడుకి ఎక్కించారు నాటి తీర్పరులు. మడిబట్ట వేస్తే దొంగలు రారుకదా అనుకున్న అమ్మమ్మల అమాయకత్వం కనిపించలేదు, ఆ రాఖీలో. Chastity బెల్టులు వేయడానికి వీలుగాగ ప్రత్యామ్నాయాల కోసం వెదికే నీతిమంతులకి దొరికిన ఆధునిక ఆయుధం కనిపించింది నాకైతే.

నేను గమనిస్తున్నంత మేరకీ బైట ప్రపంచమంతటిలో రాఖీ అంటే ఒక హెచ్చరిక, నీతిచంద్రిక, వేళాకోళం, లేదా ఓ వేలంవెర్రి. రాఖీ పౌరాణిక ప్రాశస్త్యాన్ని తెలుపుతూ పాత వ్యాసాలు ప్రచురించడం, అన్నా చెల్లెళ్ళ బంధం మీద గంభీరోక్తుల మధ్య, పదేపదే కావలించుకొనే తెలుగు సినిమా అన్నా చెల్లెళ్ల పాటల క్లిప్పింగులు ప్రసారం చేయడం, ఆడపిల్లలు రాఖీలతో దండెత్తి వస్తుంటే, మగ వెర్రివెధవాయిలు కకావికలం పారిపోవడం వంటి ముక్కిపోయిన జోకులెయ్యడం, లేదా జైళ్లకీ, నాయకుల ఇళ్లకీ బారులు తీరడం... ఇంతే రాఖీ అంటే.

భాగస్వామిగా, స్నేహితుడిగా, ప్రియుడిగా ఎంచుకోవడానికి అర్హతానర్హతలు చూస్తారు కదా, (రక్తబంధం కాకుండా) 'అన్నయ్య' అనో, 'తమ్ముడనో' అనిపించాలంటే ఎంత అల్పుడైనా ఫర్లేదా?

సంసారినయ్యాక, సామాజికంగా మప్పితమైన హోదా వచ్చాక, సాటి మర్యాదస్తుల సాంగత్యం వల్ల 'అన్నయ్య' అవ్వక మరే వీలూ లేని పరిస్థితులు దాపురిస్తుంటాయి అప్పుడప్పుడు. ముఖ్యంగా, మా కోస్తా అలవాటు ప్రకారం, అన్ని వైవాహిక బంధాలూ covert కుండమార్పిళ్లే (కుండమార్పిడి అంటే– ఇతని చెల్లెల్ని అతనికివ్వడం, అతని చెల్లిని ఇతను చేసుకోవడం). 'మా

ఆయన' అని చెప్పదు ఏ సంప్రదాయక తిలక; 'మీ అన్నయ్య గారు..' అంటుంది పక్కింటి ఆవిడ ముందరి కాళ్లకి బంధం వేస్తూ. ఆ పొరుగామె కూడా రెండాకులు ఎక్కువే గానీ, ఏమీ తక్కువ తినదు గాక తినదు (మా ఉష అంత అభద్రతతో అలమటించదు– 'మా నరేషు...' అంటుంది ఏ మెలికలూ లేకుండా).

మా పెద్దోడు పింకి (నైమిష) చదువు కోసం, సఫిల్‌గూడ డిఎవి స్కూల్ దగ్గర్లో వినాయక నగర్లో ఉండేవాళ్లం. అక్కడ పొరుగిల్లే గానీ, పుల్లకూర ఎంత మాత్రం కాని ఓ పచ్చలకడియాల పద్మగంధి. ఆమె పేరు అడగక్కరలేదు. భృకుటి మడతల్లో ఏ తొందరపాటు బ్రహ్మో వెయిన్నొక్క పేర్లు ఇరికించి ఇరికించి రాసి ఉండటం చేత పెనవేసుకున్న మిన్నాగులు కనిపించేవి నుదురు మీద. ఆ పేర్లలో నేను చదవగలిగిన ప్రలోభ, చంచల, శోషణ... వంటివి కొన్ని మాత్రమే. ఆమె ఏదైనా అడిగినా, చెప్పినా, స్వరంలోంచి వచ్చే ఏ శబ్దమైనా ఓ గుసగుసలా ఉండేది, రతికూజితమంటే ఇదేనేమో అన్న గుబులు పుట్టేది. ముందు పుట్టిందో, తర్వాతే వచ్చిందో గానీ, యుగాల పెనుగులాటల గుట్టుమట్టుల్ని కప్పుర తాంబూలంలా మనే కారాకిల్లీలా పుక్కిట పట్టినట్టే అనిపించేది, దోరగా పండిన నాలుకతో. ఏమెరగనట్టు చూసేది, కళ్లతో కాదు, రారమ్మని పిలిచేది, నోటితో కాదు. ఇంతెందుకు, తన అణువణువూ నిండిన కవోష్ణ బిందువులు నిరంతర రహస్తంత్రీ ప్రసార కేంద్రాలు.

అటువంటి ఆమె, ఉషని వదిన అనక ముందే నన్ను 'అన్నయ్యా' అని పిలిచింది, తటిల్లతలు అని మురిసిపోతున్న నా మీద వాటినే పిడుగులుగా రాల్చుతూ.

నిజంగానే తల్లడిల్లి పోయాను. ఎతీనా స్నానం చేస్తుంటే చూసి గుడ్డితనాన్ని శాపంగా పొందిన టైరషియస్ నైనా ఇంత బాధ ఉండేది కాదేమో, అంధత్వంలోంచి కూడా అందాన్ని అన్వేషించొచ్చని. కానీ, ఇదేమి ఘోరం, అకారణంగా నన్ను 'అన్నయ్య'ని చేసి, పాపపుణ్యాల అడకత్తెరలో పోకచెక్కని చేసి ఆమె బావుకున్నదేమిటి, తన పాతివ్రత్య ధర్మాన్ని గురించి ఎచ్చులు పోవడం మినహా. ముఖమ్మీద చాచి కొట్టిన ఆ అవమాన భారంతో అక్కడున్న ఏడాదిలో ఏనాడూ తన వంక చూడలేదు నేను.

'కాని' దేశాల్లో నేనెక్కువ లేను గానీ, ఉద్యోగరీత్యా కొంత కాలం ఉన్న ఢిల్లీలో అయినదానికీ, కానిదానికీ 'భయ్యా' అనే బుసలతో భయపెట్టే వాళ్లు అక్కడి శ్వేతనాగులు. తాతగారి బామ్మ గారి కాలంలో ఉండే మన దక్షిణాదివాళ్ల కంటే, దుస్తుల విషయంలో రేపటి తరం దూతలైన ఆ పొదుపరి దేవతా కాంతలు ఎక్కడ 'భయ్యా' అంటారో అని దాదాపు తరుముతున్నటే పారిపోయేవాడిని.

◆◆ ◆◆

మళ్లీ Prologue దగ్గరకే వస్తే............

ఢిల్లీ నుంచి హైద్రాబాదు తిరిగొచ్చాక దిల్‌షుక్‌నగర్‌లో ఇల్లు తీసుకొన్న కొత్తలో పక్కింటి ఆవిడ 'అన్నయ్య...' అని పిలిచింది. కూతుళ్లకి కూడా పెళ్లిళ్లైపోయి, నాకంటే పెద్దైనందువల్ల

కాదు నా ఉలికిపాటు. పక్క అపార్ట్మెంటులో ఉంటున్న ఆమె ఉనికిని ఆ వారం పదిరోజులుగా కూడా నా కళ్లు పట్టించుకోలేదంటేనే ఇక ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కానీ, తన అభిమానానికి భంగం వాటిల్లకుండా, తనని తాను రక్షించుకునే ప్రయత్నంలో భాగంగా మాత్రమే నా మీదకు విసిరిందా పెను బంధన నియతి. తన సమ్మోహన శక్తి మీద తనకి ఉన్న మొక్కవోని నమ్మకానికి కించిత్ ముచ్చట పడినా, అత్యంత మూర్ఖమైన, బహు conservative ఐన నా సౌందర్యదృష్టిని 'అన్నయ్యా...' అన్న స్వీయరక్షణ కచ్చడంతో ఘోరంగా ఆమె అవమానించడం ప్రతి రాఖీ పున్నమిన గుర్తుకొచ్చే పీడ జ్ఞాపకాలలో ఒకానొకటి.

◆◆ ◆◆

**(21.08.2013)**

# ఏమి చూసి మోహిస్తివి?

ఏ డెనిమిదేళ్ల క్రితం నేను మునెమ్మ మోహంలో అచింతితంగా చిక్కుకొన్నప్పుడు 'నా'తనమని నేను నమ్మే నా hide గాడు ఈ ప్రశ్న వేశాడు:

'ఏమి చూసి మోహిస్తివి?'

ఆ ప్రశ్నకి బదులు తడుముకొని, వెదుక్కొని చెప్పబోయే ముందు, ఎవరిని చూసి నేను మోహిస్తానో confess చేయాలి.

ముట్టుకుంటే మాసిపోతూ, తాకితే కందిపోతూ, నా దిష్టిచూపుకి వడిలిపోతూ అందీఅందని ontological సారూప్యాలతో నా చుట్టూ తిరుగాడుతూ రాయని నా వేనవేల కావ్యాలకి నాయికలౌతున్న వాళ్లు– ఒక వర్గమైతే, సీమాసమయసందర్భాల పట్టింపులేని, భావభాషాసాంస్కృతిక అంతరాలకి అతీతమైన 'ఆమె'లు ఎవరెవరి కావ్యాలల్లోనో నాయికలై తారసపడే వాళ్లు మరొక సంవర్గం.

మొదటి వర్గం వాస్తవికమనీ, రెండవ కేటగిరీ కాల్పానికమనీ అగ్గిపెట్టె అపార్టుమెంట్లలో మాదిరిగా గోడలు కడితే సహించలేను. అలాగని, నా నాయికలందరూ అడ్డూఆపు, దిక్కుదెస లేకుండా పరుగులు పెట్టే వీలున్న ఒక అనావృతమైన పచ్చిక మైదానమే నా లోపల లోకమని బొంకలేను. ఎగుడుదిగుళ్లు, చాటుమాట్లు బోలెడున్న ఆ అద్దానపు అడివి మిట్టపల్లాలో దాగుడుమూతలాడుతుంటారు యీ నా మోహనాంగులు.

నా మటుకు నాకు ఏ తేడాలూ లేకపోయినా, మహామహా కవులు/ రచయితలు చెరపరాని తమవైన అధోజ్ఞాపికల్ని లోలాకులు చేసి కొందరికి తగిలించి, నా నెచ్చెలుల్ని factual - fictional అంటూ వర్గీకరణల గీతలకి చెరో దిక్కూ విసిరేస్తుంటారు. గీతకి ఇవతల రక్తమాంసాల రాగద్వేషాల సజీవ మూర్తులు, లేదా గీతకి ఆవల రసోల్లాస రాగమయిల వెనకముందులెరగని ప్రేమలో మునగీతలేసినప్పుడు లేనిది, బాగా తలతిక్కలా అనిపించే 'ఏమి చూసి మోహిస్తవి?' అన్న ప్రశ్న – మునెమ్మ విషయంలో తలెత్తడానికి కారణమేంటి?

క్షణానికో రూపై ప్రిదిలిపోతున్న ఆవురావురు ఆవిర్మేఘాల్లాంటి... వయ్యారపు కవళికల వాయుశిల్పాల్లాంటి... నీటి కాన్వాసు మీద విరిగి విస్తరించే సవర్ణ చిత్రరచనల్లాంటి

కాల్పానిక లాసికాప్రియలు – మునెమ్మకు ముందు కుడికాలు మోపి నాలోకి అడుగుపెట్టిన ఆ శైలూషీమణుల చిట్టా విప్పనా, కాస్త ముందువెనకలుగా?

– వేదవాఙ్మయ కాలం నుంచి నిన్నటి విశ్వకవుల నుంచి, మన చలం, కృష్ణశాస్త్రుల వరకూ కవులెందరో యుగయుగాలుగా చేస్తున్న 'చిరదీక్షా శిక్షా తపస్సమీక్షణ'కి తన చేలాంచలాలు అందీఅందించని ఊర్వశి, 'అనాఘ్రాతం పుష్పం కిసలయమలూనం కరరుహైః / రనవిద్ధం రత్నం మధు నవమనాస్వాదితరసం'– శకుంతల, అదే కాళిదాసుని మాళవిక, క్షీరాబ్ధి వెన్నురగల వెన్నెలతరగల నునుపచ్చి సోయగాల మహాసౌందర్యాతిశయ Aphrodite, the face that launched a thousand ships- Helen of Troy, మరుల విరుల మదవతి Salome Cornelia, చెకుముకి స్పర్శల పరుసవేది, శరశరీర శతప్రలోభ దేహదేవి– దేవదేవి, 'నీలా తుంగస్తన గిరితటీ సుప్త ముద్బోధ్య' గోదా, 'యమునా తీరవానీర కుంజే మంద మాస్థితం ప్రాహ ప్రేమ భరోద్భ్రాంతం'... శ్రీ జయదేవ భణిత – రాధికాసఖీ, అమలిన అనురాగ దేవేరి, ఆమని తొలి తెలి సొబగుల Beatrice Portinari, 'సూటి జక్కవల జోడలరించీ నాటకపు గతుల నాభి సరసి..' అన్నమయ్య అలకలకులుకుల అలవేల్మంగ, చిట్టిపొట్టి సంపెంగ నాసికాభరణాల Cleopatra, చపల ప్రేమోన్మత్త చాంచల్య డోలాయమాన స్మరదీపిక Emma Bovary, మహా సౌందర్యాతిశయ అనురాగ ప్రేమోపహత జ్వాలా దగ్ధ Anna Karenina, నా గ్రేట్ ఎక్స్‌పెక్టేషన్ల Estella, ధీరలాలిత్య ప్రేమైక మనోజ్ఞ మానని Elizabeth Bennet..... ఇంకా వాసంతసమీరాల వసంతసేన, వంచనాశిల్పాల Scarlett O'Hara, Scarlet Letter మోసిన మోహచంద్రిక Hester Prynne, ప్రణయ పరాగాల పరాసు పుప్పొడి ధూళి Nana, చక్కెరమాటలాడి మధురవాణి, స్ఖలనలీన రాగలీన స్వప్నలీన మౌనలీన నాదలీన విశ్వలీన... స్వప్నరాగలీన...

– ఈ జాబితా అనంతం.

ఇప్పుడు తిరిగి– 'ఏమి చూసి మోహిస్తివి?' అన్న ప్రశ్న దగ్గరికి వస్తే, ఈ ప్రశ్న మునెమ్మ విషయంలో తలెత్తడానికి కారణమేంటి?

మునెమ్మని నేను చూసిన తీరు చెబితేగాని, ఏమి చూసి మోహించానో తేల్చుకోవడం కష్టం. అసలు ఈ నవల ముఖచిత్రం మీద మునెమ్మ బొమ్మ వేయడాన్నే నేను సహించలేకపోయాను. మునెమ్మ తనకెలా కన్పించిందో సదరు చిత్రకారుడు చెప్పేందుకు చేసిన ప్రయత్నం నా ఊహలకి తొలి అడ్డంకి. అయినా, ఇందులో మధురోహలు పోవడానికేముంది? ఆముదంతో అంటి అణగదొక్కిన జుట్టూ, జిడ్డోడే ముఖాన సత్తు కాసంత బొట్టు, మెరుపు మాసిన ముక్కుకమ్మి, రాగి జుమికీలు, మురికి పసుపుతాడు, మోటుగాజులు, ఎగిరిపడే

ఎండు డొక్కలు, ఉప్పిరిసిన ఒళ్లు, ఊసకాళ్లకి ఉక్కుకడియాలు, మట్టికాళ్లు– మొరటు మెట్టెలు... ఇంతకి మించి చించి... ఊహించడానికీ?

అందని అందాల ఇంద్రచాపాలు, తటిల్లతల్లాంటి నా నాయికా సందోహంలోకి ఈ మునెమ్మ ఎలా చొరబడిందో నాకు అర్థం కాకపోవడం వల్లే 'ఏమి చూసి మోహిస్తివి' అన్న లోప్రశ్న.

2007 చతురలో వచ్చినప్పుడు మొదట నడిచాను అసంకల్పితంగా మునెమ్మ వెనక. అవును, మగాళ్లం కదా ఇట్టే బైటపడి పోతాం. అలా బైటపడిపోయే సామాజిక వెసులుబాటు కావల్సినంతగా ఉంది కాబట్టి, మగాళ్ల లేదా మగ పాత్రల ఉద్వేగాలు బ్లాక్ & వైట్ గా తేటతెల్లమైపోతాయి. అసుర (అంబటి సురేంద్రరాజు) మాటల్ని అరువు తెచ్చుకొని చెప్పాలంటే, నాగరికత – ఆధునిక అర్థంలో విజృంభించి నన్ను కప్పి ఉంచడం వల్ల మనిషిగా నాలో దాగి ఉన్న మృగాన్ని అణిచి ఉంచగలిగాను. కాబట్టి మునెమ్మ మీద నా మోహాన్ని దాచి ప్రశ్నల దగ్గర తచ్చాడుతున్నాను కానీ, పశువైన బొల్లిగిత్త, పశుత్వాన్ని అధిగమించాల్సిన అవసరం లేని, విడనాడాల్సినంత నాగరికత లేని జయరాముడు – అలా బైటబడిపోయారు. కథన కాలానికే కాదు, దానికి పన్నెండేళ్ల ముందు కథాకాలానికి 20 ఏళ్ల నవయువకుడైన నేరేటర్ సినబ్బ అనే మరో మగాడు, నా అంత కాకపోయినా ఎంతో కొంత నాగరికత సోకిన ఆధునికుడు కూడా – మునెమ్మ మీద ఆరాధనని దాచుకోలేకపోయాడు.

అయితే, ఈ ఆడవాళ్లు, ముఖ్యంగా మునెమ్మ– 'ఎర్రిబాగుల్ది' మాదిరిగా ఉన్న, 'బండకింద కప్ప మాదిరి బతకడమే గాని.... తూర్పు ఏదీ, పడమర ఏదీ అని తెలిసిన మనిషి మాదిరి లేద'నిపించే, 'కొరివి పక్కన నీళ్లకుండ'లా తోచిన మునెమ్మ, typical-oriental - pre- modern - submissive మునెమ్మ తాలూకా stupidity/ profundity ఓ పట్టాన అర్థమై చావదు, నాకే గాదు, కొమ్ములు తిరిగిన రచయిత కేశవరెడ్డి అంతటి వాడికైనా. అలాంటిది మహా గుట్టుమట్టుల వాళ్ళ లైంగికత Sigmund Freud, వాడి బాబు Jung లకే కాదు, ఏ occidental Simone de Beauvoirలకి కూడా కొరకరాని కొయ్యే. కాబట్టి, మునెమ్మకి బొల్లిగిత్త ఏమిటో, దాన్ని జయరాముడు చావబాదిన కారణం ఆమెకి తెలుసో తెలియదో, సినబ్బ ఆమెకి తమ్ముడో... మరిదో, వాడికి తనమీద ఆరాధన తాను పసిగట్టిందో లేదో..... ఇవన్నీ నాబోటి చదువరులకే కాదు, రచయితకీ స్పష్టంగా తెలియదు. పాత్రలు తన సృష్టి కాబట్టి తన చెప్పుచేతల్లో ఉంటాయని, తను ఆడించేలా ఆడే కీలుబొమ్మలని ప్రపంచంలో ఏ మంచి రచయితా అనుకోడు, అనుకోలేదు.

ఈ విషయం అంతగా అవగాహన లేని తెలుగు విమర్శక లోకం మునెమ్మ libido బొల్లిగిత్తతో ముడేసి వ్యాఖ్యానించడం, మునెమ్మ దాన్ని 'పిలగా' అని పిలిచిందని రుజువులు చూపించడం మొదలెట్టి, రచయిత కేశవరెడ్డిని పర్వర్టెడ్ అనడం, మునెమ్మ ప్రధానాంశం beastiality అని ముద్రలేసింది. కేశవరెడ్డి గారిని సమర్థించే వాళ్ళు కూడా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో beastiality గురించే ప్రధానంగా మాట్లాడారు.

'పిలగా' ఆమె భర్త 'జయరాముడికి పెట్టిన రహస్యనామమట. వాళ్లు ఏకాంతంగా ఉన్నప్పుడు లేక ఆమె భావావేశంలో ఉన్నప్పుడు అలా పిలుస్తుంది..' అని సినబ్బ చెబుతాడు. రచయితే చెప్పాడు– 'వాళ్లు ఏకాంతంగా ఉన్నప్పుడే కాదు, భావావేశం కమ్మినప్పుడు కూడా ఆమె జయరాముడ్ని పిలగా' అంటుందని. ఆ భావావేశం మోహమే కానక్కర్లేదు, క్రోథం కూడా కావొచ్చు. తరుగులోడ్ని చంపే సన్నివేశం ఆమెలోని ఆగ్రహానికి పతాకస్థాయి– కాబట్టి అప్పుడు బొల్లిగిత్తలో జయరాముడ్ని చూసిన మునెమ్మ 'పిలగాడ్ని వదలమ'ని సినబ్బతో అనడం ఎంతమాత్రం విపరీతం కాదు.

"ఆ కేక విని నేను దిగ్భ్రాంతి చెందాను. తన భర్తకు మునెమ్మ పెట్టుకున్న రహస్య నామం ఆమెకి ఈ సందర్భంలో జ్ఞాపకం రావడమే నాకు దిగ్భ్రమ కలిగించింది..." అంటాడు నేరేటర్ సినబ్బ. సినబ్బలో కలిగిన దిగ్భ్రమ – పాఠకులకు కూడా కలిగిస్తూ, బొల్లిగిత్తనీ, జయరాముడ్ని ఉద్వేగస్థాయిలో ఏకం చేయడం రచయిత సాధించాలనుకున్న సృజనాత్మక లక్ష్యం. బొల్లిగిత్త రంకెలో మనిషి గొంతు వినిపించిందని... 'ఆ గొంతు మరెవరిదో కాదు జయరామునిదే అని మునెమ్మ చెప్పింది...' అని అదే సినబ్బ చేత చెప్పించినా మన విమర్శకులు చెవికెక్కించుకోకుండా, నా హీరోయిన్ మునెమ్మకి బొల్లిగిత్తకి లైంగిక సంబంధం అంటగట్టి చర్చ దారి మళ్లించారు.

అలా మళ్లకుండా, బహు enigmatic మున్నెమ్మని decipher చేసే దిశగా చర్చ అర్థవంతంగా దారి తీసుంటే, గొప్ప సృజనశీలి కేశవరెడ్డి గారితో నాకున్న అన్నేళ్ల వ్యక్తిగత, సాహిత్య పరిచయంలో కూడా అంతుబట్టని ప్రశ్న, 'మునెమ్మని ఏమి చూసి మోహిస్తివి?' అన్న నా ప్రశ్నకి ఏమైనా బదులు దొరికి ఉండేదేమో.

**(15.03.2016)**

# చొక్కి చంద్రాభరణపు సొమ్ములువెట్టెనా?

వేళకాని వేళలలో లేనిపోని వాంఛలతో దారికాని దారులలో కానరాని కాంక్షలతో దేనికొరకు పదేపదే... ఏం కొంప మునిగిందని... పది వేళ్ళలో ఒక్కటంటే ఒక్కటి... కుడిచేతి బొటనవేలు... అదేమైనా ద్రోణుడికి ఏకలవ్యుడిలా గురుదక్షిణగా ఇచ్చావా, లేదే విరిగింది అంతేనా...

***అంతేనా ఏమిటి... అంగుష్ఠమని అంటామే గానీ, మరీ అంగుష్ఠ మాత్రమేమీ కాదు... 40 రోజుల పాటు పనిచేయించడానికి వీలు కాదంటే తెలిసొస్తుంది దీని అవసరం...***

అన్నం తినిపించుకోవడం నుంచి అన్ని పనులూ ఉషతో చేయించుకుంటున్నావు కదా, ఇప్పుడేమంత అవసరమోయీ! నువ్వేమైనా స్వయంవరంలో మత్స్యయంత్రాన్ని భంగం చేయాలా? లేక అరవింద, అశోక, చూత, నవమల్లిక, నీలోత్పల... పంచ బాణాలతో stupid Cupidలా ద్రావిణి, శోషిణి, బంధిని, మోహిని, ఉన్మాదినులనే పంచమోహాల్నీ రగిలించాలా? ఎందుకోయీ నీకు బొటనవేలు....

*Billet doux* ***అంటే ప్రణయపత్రిక, అనంగలేఖ రాయాలంటే...*** *I am brooding of my agraphia.* ***నేను హృల్లేఖలకే పరిమితమా ఈ మండలం పాటు.***

అంత సీను లేదు, నిజంగా నీది హృల్లేఖల వయసే... హృల్లేఖ అంటే cardiograph!

***శరీరానికి 45 ఏళ్ళే ఇంకా, అప్పుడే*** *cardiograph, angiogram* ***అని భయపెట్టకు. బొటనవేలు లేని ఈ దిగులుతో...***

ఒక్క ఉత్తరం రాయడమేనా ఇంకేమైనా అత్యవసరాలతో ఖేదిస్తున్నావా...

***యువ జన హృదయ విదారణ మనసిజ నఖ రుచి కింశుక జాలే***

యువ హృదయాల్ని చీల్చే మన్మథుని మోదుగ గోళ్ళెందుకు గుర్తొచ్చాయి అసందర్భ జయదేవా

**నఖ లిఖిత ఘన స్తన భారం**

**ఉడుగని వేడుకతో ప్రియుడొత్తిన నఖశశిరేఖలు......**

**సరగున పతి నఖ చంద్రశకలములు ..**

వార్నీ! గోరు గిచ్చుళ్ళ గురించి ఏడుస్తున్నావా, 'ఆ బుగ్గమీద గోరు గిచ్చుడేందబ్బా...' నటశేఖర కృష్ణవా.... నీకు ఆ గోళ్ళు కాదు, నరసింహ స్వామి గోళ్ళు వాడితే రోగం నయం కావచ్చు- నఖ మాద్భుత శృంగం దళిత హిరణ్యకశిపుతమ భృంగం...... పొట్ట చేల్చి, పేగులు మెడలో వేసుకొని....

***ఎందుకంత కోపం, నేనేదో అభినవ కాసనోవా అన్నట్టు. నా బాధంతా ఆమె వస్తుందేమోనని, '30 ఏళ్ళుగా ఎదురుచూస్తున్నావా?' నా కోసం అని హఠాత్తుగా ప్రత్యక్షమైతే,*** sweet follies ***కుదరక పోయినా, ఎలమామి పిందెల చుబుకాన్ని మునివేళ్ళతో ముదిగారంగా పట్టి, పోనీ వేయి నిండుపున్నమి కాంతులీనే ఆమె బుగ్గమీద కనీసం ఒక చిటికైనా...***

చిటెకెల పందిరేంకాదూ...

***నా అర్భక భుజాలకి తన*** Midas ***తాటింపు స్పర్శతో*** Hercules ***శక్తి ఆపాదించి, నా డొక్కు బైక్‌ని పూలరథం చేస్తూ, అలాగ్గా దిగంతాల అంచుదాకా ఒక*** ride ***చేసొద్దాం అంటే, నా పరిస్థితేమిటి, 40 రోజులు ఆగమని అనాలా?***

"నాన్న నాన్నా ఏంటి ఆలోచిస్తున్నావు? ఏంటి నీలో నువ్వే గొణుక్కుంటున్నావ్? కళ్ళజోడు తీస్తే భూగోళమే కనిపించదు, ఈ వయసులో నీకు క్రికెట్ అవసరమా? అందులోనూ ఓపెనింగ్ బ్యాటింగ్. నువ్వేదో Sir Vivian Isaac Alexander Richards అనుకున్నావా, హెల్మెట్ లేకుండా, గ్లోవ్స్ వాడకుండా ఆడేయటానికి. కూతురు సీనియర్ ఇంటర్ పరీక్షల హడావిడిలో ఉంది అని నీకేమైనా ఆలోచన ఉందా... అయినదానికీ కానిదానికీ పెద్ద విక్టరీ గుర్తులా ఆ వేలొకటి పైకి పెట్టి చూపిస్తూ, అక్కని ఆటోల్లో తిప్పుతున్నావు, నన్ను నడిపిస్తున్నావు," అంటూ నా చిన్నోడు (ప్రహర్ష) తిడుతోంది, పెద్దోడు పింకి (నైమిష) విరిగిన వేలిని ఫొటోలు తీస్తుంటే...

**(11.03.2013)**

# ఓ అనామిక మరణం

ఎప్పుడూ ఎండ కాయని నా కలలో నల్ల నువ్వులు ఆరబోసిన ఆకాశంలోంచి ఊరూపేరూ లేని ఉల్క ఒకానొకటి నిశ్శబ్దంగా రాలిన సడికి ఉలిక్కిపడి లేస్తానా, రాలింది కొరకంచు కాదు... కొరివినిప్పూ కాదు, కావి వెలిసిన కాగితప్పూవు! గండశిలమీద రాలి తలబద్దలైన చప్పుడు, తీతువు పిట్ట రెక్క లోంచి ఈక రాలిపడిన అలికిడి.

"నిద్రలోనే పోయిందట ప్రాణం.... ఎంత అదృష్టం..!"

అనాయాస మరణమంటే డెబ్బై-ఎనభై ఏళ్లు బతికేసి, తీసుకోకుండా పండుటాకులా రాలిపోవడం; అంతేగానీ, ఆమెలా అర్ధాంతరంగా ఆగిపోవడం కాదు.

పొద్దుగుంకక ముందే మబ్బులు మసకేసినప్పుడు విన్నాను ఆమె మరణ వార్త!!

ఘడియఘడియకీ ఆగిపోతున్న వేనవేల ఊపిరుల్లో, ఆరిపోతున్న ఉసురుల్లో లెక్కకి కూడా రాని ఆమె ఎవరంటే- చెప్పడానికి ఏమీ లేదు.

మొగుడు మొద్దులు, పిల్లా పీచుతో అణిగిమణిగి ఉన్న కోటానుకోట్ల ఆకుచాటు ఆడప్రాణుల్లో ఆమే ఒకత్తె.

నీడ నెపంగా గుర్తొచ్చే ఉనికి

ఉండటమూ- లేకపోవడాల మధ్య ఊగిసలాటలేని లోలకపు అజాఅయిపు - ఆమె!

- ఎగశ్వాస దిగశ్వాసలే ఆమె అస్తినాస్తి అస్తిత్వానికి గొప్ప దాఖలా అయితే, ఆమె క్రితం ముందు ఉన్నట్టూ, క్రితం తర్వాత లేనట్టూ ఉంది.

అధికమాసం బరువుకి గోడ కేలండర్ అదాటున జారిపడినప్పుడు, అకారణంగా గడియారం ముల్లు కదలనని మొరాయించినప్పుడు, బీటల దారులు తీస్తూ అద్దం హఠాత్తుగా అడ్డగోలు పగుళ్లలోకి ఆహ్వానిస్తున్నప్పుడు, గుడ్డికొక్కెరాయి కిటికీరెక్కమీద morse code లో మార్మికంగా ఏదో సంకేతిస్తునప్పుడు - ఊళలా మోగిన cell phone మోసుకొచ్చింది అనామిక చావు కబురు.

చెప్పరానంత దిగులు గుండెనీ, చెమ్మగిల్లిన కన్ను చూపునీ చప్పున కమ్మేసినప్పుడు – ఆమె నాకు ఏమౌతుందని కొన్ని అడగని ప్రశ్నలకి – 'వెళ్తుంటే ఎదురౌతుంది....' అని కాసిన్ని పొసగని, అతకని పాత జవాబులు!

నిజానికి, వెళ్తుంటే కనీసం ఎదురైనా రావల్సిందే అనుకున్నాను, ఆమె గురించి మొదటిసారి విన్నప్పుడు.

ఆమే కాదు, ఎలప్రాయాలు, కలిమిలేములు, సమయసందర్భాలు, సాకులు. మరింకేవో సాపేక్షాల ఊతకర్రలు లేకుండా సౌందర్య స్త్రీత్వం తనంతట తానుగా నిక్కి, నిగడించి, నిభాయించి నిలిచిన ఆమె ఎవరైనా– నా వంటి ఒక సాదాసీదా Endymion మీద వెన్నెలసోన కురిపించిన Selene యే. అటువంటి ఆమెని కేవలం a thing of beauty అని సరిపుచ్చుకోలేను, చాటుమాటుగా తొంగిచూసి చాల్లెమ్మని సర్దుకుపోలేను.

– ఆమె కనీసం నాకు ఎదురైనా పడవల్సిందే. రెప్పల రెక్కలల్లార్చే నా దిష్టికళ్ల రెటీనాల మీద బింబమై తలకిందులు కావల్సిందే. అంతే కాదు, చక్కదనాల వెల్తురు దీపానికి రెక్కలు కాల్చుకునే చిమ్మటపురుగు నేనంటూ ఒకడ్ని ఉన్నానని కంటికొనల్నైనా గుర్తించాల్సిందే..

"ఎక్కడ్నుంచి తెచ్చుకుందో అంత మెరుగు.... మెరుపు. శ్లేష్మాల జిగురంటిన బారెడు నాల్కలు చాపి ఆ మిణుగురుని చప్పరించాలని ఎన్ని మిండ నలికిరులో. చాలీచాలని జీతం, ఇరుకిరుకు జీవితం, మొగుడి తాగుడు... ఇరుగుపొరుగు వాగుడు... రోగాలు... రొష్టులు! అయినా, ఎలా దక్కించుకుందో తరగని అంత సోయగం... సొంపు..."

అనామికని తలుచుకుంటూ చెప్పాడొక మిత్రుడు చాన్నాళ్ల క్రితం.

అప్పటికప్పుడు పుట్టుకొచ్చిన ఏటిపాయ ఎగబోతగా మెలిక తిరిగినట్టున్న ఆమె నడుము ఒంపులో తన వేళ్లు intransitiveగా ఇరుక్కున్నప్పుడు– 'Et tu, Brute?' అన్నట్టు తల్లడిల్లిందని అతని నేరాంగీకారం.

తాగుబోతు మొగుడితో ఎలా వేగుతున్నావని జాలిపడి, ఆమె అగచాట్ల పట్ల యాష్టపడి, చాటుమాటుగా మోజుపడి, ఆటలు సాగక చతికిలబడి, ఆమె చుట్టూ చిలవలు పలవలకు తెగబడిన మగకీటకాల మీద పళ్లు నూరాడు.

◆◆ ◆◆

ఆ తర్వాత కొన్నాళ్లకి, కచ్చితంగా ఇరవై ఏళ్ల క్రితం అనుకోకుండా ఎదురయ్యిందామె. ఎదురవడమేమిటీ... ఏకంగా ఒకే ఇంట్లో ఉన్నాం గెస్టులుగా ఓ నాల్గు రోజులు. నిల్చొని చూసే ఈ కల – కన్ను ఏమారితే

కరిగిపోతుందేమో నని చూశాను తదేకంగా–

నా కంటే మూడునాలుగేళ్లు పెద్దే ఉండొచ్చు. పసుప్పచ్చ పలుపుతాడుతో పాటు పేదరికం దేబిరింపులు బైటపడకుండా నల్లపూసల దండతో సరిపుచ్చిన స్వాభిమానం. అనుభవాలు ఇనుపముళ్లతో నిక్కి రక్కినా గుర్తులు పడని గోము. అయ్యిందానికీ కానిదానికీ తెంపులేని నవ్వు, ఆత్మదివ్వె మెరిసే చారడేసి కళ్లు చికిలిస్తూ.

ఇంతకీ ఆమె నన్ను గమనించిందా, అసలు మనుషుల లిస్టులో వేసిందా లేదా అన్నది అనుమానమే. తన గోలేగానీ, నా గోడు పట్టిందా?

ఎన్ని యుగాల దాహాన్నో, మరింకెన్ని జన్మల సరిపడా దాచుకోవాలనో వెంపర్లాడిందనుకుంటా, ఆమె ప్రియుడి (మా ఉమ్మడి హోస్ట్)తో సహవాసం చేసిన ఆ నాల్గురోజుల్లో. స్లీవ్‌లెస్ తామరతూళ్లని గొలుసుకట్టు మోకులు చేసి బంధించేది..... చూరునీటి జల్లులా ఎడతెగని ముద్దులు గుమ్మరించేది.... దూదిపింజ దేహంలో వెయ్యిమణుగుల రొమ్ము మొలుచుకొచ్చిన వైనమేంటో విప్పమని నిగ్గదీసేది.

– ఇదంతా నేను ఉన్నా, లేకున్నా...

– ఇదంతా నా ముందు, వెనక, చుట్టూ, అంతటా...

ఆ తర్వాత ఆమె వెళ్లిపోయింది. ఆ నాల్గు రోజుల ముందటి బతుకులోకి, ఆ నాల్గురోజుల తర్వాతి నరకంలోకి!

ఆ తర్వాత ఆమె గురించి విన్నది తక్కువ. ఆ తక్కువలో ఎక్కువ నిందలే; ఆమె భర్త పోయాక, ఆ అపనిందలు ఇంకొన్ని 'రంకులు' పులుముకొని!

◆◆ ◆◆

మళ్లీ ఇన్నాళ్లకి–

నిచ్చెన్ల నీడ సరీసృపమై మెడ మీద పాకిన జలదరింపులా –

అనామిక మరిక లేదన్న కబురు!

**(18.10.2014)**

# జగల్లీలకి నే వెలిగించే
# Reciprocal దీపం- దీపావళి

**దీపావళి అంటే నాకు ఎందుకంత ఇష్టం?**

ప్రశ్నార్థకపు వంకీల్లాంటి పగుళ్లిచ్చిన అద్దం ముందు నిలబడి నన్ను నేను నిలదీసుకోవాలని ఎప్పుడూ అనుకోలేదు. ఎంత అపరిచిత అయినా, నా ఉనికి దుస్సహమన్నట్టు నొసట్లు విరిస్తే లోన ఎలా కలుక్కుమంటుందో ఆ అద్దం ముందు కూడా అలానే ఉంటుంది. అందుకే, 'దీపావళి అంటే ఎందుకు నాకంత ఇష్టం?' అన్న పెనుప్రశ్నకి వెన్ను చూపించి, గొప్ప సామాజిక బాధ్యతతో నన్ను నిలదీసే పృచ్ఛకులు మిలియన్ డాలర్ల నిబిడాశ్చర్యంతో చూస్తుండగా నిప్పులు చిమ్ముకుంటూ తారాజువ్వనై నింగికి నే ఎగసిపోతాను (నాలుగేళ్లప్పుడే కాదు, ఇప్పుడు మొదలైన 47డుపులో కూడా).

కానీ, ఈ రోజు, నవంబర్ 3, 2013, అమావాస్య ఘడియల్లో - 'ఎందుకిష్టం' అని తెల్లనెత్తుర్ల బొద్దింకని డిసెక్షన్ బల్లమీద గుండుపిన్నులతో గుచ్చి పరిశోధించినట్టు నా 'ఇష్టాన్ని' కూడా ఈ తెలతెల్లవారే చూడాలని పూనుకున్నానే- నాకేం పట్టింది?

◆◆ ◆◆

బాలకృష్ణుడు నోరు తెరిచి బ్రహ్మాండమంతా చూపించిన ఉదంతానికి రివర్సులో "చీకటి వెలుగుల రంగేళీ/ జీవితమే ఒక దీపావళి..." అని దీపావళి సారాంశాన్ని ఓ పాట ద్వారా విప్పి చెప్పేసింది చిన్నప్పుడే మా అమ్మ. అమ్మకి ఇష్టమైన నవలా రచయిత్రి యద్దనపూడి, ఇష్టమైన నవనవోన్మేష నవలా నాయకుడు అక్కినేని. ఇక గుండ్లకమ్మలా పొంగిపొర్లే ఆరాధనకి అడ్డేముంది- 'అందాల ప్రమిదల ఆనంద జ్యోతుల / ఆశల వెలిగించు దీపాల వెల్లి' అని నిర్వచనం పూర్తి చేసేది, రాగయుక్తంగా మరీ. "నిండా ఐదేళ్లు లేవు, గుడ్డొచ్చి పిల్లనెక్కిరించిందని..." అని తిట్టేది, నేను కాకరకాయ కూర తిన్నట్టు, తలకి

పోయాల్సిన కుంకుడుగాయ రసం నోట్లో పోసినట్టు, సుఖవిరోచనం మిషతో నల్లగా మిరియంలాంటి ప్రభాకర మాత్ర బలవంతాన మింగించినట్టు ముఖం పెడితే.

కథలంటే, మరీ ముఖ్యంగా పురాణ కథలంటే మీదుమిక్కిలి ఇష్టం కాబట్టి, అమ్మ తన ఫిలాసఫీకి దన్నుగా 'ఆశ్వయుజ బహుళ చతుర్దశి, అమావాస్య, కార్తీక శుద్ధ పాడ్యమి...' అని మొదలు పెట్టి, నరకాసుర వధ, బలి చక్రవర్తి రాజ్యదానం, చివరికి విక్రమార్క ఎన్టీఆర్ పట్టాభిషేకం వరకూ అన్ని కథల్నీ మళ్లీ మళ్లీ చెప్పేది. ముక్తాయింపుగా 'చెడు మీద మంచి, చీకటి మీద వెలుగు, అజ్ఞానం మీద విజ్ఞానం' అన్న సూక్తిముక్తావళి మొదలయ్యే సమయానికి అమ్మ ఒళ్లోంచి లేచి వెళ్లిపోయేవాడిని.

ఆ గది దాటి మండువాలోకి వస్తానా, అక్కడ నాస్తిక మేధావుల కచేరి, వాద్యగోష్ఠి– నాన్నగారి మిత్రమండలి. అమ్మ పూజలతో పేచీ గానీ, లడ్లు, పాయసం, చెక్ర పొంగలి, పులిహోర, చేగోడీలతో కాదు. వాటిని కుంభాలు కుంభాలు లాగిస్తూ, డబ్బులు తగల పెట్టడమే దీపావళి కాబట్టి, దీపావళిని అయిష్టపడటమే ఎదుగుదల అని ఎచ్చులు పోయేవారు. మధ్య మధ్య, సశాస్త్రీయమైన interpretationతో పండగ వాతావరణాన్ని కలుషితం చేస్తూ, 'సంతోషం, ఉత్సాహం... 'వంటి బూతు పదాలకి తావు లేకుండా శతవిధాలా ప్రయత్నిస్తూ, కొందరు పెద్దలు నాకు బోధించేవారు: "నరకాసుర సంహారం పేరిట క్రిమికీటక సంహారం..." అంటూ.

నాన్న గారు హేతువాదే గానీ, హేతివాది కాకపోవడం వల్ల నా ఇష్టానికి అడ్డుచెప్పలేదు, నాకు పిల్లలు పుట్టాకకూడా 10,000 వాలాలు చేతికి చుట్టుకొని మరీ కాల్చడం చూసి (నాకు రాని 'పెద్దరికం' గురించి కాదు, వచ్చే ప్రమాదాన్ని శంకించి) ఆందోళన పడ్డారు తప్ప.

దీపావళి ఉత్సవ సందర్భం చెవులు పగిలే మోతల మధ్య కూడా అస్సలు గుర్తుకు రాని సందర్భం జీవితంలో ఒక్కటే ఒక్కటి: వంద అమావాస్యల దిగుళ్లని నిండు నెలల పసిగుడ్డుతో పాటు మోస్తూ పుట్టబోయే తొలి చూలు గురించి ఆస్పత్రి బెడ్డు మీద ఉష ఆందోళన పడినప్పుడు 'ఆ రోజు దీపావళి' అని గుర్తుకే రాలేదు.

ఆ ఒక్క సందర్భం తప్ప దీపావళి అంటే ఉన్మాదోల్లాసం. అసలు దీపావళి పేరులోని మెలిక కూడా భలే ఇష్టం. మతాబులు.. చిచ్చుబుడ్లు కాకరపువ్వొత్తులు విష్ణుచక్రాలు, భూచక్రాలు, ముఖ్యంగా టపాసులు..... పిరికి పింకోడితో కాకుండా సిసింద్రీ చిన్నోడితో పోటీపడుతూ ఎన్ని కాల్చినా తనివి తీరదు, చుట్టూ ఉన్న వాళ్లతో ఎన్ని కాల్పించినా సరిపోదు.

◆◆ ◆◆

దీపావళి అంటే నాకు ఎందుకంత ఇష్టం?

తిమిరం మీద సమరం చేసి, లోకాలన్నీ శుభాలు పూచి, అంతటా వెలుగుల పువ్వులు విరబూయాలని కోరుకున్న (కోరుకునే) అభ్యుదయ కవిని కూడా కాదే..... దీపావళి అంటే ఎందుకు నాకంత ఇష్టం?

'ఆల్ ఈజ్ వెల్' అనుకోవాల్సిన చిన్నప్పటి నుంచి కూడా ఏదో ఓ దిగులు నన్నంటి పెట్టుకొని ఉండేది (ఉంటుంది). 'దీపావళి'లో వేదుల వారికి మల్లే 'రండు, చిమ్మటలార! ఈ రాత్రివేళ/ నావలెనె పాడుకొను మీరె నాకు సఖులు' అని వాపోయేది మనసు. My mind is like a tower that slowly succumbs / To the blows of a relentless battering ram అని Baudelaire లా గుబులు కునేది.

వాళ్లనే కాదు, కృష్ణశాస్త్రి గారిని చదవక ముందు కూడా, 'నేను హేమంత కృష్ణానంత శర్వరిని/ నాకు కాలమ్మొక్కటే కారురూపు, నా శోకమ్మువలెనె, నా బ్రతుకువలె, నా వలెనె...' అన్న అర్థమొచ్చేలా బాధపడినవాడ్ని. 'నా కుగాదులు లేవు... నా కుషస్సులు లేవు...' అన్న ఆయనతో సారూప్యం వెదుక్కున్నాను గానీ, నాకు దీపావళులు లేవు అన్నట్లైతే మాత్రం సుతరామూ ఒప్పుకునేవాడ్ని కాదు.

దీపావళి అంటే ఎందుకు నాకంత ఇష్టమో ఈ ప్రాతః సంధ్యలో ఒక రివలేషన్‌లా తట్టింది.

దీపావళి అంటే ఒక స్తోత్రం, ప్రత్యుత్తరాల పరవశంతో చేసే ఒక ఆనంద నాట్యం, ఒక అచ్చమైన Thanksgiving!

ఎవరికా స్తుతి? ఏమిటా పరవశ వివశం? ఎందుకా Thanksgiving?

ఈ ప్రశ్నలకి బదులివ్వకపోతే నా తల వేయి వక్కలౌతుందని నాకు తెలుసు; కాబట్టి, సంజాయిషీ వంటి ఒక స్వకీయ సొద–

'ఆమె' నా ఊహల్లోకి ఎప్పుడు ఎలా కాలు మోపిందో తెలీదు. ఒళ్లంతా అంటుకున్న ఏకిన దూదిపింజల్ని దులిపేసుకొన్నట్టు నా ఊహల్లోంచి బైటకొచ్చి అప్పుడప్పుడూ నాకు కనిపిస్తుంది. ఆ జగల్లీల ఎప్పుడు ఎవరి రూపంలో కనిపిస్తుందో తెలియదు. తనని వెదుక్కుంటూ తెలియని లోకాల్లోకి కళ్లు దారి తప్పి, ఇక్కడ మూసుకుపోవడం వల్లే అంత దిగులు లాంటి చీకటి. మూసుకుపోయిన రెప్పల మీద చల్లని వెన్నెల రజను రాల్తుంది, చెమ్మ ఆరి చటుక్కున పచ్చ భాస్వరమై రెప్పల మీద నులి కాక.

నెత్తమ్మివిరివిందు రేఖలా ఆమె– నా కళ్లు తెరుస్తూ.

'తలిరాకు జొంపముల సందులత్రోవల నేల వాలు తుహినకిరణ కోమల

రేఖవా! పువుదీవవా! వెలదీ, యెవ్వతెవు నీ పవిటపీ వనిలోన్?" అని కృష్ణశాస్త్రి గారిలా క్షణంలో వెయ్యోవంతు కాలం చకితుణ్ణై, అంతలోనే తేరుకుంటుంటాను.

"......చెవులబండుగ సేసె చెలి నీసుద్దులు విని/ నవకపు వేడుక నిన్నటిమాపె / తివిరి వేగుదాకా దీపాళి పండుగ సేసె / జవకట్టి నినుబాసి జాగరాలను..." అని అన్నమయ్య ఎవరి గురించో గానం చేస్తే, ఆ నాయకుడు నేనే ననుకుంటూ విర్రవీగే నా వంటి మగ పురుగుల ప్రమేయం అస్సలు లేకపోయినా, ఉన్నట్టు వాళ్లని గొప్ప చేస్తూ...

.. అరవిరి నవ్వులై, కనిపించని కన్‌సైగలై, గరుకు గారలై, ముదిమారాలై, విరజిమ్మిన పరిమళాలై, చిటుక్కుమనే చిన్నెలై, వలపు వన్నెలై, సోయగాల సొలపులై..... చీకటి విశ్వాన్ని వెలిగిస్తున్న 'ఆమె'కి ఏడాదికో మారు హారతి పట్టడమే 'దీపావళి' అని స్ఫురించింది నాకు.

అంతా ఒక పునశ్చరణం, మతాబులు.. చిచ్చుబుడ్లు కాకరపువ్వొత్తులు విష్ణుచక్రాలు, భూచక్రాలు... పేర్లేమైతేనేం– ఆమె రూపస్మరణం, ప్రతీకలుగా ప్రతిక్షేపించడం.

భూగోళపు ఈ తూరుపు కొసన నిల్చొని, ఆ విశ్వమోహినికి నే ఎలుగెత్తుతున్న Thanksgiving యే దీపావళి. అందుకేనేమో బహుశా, ఈ revelationకి ముందు, తర్వాత కూడా దీపావళి అంటే నాకు అంత ఇష్టం!

**(03.11.2013)**

# దురుసు సొగసు-రెండు ఆక్సిడెంట్లు

"సౌందర్యం అంటే ఆమె ఆత్మోన్నత్యం.... కానీ చర్మపు హద్దులలోనేనా నీ సంచారం!"

"విద్యుత్‌లో, కాంతిలో, జీవనంలో, మనుషుల్లో, అందమే కనబడటం.. ఎంత విచారకరం!!"

"స్త్రీల దైహిక సౌందర్య వర్ణన వొక social/gendered construct – అందులో నువ్వు బందీ!!!"

ఎన్ని మందలింపులు... ఈసడింపులు!

పరిమితుల్లో చిక్కి .... ఇరుకుల్లో ఇమిడి.... సౌందర్యపు విశాలత్వం అర్థం చేసుకోలేనని, అందాన్ని అరాకొరా గాజు బీకర్లతో కొలుస్తుంటాననీ ఎన్నెన్ని నిందలు... చీత్కారాలూ!

ఇన్ని హితబోధల్లో ఏ ఒక్కటీ తలకెక్కించుకో(లే)ని నా rigidityకి సంజాయిషీ వంటి రెండు ఉదాహరణలు:

1. ఇది మూడేళ్ల నాటి ముచ్చట. బంజారాహిల్స్ రోడ్ 1 నుంచి, తాజ్ కృష్ణ టి జంక్షన్ దగ్గర (పక్కనే సండే ఇండియన్ ఆఫీసు) రైట్ టర్న్ తీసుకుంటున్నాను బైక్ మీద. నాతో పాటే టర్న్ అవుతూ, చటుక్కున దిశ మార్చుకున్న ఇన్నోవా ఖడ్గమృగం నా హోండా ట్విస్టర్ చిట్టెలుకని ఢీకొంది. ట్విస్టర్ అని పేరుపెట్టింది ఇందుకా అన్నట్టు అష్టవంకర్లుగా ట్విస్ట్ అయిపోయిన నా బండి, నన్ను తగుమాత్రం కుళ్ళబొడిచి మరీ కూలబడింది నా పక్కన. సహజంగానే గుంపు గుమిగూడింది. ఒక దయాళువు నన్ను లేపుతూ.... మరో పరోపకారి పరామర్శిస్తూ... ఇంకో మానవ ప్రేమి మంచినీళ్లందిస్తూ...

ఇక మెజారిటీ సంఘీభావులు కారుకూతల మద్దతుతో కారు మీదకి లంఘించారు.

అప్పుడు –

అతి సాదాసీదా అపరాహ్న సమయం తనదైన ఒక ప్రత్యేక సందర్భాన్ని సంతరించుకుంది. మూడుగుంటల, ఆరుగుట్టల ఎగుడుదిగుడు తార్రోడ్డు నిమ్నోన్నతాలకి కొత్త అర్థాన్ని చెప్పింది. ఎండ– వెలుగయ్యింది.... తాపం– తపనయ్యింది. దాచేస్తే దాగని గాయం కూడా, దాపరికం నేర్చింది.

కారులోంచి దిగింది– ఆమె!

"నీకు లైసెన్స్ ఇచ్చిన గాడిదెవరు..."

"ఆంఖే సర్ పే చడ్ గయే క్యా"

– ఏవేవో భాషల్లో తిడుతున్నారామెని.

"I'm extremely sorry..."

నొచ్చుకొని చిన్నబోయిన ముఖం... చికిలించుకున్న కళ్లు... నల్లకళ్లద్దాల పక్కగా చెంప అంచున పెన్సిల్ గీతలా– ఆమెకి నప్పని నాకు నచ్చని మదత– నాకు సారీ చెప్పడం వల్ల.

'నాకు క్షమాపణ చెబుతావేంటి? సంజాయిషీలు ఇస్తావేంటి? నీ సౌందర్య రాజ్యంలో నేనో పిపీలకం. చిదిమేయి.... నువ్వు ఏంచేసినా తప్పులేదు. ఆ కారు నా మీదుగా తీసుకుపో.... నీకా హక్కుంది.....'

– నా లోపలి మాటలు పైకి చెప్పలేక, కూడదీసుకున్న శక్తితో నా హితైషుల బారి నుంచి ఆమెని కాపాడి ఇన్నోవా ఉచ్ఛైశ్రవం మీద పంపించేశాను.

◆◆ ◆◆

2. ఇది మూ్డ్రోజుల నాటి ముచ్చట

ఎప్పట్లానే బైక్ మీద వస్తున్నాను– మసాబ్ ట్యాంక్ ఫ్లైఓవర్ మీద.

Milan Kundera 1990ల్లో రాసిన Slowness నవల ఇలా మొదలవుతుంది (ఫ్రెంచ్ మూలానికి నే చదివిన ఇంగ్లీషు అనువాదం)

"Speed is the form of ecstasy the technical revolution has bestowed on man. As opposed to a motorcyclist, the runner is always present in his body, forever required to think about his blisters, his exhaustion; when he runs he feels his weight, his age, more conscious than ever of himself and of his time of life. This all changes when man delegates the faculty of speed to a machine: from then on, his own body is outside the process, and he gives over to a speed that is noncorporeal, nonmaterial, pure speed, speed itself, ecstasy speed."

– ఇది చదవక ముందు నుంచే ecstasy of speedని నేనెప్పుడూ అనుభవిస్తూనే ఉంటాను. ఇప్పుడు– వయసు యాభైని తాకుతుందని గుర్తించడానికి మొరాయించే

మనసుతో కలిసి శరీరంతో పంతమాడుతున్నందుకేమో... ఆ ecstasy of speed ని మరింత ఎంచుకుంటుంటాను.

ఇది అర్థంగాక, నేను ఓవర్ టేక్ చేసింది తాను నడుపుతున్న కారుని అనుకుంది తాను.

ఆ అపార్థానికి ఫలితం– వెనక నుంచి కారు గుద్దినప్పుడు– ఫ్లైఓవర్ దిగువన గురుత్వాకర్షణ మరింత తోడైనప్పుడు హెచ్చే స్పీడ్ తాలూకూ హఠాత్ ecstasy ని అందుకోలేకపోయాను.

ఫలితం– నేను రోడ్డు మీద... బైకు నా మీద–

పూలపొట్లాంలా పిగిలిపోతున్న కారులోంచి బిలబిలమని దిగారు అమ్మాయిలు.

అందరికంటే ముందు– కారు నడిపిన అతిరథి!

యవ్వనం గొప్ప గోరోజనంతో చేస్తున్న manifested ప్రకటనలా ఉంది.

నవ్వులు... నవ్వులాటల మధ్య తొట్రుబడిన కొంటెతనంలా ఉంది.

దురుసు బులుపు ఉంటే ఉందిగానీ... సొగసు సొలుపు అంతకంత ఉంది.

“అయ్యో... Are you alright? దెబ్బలేమైనా తగిలాయా..... అంకుల్....”

అంకుల్ ?. అం–కు–ల్– ?. అం....కు....ల్......

‘అంకుల్’ అని ఒత్తి మరీ పలుకుతుంది, వెక్కిరింపుగా.

పిక్కలు బిక్కటిల్లిన కాళ్ల కక్కసం .... బుసబుసమని పొంగిన మణికట్టు తీపరాన్ని మించింది– ఆమె పిలుపుల సళుపు!

◆◆ ◆◆

చిన్నవో పెద్దవో రెండు ఎముకలు విరిగాయి. ఎడంచేయి కదల్చవద్దని కట్టేశాడు ఎముకల డాక్టర్.

అయినా, నా కలుగుల్లోంచి బైటపడి, పరిమితుల్లోంచి తప్పుకొని.... ఇరుక్కుల్లోంచి బైటబడి.... కంటికి ఆవల ఉండే సౌందర్యపు విశాలత్వం ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతున్నా, పడితే పడ్డాను గానీ దురుసు సొగసు రథ చక్రాల కిందని సంతోషిస్తూ–

**(14.06.2016)**

# గళన్మంగళ పంతువరాళి!

వంకాయ వంటి కూరయు.... పంకజముఖి సీతవంటి.... అని పాత పద్యమొకటి తలుచుకుంటూ, పిల్లల లంచ్ బాక్సుల కోసం చాపింగ్ బోర్డ్ మీద వంకాయల్ని దునుమాడుతుండగా చెవి దగ్గర జోరీగలా ఫోన్!

'హలో ఏం చేస్తున్నావోయీ....' అంటూ ఆమె స్వరం– తేనె తాగితాగీ మత్తిల్లిన mellifluous తుమ్మెద ఝుంకారంలా–

"నీ గొంతు వినక ముందు ఏం చేసినా, విన్నాక మాత్రం ఏం చేయగలను, నీలిలోహిత నులిసెగల మంట మీద పెనంలో మంచు ముక్కలు వేయించడం, గాలి పెదవుల ఒత్తిడికి రాలిన గులాబీరేకులకి కండసారి చెక్కెర పలుకులద్దడం.... వంటివి తప్ప!"

– అని చెప్పలేదు.

'ఉష ఊరెళ్లింది, నీకు తెలుసుగా, తీవ్ర సోయగ వ్యాధితో సొక్కిపోయే మా పనమ్మాయి ఉష లేనప్పుడు రాదని. అందుకే, అంట్లు తోమి, వంట చేస్తున్నా....' – అని చెప్పాను.

'సరే... ఎక్కువ సేపు మాట్లాడనులే.... ఒక ముఖ్యమైన విషయం చెబుదామని...'

చెయ్యక చెయ్యక చేసిందామె, ఫోన్ కట్ చేయాలంటే చేతులు రావడం లేదు. 'చాలా ముఖ్యమైన ఫోన్' అన్నట్టు మా పెద్దోడికి సైగ చేశాను. 'మయ్ హూ నా...' అని కళ్ళతోనే భరోసా ఇస్తూ చదువుతున్న పుస్తకాన్ని పక్కన పడేసి వంటింట్లోకి వచ్చేసింది మా పెద్దమ్మాయ్ (నైమిష).

నిజానికి ఫోన్ చేసినామె ఎవరో నాకు తెలీదు. అప్పుడప్పుడూ మాట్లాడుతుంది. మొదటిసారి తన గొంతు విన్నప్పుడు 'ఎదలోని సొదలా... ఎలదేటి రొదలా'నే విన్పించింది. ఎప్పుడూ ఏ వివరాలూ చెప్పలేదు, పోనీ అడగలేదు. వీణతీగలు కంపించినట్టు వినిపించే ఆ గొంతులో రోజువారీ రొడ్డకొట్టుడు మాటలు, మంతనాలు వినడం నాక్కూడా ఇష్టం లేదు. ఆమెకి నేను పెట్టుకున్న పేరు– కచ్ఛపి.

'మోహనతులసి కవిత బాగుంది, 'నయన విరాళి..' అనడం ఇంకా బాగుంది,' చెప్పింది.

ఎప్పుడో 'ఆంధ్రప్రదేశ్' ఆగస్టు సంచికలో వచ్చిన కవిత. కవిత పడ్డ ఆరు వారాలకి ఈ కుహూకంఠ కూస్తుంది (అయినా పర్లేదు).

**'చిడిముడి మగువకు శ్రీవేంకటపతి... విడువని కూటపు విరాళి'** అని పకపకా నవ్వింది.

ప్రొద్దుప్రొద్దునే ఆమె స్వరంలో అన్నమయ్య పదం! ఝల్లుమన్న మనసుకి పులకల మొలకలు.

గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌గారి గొంతులో ఎన్నిసార్లు విన్లేదూ, కానీ, ఆమె గొంతులోంచి–

**'వలపులు వలపులు వయ్యాళి... చలమరి మరుడును సమేళి!'**

జంత్రవాద్యాల జగడపు రగడ లేకుండా సరుగుడు చెట్ల మధ్య గుడిగుడిగుంజాల గాలి వేసే ఒంటరి ఈలలా గిలిగింత పెడుతుంది.

**'కొలదికి మీరిన గురు కుచములకును తొలకు నీ మనసు దువాళి..'**– మ్మ్..... జవనాశ్వంలా నా దూకుడు మనసు దువాళించక ఏమౌతుంది!

**'వనిత నిండు జవ్వన గర్వమునకు.. ఘనమగు నీ రతి కరాళి'** – ఆమె గొంతులో సన్నని సిగ్గుజీర (గొప్ప కార్యదక్షుడి ముందు ముంచుకు రావల్సిన సిగ్గునలా వృధా చేయకు సుగాత్రీ!)

**'వెనక ముందరల వెలదిమేనికి నీ పెనగు గోరికొన పిసాళి..'**

– ఛ.... గోళ్లు కొరుక్కునే అలవాటు చిన్నప్పట్నుంచీ వదలక గానీ, లేకపోతే, నాక్కూడా ఉండేవి కదా కొనదేరి పిసాళించే నఖచంద్రులు!

– కీర్తన ఎప్పుడయిపోయిందో... చెప్పాపెట్టకుండా ఎప్పుడు ఆ ఫోను ఆగిపోయిందో... తెలీదు!

కానీ, ఈ లోకంలోకి జారిపడే ముందు మాత్రం మనసులోనే 'థ్యాంక్స్' చెప్పుకున్నాను మోహనతులసికి, ఆ కవితని ఆమె చూడటానికి నన్నో నెపం చేసినందుకు!

**(23.09.2015)**

# Her Birth Day and Riddle of Chocolates!

**డిసెంబర్ 20: 04.00** AM

ఎప్పట్లానే ఈ రోజూ లేచాను తెల్లవారు జామున. కానీ అన్ని రోజుల్లో ఒకటిగా ఈ రోజునీ కలపబుద్ధి కావడం లేదు. ఈ రోజు అందరిదీ కూడ అనుకోబుద్ధి కావడం లేదు. లోకంలో ఎందరికోలానే నాకూ చలేస్తుంది. కానీ నా చలి నాకే, నా వరకే అయినట్టు, ఈ రోజు కూడా నాదే, అచ్చంగా.

తోడేళ్లు తరుముకొస్తుంటే పడుతూ లేస్తూ పరిగెడుతూ ఉండాల్సిన బతుకులో చప్పున తలపులసీమలో ఆగి, ఎప్పుడో పారేసుకున్న రంగు చాక్లెట్ తగరపు రేపర్ల కోసం నేనిప్పుడు తవ్వుకోవడం ఎవ్వరూ పట్టించుకోకపోతే బాగుణ్ణు. వెయిన్నొక్క తలపోతల్లో ఇదీ ఒకటి లెమ్మని ఆమె స్మృతిని చులకనచేయకపోతే బాగుణ్ణు. నెమలీకని బుక్‌మార్క్‌గా పెట్టుకున్న పాత డైరీ పేజీ ఒకటి ఫేసుబుక్కులో కేవలం ఒక బూందీపొట్లం కాకుండా ఉంటే బాగుణ్ణు.

◆◆ ◆◆

ఇన్ని ifs and buts ముందు వెనుక తగిలించకపోతే, అసలిది రాయకపోతే బాగుణ్ణని అనుకొని ఊరుకోవచ్చుగా! అలా ఊరుకోగలిగిన స్థితి వస్తే తత్వం బోధపడినట్టే, అది లేకే కదా ఇంత బాధ, సొద, రొద!!

◆◆ ◆◆

**డిసెంబర్ 20, 1980:**

ఆ రోజు ఎప్పట్లానే ఉంది. వాసుదేవ్ విలాస్ దాటాక, దర్బార్ రోడ్డులో కొంచెం టెక్కుతో నిక్కే మా వెంకటేశ్వర టుటోరియల్ కాలేజీ ఫస్ట్ ఫ్లోరు– రోడ్డు వైపు క్లాసు రూములో మెట్రిక్యులేషన్ ఫస్ట్ పీరియడ్. అచ్చం దేవానంద్‌లా ఉండే, అలానే డ్రస్ అయ్యే మా విఠల్ మాష్టారు కూడా ఎప్పట్లానే మెస్మరైజింగుగా ఇంగ్లీష్ పాఠం చెబుతున్నారు. ఎవరో ఒక సామాన్య హఠాత్తుగా యువరాణిగా anoint అవుతుంది, అందుకు గుర్తుగా ఆమె తల మీద ఓ కిరీటం, బహుశా పూలతో చేసింది. పాఠానికి అంతరాయంలా వచ్చింది హరీష. మెట్రిక్ మెట్లెక్కేశాము కాబట్టి మాకేమీ యూనిఫామ్ లేదు గానీ, హరీష కొత్త

బట్టల్లో ఉంది. దానికి తోడు చేతిలో పుస్తకాలకి బదులు రంగురంగుల డబ్బా, చాక్లెట్లని తెలిసిపోతుంది.పుట్టిన రోజని అర్థమయ్యింది. నేను పుట్టడం లోకాలకి మహోదయం అన్నట్టు ఆర్భాటం చేయడం నాకు చిన్నప్పటి నుంచీ ఉన్న జాడ్యం. నేను ఎక్కడ ఉన్నా, దాన్ని అందరికీ అంటించేసేవాడ్ని. పుట్టిన రోజుకి స్కూలంతా చాక్లెట్లు పంచడం నాతోనే మొదలు. తోటి మిత్రులు, స్కూలంతా పంచేంత అతిచేయకుండా, క్లాస్ వరకే పరిమితమైనా, స్ఫూర్తి మాత్రం నేనే. ఆ అడుగుజాడల్లో ఒక్కొక్క అడుగే వేసుకుంటూ చాక్లెట్లు పంచుతున్న హరీషని– అనుంగు అనుయాయుల్ని ఓ మార్గదర్శి ఒక మెట్టు పైనుంచి చూస్తున్నట్టు– గమనిస్తూ, ఆ అమ్మాయి వయసు అంచనా వేసేపనిలో పడ్డాను. తను నాకు లానే 1967లో పుడితే, నా కన్నా 5 నెలలు చిన్నదౌతుంది, కొంపదీసి 1966లో పుడితే 7 నెలలు పెద్దదౌతుంది....నో.... వీల్లేదు. తను నా కంటే పెద్దదవడానికి నేనొప్పుకోను. అలాగని 1968 అనుకుందామంటే, అంత చిన్న వయసుకి మెట్రిక్ (అంటే టెన్త్ అన్నమాట)కి ఎగబాకే చాన్సే లేదు.

.....ఇలా లెక్కలేసుకుంటున్న వ్యవధిలోనే, ముందు రెండు వరసల ఆడ లేడీస్‌కి చాక్లెట్లు పంచి, మగ వెధవల rowలో మొదటివాడ్నైన నా దగ్గరకివచ్చింది. నా కంటే పిసరంత ఎత్తు ఉందేమో అనిపించింది.

అంతవరకూ తనని అంత తేరిపారా చూసింది లేదు. అంటే, ప్రహ్లాదుడిలాగా 'కన్నుదోయికి అన్యకాంతలడ్డంబైన మాతృ భావము జొచ్చి మరలి పోతా'నని కాదు. ఎప్పుడూ ముందరి బెంచీల మీదే కన్ను. కానీ, మా క్లాసుకి (మా స్కూల్ మొత్తానికీ అనొచ్చు కూడా) అనుకోకుండా ఒక ఉల్కాపాతం లాంటి ఉత్సవ సందర్భం ఎదురైంది. ఎకడమిక్ ఇయర్ ప్రారంభమైన రెండు నెలల ఆలస్యంగా అనూరాధ అనే ఓ వేగుచుక్క మా క్లాసు పెంకుకప్పుల గగనంలో పొడిచింది. ఏవో అమిత సౌందర్య సంబంధిత శాపవశాత్తూ ఈ మట్టినేలల భూలోకానికి దారితప్పినవారిని నేనొక్కడినే గుర్తుపట్టగలనని చాలా రహస్యంగా విర్రవీగేవాడిని. కానీ, అనూరాధ విషయంలో మా స్కూలు మొత్తం పిల్లల నుంచి పెద్దల దాకా ఆ విషయం గ్రహించి, నాకు గర్వభంగం చేసారు. ముసిరే ఈగల్లో, మూగే దోమల్లో నేనూ ఒక్కడ్నేతప్ప ఏమంత ప్రత్యేకం కాదని లోకం నన్ను తట్టి చెప్పిన దురదృష్టకరమైన సందర్భాల్లో అదొకటి.అందం అంచనాకి కొలతలు, తూనికలు వెతుక్కునేలా చేసే అనూరాధ శోభ– అదే అందాన్ని తూచే రాళ్లు ఎంత అల్పుడి దగ్గరైనా కచ్చితంగా ఉండి తీరుతాయనికూడా నిరూపించింది. చక్కదనాల mythని వెక్కిరిస్తూ, 'తను మునిగిందె గంగ, తాను మెచ్చిందే

రంభ' వంటి ముతక సామెతల్తో దాని సాపేక్షికతని పరాచికలాడే తెలివిడికి అనూరాధ సోయగం ఒక మెత్తని సవాలు.

అనూరాధది ఎటువంటి అందమంటే, చూసే ఎటువంటివాడికైనా ఆమె ఓ అపురూపమైన సొబగుల సొత్తు అనిపించడమేకాదు, ఆ చెలువాలకలిమి, ఐశ్వర్యమిసిమి ఎవరికీ (చివరికి తనకి చూసే కూడా) చెందకుండా భద్రపరచవల్సిన బాధ్యత తీసుకోవాలనిపించడం! వాళ్ల అన్నయ్య రవి (ఇద్దరూ కవలలేమో అని మా డౌటు) తో పాటు రెణ్ణెల్ల ఆలస్యంగా చేరింది అను. రవి గాడు కూడా అనూరాధంత అందంగా ఉండి, క్లాసు అమ్మాయిల కలల రాకుమారుడయ్యాడన్న వార్తలొస్తున్నా, కన్ను కుట్టించి, కడుపు రగిలించే అటువంటి వార్తలని పెడచెవిన పెట్టడం స్వీయ శిక్షణలో భాగమైపోయిన నేను, అసలీ చందనగంధి మొదట పరిమళించిన లోకమేదని పసిగట్టే ప్రయత్నాల్లో ఉన్నాను. ఆమె 'నివాసమ్ము తొలుత గంధర్వలోక మధుర సుషమా సుధాగాన మంజువాటి' అని తెలిసిపోయినా, ఇప్పుడు ఉండేది తెలుసుకోవాలని తనని వెంబడిస్తూ వెళ్తే, చీరాల రైల్వేస్టేషన్ వెనక రాజప్రాసాదంలా ఉండే మూడంతస్తుల భవనం అని తెలిసింది. వయసు వల్ల చెంపలు జారినా, దర్పం ఎంత మాత్రం తగ్గని ఘంటా భాస్కరరావు గారనే పెద్దాయన స్కూటర్ మీద బహు డాబుగా తిరిగేవారు మా చీరాల రోడ్ల మీద. మా అనూరాధ ఆ చౌదరిగారి మనమరాలని మాత్రం తెలిసింది.

అటువంటి సౌగంధిక ఉన్న చోట మరింకెవరూ కంటికి ఆనకపోవడం ఆశ్చర్యమేముంది? నిజానికి అనూరాధ రాక ముందు మా క్లాసులో చాలామంది పసిడిబొమ్మలుండేవారు. మా చీరాల మునిసిపల్ చైర్మనుగా తర్వాత ఎన్నికైన తులాబందుల వెంకటప్పయ్య గారి అమ్మాయి కన్యాకుమారి, ముంతావారి సెంటర్ రేవతి ఇంకా ఎందరో. కానీ, తర్వాత అనూరాధ బాలార్క కాంతి ముందు దివిటీలై, అసలు ఉనికి కూడా కోల్పోయారు. వాళ్లెలా ఉండేవారన్న ఆలోచన కూడా వచ్చే వ్యవధి లేనంతగా పరిస్థితులు మారిపోయాయి.

అప్పట్లో మరో విషమ పరిస్థితిని కూడా ఎదుర్కుంటుండేవాడ్ని, కెమిస్ట్రీ చెప్పే వెంకటేశ్వర్రావ్ మాష్టారి వల్ల. ఆయనకి తన క్లాసులో స్టూడెంట్లని ప్రశ్నలడగడం ఒక అలవాటు. సాధ్యమైనంతవరకూ పిల్లలు చెప్పలేనివి అడగడం ఆయన సరదా. చెప్పని వాళ్లని నిలబెట్టి, చెప్పిన వాడి / అమ్మాయి చేత చెంపదెబ్బలుకొట్టించడం కూడా మరో మృగయా వినోదం. హిందీ టీచర్ గారంటే పైకి చెప్పలేని సరదా ఉందేమో బహుశా, ఎవ్వరికీ (ఆమెకి కూడా) అర్థంగాని సైగలేవో చేస్తుండటం నేను చాలాసార్లు గమనించాను గానీ, అవి క్లాసు బైట సరదాలు, సరసాలు కాబట్టి ఇక్కడ అప్రస్తుతం. క్లాసు రూముల్లో గుత్తులు గుత్తులుగా కాసే లెంపకాయలంటే ఆయనకి మక్కువ ఎక్కువ అవ్వడం వల్ల నాకొక చిక్కు వచ్చి పడేది. ఆయన ఎటువంటి ప్రశ్న అడిగినా నేను కచ్చితంగా చెప్పేస్తుండటంతో, ఆయన నన్ను తప్పించి అందరినీ అడిగి, చివరికి నేను కరెక్టు

సమాధానం చెప్పాక, నా చేత క్లాసు మొత్తానికీ చెంప దెబ్బలు వేయించడం. ఎవరు ఎవర్ని కొట్టడమైనా చిన్నప్పటి నుంచీ నేను సహించలేక పోయేవాడ్ని.దెబ్బ తీవ్రత ఎంత అనే కంటే, దెబ్బ వేయడం అనే ఆలోచనని కూడా వ్యతిరేకించే నా చేత అందరికీ చెంపదెబ్బలు వేయించడం ఒక బాధ అయితే, ఒట్టి చూపులకే కందిపోయేలా ఉండే నవనీత అనూరాధకి చెంప దెబ్బలు కొట్టడం దానికి వెయ్యిరెట్ల వేదన. పోనీ, కెమిస్ట్రీ ప్రశ్నలకి జవాబులు చెప్పకుండా ఉందామా అంటే, వెంకటేశ్వర్రావ్ మాష్టారి బండ చేతులతో నేను దెబ్బలు తినాల్సి రావడమే కాకుండా, అనూని కూడా వాటి బారిన పడేయాల్సివస్తుంది. ఇన్ని దూరాలోచనల్తో, అనూ చెంపల్ని తాకాల్సి రావడాన్ని ఇప్పటికీ క్షమించుకోలేను.

ఆ పాత ముచ్చట్లన్ని అలా వదిలేసి, ఇప్పుడు మళ్లీ, చాక్లెట్లు తీసుకొస్తున్న హరీష దగ్గరికి వస్తే– నా కంటే కొంచెం ఎత్తు ఉందనిపించింది. Courteous గా అందరూ లేచి నిలబడి చాక్లెట్ తీసుకొని, విషస్ చెబుతున్నారు కాబట్టి, లేవక తప్పదని అర్థమై, అడ్డంగా డెస్క్ ఉంది కనక, కింద బెంచీ దన్నుగా కొంచెం కాళ్లెత్తి, ఎత్తు అడ్జస్ట్ అయ్యేలా నిల్చొని చాక్లెట్లు తీసుకొని, విషెస్ చెప్పీచెప్పనట్టు గొణిగాను. తను ముందుకు వెళ్లిపోయింది, చాక్లెట్లు పంచుకుంటూ. గుప్పిలి విప్పి చూసుకుంటే నాలుగు చాక్లెట్లు. పక్కనున్న ప్రవీణు, రమణ, సుభానీ.... ఒకే ముఖంతో ఆశ్చర్యపోయి, ఒకే నోటితో అభినందించారు. ఎందుకంటే, ఎవరికైనా హరీష రెండు చాక్లెట్లే ఇచ్చింది. నా ఒక్కడికే నాలుగు చాక్లెట్లు.

“డౌట్ లేదహె.... తనకి నువ్వంటే ఇష్టం ఉండి, అది చెప్పడానికే ఇలా సిగ్నల్ ఇచ్చిందిరా”అని మరికొంతమంది నేస్తులు నిర్ధారించారు. అంతమంది, నాకంటే గొప్ప అనుభవజ్ఞులుగా పేరుమోసిన మిత్రులు తేనెలో ఊరేసిన ఖర్జూర పండు లాంటి కబురు కల్పిస్తుంటే కాదనబుద్ధి కాలేదు. చాక్లెట్లు ఇచ్చేటప్పుడు హరీష కళ్లు చూడకుండా నిర్లక్ష్యం చేసినందుకు ఎంతగానో తిట్టుకున్నాను.

స్వీట్లూ, చాక్లెట్లూ, గడియారస్థంభం దగ్గర కేకులు అంటే మహా కక్కుర్తిగా తినే నేను, ఆ చాక్లెట్లు మాత్రం తినలేకపోయాను. ఇంకా చిన్నవాడిగా ఉన్నప్పుడు, మనీషా విద్యా విహారులో చదువుతున్నప్పుడు, సీనియర్లు చిన్న చిన్న ప్రేమసమాచారాల్ని చాక్లెట్ తగరపు కాగితాల్లోనే చుట్టి నా చేత పంపించే వాళ్లు. ఎన్నో ప్రణయసందేశాలని శుకాన్నై, పికాన్నై మోసుకెళ్లి మూటగట్టుకున్న పుణ్యాలు ఫలించి, నాకు అటువంటి ఊసులు తెలిసేలా చేయొచ్చుకదా అని కాసేపు హరీష ఇచ్చిన చాక్లెట్ల వంకే చూసుకుంటూ ఉండిపోయాను. ఒక

వేళ, అటువంటి కబురేమైన ఉందేమో అని చాక్లెట్ రేపర్లు విప్పి చూశాను. ఏమీ కనిపించక, మళ్లీ మళ్లీ చాటుగా హరీష ముఖాన్ని కూడా చూసాను. నన్ను క్రీగంట చూసి నవ్వినట్టు అనిపించింది.

అప్పుడర్థమయ్యింది హరీష అందం. ఎవ్వరికీ తీసిపోనంత కాంతి, బహుశా రశ్మి అంటారనుకుంటా. సూటైన ముక్కు కొంచెం పుటల దగ్గర బోర్లించిన క్రావడిలా కనిపిస్తూ, తను నవ్వినప్పుడు ఆ వంపుమరింత పొటకరిస్తూ భలేగుంది. అన్నింటికన్నా విశేషం తన front locks. నొక్కుల జుట్టు కావడంవల్ల అణిచివేతని సహించని తిమురుతనం మొహాన, దాని మీద ఆడే ముంగురుల్లో కనిపించింది. పూవు వరకీ కష్టం మీద మోస్తూ, ఇక తావి బరువు కూడా ఓపలేని తామర తూడులా కోమలంగా ఉంది హరీష. తననా ఇంతకాలం చూడనిది? బైటకి చెప్పుకోలేని తప్పిదానికి లోన కలిగే దిగులు, అంతకి నూరంతలైన ప్రేమ ఒకదాని తర్వాత మరొకటి ఆవహించాయి నన్ను. ‘Broad daylightలోఅంత సాహసంగా, గొప్ప నేర్పుగా తన ఇష్టాన్ని తెలియచెప్పిన హరీషకి నువ్వేమి ఇస్తావ’ని సావాసగాళ్లు సతాయించడంతో, మర్నాడు ఒక గ్రీటింగ్ కొన్నాను. తనకి ఇవ్వాలని శతవిధాలా ప్రయత్నించాను. భిక్షాలు గారి రమణ నన్ను సైకిల్ మీద ఎక్కించుకొని రెండు మూడుసార్లు హరీష వెనకే తీసుకెళ్లాడు, నా వెన్నులో దన్ను గునపంగా గుచ్చినన్ను ముందుకు తోయాలని. ‘పక్కన ఎవరైనా ఉన్నార’నో, ‘పుట్టిన రోజు అయిపోయిన ఇన్నాళ్లకి ఇస్తే ఏం బాగుంటుంద’నో సాకులతో ఆ గ్రీటింగ్ ఇవ్వలేక పోయాను.

“ఒక వేళ నీకు పొరబాటున ఇచ్చిందేమోరా...” అని నిత్యశంకితుడు రాఘవ వంటి వాడు వాగే అవాకులు నచ్చేవి కావు గానీ, హరీష నుంచి మరెప్పుడూ నాకు అనుకూలమైన సంకేతం కనిపించలేదు.

“Hint ఇచ్చినప్పుడు నువ్వేమి పొడిసావురా. ఆడపిల్ల అంతకంటే ఏం చెబుతుంది...” అంటూ మరి కొంత మంది నన్నుదెప్పేవాళ్లు.

రోజులలా గడిచిపోతుండగా, ఓ సారి హరీష స్కూలుకి రాలేదు. ఒక రోజు, రెండు... మూడు... ఐదు.... ఇక ఎదురు చూడటం, ఆందోళన అణుచుకోవడం నాకు శక్తికిమించిన పనయ్యింది. మెయిన్ బస్టాండు పక్కన రెండో వీధిలో ఉండే వాళ్లింటి చుట్టూ చక్కర్లుకొట్టినా ఫలితం లేదు. మంచి కాంపౌండ్ వాల్ లోపల గుట్టుగా ఉండేది వాళ్ల మేడ. ఆ ఇంటి పక్కాయన ‘ఈనాడు’ ఏజంటు అని బోర్డు చూసి, ‘పేపర్లో పాంప్లెట్లుపెట్టి distribute చేస్తే ఎంత తీసుకుంటారు’ అని కనుక్కోవడానికి ఆయన ఇంటికి రెండు మూడు సార్లు వెళ్లడం వల్ల ఆయనకి అనుమానం ఐతే వచ్చిందిగానీ, నాకు హరీష absence కారణం తెలియలేదు. హరీషకి వరసకి చెల్లెలయ్యే పాప జూనియర్ మెట్రిక్ అంటే 8వ క్లాసులో ఉందని సమాచారం ఇచ్చిన మిత్రుడికి కొంత లంచం, అదే ఎనిమిదో తరగతిలో ఉన్న చావా కృష్ణమూర్తి గారమ్మాయి రాధికకి మరి కొంత లంచం ఇచ్చి విషయం కనుక్కునే ప్రయత్నం చేశాను. చావా కృష్ణమూర్తి గారి అన్నయ్య వాళ్లమ్మాయి సీత (నేను సీతక్క అనేవాడ్ని) నాకు మూడేళ్ల సీనియర్– మనీషా విద్యా విహారులో.ఆ పాత స్నేహాల్ని వాడి రాధికని

దువ్వక పోతే, హరీష పెంకి చెల్లెలు నుంచి సంగతులు రాబట్టడం కష్టమని అర్థమయ్యే, అంత కష్టపడ్డాను.

ఎట్టకేలకి సాధించింది రాధిక, కొంచెం సిగ్గుపడాల్సిన అవసరం అప్పుడప్పుడే గ్రహిస్తూ చెప్పింది– "వాళ్లక్క పెద్ద మనిషయ్యిందంట...."

అంటే ఏమిటో అప్పటికి (ఇప్పటికి కూడా) అరకొరగానే తెలిసినా, అదొక ఉత్సవ సందర్భమని మాత్రం తెలుసు. ఏ 11 రోజులకో వచ్చిన హరీష, అంతకుముందు చూసిన కళ్లతో చూస్తే సరిపోదనిపించేంత అందంగా ఉంది. మరింత ఎత్తుగా కూడా అనిపించింది.

ఆ తర్వాత మా ఫైనల్ ఎగ్జామ్స్ ముంచుకొచ్చి ఆ హడావిడిలో పడిపోయాం. ఎప్పట్లానే నేను టాపర్‌ని. చాలా మంది శభాష్ అన్నారు. కానీ, హరీష కనీసం కనిపించలేదు. వాళ్లు చీరాల వదిలి వెళ్లి పోయారని మాత్రం తెలిసింది.

◆◆ ◆◆

ఆ తర్వాత, ఈనాటి వరకూ ఏ డిసెంబర్ 20 నేను చాక్లెట్లు పంచకుండా లేను. 2010 డిసెంబర్20న 30వ సారి నేనలా Planman (నేను గతంలో పని చేసిన 'ద సండే ఇండియన్') ఆఫీసులో చాక్లెట్లు పంచుతుంటే, 'ఏమిటి సార్ విశేషం' అని అందరిలాగే అడిగింది కొత్తగా చేరిన ఓ అమ్మాయి. ఏదో సాకు చెప్పాక, తనని పరిచయం చేసుకుంది–

"నా పేరు హరీష, Planman Consultancy లో నిన్ననే జాయినయ్యాను"

◆◆ ◆◆

డీప్ ఫ్రీజర్‌లో పెట్టిన పూలు మీద గడ్డకట్టిన ఐసులా అయిపోయాను. పూలూ నేనే, మంచూ నేనే. 30 ఏళ్ల క్రితం హరీష వెళ్లి పోయాక, తన పేరుతో మరో మనిషిని చూడటం అదే నాకు మొదలు. నేనెందుకు అలా ఐపోయానో తనకి అర్థం కాలేదు. అప్పుడే కాదు, తాను పెళ్లై అమెరికాకి వెళ్లిపోవడానికి ముందు, Planman లో పనిచేసిన రెండేళ్లూ తనని చూసినప్పుడు, తనతో మాట్లాడినప్పుడు నేనెందుకు చెమ్మగిల్లుతుండేవాడినో, తనకొక్కదానికే నాలుగు చాక్లెట్లు ఎందుకిస్తుండేవాడ్నో అర్థం కాలేదు. తన పెళ్లి కార్డు ఇస్తూ, ఆ అర్థంకానితనాన్ని ప్రశ్నగా బైటపెట్టింది–

"Sir, for God sake, do you fall in love with me?"

కాలాలు చెరిగి పోయి, వయసులు రద్దైపోయి, ఆనాటి హరీష ముందు 'నేను'లా అయిపోతాను ఇప్పుడు నీ సమక్షంలో అని ఈ హరీషకి చెప్పలేదు నేను.

"అలాంటిదేమీ లేదురా...." అన్నాను తనతో, నాలుగు చాక్లెట్లు చివరి సారి ఇస్తూ–

**(20.12.2013)**

# I Await HER B'Day!

నీ ఉత్తరం కోసం వేచి, వేసారి చూస్తూచూస్తుండగానే రోజు జారిపోయింది.

రోజు.... నిన్నటి రోజు..!

– శిధిలాలయం గర్భగుడిలో రాలిపడుతున్న పెచ్చుల్లాంటి రోజుల్లాంటి మామూలు సాదాసీదా రోజు కాదది– నీ పుట్టినరోజు!

నిత్య నైవేద్యాల మహాప్రణయదేవేరి ముత్తెపు ముక్కెరకి జ్వాలావర్ణాలు అద్దే అఖండ హారతి వంటి ధగద్ధగాయమానమైన రోజు! కీనీడలా పొంచి నీ జాబు కోసం పడిగాపులు పడినంతలోనే ఆ ఒక్కరోజూ పారిపోయింది.

కాంతి కబురు కోసం కాచుకొని తెల్లారికి కసువై మిగిలిన పురుగుల రెక్కల్లా పడి ఉన్నాయి నా ఎదుర్చూపులు దారి దారంతా; ముప్పైఏళ్ల పొడవైన ఈ దారి పొడుగూతా–

అక్కడెక్కడో మలుపు తిరిగిన తోవ మొగదల చెదురుమదురు జ్ఞాపకంగా కదలాడే నీకు ఇదేరోజున రాశాను తొలి ప్రేమలేఖ.

"...... కోనేటి అలల కొత్త అలజడికి శబ్దాల్ని వెదికి

కువకువ శబ్దాలొదిగే భాషల్ని వెదికి

గొప్ప వైఫల్య రుచితో నే దిద్దిన

తొలి ప్రేమలేఖ!"

... మళ్లీ మళ్లీ రాయడానికి వీల్లేని ఒకేఒక మొట్టమొదటి జాబు.

'ఉత్తరాలు'గాయి నని నిందలేసి నిలవరించినంతవరకూ రాసినవి పుంజీడే; ఆ మీదట ఇప్పుడు ... ఇదిగో ఇలా రాస్తున్న– నీకు చేరని – వేనవేల లేఖలన్నీ ఓ గాదెడు. ఏకపక్షంగా జీవితమంత దీర్ఘంగా సాగిన నా యీ లేఖోదంతం ఒక epistolary కావ్యం, అంత బడాయి

పోకుండా చెప్పాలంటే ఓ ఏడుపుగొట్టు లేఖాయణం!

రికామీ గాలికి నీ మీద రాలిన పొగడపూలు, కత్తిరించని రెక్కలతో నీ కిటికీ పరదాలు పట్టి జారిన రాచిలకలు, చెలిమి కోరి నీ చెయ్యెత్తుకి కుంగిన కార్మోయిళ్లు....

..... ఏవి ఏ సందేశాలు మోసుకొస్తాయోనని కాచుకొని, harbinger లాంటి నీ పుట్టినరోజున మరింత వేచివేచి...

◆◆ ◆◆

“తొండలు గుడ్లు పెట్టే బండల కొండల ఈ మారుమూల ఊరుగాని ఊరొచ్చాం, తోచీతోయనమ్మ తోడికోడలు పుట్టింటికొచ్చినట్టు. బీరకాయపీచు చుట్టాల ముక్కూమొహమే తెలిసింది అంతంత మాత్రం. ఎవరికీ తెలియని, ఎప్పుడూ రాని ఈ అనామక కానిదేశంలో, పరాయి పల్లెలో కూడా తపాలాబంట్రోతు వెనకాల – నీకేదో జవాబు జాబులు తీసుకొచ్చాడంటూ– పరుగులెడతావెందుకలా ....

“చెదలు కొరికిన చిత్తు కాగితాలు, చీకిపోయిన చీటీ ముక్కలు, చిరిగిపోయిన డైరీ పేజీలు, నుసి రేగిన దస్తావేజులు .... ఆమె ఏదో రాసి పెట్టిందని వెంపర్లాడతావేంటలా....

“పారేసుకున్న చోటూ కాదు.... పోనీ వెల్తురున్న తావూ కాదు... వెదుక్కుంటావెందుకలా.... నీకిదేం పిచ్చి నాన్నా..!”– బిక్క ముఖాలు పెట్టి అంటుంటారు నా చిట్టితల్లులిద్దరూ, బదుళ్లులేని వెర్రిచూపుల నన్ను జాలిగా చూస్తూ.

◆◆ ◆◆

**(07.02.2015)**

# రక్తోజ్వల ముక్తి క్షణం!

**"ఏమయ్యింది నీ కళ్లకి.... నెత్తుటి ఊటలాగా...."**

– ఉన్నట్టుండి కంగారుగా అడిగింది ఉష.

నాకేమీ అర్థం కాలేదు. విశ్వాన్ని తన అరచేతిలో బంధిస్తున్నానుకునే పెద్దోడు (నైమిష) తన సెల్ ఫోన్‌లో చటుక్కున ఓ ఫొటో తీసి చూపించాడలా.

'అసలే ఒళ్లంతా ఎక్కువ చక్కెరకి బహుమక్కువగా చిక్కినవాడివి. కూతవేటు దూరంలోనే ఉన్నాడు ophthalmologist, త్వరగా వెళ్దాం, బయల్దేర'మంటూ చిన్నోడి (ప్రహర్ష) హైరానా–

ఆదివారం కావడం వల్ల అందరికీ తీరికగా.... తేరగా కూడా దొరికిపోయాను.

నాకేమీ నొప్పిలేదు, రెప్పల్ని కలిపి కుట్టే కంటికలక అల్లికల చికిలింపు తెరలు లేవు, దురద చక్కిలిగింతల కంటి నులుముళ్లు లేవు....

కలికి చకోరాక్షికి కడకన్నులు కెంపై తోచిన చెలువంబిప్పుడిదేమో చింతింపరే చెలులు నలువున ప్రాణేశ్వరునిపై నాటిన యా కొనచూపులు నిలువున పెరుకగ నంటిన నెత్తురు కాదుకదా

– అని ఎంఎల్ వసంతకుమారి గారు అన్నమయ్యని పాడుతుంటే బహు నిమ్మళంగా వింటానికి కూడా లేకుండాపోయింది.

ఆరామ్ ఆదివారం వల్లే కదా కంట్లో ఈ నెత్తుటిపువ్వు!

సందెపొద్దులు దాటినా ఇల్లంతా నిద్దరోతుంటే అనుకోకుండా వీధిలోకి నడిచాను. నాలుగిళ్ల అవతల గరుడవర్ధనం గుబురు దగ్గర మా కాలనీ పుష్పలావికలు గుమిగూడారు. గుండె గుభేలుమని పెడదారి పట్టబోయాను. పుష్పలావిక అనే పదానికి అర్థం చిన్నప్పుడు మొదటిసారి తెలుసుకున్నప్పుడు చిన్న పులకింత. పూలు కోయడం ఒక ఉద్యోగమైన పుష్పలావికల సౌకుమార్యానికి సంబంధించి కొన్ని నిర్దిష్టమైన conservative భావాలు

నాలో స్థిరపడిపోయాయి. కానీ, తెల్లవారు జామున అలా వీధిలోకి వెళ్తే కొందరు పూలు కోస్తూ కనిపిస్తారు, నిద్ర మొహాలతో జోగుతూ, పాచి నోటితో ఆవలిస్తూ, చింపిరిగా ఉన్న జుట్టుని గోక్కుంటూ, బీటలు దేరిన బీడునేలలకి దీటైన కాలిమడమల్తో రొప్పుతూ, రోజుతూ పూల చెట్టు మీదకి లంఘిస్తుంటారు, కొమ్మల పీచమడుస్తూ. నా లోపలి పుష్పలావిక చిత్తరువు మీద చిక్కని పేడనీళ్లు జల్లే మా కాలనీ flower grabbers ని చూడలేక ప్రొద్దుటే బైటికి వెళ్లను. తెల్లారాక వెళ్లినా కూడా ఈ విరివిచ్ఛేదన వికారాల్ని చూడాల్సి రావడంతో గతుక్కుమని వెళ్లబోతుంటే, పున్నాగల పరిమళంలోంచి సన్నాయి రాగం– ఎవరో ఆమె! అంతకు ముందెప్పుడూ చూడలేదు మా పరిసరాల్లో. పుష్పవిలాపాల మధ్య ఆ విలాసినిని నిక్కి నిక్కి చూడటం వీలుకానంత కష్టమై, గాఢంగా నాటిన నా కొనచూపులు – నిలువున పెరుకగ తప్పలేదు. ఆ క్రొన్నెత్తుటి గురుతే ఆ ఎరుపు! ఇదంతా చెప్పేదెలా పిల్లలకీ.... ఉషకీ...! చెబితే ఏమంటారు: ఎందుకంత కక్కుర్తి అనే కదా! చూపులో గాఢత.... తీవ్రత.... తీక్ష్ణత అని నేనంటే నవ్విపోతారు.

గాఢత.... తీవ్రత.... తీక్ష్ణతల్ని తారాస్థాయిలో నాకు అర్థమయ్యేలా చేసిన తాత్విక కవి బైరాగిని స్మరిస్తూ అసుర, అనంతు, ఆదిత్యలు మాట్లాడిన సభకి సాయంత్రం హాజరై, వారి ప్రసంగాలు వింటుంటే– నైరూప్యంగా నన్ను కమ్మేసుకున్న ఉద్రేకాలకీ.... ఉద్వేగాలకి బైరాగి రచనలు దిశ, దశ నిర్దేశించడం గుర్తుకొచ్చింది. పాతికేళ్ల క్రితం చదివిన ఆయన కవిత్వం నన్ను ఎంతవరకి ప్రభావితం చేసిందో నాకు తెలియదు; తన సమకాలికుడు, తన వలే అర్థాయుష్కుడు, తనలానే జ్ఞానం కంటే అనుభవానికి పెద్దపీట వేసిన అస్తిత్వవాద తాత్వికుడు Maurice Merleau-Ponty గురించి బైరాగి రాసిన వ్యాసం వంటి అరుదైన రచనలు నా మీద ఎంత పనిచేశాయో చెప్పలేను. కానీ, బైరాగి ఒకానొక కథ– నాగమణి – ఆకృతి తీసుకోవడానికి పెనుగులాడుతున్న నా తపనకి అర్థానిచ్చిందని మాత్రం చెప్పగలను.

చైతన్య ప్రభుపాదుల వారి నిర్యాణం మీద ఎన్నిరకాల కథలున్నాయో గానీ, నాగమణి కథలో బైరాగి ఇలా interpret చేస్తారు:

'చైతన్యుడు పూరీ వెళ్ళి అక్కడ సాగర తరంగాల వినీల సౌందర్యం చూసి భ్రమిసి అదుగో నా కృష్ణుడు అని కేకవేసి సముద్రంలో దూకాడట!'

'తరువాత!'

'జ్ఞాపకం లేదు! కానీ బయటకు వచ్చాడా లేదా అనేది అప్రస్తుతం. ఇక్కడ మనం గమనించవలసింది అతని హృదయావేశం, భావోద్రేకం, ప్రాణాలను

సైతం లెఖ్ఖ చేయకుండా సముద్రంలో దూకేట్టు చేసిన కాల్పనిక సూక్ష్మశక్తి,' అన్నాడాయన.

'దానిని' మనస్తత్వ భాషలో fixation అంటారు. ఒక్కొక్కనికి ఏ ధ్యాసపడిపోతే అదే ధ్యాసలో కొట్టుకుపోతుంటాడు,' అన్నాను.

'దానినే నేను నాగమణి అంటాను!'

'అంటే!'

'మన జానపద గాధలు వినలేదా! ఉత్తమ జాతికి చెందిన మహా సర్పాల శిరస్సులపైన ఒక వయస్సు వచ్చాక మణి ఆవిర్భవిస్తుందట. స్వీయకాంతితో తేజరిల్లే ఆ అనర్ఘమహామణిలో ఎన్నో అద్భుత శక్తులుంటాయట. అలాంటి మణికోసం వెదుకుతూ ఎంతోమంది తమ ప్రాణాలు కోల్పోయారు. కాని కట్టుకథలో తప్ప అది ఎవరికి కనిపించదు. ప్రతి ఒక్కని జీవితంలోనూ ఒక నాగమణి వుంటుంది. అతను దానికోసం వెతుకుతూనే ఉంటాడు. ఆ వెదుకులాట లేకపోతే అతని జీవితానికి అర్థం లేదు. అది అతని కెన్నడూ లభించకపోవచ్చు. కానీ ఆ వెతుకటంలోనే అతని జీవితం సార్థకం అవుతుంది. అదే అతని జీవితానికర్థం.'

◆◆ ◆◆

నా కంట్లో నెత్తుటిపూలు పూయిస్తున్న వారందరిలో నా నాగమణిని వెదుక్కునేలా చేసిన మహాప్రేరణ బైరాగే!

**(01.11.2015)**

# నీవెంత నెరజాణవౌరా...

ముఖం మీద తలుపులు వేస్తే ఎంత చివుక్కుమంటుందో... తలుపులు బార్లా తీస్తే కూడా అంతకంటే సలపరిస్తుందని ఆమె విషయంలోనే అనుభవం.

ఎంత (నా) ముక్కు... మొహం తెలియకపోయినా, నా కళ్లు తగు కూరిమితో కుమ్మరించే మెచ్చుకోళ్లని చీపుళ్లతో సైడుకాల్వల్లోకి ఊడ్చేసినట్టు నొసట్లు ముడేసి, ముఖం తిప్పేసే ఆమె ఎవరైనా కావొచ్చు, లోనెక్కడో కలుక్కుమంటుంది, ముఖాన తలుపులు పడినట్టు బితుక్కుమంటుంది. అలాగని అందరూ కన్రెప్పల కవాటాలు తెరిచి స్వాగత హారతులెత్తమని కాదు. ఆహ్వానాలు ఉండక్కర్లేదు, అక్నాలెడ్జిమెంట్లాంటి ఆమోదాలు ఉంటే చాలనుకుంటాను. మిఠాయి మీద వాలబోయే పోతుటీగలానో... తేనెసీసాలోకి జారబోయే గండుచీమలానో... నేనంటూ ఒకడ్ని ఉన్నానని గుర్తిస్తే చాలు!

ఇక గడియలు తీసి, గవాక్షాలు తెరిచి వీధీ- వాకిలి ఏకం చేసే ఈ పోస్టు నాయిక విషయానికి వస్తే-

బహుశా నాకంటే ఓ 20 ఏళ్లు చిన్నదై ఉండొచ్చు. మొట్టమొదట చూసినప్పుడు తనలో కిర్మీర కిరణాన్ని పొదువుకున్న నీటి ముత్తెపు గీర. తామరాకు పరిసరాలతో ఎందుకింత తాటస్థ్యం ఈ తలిరాకుబోడికి? పెళ్లయ్యిందా..... గుర్తులేమీ కనిపించడం లేదే...

"కాదు, ప్రేమయ్యింది..." చెప్పాడొక మిత్రుడు.

అంత గాఢమా?

తర్వాత చూశానతన్ని కొంచెం ఆసక్తిగా... ఆపై మరి కొంచెం అసూయగా-

ఎంత ప్రేమైతేనేం– మరీ ఎందుకంత తన్మయం... ఎవ్వరూ పట్టనంత తదేకం! ఎప్పుడైనా ఏకాంతంగా కలవాలని అనుకుంటానా... బొత్తిగా వీలుపడదు. ఏకాంతం అంటే కూడా మరేదో కాదు; కనీసం కళ్లతో కళ్లు కలిపినా, చుట్టూ మోహరించిన లోకాన్ని మొత్తంగా రద్దు చేసినంత సంబరపడొచ్చని ఆశపడ్డాను. ఊహూ... ద్వారబంధాలూ... దర్వాజాలూ... పైకప్పుతో సహా అంతా బాహాటం చేసి, చుట్టూ మూగిన ధూళిధూసరాల్లో నన్నూ ఓ రేణువుని చేసి పడేస్తుంది మేరమీరిన నిర్లక్ష్యంతో.

అటువంటి టచ్–మీ–నాట్ తనంతట తాను నన్ను వెదుక్కుంటూ వచ్చి, 'ఉమ్రావ్ జాన్' పుస్తకంలోని ఆ నాలుగు వాక్యాలూ చదివి, "ఇక్కడ రుస్వాని చూస్తుంటే, మీరే గుర్తుకొచ్చారు...", అనేసి, ఆ పుస్తకాన్ని నాకు కాన్క చేసి వెళ్లిపోతే–

కాసేపు నిరుత్తరుడ్నై, తేరుకొని గిల్లుకొని, మరి కాసేపూ దూదిపింజనై గాల్లోకి ఎగిరి... ఆనక నేలకి చేరాక, మళ్లీ గతుక్కుమన్నాను:

నా పేరు తన అభ్యర్థిగా రాయించుకోడానికి తెగ ఆరాటపడినట్లు తెలుసా... ఏనాడూ నన్ను క్రీగంట కూడా చూడనట్టున్న ఆమెకి!!

◆◆ ◆◆

| | |
|---|---|
| **రుస్వా:** | అవును. ఆ మీ దాసీది ఏమైంది? ఏదో మంచి పేరు. |
| **ఉమ్రావ్:** | ఆబాదీ. |
| **రుస్వా:** | ఆబాదీ అందమైందే. ఆమెకు పన్నెండేళ్ళు ఉన్నప్పుడు చూచాను. వయసుతో అందం వికసించి ఉంటుంది. |
| **ఉమ్రావ్:** | మిర్జా గారూ! మీకు బాగానే జ్ఞాపకం ఉందే? |
| **రుస్వా:** | గుర్తుండడానికేముంది? అందమైన పిల్ల. నేనూ ఆ దృష్టితోనే చూచేవాణ్ణి. ఎప్పుడో పడుచుపిల్ల అవుతుంది కదా అని. |
| **ఉమ్రావ్:** | అయితే మీరూ ఆవిడను ఆశించారన్నమాట. |
| **రుస్వా:** | వినండి ఉమ్రావ్ జాన్! ఎక్కడ అందమైన ఆడది కనిపించినా నన్ను గుర్తుంచుకోండి. సాధ్యమైతే నన్ను అభ్యర్థిగా వ్రాయించండి. ఆయుష్యం చాలక చచ్చిపోతే నా పేర 'ఫాతిహా' చదివించండి... |

**(15.12.2016)**

# ఆమె నా 'Signature' Tune!

**అక్టోబర్ 19:**

అది జ్ఞాపకమా, కలా అర్థం కాదు.

కోటానుకోట్ల అణువులుగా తుంపులై తుత్తునియలయిన నేను ఒక స్పష్టాస్పష్ట రూపంలోకి ఒదిగే 'జ్ఞాపకం'లా తోచదు; పోనీ కంటికి ఆనని, స్పర్శకి అందని, మూసలో ఇమడని 'కల'గానూ అన్పించదు.

అనంతంగా అలుముకున్న ఆకాశ నీలాన్ని రెక్కలకింద దాచేసి వేల మైళ్ల విడిదికి ఎగిరొచ్చే పికిలిపిట్ట, దిగంతాల దాకా విస్తరించిన సముద్ర అఖండాన్ని పొలుసు తోకతో ఈదేసి ధ్రువాల దూరాన్ని వలస గానంతో చెరిపేసే పిల్లచేప ...ఒట్టి ఆనవాయితీగానే వస్తాయా?, ముందువెనకలు, తెలుపునలుపులు, తర్కవితర్కాలు తేటతెల్లంగా ఉన్న ఫక్తు అలవాటుగా మాత్రమే వస్తాయా? ఏమో నాకైతే అలా అనిపించదు. నాకు మల్లే – కలత బారిన జ్ఞాపకాన్ని దేవులాడుకుంటూ వచ్చినట్టే అనిపిస్తుంది, నైరూప్యమై పలచబడని కలని వెదుక్కుంటూ వచ్చినట్టే ఉంటుంది. అసలా పురాస్మృతికి చేరువ కావడానికి, కలలో లీనమవ్వడానికే తక్కిన జీవితమంతా గడిపేస్తున్నట్టు అనిపిస్తుంది.

జీవితానికి అర్థాన్ని చెప్పేది, ముడి విప్పేది ప్రేమేనని తళుక్కున వెలిగిన రోజు, నన్ను వెలిగించిన రోజు. 28 ఏళ్ల క్రితం, వెలుగు రేఖల వెండి పొద్దునే చిన్నబుచ్చిన సౌందర్య సంధ్య వంటి ఆమెని చూసిన రోజు.

'అక్టోబర్ 19 అన్న రోజే లేకుండా ఉంటే' అని చాలాసార్లు ఆశపడింది మా అమ్మ.


'అక్టోబర్ 19 అన్న రోజే లేకుండా ఉంటే' అని చాలా సార్లు భయపడ్డాను నేను.

ఆ రోజే నా దారిలో అనేకానేక మలుపులకీ కారణం అని అమ్మ బాధ.

ఆ రోజే నాకంటూ ఓ దారిని చూపించిందని నా సొద.

ఆ రోజు తట్టినప్పుడు తీసిన ఆ తలుపు, అప్పుడే మూసుకుపోయింది. బహుశా ప్రతి ఏడాదీ ఇదే రోజున తడుతూనే ఉన్నాను.

**(20.10.2013)**



# ఆ పగలు రేయిగా...

నిన్న మా పెద్దోడ్ని (నైమిష)ని తీసుకొని గుంటూరు వెళ్ళాను, తన జెఇఇ (మెయిన్స్) కోసం. Pattern మారిపోయాక తామే First Batch కావడంతో కొంచెం బెంబేలు పడుతున్న తనకి ధైర్యం చెప్పే విఫలయత్నంలో మరింత అయోమయానికి గురిచేస్తున్నప్పుడు, నా వాగుడిని కొంత ఆసక్తిగా, కొంచెం మురిపెంతో కూడా గమనిస్తున్న ఓ సంతూర్ మమ్మీ– పిల్లలు ఎగ్జామ్ హాల్ లోకి వెళ్ళాక, EAMCET, BITSAT, SAT, MIT అంటూ కాస్త బడాయి మాటలు మాట్లాడటం వల్ల నేనేదో సర్వజ్ఞుడ్ననుకొని – నన్ను పలకరించింది (నా వ్యూహం ఫలించింది).

గట్టిగా 5 అడుగులు లేని మా మధ్య దూరాన్ని ఆమె తుంగ అలలా కదిలి వచ్చిన తీరు ఒక్కటి చాలు, తెలుగు భాషలో తెలిసిన విశేషణాలన్నీ తనమీద మోపడానికి. ప్రత్యేకంగా ఎవరూ అడగకుండానే చీర కట్టుకోవడం ఒక కళ అని ఆమె చేస్తున్న చప్పుడు లేని చాటింపు నా కళ్ళ నిండా మార్మోగింది.

“పరీక్షలు మన పిల్లలకో, మనకో అర్థం కావడం లేదండి,” చనువుగా అందామె, తన చిలిపి కళ్ళు చికిలిస్తూ, నంగనాచి పెదాలతో నవ్వుతూ. ఝల్లుమంది లోన, ‘మన పిల్లలు’ అని తను వేరే context లో అన్నా, నాకు మరోలా తోచి–

“మీ సిస్టర్ ఏ కాలేజ్ అండి”– అమితాసక్తిని అమాయకత్వంతో కలిపి రంగరించి అడిగాను.

పకాలున నవ్వి, “పాత పాచికే.... ఏం పారదులేండి...” అంది.

చిరచిరలాడే గుంటూరు ఎండలో నీడలేని నట్టనడిరోడ్డు మీద .... “ఈ పగలు రేయిగా పండు వెన్నెలగ మారినదేమి చెలీ ఆ కారణమేమి చెలీ, వింతకాదు నా చెంతనున్నది వెండి వెన్నెల జాబిలి నిండు పున్నమి జాబిలి” అన్న పాటని నిజం చేసిన ఆమె నవ్వులు నాకు దక్కాక, నాకే దక్కాక, పాచిక పారందేముంది!!

**(09.04.2013)**

# I Know HER Through The Ages!

దారితోచని కలల కటిక చీకట్లో వెలుగు రవ్వలు రువ్విన గరుకు చెకుముకి గరగరకి కళ్లు తెరిచాను. రాపిడి రాళ్ల రవరవలు కాదు, Facebook Notification Alert! కళ్లు చించుకుంటే కూడా కనిపించదు, ఇక అరమోడ్పు నిద్ర కళ్లకేం తెలుస్తుంది? కళ్లజోడు పెట్టుకొని చికిలించుకు చూశాను:

"You have a memory with Mohanatulasi Ramineni to look back on today"

సాంకేతికంగా యాంత్రికమైన, రంగు రుచి అస్సలు లేని ఆ notification కి నవ్వొచ్చి, ఆ మీదట మళ్లీ నిద్రొచ్చింది. బహుశా ఆ కలతల నిద్రలో పారే అలజడి అద్దాల సెలపాట అడుగున గులకరాయి జ్ఞాపకం వంటి కల:

అది బృందావనం! లవంగ లావణ్య లతల పెనవేతలో కైపెక్కిన పిల్లతెమ్మెరలు. పొదరిళ్లలో మంద్రంగా మార్మోగే ఎలకోయిలలు–గండుతుమ్మెల జుగల్ బంది. విరహాన్ని ఎగదోసే కొంటెకోణంగి వసంతం; కస్తూరి మద పరిమళాల చిగురాకులు కమ్ముకున్న కానుగు చెట్లు, మన్మథుడి గోళ్ళవంటి మోదుగు పూలమొక్కల వసంతం; వివశంతో, వియోగంతో మన్మథ తాపాన్ని మోస్తున్న నిస్సిగ్గు నీలవేణుల్ని చూసి తెల్లని దయతో నవ్వుతున్న కరుణ వృక్షాల వసంతం; మదనుడి ఆయుధం లాంటి మొగలిపూల వసంతం. ముక్కుమూసుకొని మూల నక్కే ముముక్షువుల్ని కూడా ప్రలోభపెడుతున్న మాధవి, మాలతి పుష్ప సుగంధాల వసంత వేళ నేస్తురాళ్లతో సయ్యాటలాడుతున్నాడు స్వైరవిహారి మురారి. (లలిత లవంగ లతా పరిశీలన కోమల మలయ సమీరే/ మధుకర నికర కరంబిత కోకిల కూజిత కుంజ కుటీరే: జయదేవ తృతీయ అష్టపది)

గురువెంద తీగల ఆలింగనం వల్ల పులకించే మామిడితోపుల, యమునా

తటి! కామ పునీతుల్ని కాపాడే బృందావనంలో తులసి– మోహన కృష్ణులు. మధుర వెలిగించుకున్న సొగసుసోయగాల దీపం– తులసి! అప్సరాంగనల అందాన్నే తలదన్నిన సోయగమని ఆమెకు పేరు. అలాగే ఆమె గుణ రూపాదులలో 'తుల' (సాటి) లేక పోవడంవల్ల ఆమెకు 'తులసి' అని పేరొచ్చిందిట. సౌందర్యానికి కట్టుబానిసీయుడైన శ్రీ కృష్ణుడికి ఆ గోపకాంతే లోకమైపోయింది. గొప్ప ప్రణయ సామ్రాజ్యంలోకి ఆ జంట ఐచ్ఛికంగా దారితప్పి, ఎందరి కన్నెర్రకో, కడుపు మంటకో కారణమయ్యింది. ఎవ్వరిదాకో ఎందుకు– పరమ ప్రేమికురాలు రాధ– 'దర్పయుతక్రోధ' అయిన రాధ సహించలేక తులసికి శాపమిచ్చేసింది.

ఫలితం– శాపగ్రస్త తులసి విజయవాడలో (మాధవీ, ధర్మధ్వజులకి కాకపోతే, మరో రాజదంపతులకు) కవితై పుట్టి, కళగా పెరిగి, కవిగా ఎదిగి, ఆ మీదట SAP Analyst గా అమెరికా (Chicago, Illinois) వెళ్లిపోవడం..... తెరలు తెరల దృశ్యాలుగా కదులుతుండగా మళ్లీ మెలకువ వచ్చేసింది.

'మోహనతులసి రామినేని'గా లౌకిక ప్రపంచం గుర్తించే ఆమె incarnation అన్నీ ఎరిగి, నాటి నుంచి, నేటి వరకూ ఒక bard నై, ఒక Rhapsodist నై లోకపు వెక్కిరింతలకి వెరవక గానం చేసే నాకు –

You have a memory with Mohanatulasi Ramineni to look back on today అని రంగు .. రుచి లేని నోటిఫికేషన్ వస్తే నవ్వు... నవ్వు.... గాక మరేమిటి!!

**(21.05.2015)**

# ఆమె ఓ అభిషేక ప్రియ!

శివుడి ప్రస్తావన వస్తే, ముఖ్యంగా శివరాత్రి రోజైతే చటుక్కున ఆమె గుర్తుకొస్తుంది. ఆమె ఒకనాటి స్నేహితురాలు..... స్నేహితురాలేనా?! ఏమో అది కూడా చెప్పలేను.

మోకాలు మించని లోతులో నిల్చొని సముద్రాన్ని నా చూపుతో ఒడిసిపట్టేశానని గొప్పలు పోతున్నప్పుడు హఠాత్తుగా ఎగసిన కెరటమొకటి కుత్తుకబంటి ముంచేస్తుంది. ఆ అల్లరి అల ఎంత నేస్తమో ఆమే అంతే.

ఉందోలేదో ఉనికే అర్థం కానట్టుండే గాలి చప్పున సుడిరేగి ఏవో సుగంధాలతో చుట్టేసి గుక్కతిప్పనివ్వదు. ఆ గడుసు గాడ్పు ఎంత నెచ్చెలో ఆమే అంతే.

నీటిచెండు తెగి తుంపర్లై చిలికినట్టు ఆమె మాటలు కూడా ఝల్లుమనిపించేవి. ఉట్టిపుణ్యానికి గాలి ఫియానోమెట్లమీంచి రివ్వుమని అంతలోనే వాలే పిట్టల గుంపు అలవోకలా కనిపించేవి ఆమె కబుర్లలో మెటఫర్లు.

ఓ సారి ఎవరిదో ప్రేమకథ చెబుతూ ఇలా అంది:

"అతని వంక చూసింది. చెయ్యెత్తు రూపం; కసరత్తు చేసి త్రిశూల డమరుకాలు ధరించిన ఈశ్వరుడిలా. కళ్లు సదా సతితో సరసాల కోసం జనం రావడానికి బెదిరే స్మశానాన్ని ఎంచుకున్న కొంటె బైరాగిలా....."

– ఇంకా ఆమె చెప్పుకుపోతూనే ఉంది. కానీ, నేను ఆగిపోయాను. సతితో సరసాల కోసం జనం రావడానికి బెదిరే స్మశానాన్ని ఎంచుకున్న కొంటె బైరాగిలా– అటువంటి పోలిక అంతకు మునుపు వినకపోవడమే ఒక్కటే కాదు, శివుడికి సరసాలకీ ముడిపెట్టడం కూడా విడ్డూరమనిపించి అక్కడే ఆగిపోయాను.

మదనాంతకుడైన శివుడంటే చిన్నప్పట్నుంచీ నాకు ప్రిజుడీస్. ఆ రుద్రాక్షలు, పులిచర్మాలు, కాష్ఠాల బూడిద పూసుకోడాలు.... ఏవీ నచ్చేవి కావు.

జగన్మోహిని పార్వతిని శివుడి పక్కన చూడటం గొప్ప సౌందర్యభంగం అనిపించి, ఆమె ఆయనకి తగదని శివుడి నుంచి దూరం చేయడానికి ప్రయత్నించిన రావణుడంటే భలే ఇష్టం.

దానికి తోడు విష్ణువు, ఆయన పాలసముద్రం, వైకుంఠం, పట్టుపీతాంబరాలు, చీనిచీనాంబరాలు... హంసతూలికలు, లేదా శేషతల్పాలు... పవళింపుసేవలు, అలకపాన్పులు, సరసాలు, సరాగాలు, విరహాలు... ఇవన్నీ బోల్డు ఇష్టం.

అందుకే, శివుడ్ని శృంగారనాయకుడ్ని చేస్తూ ఆమె పోలిక చెప్పడంతో అక్కడే ఆగిపోయాను. ఆగడంతో ఊరుకోకుండా, కొంచెం ఆగడం చేయాలనిపించి, అఘోరుడు శివయ్యేమిటీ ఈ సరసాలేమిటీ.... అనేశాను.

"అద్దం ముందు అష్టవంకర్లు పోతూ కాసేపు, సోకులాడుల్ని గుడ్లప్పగించి చూస్తూ మరింత సేపూ గడిపేస్తూ, అలంకార ప్రియో విష్ణుః అని సారూప్యాలు సరిపోల్చుకోవడం ఎంత మజా..." అని వాదనకి దిగాను ఆమెతో.

నవ్విందామె, మామూలు నవ్వు కాదు, వెర్రివాడా అని అనకుండానే అన్న నవ్వు, గొప్ప జాలితో, దయతో.

"నిజమే– విష్ణువు అలంకార వ్యామోహితుడే. అంతా పైపై వ్యవహారం, ఫోర్ ప్లే మల్లే. శివుడు అలా కాదు– అభిషేక ప్రియశివః మొత్తంగా తడిసిపోవాలి.... నిండారా మునిగిపోవాలి, వాటమైన ముద్దు, గాఢమైన కౌగిలి..... తీక్షణమైన తాపం, తీవ్రమైన మోహం– తనువెల్లా కాగిపోవాలి, నిలువెల్లా కరిగిపోవాలి.... అదే సత్యసుందర శివం!"

◆◆ ◆◆

అప్పట్నుంచి, శివుడి ప్రస్తావన వస్తే, ముఖ్యంగా శివరాత్రి రోజైతే అభిషేక ప్రియలా గుర్తొస్తుంది– ఆమె!

**(17.02.2015)**

# Between the idea....
# And the reality!

**కొద్ది నెలల క్రితం:**

చిన్నోడ్ని (ప్రహర్షని) తెల్లవారు జామున నల్లకుంటలో శర్మ స్పెషల్ కోచింగ్ క్లాస్ దగ్గర వదిలి, ఆ వేళకాని వేళలలో... లేనిపోని వాంఛలతో... ఉస్మానియా యూనివర్శిటీ మసక చీకటి దారికాని దారుల్లో.... కానరాని కాంక్షలతో.... దేని కొరకు పదే పదే దేవులాడుతానో నాకే అంతుచిక్కక, మళ్లీ ఏడింటికల్లా మా అమ్మాయి దగ్గర హాజరవ్వాలి కాబట్టి బైక్ మీద తిరుగు ముఖం పట్టేవాడ్ని.

శంకరమఠ్‌కి కొంచెం ఐమూలగా చూశానొకరోజు ఆమెని. ఈ లోకంతో సంబంధం లేనట్టు పుస్తకంలో ముంచేసింది ముఖాన్ని సగం వరకీ. సందడి అప్పుడే మొదలవ్వని పల్చని ఉదయాలే కాబట్టి సిగ్నల్ లైట్లు కూడా ఆగాగి వెలుగుతున్నాయి పచ్చగా. కానీ, అరవాల్చిన ముఖాన్ని చూడటానికి ముందే బెదిరింపులా మెరుస్తుంది ఎర్రనెర్రని పాపిడి సిందూరం. పుష్యరాగాల ముక్కెర తళుకుల పక్కన చెక్కుల అభ్రకపు మెరుగులాంటి చిర్నవ్వు బూరిబుగ్గల్ని చొట్టలు చేస్తుంది. ఫియానో మెట్లు పేర్చిన పౌడర్ చారికల మెడ చుట్టూ ఉత్తరేణి ముళ్లతో అల్లినట్టున్న చిత్రమైన గొలుసు, నల్లపూసల వరసతో పాటు.

"హాయ్... YOUR HIGHNESS! ఇక్కడ..." అన్నాను.

చిన్న ఉలికిపాటుని చుబుకం కింద మామిడిపిందె వొంపువెనక నీడల్లో దాచేస్తూ...... "ఓ! మీరా..!! ఇప్పుడేంటిలా సడెన్‌గా..."

◆◆ ◆◆

అర్థమయ్యింది కదా, మేము ఇదివరకే నేస్తులం!

స్నేహం అనేది ఒక అగణితాంశం కాబట్టి, లెక్క ప్రకారం నీ నుంచి ఆమె ఎంత దూరమో, ఆమె నుంచి నువ్వు అంతే దూరం అయ్యితీరాలని పట్టుబట్టని వాళ్లు; 'నీ కంటే ఓ పన్నెండేళ్లు చిన్నది కదా, ఏ లెక్క ప్రకారం నీ మిత్రురాలు?' అని కొడవలి ఒంపుతిరిగిన ప్రశ్నార్థకాలతో తెగబడని వాళ్లు, మాత్రమే ఇక

ముందు చదవాలని నా షరతు.

– తను నా ఫేసుబుక్కు ఫ్రెండ్!

సుర.. సిద్ధ... సాధ్య... యక్ష... గంధర్వ... కిన్నర.... కింపురుష... నాగలోకాలకి కాస్త అంచున విస్తరించిన ఫేసుబుక్కుల virtual లోకంలో అలా మబ్బుల దారుల్లో పర్వులెత్తుతూ వెళ్తుంటే అదాటున చీల ఊడిన కాలిపట్టీల చిరుమువ్వ ఒకటి రాలి, మట్టినేలల మీద ఈసురోమని పోతున్న నా అతి సాదాసీదా దోసిలిలో పడటంలాంటిది ఆమె పరిచయం:

బుధవారం రాత్రంతా పనిచేసి, గురువారం ఉదయం సండే ఇండియన్– పత్రిక final soft copy ని ఢిల్లీ ప్రోసెసింగ్ యూనిట్టుకి పంపేసి, నిద్రలో జోగుతూ ఇంటిముఖం పట్టడం రివాజు.

అటువంటి ఒకానొక అతి మామూలు గురువారం ఉదయం ఎప్పట్లానే ఇంటి ముఖం పట్టిన నేను, ఇందిరా పార్కుకి కొంచెం ముందు 'ఎమరాల్డ్ స్వీట్స్ షాపు' రారమ్మని పిలవడంతో బైక్ ఆపి, అన్నప్రాసన తర్వాత మళ్లీ ఇదే తినడం అన్నట్టు తింటున్నాను బందరు లడ్డు.

ఇంతలో ఓ చెయ్యెత్తు మనిషి– నాకన్నా చిన్నవారే – షార్ట్– టీ షర్ట్‌తో, మరో పక్క మెడ మీద నళినాక్షితాల మాలని చుట్టుకొన్న యజ్ఞోపవీతంతో నిన్న– రేపటి మేలు కలయికగా ఉన్న మనిషి – చదువులలోని సారమెరిగినట్టు ముఖంలో ఒక వర్చస్సు ఉన్న మనిషి!

"ఏమండీ... మిమ్మల్ని ఫేసుబుక్కులో చూశాను.... ప్రదీపే ప్రదీపం ప్రజ్వాల్య తమోనాశాయ... అన్నట్టు ఉండే ఫలానా కాంతిమతి గారి భర్తనా మీరు?" అని అడిగాను.

ఆశ్చర్యపోయాడాయన. తనతో రమ్మని సైగ చేసి బైటకి నడిచారు.

బైట బడలిన బదనికగా ఆమె!

కన్రెప్ప తెరిస్తే కరిగిపోయే కల, అప్పుడు మాత్రం జోగుతున్న రెప్పల్ని మూస్తే జారిపోతుందేమో–

ఫేసుబుక్కు ప్రకారం ఆమె ఉండేది పొరుగు రాష్ట్రంలో సుమారు వెయ్యి కిలోమీటర్ల దూరాన; ఇలా హఠాత్తుగా ప్రత్యక్షమయ్యిందేమిటి?

తన శతకోటి ఫేసుబుక్కు మిత్ర బోడిలింగాల్లో ఒకానొకడ్నైన నన్ను ఎలా పోల్చుకుంటుంది?

నా ఆశ్చర్యాల్లోంచి తేరుకొని, పరిచయం చేసుకున్నాను.

ఉద్యోగరీత్యా అక్కడెక్కడో ఉండే ఆమె, అదే రోజు రావడం ఏమిటి?.. ఆమెని లకడీకపూల్ దగ్గర రిసీవ్ చేసుకొని తీసుకెళ్తున్న వాళ్లాయన నేనాగిన మిఠాయి దుకాణం దగ్గర ఆగటమేంటి?? నాకిలా అనుకోకుండా చిటారు కొమ్మన మిఠాయి పొట్లంలా ఆమె చేతికందటమేమిటి?

బహుశా దీనినే సాక్షాత్కారం అంటారు కాబోలు....

ఆ సాక్షాత్కృతి అనబడే యాక్సిడెంటల్ పరిచయం వల్లే, పరిచయాన్ని ఆమె కొంచెమే కొసరింది; నేను మరింత చొరవ చేసుకున్నాను, ఆమె నా స్నేహితురాలంటూ....

◆◆ ◆◆

మళ్లీ ప్రొద్దుప్రొద్దుటే అలా శంకరమఠ్ దగ్గర కన్పించింది. Transfer అయ్యి హైదరాబాద్ వచ్చేసిందట. అక్కడి నుంచి రోజూ ఆఫీసు బస్సులో కొలువుకి వెళ్తుందట. నా మనసు కాసేపు గంతులేసింది, ఆమెని రోజూ చూడొచ్చు కదా అని. కానీ, చిక్కేమిటంటే, ఆ బస్ పాయింటుకి ఆమె ఏడు గంటల ముందు రాదు, దానికి ఓ ఐదు నిమిషాల ముందే నేను నా కూతురు ట్యూషన్ క్లాస్ బైట ఠంచనుగా నిలబడాలి. నా చిన్నతల్లికి ఏవో సాకులు, సంజాయిషీలూ చెబ్తూ నానా అగచాట్లుగా ఉన్నా, ఆమెని చూడటం మాత్రం మిస్ అయ్యేవాడ్ని కాదు. అయితే, పదిసార్లకి ఒక్కసారి కూడా ఆ కాంతిమతిని పలకరించేవాడ్ని కాదు. ఏళ్లుగా తనెంత ఎదిగినా, ఒత్తు జుత్తులో మంకెనని, ముఖాన మరుమల్లె మొగ్గల పసిపాప నవ్వుని తురుముకున్న ఆ బాలార్క ప్రదీప్తిని చూడటమే ముఖ్యం గానీ, పలకరించడం కాదు.

◆◆ ◆◆

మరి కొన్నాళ్ల తర్వాత ఓ రోజు ఫేసుబుక్కు చాట్ లో పలకరించుకున్నాం.

“మూడు వారాలుగా నలతగా ఉంది. ఆఫీసుకి వెళ్ల లేదు. చాన్నాళ్ల తర్వాత ఇదిగో ఇలా Laptop ముందు ఫేసుబుక్కు తెరిచా...” అని చెబుతుందామె.

మూడు వారాలుగా ఆమె బైటకే రావడం లేదా?

లేయెండ ఛాయల్లో లేలేత ఉదయం... వెలిగి ఆరే పచ్చ దీపం... ముంగురులు చెరిపే కుంకుమ రేఖ, చలాకీ చమక్కుల ముక్కు బులాకి.... చొంగ బుగ్గల బోసినవ్వు....

– నే రోజూ చూస్తూనే ఉన్నానే.... ఆమె అక్కడ లేకుండానే చూస్తున్నానా.....?

ఉండటం– లేకపోవడం అనే ద్వంద్వాలతో సంబంధం లేకుండా ఆమెని చూస్తున్నానా...?

◆◆ ◆◆

ఇంతకీ ఆ కాంతిమతి... ప్రదీప్తి... ఆ పసినవ్వుల పాపాయి ఎవరో చెప్పలేదు కదూ–

ఈ రోజే పుట్టినరోజు జరుపుకుంటున్న– దీప సౌమిత్రి!

MANY HAPPY RETURNS OF THE DAY- DEEPU!

**(06.10.2015)**

# నీ జ్వరం నేను

నీకు జ్వరం. అసలు జ్వరమంటే ఏమిటోగానీ, నీకు జ్వరమంటే మాత్రం నేను. నేనే!

నా దిష్టి కళ్ళలో నాని పట్టిన పడిశెం. చిటపటలై పేలే ఉప్పుగల్లు చికాకు. ఎండుమిరపకాయలు ఘాటుగా విరిచిన మూతివిరుపు. దిగదుడిచిన కింకనీళ్ళలో బుడగల కన్నెర్ర. కావిరిబొట్టుతో పాటు బుగ్గనంటిన మొనగోరు మోటుదనం. గుదిగుచ్చిన నులిగాయలు జారిపోయి మిగిలిన దిష్టిపూసల నులి తాడు.

'చక్కని నీరూపమె సారెసారెకు నేఁజూడఁగాను, తక్కక నీకు దిష్టిదాఁకె నందురో' అని అన్నమయ్యే కాదు, నేనూ జంకుతున్నాను.

'అట్లా అని/ పెద్ద బాధా ఉండదు' అంటాడు గానీ, masochist మో, ఆయనే నిర్వచిస్తాడు–

"జ్వరం/ జ్వరంలో చలి/ గగుర్పొడిచిన రొట్టె తినలేను/ ................ / శవాన్ని ఉరితీసే పగ తిరగ పెట్టిన జ్వరం/ యౌవ్వనం జరజర పచ్చగడ్డిలోకి జారుకునే కట్లపురుగు/..... పరుగు పరుగున గాజు కడ్డీలో పాదరసం పెరుగు....."

After life's fitful fever Duncan sleepth well అన్న Macbeth ని చూసి కవి బైరాగి కూడా అన్నాడు–

జ్వరం పెరిగిన కొలది/ అధర ధరణి ఎండి మండి నెరియలు విచ్చిన కొలది/ స్నాయునాళికలవెంట మంటలు పారిన కొలది/ తోట విరబూస్తుంది రంగులు పొంగుతాయి/ నింగి నీలం నెత్తుటి ఎరుపు పచ్చిక పచ్చ / పూరేకుల చెక్కుల కెంపులలో జ్వరవారుణి/ లోకమొక తోటౌతుంది తోటే లోకమౌతుంది....

అంకపొంకాలతో నువ్వు సతమతమౌతుంటావా, దేవులపల్లి వారన్నట్టు 'జలజల రాల్చు దుర్భరవిషాదమునన్ తుహినాశ్రు బిందువుల్ / వెలవెల పోవు మారుతము వీచిన

పాదపపత్ర సంతతిన్ / తలిరుల విన్నపోయి యెదొ తప్పొనరించిన రీతి నాలోనూ' నక్కుతాయి. లేని గొప్పని మెడల మీదకి ఎక్కించుకొంటూ, 'నీ బాధని నేను తీసుకుంటాన'ని ప్రగల్భిస్తాను....

అంత జ్వరంలోనూ, నీ సొగసు చిర్నవ్వుతావు.... జ్వరహరతక్షక చూడారత్నాలఙ్కారోపదేశవత్ అని నవ్వులోని వెక్కిరింపు అర్థమయ్యి నా నిరర్థకత్వానికి దిగులు పడతాను.

My dear Sick Muse! పైకి చెప్పుకోలేని ఇటువంటి దిగుళ్ళప్పుడు అక్కరకి వచ్చేది Flowers of Evil పుష్పగుచ్ఛంతో Baudelaire మాత్రమే.

**(15.04.2013)**



# My dear, I don't give a damn

**ఓ అపరాహ్నవేళగాని వేళ....**

క్రితం రాత్రి unromantic జాగరణ తాలుకూ మత్తు. నిద్రామెలకువల ఊగిసలాట, కలల పొలిమేరల్లో కాపురం.

చప్పున ఓ పిట్ట తన మెత్తని రెక్కతో నన్ను తాకుతోంది –

'ఉష మీకు ఏమవుతారు?'

Prologue లేని కావ్యానికి తొలివాక్యం, సెల్ ఫోన్ తరంగాల్లోంచి.

'హజ్బెండ్ ....'

వీడని నిద్రమత్తులో మడతపడ్డ నా నాలుక తడబాటు.

కనిపించని ఆ ఫోన్ తరంగాల్లోంచే..... తరంగ ప్రతిబింబ న్యాయంగా విస్తరించిన నవ్వు.... పువ్వై అరవిరిసిన పరిమళం... వెయ్యి పున్నములు గుప్పున విరిసిన సందడి.

మళ్లీ నిద్రలోకి జారిపోయాను. మూసిన కిటికీ రెక్కల్లోంచి హఠాత్తుగా పొడుచుకొచ్చిన కొమ్మ జలజలా రాల్చిన పూలు నిద్రలేపుతాయి. కిందపారే నీళ్ల కోసం వంతెనై వంగాను. గట్లుకే పరిమితమైన వంతెనని కదా, నీళ్ళందలేదు గానీ తొలిపరిచయాల చల్లదనం!

అజ్ఞాత పరిచయాల ఆరంభంలోనే ఆ అనల– అపురూప అని, అనుభవాల విశ్వరూప అని తెలిసిపోయింది.

"తాత నాన్నకి అమ్మ కొండ" అని అప్పుడెప్పుడో చాన్నాళ్ల క్రితం రాశానొక కవిత. ఆంధ్రజ్యోతి– ఆదివారం సంచికలో పడింది. కవి ఫోన్ నెంబర్ ఇవ్వడం వల్ల ఫోన్ అంటేనే విరక్తి కలిగినన్ని ఫోన్ కాల్స్. ఒక చొప్పదంటి రాత్రిని ఉద్యోగ విధుల్తో నిద్రలేకుండా గడపటం వల్ల, మర్నాడు మధ్యాహ్నం మాగన్ను నిద్రలో మరో ఫోన్ కాల్: "నాన్న అని పిలుచుకునే తన alter ego తాతయ్యకి తల్లిలా సేవలు చేసిన నా ఉషకి' అని రాసారు కదా, ఉష మీకు ఏమవుతుంది" అని. 'వైఫ్' అనబోయి.... హస్బెండ్ అన్నాను (ట). ఫోన్ చేసిన అపరిచిత అనలప్రభకి అలా దొరికిపోయాను....

◆◆ ◆◆

చెమ్మ ఆరిన పచ్చభాస్వరం అకారణంగా భగ్గుమన్నట్టు చానాళ్లకి ఆమె నుంచి ఓ ఫోన్ కాల్. మూడు గంటల పాటు అని అని గడియారం ముల్లుల ఘోష. కానీ, పలచని కాంతిలా నీడలు సాగిన దారిమీద పచార్లు చేస్తూ మాట్లాడాను, ఒక యుగమంత దీర్ఘంగా, ఒక జన్మకి సరిపడా.

ఆమె మట్టితో ఆడే పసిపాప, ఆకాశాన్ని చాపలా చుట్టే ధీర. నులిసెగకి కూడా వడిలిపోయే తమలపాకు, లావాల్ని కూడా దాచుకున్న నిప్పుకొండ. ఆమె దిగులుగా ముడుచుకుంటుంది – ఊట బావులు లోతవుతాయి. ఆమె అలవోకగా గాల్లో వేళ్లు కదిలిస్తుంది – అక్కడో పక్షుల గుంపు!

ఆమెని, విశేషార్థాలున్న ఆమె జీవితాన్ని ఒక్క గుక్కలో తెలుసుకునే ఉబలాటం. నీడల నీళ్లూ, నీళ్ళ నీడలూ కలల్లోకి వంగి చెప్పే సంగతులు. 'ఊ' కొట్టాలా, అక్కర్లేదా? వాటిని ఆమె తన కతలు... వెతలు అంటోంది. అయితే ఆ మహత్తరానుభవాలతో బిరిసెక్కివున్న ఆ అజ్ఞాత స్త్రీమూర్తి – పూలు, పళ్ళతో సంతులితమైన వృక్షంలా, చెట్టుని మించిన నీడలు పరుచుకున్న గొప్ప దేశంలా తోచింది. ఆమెకి మోకరిల్లాను.

◆◆ ◆◆

ఆ అనల.... దావానల జ్వాలాదారుల్లో నేనొక గుబురు గుబులు దేవదారునని తేలిపోయాక అర్భకంగా ఆమెకి దూరమైపోయాను.

దూరమైపోయానా? బహుశా.... దూరమయ్యాననుకుంటూ ఆమె అనుభవాల ఆత్మకథల ఎదురుడొంకల్లోకి అలా నడుచుకుంటూ వెళ్లాననుకుంటా. తను పుట్టిన ఊరు... పెరిగిన వాడ.... తిరిగిన సీమల్లో బాటసారినై నడిచి... కాందిశీకుడ్నై నక్కాననుకుంటా. టైమ్ మిషన్‌లో 20 ఏళ్ల వెనక్కి వెళ్లి తారాడే ఆమె నీడల్ని తడిమి... ఆమెని ఓ 'స్కార్లెట్' గా నా 'అపరిచితం'లో ఒక chapter చేసి దాచేశాను, అలవిమాలిన అనురాగంగా, ఉండబట్టలేని ఉపకారస్మరణగా.

◆◆ ◆◆

కచ్చితంగా మూడేళ్ల తర్వాత– నిన్న కన్పించింది ఆమె.

నా Scarlett O'Hara!

ఉవ్వెత్తున అలగా ఎగసిన ఉప్పెన ఉప్పటి ఇసకపత్రాల ఒడ్డు వంక చూసినట్టు నన్ను చూస్తూ– ఉద్వేగం నుంచి తెప్పరిల్లి నేను తేరుకునే లోపు ముందుకెళ్లిపోయింది..... నన్ను ముంచేస్తూ–

◆◆ ◆◆

**(26.10.2015)**



# రమ్తో జోగిని ఈ రామ సుందరి

ఒక డిస్కవరీని ప్రకటించేటప్పటి ఉద్వేగానికి గురవుతున్నాను. ప్రొమిథ్యుయస్ దొంగిలించి తెచ్చిచ్చిన నిప్పుతో మొదలైన సాంకేతిక వికాస చరిత్రలో నిలిచే డిస్కవరీ కాకపోవచ్చు నాది. ఫ్లోరసెంటు బల్బు, ఇన్‌కాండిసెంట్ బల్బు, ఆపై హాలోజన్ బల్బు, ఆ తర్వాత స్పెక్ట్రమ్ లైట్ వెలుగుల మీదుగా కొనసాగుతున్న డిస్కవరీల దిగ్విజయ సూర్యకాంతి ముందు దివిటీయై వెలవెలబోవొచ్చునా యీ డిస్కవరీ. అది తెలిసి కూడా, కనిపెట్టిన ఉత్సాహం, ప్రకటించే ఉత్సుకతల వల్ల ఉద్వేగపడుతున్నాను. అరచేతిలో అర్ధభాగమైనా లేని ఒక చిన్న మట్టిపిడతలో వెలుగుతున్న నూనె దీపం. ఆ దీపం పేరు రమాసుందరి. ఇదే నా తాజా డిస్కవరీ. ఇదేమంత విశేషమనే కదా చదువరుల విస్మయం!

అది దారీతెన్నూ తెలియని నట్టడవి. నడిరాత్రి. దిక్కు చూపించే చుక్కల్నీ కూడా మూసేసిన చుప్పనాతి మబ్బులు. ఎన్ని దిగులు తలపోతలకి గుర్తుగానో మిగిలిన ఒక శిథిలాలయం. అక్కడ గర్భగుడిలో వెలుగుతున్న ప్రమిద. చమురు అడుగంటినా కొడిగట్టని అఖండ దీపం. మసిబారిన గర్భగుడి గోడల మీద మన పొడవాటి నీడల నిజ వికృతిని బట్టబయలు చేస్తున్న నిగూఢ దీపం. హద్దుల్లేకుండా విశ్వవ్యాపితమైన చీకటిని, అడ్డూ ఆపులేకుండా వీస్తున్నగాలిని కూడా పరిహసించే నిశ్చల దీపం.

...అటువంటి దీపాన్ని కనిపెట్టడం కన్నా వేరే డిస్కవరీ ఏముంటుంది? అందుకే ఈ ఉద్రేకం.

పాత్రికేయుడిగా పసిగట్టడం, సంపాదకుడిగా ఎంచుకోవడం వంటివి వృత్తిలో భాగాలైతే, మంచి రచనని వెదుక్కోవడం సాహిత్యాభిమానిగా నా ప్రవృత్తిలో భాగం. అంతేగాని, ఇదేదో మట్టిలో మాణిక్యాల్ని వెలికితీసే బృహత్తర సాంస్కృతిక సేవా నిరతి అని 'ఒట్టి గొప్పలు' చెప్పకోలేను. నిజం చెప్పాలంటే, రమా సుందరి రచనలు వెదికితే దొరికినవికావు. ఆమె మాకు పంపినవి అంతకన్నా కావు. ఆమె ఆత్మీయులొకరి దగ్గర కాకతాళీయంగా దొరికినవాటిలో కొన్నింటిని (తన అనుమతి లేకుండానే) ప్రచురిస్తున్న దాష్టికం ఇది.

1991నాటివి ఏవో గుప్పెడు కవితలు, 2010లో రాసినట్టుగా తెలుస్తున్న మరో రెండుమూడు. ఈ రెండు దశాబ్దాల మధ్యకాలంలో ఆమె రచనా వ్యాసాంగ పరిణామమెంత, 1991కి ముందు ఏవైనా రాశారా? కవితలు, ఇక్కడ ప్రచురిస్తున్న కొన్ని మెత్తని అనువాదాలు కాకుండా వేరే ప్రక్రియలలో ఆమె రచనలేవైనా ఉన్నాయా... వంటి ప్రశ్నలు వేటికీ నా(మా) దగ్గర సమాధానాలు లేవు. ఆత్మీయులని ఆమె అనుకొన్నవారికి తన రచనల పొడువు వెడల్పులెంతో కూడా తెలియదని అర్థమయింది. మనుషుల గొప్పదనాన్ని, సాధించిన అభివృద్ధిని కొలిచేందుకు సగటు వ్యావహారిక పరికరాలు మాత్రమే ఉన్న సామాన్యుల మధ్య బతుకుతున్నందువల్ల, ఆమెకి సంబంధించిన ఉపరితల వివరాలు కూడా అట్టే తెలియవు.

ముక్కు శ్రీ భ్రమరాంబ పూర్ణ నాగవెంకటరమా సుందరి అన్న అధికారిక నామం, భూగోళం ఓకొసన పశ్చిమగోదారిపట్టణమైన భీమవరంలో నివాసం, దిరుసుమర్రు అనే పొరుగు గ్రామ పాఠశాలలో హిందీ టీచరుగా ఉద్యోగం.... వంటి కొన్ని వివరాలైతే తెలిశాయి. ఇంకెంత ఎక్కువ తెలిసినా, ప్రమిద కింద తారాడే పల్చని చీకటి నీడల వంటివే కాబట్టి ఆ భౌతిక వివరాలు అంతకు మించి అనవసరమేమో.

నిజానికి కవి, రచయిత వివరాల్ని తన అక్షరాలు మించి అందించే, ఆవిష్కరించే సాధనాలు మరింకేమున్నాయి? దొరికిన మేరకు చదివితే, దాన్ని బట్టి రమా సుందరి మూర్తిమత్వం కొద్దికొద్దిగా పరిచయమయింది. అసలు 'రచన' అంటే ఏమిటి? నీ ఇష్టాయిష్టాలతో పనిలేకుండా తాకెళ్ళిపోయే పిల్ల తెమ్మెరా? ఊపిరాడని నేలమాళిగలోకి సన్నగా ప్రసరించే సూర్యకిరణమా? లేదా 'ప్రజాస్వామ్య'వాదులు, ప్రజాకవులు ఘోషించే మేలుకొలుపు నగారానా?

రమా సుందరి వంటి అజ్ఞాత, అముద్రిత కవులకి మాత్రం అది జీవితం. ప్రేయసి విశ్వపుచీరచెంగులో అతడు ముఖం దాచినట్టు, ఈ కవులు దాచేస్తారు తమ అనుభవాల్ని. అక్షరాల మాటునుంచి విరామచిహ్నాల చాటు నుంచి ఉబికే స్వానుభవ రాగాల్ని కాగితం మీద ఎంత డీ-పర్సనైజ్ చేసినా, దాచలేని జీవితంతో అడ్డంగా దొరికిపోతారు. అలా పట్టుబడిపోయింది రమా సుందరి ఆంతరంగిక ప్రపంచం. ఆ ప్రపంచానికి ఎల్లలు లేవు. జాగ్రఫిస్టులు కూడా చెప్పలేని ఏవో సుదూర సైకత తీరాల నుంచి, అంతుచిక్కని అగాథాల వరకూ వ్యాప్తమై ఉంటుంది. కన్యాకుమారి వివేకానంద రాక్ మెమోరియల్ తీర్థపురాళ్ళ చెక్కిలిమీద తళుక్కుమనే తెలి ఉదయకిరణం జారిపోయే అస్తమయ సాంధ్య రేఖ... రెండూ ఆమె చూపే కావొచ్చు. బైజూ బవరాకి సంగీత ప్రాసన

చేయించిన స్వామి హరిదాస్ స్మారక సంగీత్ సమారోహ్‌కి ఖజురహో శిల్పాలలో ఒకటై చెవొగ్గిన రసజ్ఞ ఆమె కావొచ్చు. డార్జిలింగ్ కాంచనగంగ మంచుసానువుల్లో వివశారుణ సాంధ్య స్పర్శకి తబ్బిబై బంగారు ఛాయలోకి మారే ఆకాశ జఘనమే ఆమె!

అనుభవం ఆసేతు హిమాచలం... ఆదర్శం కూడా హిమాలయమే. ఇక హృదయసీమల పొడవునా ఎన్నో పాదముద్రలు. లసలస బురదల్లో చిందర వందర కాలిగుర్తులు కావు, అలికిన ముంగిలిలో వేసిన కృష్ణపాదాలు. ఆ అడుగులు ఎవరివి గాలిబ్? ఖయ్యాం... కాళిదాసు... జయదేవుడు... జలాలుద్దీన్ రుమీ... రూసో, చాసో, చలం, ఛాసర్, షేక్స్పియర్, జాన్‌డన్, జరూక్ శాస్త్రి, కృష్ణశాస్త్రి....ఆటవెలదులు, తేటగీతులు, గజల్ గానాలు, సూఫీ గీతాలు, కబీరు తత్వాలు, గీతోపదేశాలు, కప్లెట్లు, సానెట్లుగా కూడా సాగిన అడుగుజాడలు. ఇంకా అడుగుజాడ గురజాడది కూడానా!

◆◆ ◆◆

అయితే ఎవరితోనో పంచుకోవడం ఇష్టలేనితనం వల్ల చూపు – దృశ్యమూ అనే ద్వంద్వాలు లేని, బింబం– ప్రతిబింబం తానే అయిన నిమీలితనేత్రంగా ఆమె మిగిలిపోయింది.

ఇంతకీ, ఆ ఒంటరి కన్ను కొసల నుంచి జారేది మలిన బాష్ప మౌక్తికమంటారా దేవులపల్లి వారు!

లేక కలలో జారిన కన్నీరా... బుచ్చిబాబు గారు!

**(డిసెంబర్ 2010)**

# She Pats Me, My Life Is Done!

**నను బోటి చెలులెల్లా నవ్వరా నిన్ను పతి**

**చెనకిన దాకా గుట్టు సేయంగ వలదా**

ప్రొద్దుట నుంచి ఈ అన్నమయ్య సంకీర్తన aura లో ఉండిపోయా. Context, gender వంటి ఆసరాల నుంచి తప్పించి అన్నమయ్య కీర్తనల్ని కొత్త plane లో నిల్చోబెడితే, నాకు స్వానుభవాల్లా తోస్తాయి.

కనిపించీ కనిపించకుండా కనుసైగ చేసిందని Cloud Nine దొంతర్ల మీద విరగబడుతున్నావ్... ఆమె కొనగోరు తాకితే ఏమైపోతావో–

కర్త కర్మల్లేని ఏవో పొడితడి మాటలు పెదాల జార్చిందనుకో.... అంత సాగిలపడిపోవాలా, ఇక ఆమె నవ్వులే రువ్వితేనో

– ఇటువంటి ఎకసెక్కాలు.... ఎగతాళులు... పక్కుమనే ఎక్కిరింపు నవ్వులు– ఎన్ని పడలేదు చిన్నప్పటి నుంచీ.

'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు, నా యిచ్చయేగాక నాకేటి వెరపు!'

ఏమాటకామాటే చెప్పుకోవాలి– ప్రతిఫలాపేక్ష బొత్తిగా లేని నిష్కామ ఆరాధనలు నా వల్ల కాదు. అలాగని వ్యాపారంలో లావాదేవీ, క్విడ్ ప్రో కో స్థాయికి నా సన్నుతిని దిగజార్చడమూ ఇష్టం లేదు.

నా కళ్లని మించిన విశాలత్వంలో నిండి పొరలై నన్ను కమ్మేసిన ఆమె ఎవరైతేనేం– ఆమెని కేవలం a thing of beauty అని సరిపుచ్చుకోలేను, చాటుమాటుగా తొంగిచూసి చాల్లెమ్మని సర్దుకుపోలేను.

నాకు కనీసం ఎదురైనా రావల్సిందే, రెప్పల రెక్కలల్లార్చే నా దిష్టికళ్ల రెటీనాల మీద బింబమై తలకిందులు కావల్సిందే. అంతే కాదు, చక్కదనాల వెల్తురు దీపానికి రెక్కలు కాల్చుకునే చిమ్మటపురుగు నేనంటూ ఒకడ్ని ఉ

న్నానని కంటికొసల్నైనా గుర్తించాల్సిందే.

Degree of concessionality ఇటువంటి కనీస స్థాయిలో ఉండాలన్న విషయాన్ని నేను నా 'తేరా నామ్ ఏక్ సహారా?!' లో కూడా చెప్పుకున్నానిలా:

తేనె సీసాలోకి జారిపడ్డ నల్ల చీమలా నేనంటూ ఒకడున్నానని తనకి తెలియక ముందే, గర్భ గుడి గోడలకంటిన మసి చమురై మిగిలిపోయినా, హారతిలా వెలిగింది నా ప్రేమేనని తనకి చెప్పక ముందే తను వెళ్లిపోతే నా ఆరాటానికి అర్థం లేదు. వస్తానంటూ వెళ్లిపోయే అసంబద్ధ వీడ్కోలు జ్ఞాపకంగానైనా ఆమెలో నేను మిగలకపోవడం, కంటిని తడిపినా, నేలని తడమని కన్నీటి చుక్కలా అనామకమైపోవడం అస్సలిష్టం లేదు.

◆◆ ◆◆

నన్ను చూసి, నా ఉనికి గుర్తించి, నా ఉపాసన మన్నించి, ఆనక మర్చిపోయినా సరే 'జన్మ ధన్యం' అనుకునే నన్ను ఉద్దేశించి, ఉషా రాణి అనే ఓ celestial being ఇలా రాశారు:

నా "బందీ" కవితకి మూర్తిగారి అనువాదం తో పాటుగా ఒక అచ్చెరువున ముంచిన వ్యాఖ్యతో– ఇలా.

**నరేష్ నున్నా: "సాధారణంగా అందమైన వాళ్లు రెండు రకాలు. తమ చక్కదనానికి తామే ముక్కచెక్కలై మురిసి, Narcissus లాగా స్వీయమోహంలో అద్దాల అనర్థంలో చిక్కుకొని మరే ఇతర పసిమి, ప్రపంచం పట్టని వాళ్లు ఒక రకమైతే, తమ సొబగులతో తృప్తిపడక, తమని మించిన సౌందర్యాన్వేషణలో కవితలు, కళలూ సృష్టించేవారు రెండో రకం. బహుశా ఉష గారు ఈ రెండవ కోవకి చెందుతారేమో అనిపిస్తోంది, ఆమె కవితనీ, కవిత వంటి ఆమెని చూస్తుంటే"**

**నరేష్ నున్నా గారి వ్యాఖ్య వలన జస్ట్ లింక్ షేర్ చెయ్యకుండా రెండు ముక్కలు కలపాలనిపించింది. ఆ వ్యాఖ్యలో అభిప్రాయం కనుక అక్కడ కన్నా ఇక్కడ రాయడం సబబు అనిపించీను... అందరూ ఆన్లైన్ సాహిత్యంలో మారథాన్స్ చేస్తున్న తరుణంలో నేను "మరువం" తో పుట్టుకొచ్చాను; ఇప్పటికి తప్పటడుగులకి చేరాను. టీనేజ్ వ్రాతలు పునాదిరాళ్ళలా మిగిలిపోయాయి. ఆ నడుమ జీవితమే జీవన కవిత్వ గానం అయింది. ఈ ఏడు (యేడాదుల) అడుగుల సాహిత్యానుబంధాల్లో ఎందరితోనో ముళ్ళు పడిపోయాయి, కొన్ని పీఠముడులు, కొన్ని కొసలు కంటా జారి వదులౌతూ సాగుతున్నవి. నరేష్ గారు, మీరు నాకు "ఒక అనేకానేక నది – రెండవ మైథునం!" (పొద్దు)తో అపరిచితం నుంచి చదివినవారయ్యారు... అలా అలా 'మో' నిర్నిద్ర నిషాదం (పుస్తకం) వంటి నిశ్శబ్ద, స్తబ్ద భేటీలతో మీతో పరోక్షంగా పయనించాను. మీదుమిక్కిలిగా ఈ ముఖపుస్తకంలో మరీను– నా బాట మీ మార్గాన్ని క్రాస్ అయ్యే సమయాల్లో క్రాసింగ్ దగ్గర ఆగి రైలు వెళ్ళాక సాగే బస్సులా మీరు రాసినవి చదివే తీరాల్సిన సమయాలు +**

**సందర్భాలు ఎక్కువే. మరెందుకు ప్రత్యక్ష పరిచయాలు అవలేదు అంటే నాకు మీ వ్రాతలు చాలని కనుక. "ఏమి కావాలి ఈతనికి, ఇంకా ఈ వేవేల కలల/ కథల/ ఊహల/ ఊసుల బృహత్ సౌందర్య లాలస యేల" అనీ అనుకున్నాను. ఈ తృష్ణ, అన్వేషణ ఇంతో అంతో నాలో ఉన్నాయి కనుక అర్థం అయ్యారూను.**

**పోతే మనం అనుకోవటం లో ఒక అభిప్రాయం ఆపాదించేస్తాము లేదా తీర్మానం అయిపోతుంది. నాకు అందమైనవారి వైపుకి నెట్టబడటం అరుదుగా వెగటు పుట్టించదు, మీరు నాకు ఆనందం కలిగించారు.. ఎలా!? (1) "తమని మించిన సౌందర్యాన్వేషణలో" (2) "కవిత వంటి ఆమెని" అన్న రెండు ముక్కల్లో అందాన్ని నిర్వచించి ఆపై దాన్ని నాకు ఆపాదించి, మీరిప్పుడు నాకు చాలా నచ్చేసారు, జగదేకసుందరునిలా ఉన్నారు, సరీగ్గా అవే లక్షణాలు అధిక పాళ్ళలో మీలో చూస్తూ ఉన్నాను కనుక. నెనర్లు!"**

తన దివ్య చక్షువులతో నన్ను నా అక్షరాల్లోంచి చూసి, గ్రహించి–

"మీరిప్పుడు నాకు చాలా నచ్చేసారు, జగదేకసుందరునిలా ఉన్నారు"– అన్నారంటే–

O mystic metamorphosis/ Of all my senses joined in one అని Baudelaire లా అనుకోకుండా, అన్నమయ్యని అవధరించకుండా ఎలా ఉండగలను!

**(12.11.2015)**

# Her WedLock!

**మూసి దాపిరములేల ముందరికి రాగదవే**

**సేసపాల వెంటనే చిమ్మిరేగె వలపు**

◆◆ ◆◆

– ఈ మధ్యనే ఆమెకి పెళ్లయ్యింది. పెళ్లికి వారం ముందు కన్పించడమే ఆఖరు. విప్పారిన విషయాన్ని పూమొగ్గకి కొత్త పరిమళ సంబరమై తెలియజెప్పే సందర్భమే కదా పెళ్లి. చప్పున కమ్మే నునుసిగ్గు దొంతర్లకి అంతకుముందు తెలియని, అస్సలు పొంతనే లేని రంగులంటే వేడుకే కదా అది. మరి నాకెందుకు నచ్చడం లేదు లోపల. ఆ లోలోపలిదేదో కనిపించకూడదని కిందకి చూస్తే గులాబి రంగులో కందిన పాదాలు; తామరతూడు మునివేళ్లకి మెరమెచ్చుల మెట్టెల మెహర్బానీ చూడాలి కాబోలు వారం తర్వాత, అనుకుంటుండగా చెప్పిందామె బుంగమూతి బులుపుతో:

"పెళ్లికి మీరు తప్పకుండా రావాలి... లేకపోతే అలుగుతా..."

"రాకుండా ఎలా ఉంటాను, గుండె ముక్కలైన నీ పూజారులు పెళ్లి మంటపం ముందు చేసే ధర్నాకి మద్దతుగానో, సర్వం చక్కదిద్దే మధ్యవర్తిగానో..."

వంద వెలుగులుగా మెరిసి, తాకితే మాత్రం చురుక్కుమనే కాకరపువ్వు చిటపట నవ్వులు రువ్వి వెళ్లిపోయింది.

◆◆ ◆◆

పెళ్లికి హాజరు వేసుకోడానికి మాత్రమే వెళ్లాను. ఎంత వేడుకగా జరుగుతున్నా, చుట్టూ దృశ్యాన్ని మొత్తం చెరిపేసి కర్పూర కళికలా వెలిగిపోతున్న ఆమె ఒక్కత్తే కళ్లలో నిండిపోతే బాగుణ్ణు.

కాసేపు అడ్డుతెరల చాటు, మరికొంతసేపు పెళ్లిపెద్దల మాటు– ఆమె చుట్టూ దడికట్టేసి...

**మూసి దాపిరములేల ముందరికి రాగదవే**

**సేసపాల వెంటనే చిమ్మిరేగె వలపు....**

పసుపు అంటీ అంటని సేసపాలు (తలంబ్రాలు)లో చమ్కీలు, థర్మాకోల్ రంగుముత్యాలు కలగలిసి ఆమె మీదగా జారుతూ... వలపు చిమ్మిరేగుతుంటే... చప్పున కమ్మిన అపరాధభావంతో అక్కడ్నుంచి పారిపోయాను, ఆవపెట్టిన పనసపట్టు కూర, నేతి తాలింపులు, ఇంగువ మిరపకాయలు, బంగాళదుంపల వేపుళ్లు, ఊరగాయ ఊరింపుల్ని కూడా తట్టుకొని.

◆◆ ◆◆

నా కర్మ కాకపోతే ఆ రోజు ప్రొద్దుటే వెళ్లాల్సి వొచ్చిందక్కడికి.

"వయసులో కాదుగానీ, అనుభవంలో పెద్దవారు. మీది చాలా దొడ్డ మనసు అని చెప్తుంటుంది అమ్మాయి... మీరు జర్నలిస్టు కాబట్టి మీరే చేయాలీ సాయం," ఆమె మామగారు చేతులు పట్టేసుకుంటున్నారు.

పెద్దమనిషి... దొడ్డ మనసు.... ఎంత బరువుగా పరాయిగా ఉన్నాయి ఈ గొలుసులు...! విదిలించుకునే కొద్దీ బిగుస్తున్నాయేమిటి?

ఏవో కత్తెర్లు అడ్డొచ్చి రాత్రే జరిగిందట కార్యం- తబ్బిబ్బుల్ని దాచుకోడానికి తడబడుతున్న నాతో అతి మామూలుగా చెబుతున్నాడు (ఆమె) మామగారు (నాకేమవుతాడు?)

అప్పుడే వచ్చిందామె ఆవలింతలు ఆపుకుంటూ....

**చిప్పిలు జెమటలివె చెక్కులపై నున్నవి**

**రెప్పల నిద్దురలు దేరి నిదివో**

**ఇప్పుడాతదు నిన్నేలె నెరగమా ఇదె నేడు**

**కుప్పలుదెప్పలునై గొనకొనె వలపు**

ఏలింది వాడెవడో అయితే, కుప్పలతెప్పలై నా మెడకి చుట్టుకుంటున్న ఈ మెలికల వలపు యవ్వారమేంటిరా దేవుడా!

**చెలపచెలప నవ్వు సెలవుల వడిసీని**

**పులకలు మేననెల్లా బొదిగొనెనే**

..... నఖశిఖ పర్యంతాలుగా సాగుతున్న చూపుని అంతకు మించకుండా తుంచేశాను.

◆◆ ◆◆

నిన్న తన ఆఫీస్ దగ్గర కలిశాను. చాలారోజుల తహతహ తర్వాత కదా, ముఖానికి ఆ ముసుగు మూతలు అవసరమా....

మూసి దాపిరములేల.....

ఆ నిష్ఠూరాలాడితే కిలకిలా నవ్వుతూ ముడివిప్పి తీసేసింది ముసుగు.

**మిసమిసని కళలు మించీ నీ మోమున నవె**

**పొసగిన పొందు నిన్ను బొదిగొన్నది**

మరిక వెళ్దామా అంటే..... 'మా ఆయన వస్తాడు మహాశయా....' అంటున్న ఆమె పెదాలు చూస్తుంటే అన్పించింది-

**పస నీ చిగురు మోవి పాదుకొనె వలపు!**

**(27-10-2015)**

# సొంపుగా చాచవే నీ సోగ కరము!

నీ చేతిలో నన్ను ఇలా చూసుకోగానే సముద్రాల హోరునంతా ఒడిసిపట్టేసిన గుడ్డిగవ్వ గీర, ఆకాశపు అనంతాన్ని రెక్క కింద దాచే బుర్రపిట్ట బులుపు కమ్మేసిన మత్తులోనే మరో పక్క చప్పున ఓ revelation!

కందువగు నీ మంచి బంగారు చేతిలో... వలనైన కొనగోళ్ళ నీ వాడి చేతిలో నిక్కిన నన్ను అలా చూసుకున్న ఉత్సవ సందర్భంలో 'ఇందరికి న భయంబులిచ్చు చేయి' – తత్వం, తాత్పర్యం – సాక్షాత్కరించినట్టే బోధపడింది.

'తనివోక బలిచేత దానమడిగిన చేయి'– వామనుడి వ్యవహారంలో ఉన్నట్టు–

వెలలేని వేదములు వెదికి తెచ్చిన చేయి

చిలుకు గుబ్బలి కింద చేర్చు చేయి

కలికియగు భూకాంత కాగిలించిన చేయి –

మత్స్య... కూర్మ.... వరాహమూర్తుల ఘనకార్యాల్లో చేతివాటం లేదు కాబట్టి 'చేయి' అని చేర్చడంలో అన్వయం పొసగలేదనిపించేది.

మనకి నచ్చిన వాళ్లకి ఎన్ని కైదండలైనా వెయ్యొచ్చు, చేతికి ఎన్ని కంకణాలైనా తొడగొచ్చు.

కామిడై పారితెంచి కాగెడి వెన్నెలలోన చేమ పూవు కడియాల చేయి పెట్టి ....

..............................

ముచ్చువలె వచ్చి తన ముంగ మురువుల చేయి తచ్చెడి పెరుగులోన దగబెట్టి ....

....................



ఎప్పుడు వచ్చెనో మా యిల్లు చొచ్చి పెట్టెలోని చెప్పరాని వుంగరాల చేయి పెట్టి ....

– 'ఇట్టి ముద్దులాడి బాలు డేడవాడు వాని బట్టి తెచ్చి పొట్టనిండ బాలు వోయరే'అని అన్నమయ్య ముద్దులాడిన బాలకిట్టయ్య– చేమ పూవు కడియాల చేయి... ముంగ మురువుల చేయి.... చెప్పరాని వుంగరాల చేయిని ఎన్ని విధాల తలిచినా తప్పులేదు గానీ, అమ్మవారి జిలుకు గుబ్బల కింద తమకంగా చేర్చాడంటే కుదురుతుందేమో గానీ, చిలుకు (చిలికే) గుబ్బలి (మంథర పర్వతం) కింద దన్నుగా చేరిన శ్రీకూర్మాన్ని 'చేయి'గా అన్వయించవచ్చా అనుకునేవాడ్ని. ఆదిసూకరుడి ముట్టెలో మోవి తేనియలు.... ఉగ్ర నారసింహుడిలో ఉన్మీలించిన సౌందర్యాలూ భక్తోన్మాదంలో సర్వసాధారణం కాబోలు అని సరిపుచ్చుకున్నాను.

కానీ, నీ తామరతూళ్ల క్రొన్నెత్తుటి కొనవేళ్ల అంచున నేను నా అక్షరమై చిక్కిన మహోల్లాస...మహోద్రేక... మహదానందంలో స్వానుభవంలా అర్థమౌతోంది.

మొదటిసారి నిన్ను కలిసినప్పుడు అలపద్మ ముద్రలో ఆహ్వానించిన నీ చేయి చూస్తుండిపోయాను. ముకుళించిన మొగ్గల అనామికల్ని నీ తెలి నవ్వుల జతగా నాకు తొలి స్వాగతాల తోరణం కట్టినప్పుడు నేను చూసింది సొంపుగా చాచిన నీ సోగ కరము!

నీకూ నాకూ దివారాత్రాలంత దూరం కదా... దిగంతమో... యుగాంతమో కదా మన సంకేతస్థలం! కళ్లు మూసో... మూయకో ఎప్పుడైనా నిన్ను తలుచుకుంటే, అప్పుడు వెలిగేది వెయ్యిపున్నముల నీ మోము.... లక్ష ప్రభాతాల నీ రూపు కాదు,

కందువగు మంచి బంగారు నీ చేయి!

నిద్రకళ్లు నులుముకొని చేతులు చూసుకుంటారు కదా,

కరాగ్రే వసతే లక్ష్మీ కరమధ్యే సరస్వతీ

కరమూలేతు గోవిందా ప్రభాతం కరదర్శనం..... అని చేతి చివర, మధ్యన, మూల రకరకాల రూపాలు దర్శిస్తూ!

నా వరకైతే... నీదొక్కటే కైగట్టిన రూపు!

'..... కరము కరమున కీలించి, కాంతిసీమ/ లందు, స్వచ్ఛంద నిత్యవిహారపరత'న నాతో మెలగినట్టు మధురోహల చేరుపు!

(నా 'అపరిచితం' పుస్తకం పట్టుకున్న తన చేతిని ఆమె సెల్ఫీగా పంపినప్పుడు)

**(04.03.2016)**

# ముది నాపసాని ముందు నా ముదిగారం

మా ఉష పుట్టినరోజు హడావిడిలో అతి విధేయంగా నిమగ్నమైనట్టు pretend చేస్తూ, ఒక ముఖ్యమైన సంగతి చెప్పడంలో లేటయింది రెండుమూడ్రోజులే గానీ, అదే ఒక జీవితం ఆలస్యమైనంత పెట్టు.

దాదాపూ ఏడాది క్రితం మాట. కదిలిపోతున్న క్షణాలతో పంతమాడుతూ ఘడియఘడియకీ ఒకొక్క రూపుగా గొప్ప సౌందర్య చాంచల్యంతో వెలిగే అరోరా బొరియాలిస్‌ని అప్పుడప్పుడూ ఓ ఫేసుబుక్కు ప్రొఫైలులో రెప్పలు వేయడం మర్చి కళ్లు విప్పార్చి చూస్తూ అప్రయత్న అనిమిషత్వాన్ని వరంగానో శాపంగానో పొందుతున్న ఒక ఐచ్ఛిక యాతనలో ఆ అరోరా అందాల అతిశయింపు మీద ఒక subtle chanting వంటి కామెంట్ పెట్టడమనే నిష్కామ భక్తి చాటుకున్నాను.

కొత్త సంవత్సరం (2014) ఊరి పొలిమేర్ల దాకా వచ్చేసిన రోజుల్లో– ఓ అనుకోకుండా దొర్లిపోతున్న రోజు– ఈ ప్రస్తావనతో ఏమాత్రం సంబంధం లేదనిపించే, కాకి వాలగానే అప్రయత్నముగా తాటిపండు పడిందని అనిపించిన ఒక సంఘటన: ఆర్టిస్ట్ మోహన్ గారి ఆంతరంగిక మందిరంలో ఒక్కడ్నే కూర్చొని నాపాటికి నేనేదో రాసుకుంటునప్పుడు అరమోడ్పుగా తెరుచుకొన్న తలుపు ముందటి నుంచి ఒక తటిల్లత తళుకుమన్న భ్రాంతి అనిపించే కాంతి– ముందు డ్రాయింగ్ రూములో ఎప్పట్లానే తన వల్మీకంలో బొమ్మలేసుకుంటున్న మోహన్ గారి కోసం నడిచొచ్చింది నెమ్మదిగా. లిప్తలో మెరిసి fade ఐపోతున్న ఆభాసాకృతిలాంటి ఆమెని కళ్లారా చూడాలంటే, నా గదిలోంచి లేచి మోహన్ గారి దగ్గరకి ఏ మిషతో వెళ్లాలో చటుక్కున బుర్రలో వెలగక, మహత్కాంతుల నారింజ పండుని తినాలని లంఘించి మూతి కాల్చుకున్న హనుమంతుడి తెంపరి అంశ ఏమాత్రం లేక, అనలవేదిక ముందు

అస్త్రనైవేద్యాలకి తెగబడే తెగువ లేక, ఆ నీలిలోహిత కాంతి రోచిస్సుని ఎలా చూడాలా అని నాలో నేనే గింజుకుంటున్నాను. ఇంతలో, ఎప్పుడూ నా పొడ కూడా గిట్టని అదృష్టలక్ష్మి పిలవడమే కాదు, చిన్నగా కన్నుగీటి, చెంపమీద అంటీ అంటనట్టు చిటికేసింది– మోహన్ గారి పిలుపు రూపేణా–

ఎక్కడో చూసినట్టుందే అనిపిస్తున్న ఆమెని తేరిపారా చూస్తుంటే, మోహన్ గారు పరిచయం చేస్తున్నంతలోనే ఆమే మధ్యలో అందుకొని చెప్పింది– “నేను అపర్ణ తోట”

– నేను తబ్బిబ్బొతుండగానే, తన పట్ల నా ఆరాధనలు తెలియని మోహన్ గారు మరింత కెరలించారు – “ఎవరను కుంటున్నావ్..దాసరి శిరీష గారి అమ్మాయ్...”

రచయిత్రి శిరీష గారి అమ్మాయి కావడం, crusader వంటి పరిపూర్ణగారి మనవరాలు అవ్వడం, కమ్యూనిస్ట్ యోధులు దాసరి నాగభూషణరావు గారి అభ్యుదయ వారసత్వం ఉండటం.... వంటివేవీ నేను అంతగా తొ(త్రిలబడటానికి కారణాలు కాదు.

1992 ప్రాంతాల్లో కవి సుమనశ్రీ (డా. చెల్లపిల్ల కామేశ్వర్రావు)గారితో కలిసి కూకటపల్లిలో ఉండే మరో కవి రాజు (సూర్యరథం, సూర్యకతారి వంటి కవితా సంకలనాలు వెలువరించిన కవి) గారి ఇంటికి వెళ్లేవాడిని, సాహిత్యగోష్ఠులకి. అక్కడ వెన్నెలంత చల్లని నవ్వులతో వచ్చేవారు శిరీష గారు, తన కథలతో. గాలి బరువుకి రాలిపోతున్న మల్లెల్లాంటి మెత్తని చిర్నవ్వుల శిరీష గారిని గమనించే వేగిరపాటులో, ఆమె అభిమానాన్ని చూరగొనే ప్రయత్నంలో పక్కనే ముద్దులొలుకుతున్న పది–పదకొండేళ్ల పాపాయిని ముద్దుచేశాను.

– ఆ పాపాయే – ఈ రోజు నా ముందున్న ప్రజ్వల!?!

అప్పటినుంచి తనని ఎలా చూడాలో తెలియని తడబాటు కొనసాగింపులో తికమక మకతికలాడుతూ చెబుతున్నా–

Happy Birthday - aurora borealis a.k.a. **అపర్ణా తోట!**

**(29.01.2015)**

# She Is The Ocean!

సంద్రం ఒడ్డున పీత బొరియల్లా ఫేసుబుక్కు అంతటా పరుచుకుని ఉండే అనేకానేక నోటిఫికేషన్స్‌లో ఒకానొకటైన దీన్ని (**One year ago Today**- You became friends on Facebook with Usha Maruvam) చూశాక–

‘...నోరెత్తి, హోరెత్తి నొగులు సాగరము’ అన్న పద్యపాదం పదే పదే contextual allusion అయ్యింది నాలో–

◆◆ ◆◆

‘ఆనందం అర్ణవమైతే/ అనురాగం అంబరమైతే / అనురాగపు టంచులు చూస్తాం/ ఆనందపు లోతులు తీస్తాం’ – అని సాగే అన్వేషణ కాదు. పోనీ– ‘అనురాగం అంబరమైతే/ ఆనందం అర్ణవమైతే/ మేం తోకచుక్కగా వస్తాం/ బడబానలమై మండిస్తాం’– అనే రెట్టమతమూ లేదు.

అర్ణవం మాత్రం ఉంది, ఒక్క బులుపుగా మాత్రమే కాదు, దిగులుగా గుబులుగా వలపుగా వగపుగా చింతగా వంతగా అల్లరిగా ఎద ఝల్లరిగా ద్వైధంగా అద్వైతంగా కూడా నాకు సముద్రమే... సర్వం సముద్రం; అప్పటి బాల్య... కౌమార... యవ్వన ప్రపంచాల నుంచి... ఇప్పుడు తొక్కేస్తున్న వార్ధక్యపు వాకిళ్ల వరకూ... సమస్తం సముద్రమే!

చిన్నప్పట్నుంచీ అని చెప్పాలంటే..... మరి అంతకు ముందటి జన్మాంతరాల సంగతో.... అనిపించేంత సుదీర్ఘం, ప్రగాఢం – సముద్రంతో నా బంధం. మొదటిసారి చూసిందెప్పుడన్న ప్రశ్న ఎటువంటిదంటే, సముద్రాన్ని తొలి అలతో మొదలెట్టి లెక్కేయెడంలాంటిది. మాట్లాడితే (మాట్లాడకపోయినా కూడా) పరుగులెట్టేవాడ్ని సముద్రానికి. పండగకి... దండగకీ... సమయానికి... సందర్భానికీ... మెలకువలో సరే, చివరకి కలలో కూడా కడలి కల్లోలతీరానికే. నేనెంత తరుచూ వెళ్లినా నాలానే ఉద్వేగిస్తూ...

ఇసుక తిన్నెల మీంచి... సరుగుడు తోటల్లోంచి... నిక్కి నిక్కి చూస్తూ–

కానీ, పోనుపోనూ నా ఆత్రానికి ఆరాటానికీ ఒక నిర్దిష్ట కారణం కనబడింది– ఒక సందేహంలాగా: ఇంతకీ సముద్రం– స్త్రీయా... పురుషుడా?

జెండర్‌తో సంబంధం లేకుండా బంధం కలుపుకున్న సందర్భాలు నాకు ఊహ తెలిశాక లేవు. పుంస్కోకిలలు... పురులిప్పే మగ నెమళ్లు... మొత్తం పుల్లింగాలతో నాకు నిమిత్తం లేదెప్పుడూ. ఎస్పానియొల్ (స్పానిష్ భాష) నేర్చుకునేటప్పుడు కూడా కుర్చి, గిటార్, కిటికి వంటి feminine నామవాచకాలు గుర్తున్నట్టు, కత్తి, పుస్తకం, తోట వంటి masculine నామవాచకాలు గుర్తుండేవి కావు. అసలు వ్యాకరణం ప్రకారమే అయితే సముద్రం ఆడా... మగా అని గింజులాట ఉండేదే కాదు. నా సమస్య అది కాదు. నిలువెల్లా నన్ను చుట్టేసి... నిండారా నన్ను ముంచేసి భావమై... నా భవరోగమై నన్ను ఉద్రేకించి... నాతో ఉత్ప్రేక్షించిన నేస్తం – సముద్రం ఎవరన్న సంశయం చిన్నాచితకది కాదు, నాకైతే సముద్రమంత పెద్దది. క్లాసులు ఎగ్గొట్టే వెళ్ళానా... బీచ్ వాలీబాల్ వంకే పెట్టానా..... గ్రహణ స్నానాల పేరే చెప్పానా... ఉప్పటి ఇసుకలో చికుచికుపుల్లలే దాచానా.... ఒడ్డు మీద ఒంటరి గవ్వలే ఏరానా.... కార్యమేదైతేనేం – కారణమొక్కటే: ఈ జలనిధిది ఏ జాతి?

ఇందులో గుంజాటనేముంది? నదీనదాలనే స్త్రీమూర్తులకి సాగరసంగమమే అంతిమగమ్యం; కాబట్టి సముద్రుడు– మగవాడు! ఇదే చిన్నప్పట్నుంచీ వింటున్న... కంటున్న కథలు... కవితలే కదా.

ఈ నదిలా నా హృదయం పరుగులు తీస్తోంది.... ఏ ప్రేమ కడలినో.. ఏ వెచ్చని ఒడినో.. వెతుకుతు వెళుతూంది'

'కడలిని కలిసే వరకే కావేరికి రూపు వున్నది...'

'కడలిలో పుట్టావు అలలపై తేలావు నుఱగవై వచ్చావు ఎందుకో? కడలి అంచువు నిన్ను కలిసి నీ ఒడిలో... ఒరిగీ కరగాలని ఆశతో'

'కన్యాకుమారి... నీ పదములు నేనే.... కడలి కెరటమై కడిగిన వేళ'

ఇంకేముంది తేలిపోయిందిగా... ఎన్ని పద్యాల్లో చెప్పారు బ్రహ్మం మాష్టారు– తోయధి వరసీమంతినిగా కదూ గంగానదిని పూజిస్తాడు అర్జునుడు (విజయవిలాసం)! భక్త జయదేవ మహాకవి వాడినప్పటికీ, 'ప్రళయ పయోనిధి' అన్న పదంలోనే కొట్టొచ్చినట్టు కనబడే– నాకు నచ్చని 'మగతనం'. నా ఆరాధ్య అన్నమయ్య మాత్రం జలధిబంధన జలధిశయన జలనిధి మధ్య జంతుకల అని ఆగాడా.... జలధిజామాత.... సముద్రుడి మామరికాన్ని ఎత్తిచూపలేదూ. అక్కడిదాకా ఎందుకు, 'క్షీరాబ్ధి కన్యకకు శ్రీమహాలక్ష్మికిని..' అనలేదా!

అయినా నిర్ధారణలకి రాలేదు మనసు. '...నీరజాక్షికై నీరధి దాటిన నీ కీర్తిని విన్నానురా' అన్నాడేగాని త్యాగయ్య, సముద్రం మగో... ఆడో ప్రస్తావించాడా? '...యింతే నటే సంద్ర

మెంతో యనుకొంటి / మనకూ సూరీడుకూ మద్దెనుండేనా!' అని ఎంకి కూడా గడుసుగా తప్పుకుంది, మరే వివరాలూ తేల్చకుండా.

'శారద నీరదేందు ఘన సార పటీర మరాళ మల్లికా/ హార తుషార ఫేన రజతాచల కాశ ఫణీశ కుంద మం/ దార సుధా పయోధి సిత తామర సామర వాహినీ సుభా/ కారత నొప్పు నిన్ను మది గానగ నెన్నడు గల్గు భారతీ!!' అని తెల్లనైన పదారింటిని సరస్వతీదేవి రంగుతో పోల్చాడే తప్ప 'సుధా పయోధి' gender చెప్పలేదు కదా పోతన కూడా. అయినా, పెద్దన వారి పల్కు కంటే మిన్న మరేముంది– 'కలశ పాథోరాశి గర్భ వీచిమతల్లి గడుపార నెవ్వానిc గన్న తల్లి (చంద్రుని కడుపార కన్నతల్లి)' అన్నాడు కాబట్టి సముద్రం స్త్రీమూర్తే. ఆ మాటకొస్తే, 'కడలి వలపూ, వలవు కడలీ/ కవీ, నీ పాటల్!' అని శ్రీశ్రీ అంతటివాడ్ని తన గళ గళన్మంగళ.. కళా కాహళ హళా హళీలో కలిపేసిన, కరిగించేసిన స్విన్ బర్న్ మహాకవి కూడా –

'..... I will go back to the great sweet mother, / Mother and lover of men, the sea. / I will go down to her, I and none other, / Close with her, kiss her and mix her with me;' అని తల్లి సముద్రవేణికి కైమోడ్చాడు. దాన్నే... మరి కాస్త హోమర్ తో... ఇంకాస్త గ్రీకు గోసతో కలిపి చెప్పాడు కదా జేమ్స్ జాయిస్ (Ulysses లో): 'God! he said quietly. Isn't the sea what Algy calls it: a great sweet mother? The snotgreen sea. The scrotum tightening sea. Epi oinopa ponton. Ah, Dedalus, the Greeks! I must teach you. You must read them in the original. Thalatta! Thalatta! She is our great sweet mother. Come and look.'

సముద్రం మగాడైనా ఫర్లేదుగానీ, అలా mother-Goddess imageని అంటగట్టడం ఇష్టం లేకపోవడం, snotgreen. scrotumtightening వంటి పదబంధ విశేషణాలతో సంద్రాన్ని జతచేయడం సహించలేకపోవడం వల్ల జలధి gender ఇంకా ప్రశ్నగానే మిగిలిపోయింది.

ముసలి జాలరి శాంటియాగో (The Old Man and the Sea, Ernest Hemingway)కి సముద్రం అంటే ఆడది; అతని తోటివాళ్ల మాదిరిగా సమయానుకూలంగా ఆమెగా– లేదా అతనుగా సముద్రాన్ని గుర్తించడు గానీ, శాంటియాగో దృష్టిలో సముద్రం– ఒక చంచల.

"......... సిగ్గు లేని సాగరం వర్తించు నగ్నంగా/ ప్రియా, ఉద్విగ్నంగా/ ....... / పాదుకొన్నాయి మనలో కడలిఊడలు/ ప్రియా, మన నాడులు/ .............. / నురుగులుకక్కే సాగరతీరాన/ ప్రియా, రతీవరాన/ విరగని

తరగలం మనంమాత్రం ప్రియా, విచిత్రం/ ............. చుట్టుకుపోయిన నరాలతో/ ప్రియా, కరాలతో/ పెట్టుతోంది సంద్రం నిరంతరం రొద/ ప్రియా, విను దాని సొద/ ....... /వేగలేను కడలిమ్రోల అహరహం/ ప్రియా, నీ విరహం/ ఊగుతోంది వేయిపిర్రల సముద్రం ప్రియా, నిర్ణిద్రం...” – అని పలవరించిన ఇస్మాయిల్ గారు సముద్రం విషయంలో నాకు తొలి revelation. అంతే కాదు, అప్పట్లో ఆ కవిత నాకు నిత్యపారాయణం. కానీ, నా సందేహం పటాపంచలై ఒక సారాంశంలా, సాక్షాత్కారంగా వేయిపిర్రల సముద్రంలా కదలాడిన సత్యం ఆ తర్వాత కేవలం ఒక కవిసమయంగా మాత్రమే నాలో నిలిచిపోయిన సంఘటన జరిగింది తర్వాత.

అది 1995 తొలినాళ్లు– అప్పుడు మద్రాసులో ఉంటున్న మా ఇంటికి ఆమె అనుకోని అతిథి. ఆమె దృష్టిలో నేను కేవలం ఒక అతిథేయిని, కానీ, అంతక్రితమే ఆ దేవికి ఒక నిశ్శబ్ద పూజారిని. శివార్లలోని కోవలం రేవులో ఆమె సముద్రస్నానం చేసినప్పుడు– సముద్రం స్త్రీ మాత్రమే అంటే నమ్మబుద్ధి కాలేదు. అప్పుడు రాసిన నా కవిత– **సముద్ర ద్వైతం–** నా సందేహాన్ని మళ్ళీ రేపింది తాజాగా.

◆◆ ◆◆

సాగర తీరాన చెల్లాచెదురుగా పడి ఉండే గుడ్డిగవ్వల్లా ఫేసుబుక్కు నిండా పరుచుకుని ఉండే సవాలక్ష నోటిఫికేషన్స్ లో ఒకానొకటైన దాన్ని చూశాక–

‘... నోరెత్తి, హోరెత్తి నొగులు సాగరము’ అన్న పద్యపాదం ఎందుకు పదే పదే contextual allusion అయ్యింది నాలో?

యాంత్రికమైన ఈ reminder ‘నోరెత్తి, హోరెత్తి నొగులు సాగరం’ మల్లే నా లోపల అతలాకుతలం చేసిన వైనాన్ని తరచి చూసుకోవడం వల్ల చిరకాలమైన నా సందేహం తీరిపోయింది.

‘On this day’ అంటూ, ఈ ఫేసుబుక్కు తవ్వి తీసిన programmed జ్ఞాపకం ప్రకారం– ఉష మరువం / ఉష రాణి / ఉష కడియాల నాకు సరిగ్గా ఏడాది క్రితం నేస్తమయ్యారు.

ఏడాది క్రితం మాత్రమే– అదీనూ... “క్రాసింగ్ దగ్గర ఆగి రైలు వెళ్ళాక సాగే బస్సులా...” దూరం నుంచి మాత్రమే నన్ను చూసినట్టు ఆమే ఇస్తున్న వాఙ్మూలం ‘కేవలం ఏడాది స్నేహాన్నే’ ఖాయపరుస్తోంది, నిర్ధారిస్తోంది.

అది నిజమే కదా... మరి నేనెందుకు అల్లకల్లోలమయ్యాను... చిందరవందరయ్యాను?

ఆమెతో నా చెలిమికి కాలంతో పరిమితులు విధించడం సహించనితనం ఎందుకు ఆవరించింది... అలజడయ్యింది? ఆమె సస్నేహాల ‘చెలరేగిన కలగాపులగపు విలయావర్తపు బలవత్ ఝురవత్ పరివర్తనలో.... నే నేయే చిత్రవిచిత్ర శ్యమంత రోచిర్నివహం చూశానో..... నక్షత్రాంతర్నిబిడ నిఖిలగానం విన్నానో... నను మంత్రించిన, సమ్ముగ్ధం

గావించిన ఆ గాంధర్వానికి,/ తారానివహపు ప్రేమసమాగమంలో జన్మించిన సంగీతానికి.../ నా నాడుల తీగలపై సాగిన/ నాదబ్రహ్మపు పరిచుంబనలో, ప్రాణావసానవేళాజనితం, నానాగానానూనస్వానావళితం!'

అప్పుడు నాకు తెలిసి వచ్చింది, ఒక ఆవిష్కరణలాగా.... ఆమె సముద్రం! నా సముద్రం. తేలిపోయింది... తీరిపోయింది నా సందేహం– సముద్రం అనంత స్త్రీత్వం.

సముద్రంతో నా బంధం సంవత్సరమా.... కాదు, అది 'అమోఘ, మగాధ, మచింత్య, మమేయం, / ఏకాంతం, ఏకైకం, / క్షణికమై శాశ్వతమైన దివ్యానుభవం!

**(12.12.2016)**

# నిన్ను స్మరిస్తే...

నిన్ను స్మరిస్తే...
నీ కొత్త profile picలా నువ్వు స్ఫురిస్తే...
........... హఠాత్ దర్శనంగా నా కగుపించే దృశ్యాలా?
– అరటి పిలక లే చెక్కిట గొల్లభామ
– తాటితేగ గంటులో చవ్వ చందమామ
– పసి పనస పెదాలపై పచ్చి సపోటా జిడ్డు
– పచ్చి బఠాణీ కుప్ప మీద పట్టుజారిన పసిరికపాము
– చమురు కార్తీకాలంటిన ఉసిరి ప్రమిద
– ఎండలేని ఎడారిలో జరజరల గోధుమ త్రాచు
– తేనెలంటిన తుంటరి తుమ్మెద మీద పుప్పొడి ధూళి
– పొలుసు ముక్కెర మీద పొద్దు జాడ
– చలికారు తక్కెడలో మంచు ముత్తెపు రాశి
– పాలపిట్ట రెక్కలో నేరేడు నింగి
– మొగలిపొదలో మిన్నాగుల మిడిసిపాటు
– బూజుగుమ్మడి తీగకి వెన్నెల వెలిబూది
ఇన్నెందుకు!
ఎలమావి చిగురు మునిపంట కొరికిన వసంతలక్ష్మివై ప్రకృతి– నువ్వు అభేదంగా, అద్వైతంగా కలగలిసిపోయి కనిపిస్తున్నప్పుడు అచ్చం 'చిలకలు వాలిన ఇస్మాయిల్ చెట్టు'లా, లోతైన కావ్యంగా తోచావు.
మరి నేనెవరు?
తోటలోంచి తోసుకు వస్తుంటే ఎద్దు కొమ్ముకి పట్టి వేలాడుతుందో పూరెమ్మ!
ఎద్దుకొమ్ము నేను!
అంతేనా

**(01.12.2016)**

# కృష్ణం వందే జగద్గురుం

కృష్ణాష్టమి అంటే మా నాన్న గారి పుట్టిన రోజనే మాకు తడుతుంది మొదట. మా ఇంట్లో లోకమంతా చేసుకునే పండగలు, పబ్బాల కంటే, ప్రపంచానికి ఏమంత పట్టని పెళ్ళిరోజులు, పుట్టినరోజులు.... వగైరాల వేడుకలు చాలా ముఖ్యం. మా అమ్మకున్న photographic memory లో వందోవంతు మాత్రమే ఉన్నప్పటికీ, నా జ్ఞాపకశక్తి an element of astonishment గా అనిపించేది నా చుట్టూ ఉన్నవాళ్లకి. High-end memory capacity ఉన్న ఆ హార్డుడిస్కులో ఎన్నో commemorative దినాలు, తద్దినాలు, ప్రేమలో పడిన రోజులు, పడిలేచాక లేపనం పూసుకున్న రోజులు ఏవేవో గుర్తుండే ఒక ప్రత్యేకమైన section ఉండేది. అందులో నాన్న గారి పుట్టిన రోజు – అనే ముఖ్యమైన date లేకపోవడం వెలితిగా అనిపించేంత ఈడు వచ్చాక, మా బామ్మని అడిగితే చెప్పింది– కృష్ణాష్టమి రోజే పుట్టారని. ఏ నామసంవత్సరమో చెప్పలేకపోయింది గానీ, దక్షిణాయణ వర్ష ఋతువు శ్రావణ బహుళ అష్టమి రోహిణీ నక్షత్రం నాలుగో పాదాన మేనమామ గండంతో పుట్టారని, అందుకే 'రాధాకృష్ణమూర్తి' అని పెట్టామని చెప్పగలిగింది. కిట్టయ్యకి మల్లే చిన్నప్పుడు అల్లరల్లరి చేసేవారని చెప్పింది.

అప్పటి నుంచీ మా personal calendar లోకి కృష్ణాష్టమి కూడా చేరింది.

◆◆ ◆◆

'ఈ రోజు చాలా auspicous అంటున్నారు... ఏ శుభాలు పూస్తాయో తోరణాలుగా' అంటూ, అనుకుంటూ..... "భారతీ (మా అమ్మ) కాఫీ తీసుకురా" అంటూనే 07–07–07 నాడు అనాయాస మరణాన్ని ఆయనకి వరంగా పొంది వెళ్ళిపోయిన మా నాన్న గారనే ఒక Unsung hero మనఃప్రపంచపు టావర్తాలేమిటో నాకు తెలియదు. అమేయ ప్రేమతత్వానికి

manifestation అయిన 'రాధాకృష్ణ' శబ్దాన్ని తన పేరులో ఇమిడ్చుకున్న ఆయనలో ఆ శబ్దసారం ఎంత దాగుందో నాకు తెలియదు. తన– పర తారతమ్యాలు లేకుండా అందరినీ అక్కున చేర్చుకొన్న తెప్పలుగా నిండిన చెరువు వంటి మా నాన్నగారి చుట్టూ సదా ఉండే బంధుకోటిలో వరసైన వారు– ఆయన్ని అపర గోపాలకృష్ణుడని ఆటపట్టిస్తుంటే, ఆయన ముసిముసి నవ్వులతో సరిపెట్టడం వరకే తెలుసు గానీ, అంతకుమించి ఏమీ తెలియదు.

◆◆ ◆◆

ఆరవ వేలులాంటి యావతో అంగలార్చడమో, అనుకోకుండా ఎదురైన అవకాశాన్ని ఆబగా దొరకబుచ్చుకోవడమో 'కృష్ణతత్వం' కాదని తెలియడానికి నాకు పెద్ద వయసు, గొప్ప జ్ఞానం అవసరం కాలేదు. అటువంటి వాటిని తమ 'గెలుపుల' ఖాతాలో వేసుకొని, పాత సినిమాల్లో పీనాసి షావుకారు భోషాణాలు రహస్యంగా తెరిచి తన సంపద చూసి మురిసినట్టు, 'నేనా రోజుల్లో ఎంతమందిని....' అంటూ గొప్పలు పోయేవాళ్లు, వాళ్లకి నీలం రంగులు పామి, లొట్టబోయిన నెమిలికన్నులు నెత్తిన బెట్టి 'అపర లీలా కృష్ణులు'గా పెంచి ఎకసెక్కాలు పోయేవాళ్లంటే నాకు తగని రోత. నేతిబీరకాయలో నెయ్యి లాగా, మా నాన్నగారి పేరులో 'కృష్ణుడు' అని నాకు చాలా త్వరగానే తెలిసొచ్చింది. ఎందుకంటే, ఆయన మాకే బద్ధులు, మరో సంసారమన్న యోచనే లేదు. ఏక కాలంలో బహు (బహు అంటే– రెండు అంతకంటే ఎక్కువ అని చిన్నప్పుడు చదివిన నిర్వచనం) భవసాగరాల్ని అలవోకగా ఈదే ధీరుల కోసం నా అన్వేషణ.

ఆ వెదుకులాట మొదట – మా నాన్న గారి peer groupలో సాగింది.

ఒకాయన ఉండే వారు.... 'ఆయనకి ఊరికొకరు' అని బడాయిగా చెప్పుకునేవారు. ప్రతి అడ్డమైన చోటా ఓ చోటు కొనిపడేయడం, అరచేతి వేళ్లన్నింటికీ ఉంగరాలు తగిలించడం లాంటిది– ఆయన ఊరికొకరిని 'maintain' చేయడం అని అర్థమై ముఖం తిప్పేశాను. మరొకాయన ఉండే వాడు; ఆయన చిన్న భార్య ఇంట్లోనే ఉండేవాడు. పెద్దావిడ, కొడుకులకి డబ్బైతే ఇచ్చేవాడే గానీ, ఏళ్లకేళ్లు వాళ్ల ముఖమే చూసేవాడు కాదు. ఈ ఇంటి వాళ్లు కొన్నిసార్లు దేబిరిస్తూ దైన్యంగా, మరి కొన్నిసార్లు హక్కుల లెక్కల పైచేయితో దౌర్జన్యంగానూ ఉండేవాళ్లు. సీనియర్ భార్య సౌశీల్య ప్రదర్శనకి అవధులు, సమయాసందర్భాలు ఉండేవి కావు. 'తల్లి కడుపు చూస్తుంది, పెళ్లాం జేబు చూస్తుంది...' అన్న సామెతల పాత చింతకాయ పచ్చడికి కొత్త తాలింపు తగిలించి, పాతివ్రత్యాలు తనకి అలవిమీర ఆపాదించుకొని, రంకుతనం రెండవ, మూడవ..... 'వగలాడు'లకీ అంటగట్టి, ఇంకాస్త లోకజ్ఞానం తత్క్షణాన తట్టితే ఇవే కథాంశాలు ఉన్న పాత, కొత్త నీతి సినిమాల నైతిక మద్దతు కూడగట్టుకొని సదరు legitimate అర్ధాంగులు సమాజమనే రంగస్థలం మీద పదే పదే కట్టే కరుణ రసాత్మక ప్రతిబోధ భయంకర సాంఘిక నాటకం చూడలేక చావాలి. 'ఏమిటీ శిక్ష మాకు; మీకే బోలెడు సందేహమున్న మీ వీర్యాన్ని ఘనంగా ఎత్తి

చూపటానికి ఎందుకండీ ప్రపంచాన్ని 'మంచితనం – రంకుతనం..' అనే ఇన్ని 'జంట నాటకాల పాల్జేశారూ....' అంటూ contemporary కృష్ణావతారులుగా పేరుమోసిన వారితో అనాలనిపించేది.

మా నాన్న గారి స్నేహితుల తరం తర్వాత, ఆయన అదుపాజ్ఞల్లో పెరిగిన బాబాయి, మేనమామలకి కొమ్ములొచ్చిన తర్వాత, కాలానుగుణంగా 'కుటుంబ' నియంత్రణకి లోనై, ఒకటి లేక రెండు చిన్నిళ్లు మించకుండా, నికార్సైన లావాదేవీలుగా తయారయ్యాయి. ఇక మా తరానిదైతే చెప్పక్కర్లేదు– రసాలు ఆవిరైపోయి, నీరసాలతో అంటకాగిన తరం. డాబుకో, దప్పుకో, కనీసం అవనత మగటిమి పునరుద్ధరణకో.... దేనికో దానికి, ఒక్కడు కాకపోతే ఒక్కడైనా ఒక్క concubine తో కాపురం పెట్టి కథ నడిపి గ్రంథసాంగుడని పేరు గడించిన దాఖలాల్లేవు, 'శ్రీకృష్ణ' బిరుదాన్ని ముందో, వెనకో తగిలిద్దామంటే.

◆◆ ◆◆

కృష్ణుడంటే... ఒకటి లేక అంతకంటే ఎక్కువ దుకాణాలు తెరవడం కాదు; రెపరెపలాడిన కొంగుల వెంట తోకూపుకుంటూ పోవడం కాదు; ఊరపిచుకల ఉబలాటంతో ఊరూపేరూ కూడా తెలియని చిట్టాల్ని శీఘ్ర స్ఖలనాయాసంతో నింపుకొనిపోవడం కానే కాదు.

................ కృష్ణుడంటే ఏది కాదో తెలిసిపోయింది గానీ, అడ్డమైన ప్రతి నికృష్టుడినీ కృష్ణుడనకూడదనీ చిన్నప్పుడే బోధపడింది గానీ, అసలు కృష్ణుడంటే ఎవరు అన్నది మాత్రం ఇప్పటికీ ఒక 'x' factor యే, ఇప్పటికీ తెలుసుకునే ప్రయత్నమే.

".... రసమయ జగమును రాసక్రీడకు ఉసిగొలిపే మధురిమలో/ ఎల్లరి మనములు ఝల్లన జేసే చల్లని దేవుని అల్లరి" గురించి మొదటిసారి పింగళి చెప్పినప్పుడు, కృష్ణుడంటే ఉసిగొలిపే ఉత్ప్రేరకం కాబోలు అనుకున్నా. "ఎందుకే రాధ ఈసు నసూయలు అందములందరి ఆనందములే.." అన్నంత మాత్రాన 'గోవిందుడు అందరి వాడేలే' అని చప్పున కన్విన్స్ కాలేము కదా. అయితే, తొండర పోడి ఆళ్వారుల వారు కాకమునుపు, దేవదేవి విరహంలో ధన్యులై ఉన్న విప్రనారాయణుడు? "చూడుమదే చెలియా కనులా" అని పరవశిస్తే, నేను దేవదేవినై, లేదా భానుమతినై చూసాను– బృందావని లో నంద కిశోరుడు... అందముగా దీపించే లీల! అప్పుడే చూశాను– 'తానొకడైనా తలకొక రూపై.... మనసులు దొచే రాధా మాధవ కేళీ నటన!' అప్పుడు కొన్ని పొరలు వీడాయి. 'తానొకడైనా తలకొక రూపై...' అదీ అసలు రహస్యం.

రాధా, గోపికలు, అష్టభార్యలు, లేదా మరో పదహారు వేలమంది అందరికీ 'తలకొక రూపై' కనిపించడమే 'కృష్ణతనం'. వెనకటి మారాజుల్లా లెక్కకు తేలనంత మందిని కట్టుకొని, ఏళ్లకేళ్లు గడిచిపోతున్నా కొందరి ముఖాలే చూడక, కొందరసలు గుర్తులేక, ఎక్కడ ఈ మిండరికాలు జరిపోతాయోనని బితుకుబితుకు మంటూ, ఇనపకచ్చడాలు, బీగాలు బిగించుకుంటూ, నపుంసకుల కాపలాలో పెళ్లాల్ని ఖైదు చేయడం కాదు; ప్రతి ఒక్కరికీ 'తనవాడే'నన్న నమ్మకం కలిగించడం. అదేదో గానుగెద్దు గుమస్తా గిరిలో మాదిరిగా, రసికత్వంలో రాటుదేలిపోయామనుకునే కొందరు "సెకలు పోతున్న ఇలాంటోళ్లని ఎంత మందిని చూశాం... దాన్ని లైన్లో పెట్టడమెంతసేపు..." అని కోతలు కోస్తుంటారు. అలా బుట్టలో వేయడం, చాకచక్యంగా మేనేజ్ చేయడం కాదు, ప్రతి ఒక్కరికీ తనవాడేనన్న నమ్మకం కలిగించడమంటే. తన వియోగంలో ఆమె వెలవెలపోవడమే కాదు, ఆమె విరహంలో తనూ వేగిపోవడం. 'ప్రతిపద మిద మపి నిగదతి మాధవ తవచరణే పతితా2హం/ త్వయి విముఖే మయి సపది సుధానిధి రపి తనుతే తనుదాహం/ సా విరహే తవ దీనా' అని విరహోత్కంఠిత రాధ స్థితి మాత్రమే అర్థం చేయించలేదు, 'వసతి విపినవితానే త్యజతి లలితధామ/ లుఠతి ధరణిశయనే బహు విలపతి తవ నామ/ తవ విరహే వనమాలి.....' అంటూ, ఆమె విరహాగ్ని కాగి, కాలిన ధన్యుడైన శ్రీకృష్ణ మౌళికతనీ గానం చేశాడు జయదేవ మహాకవి.

అతను వెళ్లక తప్పదు, కానీ ఆమెని వదిలి వెళ్లలేదు. అతనిని ఆమె విడవలేదు, అలాగని బంధించలేదు. ఇద్దరిలోనూ ఉంటుంది పెనుగులాట, తప్పనిసరితనాల బరువు మోయలేని దుర్భరత్వం. దగ్గత్తిక సుడి లోంచి వినవచ్చే పిలుపుల ఆరా ఎలా తెలియదో, లోన అలకల నిర్హేతుకత్వం అలానే అర్థం కాదు. వీడ్కోలు చెరో కొసనా నిల్చొని ఉంటారిద్దరూ. పట్టే గానీ, విడుపులు తెలియవు ఇద్దరికీ.... ఉబికి కళ్ల వెంట బైట పడుతున్న దిగులుని దాచడానికి ఆమె ముఖాన్ని కాస్తంత వంచి, కాలి బొటన వేలితో ఏ ఆకారంలేని గజిబిజి గీతల్ని చుడుతుంటుంది. అటువంటప్పుడు ఆమెని 'తలచిన హృదయము ఝుల్లను.....' అంటాడు అన్నమయ్య. ... "మోమరవంచి పదాంగుటమున నిల నొయ్యన వ్రాయుచు/ కోమలి కన్నీరెడనడ గ్రుక్కుచు రెప్పలను/ వేమరు నా దెస జూచిటు వీడ్కొన నొల్లని భావము....."... "....యేమని తలపోయుదు విధి నేమని దూరుదును..." అని నీలా, అచ్చం నాలా విధిని తిట్టుకోంటూ బేల అయిన అతను.... నీలా, నాలా సామాన్యుడా? సాక్షాత్ శ్రీకృష్ణుడు!

మగవాడికి ఏకపత్నీవ్రతమనే అందని మ్రానుపండుని మూపున గట్టి, ఆమెకి ప్రాతివత్యాన్ని మెడలో గుదిబండచేసి, connubial harmony అని నేల విడిచి సాము చేయడం కాదు మేళనాదర్శం అంటే. ఒకరికొకరు ఏమౌతారని ఆలోచించుకునే వ్యవధి దొరకకపోవడం, తాముతప్ప మిగతా లోకమంతా రద్దైపోవడం, క్షణంలో యుగాన్ని చూసే,

యుగం ఒక క్షణమని తోచే, గడియారం గంటలు, కేలండర్ తారీకులతో సంబంధంలేని Human time & divine space లో బతకడం– ఇదే ఏ స్త్రీ–పురుషుల పొత్తైనా అందుకోవలసిన ఆదర్శం. అది సాధించాడు కాబట్టే– "... హత్తిన రేపల్లెలోని అంగనామణుల కెల్ల పొత్తుల సూత్ర' మయ్యాడు. "మొల్లపు గోపికల మోవిపండులకు నెల్ల కొల్లకాడు గదమ్మ మా గోల గోవిందుడు //మందడిసానుల కమ్మని మోముదమ్ములకు చెందిన తుమ్మిదవో మా శ్రీకృష్ణుడు// చందమైన దొడ్డీవారి సతులవయసులకు విందువంటివా దమ్మ మా విఠ్ఠలుడు// .... మత్తిలి వ్రేతెల నిండుమనసుల కెల్లాను చిత్తజునివంటి వాడు....' అని అన్నమయ్య వంటి ప్రేమాన్వేషికే కాదు, 'సత్యభామ ఉరముపై చల్లని కస్తూరి పూత/ తత్తరించె రుక్మిణి చే తామర పూవు/ హత్తిన భూకాంతకు యంగపు పయ్యెద కొంగు /......... పంతపు పదారువేల బంగారు ఉంగరము/ బంతికే కుబ్జగట్టిన పసిడి తాళి/ వింతగా రాధాదేవి వేసిన కలువదండ..' అని అన్నమయ్య దారిలో నడిచిన ఆయన కొడుకు పెద తిరుమలాచార్యులకి, ప్రేమ కోసం తదేకమైన వెదుకులాటలో ఉన్న ఎవరికైనా ఎదురౌతాడు, తెలిసివస్తాడు మహా ప్రేమికుడు శ్రీకృష్ణుడు.

('నేను హిందువు నెట్లైత' అని కంచె ఐలయ్యలా లోతుగా అనిపించే ఉపరితలాంశాలు లేవనెత్తకుంటే) సగటు (కోస్తా) హిందూ కుటుంబ వాతావరణంలో పెరిగిన నా తరం వాళ్లకి ఎవరికైనా కృష్ణుడు తమ లోగిలోకి ప్రవేశించిన తొలి జ్ఞాపకం చెప్పడమంటే కష్టమేనేమో. పలుకుగానో, పాటగానో, నుడిలానో, గుడిలోనో, ఆట అనో, అల్లరి అనో, వాదులాట వల్లనో...... లోపలికి బిరబిరా వచ్చేస్తాడు కిట్టయ్య. అయినా, గుర్తు చేసుకునే ప్రయత్నం చేస్తే, పిండి ముగ్గుతో అమ్మ వేసిన కృష్ణ పాదాలు గుర్తొస్తున్నాయి గానీ, నాకు కృష్ణుడి వేషం వేసిన గుర్తైతే లేదు. అసలు వేయలేదనే చెప్పాలి. దానికి కారణం చెప్పాలంటే.... మళ్లీ (పేరుకే) రాధాకృష్ణమూర్తైన మా నాన్న గారి దగ్గరకి రావాలి.

వాళ్ల (మా అని అనాలేమో...) వంశవృక్షంలో ఆయన ఒక 'చెడ' బుట్టిన శాఖ, లేదా చెడ పెరిగిన ఉపశాఖ. ఆ 'తేడా' కొమ్మకి పట్టిన చీడలు ఎన్నో: ఎం ఎన్ రాయ్ రాడికల్ హ్యూమనిజం కొన్ని పాళ్లు, గోరా గారి నాస్తికత్వం మరి కొన్ని పాళ్లూ కలగలిసి, హేతువాదంతో చెట్టాపట్టాలేసుకొని హేతివాదం పొలిమేరల్లో ఆగిపోయిన వ్యవహారం ఆయనది. అష్టాదశ పురాణాలు, ఇతిహాసాలు, ముఖ్యంగా భగవద్గీత స్పెషలిస్టు అమ్మ– పరమ భక్తురాలే గానీ, కొన్ని సైద్ధాంతిక ఘర్షణల ఫలితంగా సాపేక్షంగా ఇంట్లో ఆధ్యాత్మిక

వాతావరణం ఒకించుక తక్కువే. అంటరానిదిగా ఒక మూల ఉండే పూజా గదిలో అమ్మ దీపధూపాలూ నడిచేవి గానీ, మరీ నన్ను (లేదా తమ్ముడ్ని) బాలకృష్ణులు చేసి మురిసేంత వెసులు బాటు లేదు.

గుడిలో ఎవడో ఉన్నాడని లోపలికి రావడానికి నిషేధాలు విధించుకున్న నాన్న గారికీ, భక్తి అన్నది గుడిలో మాత్రమే ఉందని నమ్మే అమ్మకీ తేడా కనిపించేది కాదు నాకు (అల్లరి ఓణీలు అరకొరగా దాచే అరవిరి మొగ్గల్ని చూడ్డానికి కూడా గుడి పదిలమని కూసింత ముందే గ్రహింపుకొచ్చిన నాకు! నాన్న కన్నెత్తి చూడక పోవడానికీ, అమ్మ కళ్లకద్దుకోడానికీ మధ్య వారిద్దరికీ తెలియని లిటరల్ తీపిదనం ప్రసాదంలో ఉందని లొట్టలతో తెలుసుకున్న నాకు!!)

Trial & error పద్ధతిలో ప్రయత్నం చేయడానికీ, Program loopలో కొన్ని ‘if’ conditions పెట్టి చూడ్డానికీ, hypotheses అటూఇటూ మార్చి రెండు మూడు కాంబినేషన్లతో ఆలోచించడానికీ, ఇష్టం లేని వాటిని దస్టరుతో చెరిపేయడానికీ వీల్లేనిదే జీవితం. ఇది సాధారణార్థంలో. కానీ పిడివాదానికి కుడి ఎడమల్లానో, నియతి వాదానికి బొమ్మాబొరుసుల్లానో ఉండే, పరస్పరం విరుద్ధమనిపిస్తూనే, ఒకే తానులో గుడ్డల వంటి భావాల మధ్య నడిచొచ్చిన దారి వంటి జీవితం కాబట్టి నాలోకి నల్లపిల్లిలా లీలాకృష్ణుడు ఎప్పుడు చొరబడ్డాడో వెదుక్కోవడం ఏమంత కష్టం కాదు.

నాన్న గారు తమవైన ఖండనమండన సభలకి తీసుకు వెళ్లేవారు. రావిపూడి వెంకటాద్రి గారు, ఎన్వీ బ్రహ్మం గారూ ప్రత్యక్ష గురువులు కూడా. ఓ సారి సభకి ప్రధాన ప్రసంగీకులు (నాకు గుర్తున్నంత వరకూ) వెనిగళ్ల సుబ్బారావు గారు. ఆయన ప్రసంగంలో ప్రధానాంశం– కృష్ణుడు – శృంగారం.

“పద్మా పయోధర తటీ పరిరంభ లగ్న కాశ్మీరముద్రిత మురో మధుసూదనస్య వ్యక్తానురాగమివ……” – అదే రంకు రంగులు పులిమబడ్డ జయదేవ కృష్ణుని తొలి పరిచయం. వామాచారంలాగా అది విలోమ పరిచయం ‘గోపీ పీనపయోధర మర్ధన చంచల కరయుగశాలి’ గురించి. ‘కోకిల కలరవ కూజితయా జిత మనసిజ తంత్ర విచారం / శ్లథ కుసుమాకుల కుంతలయా నఖ లిఖిత ఘన స్తన భారం….’– ఇదంతా చిత్తకార్తె వ్యవహారం; ‘రతి సుఖ సమయ రసాలసయా దర ముకుళిత నయన సరోజం / నిస్సహ నిపతిత తను లతయా మధు సూదనముదిత మనోజం…..’– ఇది బూతు బాగోతం; ‘శ్లిష్యతి కామపి చుంబతి కామపి రమయతి కామపి రామాం పశ్యతి సస్మిత చారుపరా మపరా మనుగచ్ఛతి వామాం…..’– ఇక్కడ కృష్ణుడు ఒక పచ్చి philanderer!

దాదాపు ఆ రోజుల్లోనే అమ్మ ఒక భజన ముఠాకి తీసుకు వెళ్లినప్పుడు – అక్కడ శాస్త్రుల వారు ఆ కృష్ణ లీలల్నే మరోలా వివరించారు. రాధ, గోపికలు జీవాత్మలని, కృష్ణుడు పరమాత్మ అని, వారి సంగమమే జీవన్ముక్తి అని. అసలు సమస్త మానవకోటి స్త్రీప్రాయమని,

మాధవుడొక్కడే మగవాడని చెప్పారు. శాస్త్రుల వారు శ్రీకృష్ణుడు శిఖిపింఛమౌళి ఎందుకో వివరించారు. నిజమో కాదో తెలియదు గానీ, నెమళ్ల మధ్య సంభోగం శారీరకం కాదట; వివశానందంలో ఆడ, మగ నెమళ్లు నాట్యం చేశాక, మగ నెమలి ఉచ్ఛిష్టాన్ని ఆడ నెమలి మింగుతుందట, అదే గర్భధారణకి బీజమట. అదే విధంగా, రాధా గోపికలు, అష్టభార్యలు, పదారువేల కాంతలూ.... అందరితో కృష్ణుడికి ఉన్న సంబంధం అటువంటిదేననీ, దానికి కృష్ణకొండి లో తురిమిన నెమలి పింఛమే ఆనవాలని చెప్పారా శాస్త్రుల వారు. అందుకే అసలు నిజమైన బ్రహ్మచారి శ్రీకృష్ణుడేననీ అన్నారు. అప్పుడే హతాశుడ్నైయ్యాను. ఆ పరమ ధార్మిక స్వైర కల్పన కంటే, చార్వాకుల పచ్చి బూతులే బాగున్నాయనిపించింది. గానం, లాస్యం, కవిత్వం ముప్పిరిగొన్న 'శ్రీ జయదేవభణిత మిద మద్భుత కేశవకేళీ రహస్యం...' కళావిముఖులైన హేతువాద మూర్ఖులకే కాదు, ఆ శిష్ట ధార్మిక నైతికాధములకీ బోధపడే అవకాశమే లేదని తేలిపోయింది.

ఒకరికి భక్తి అంటే లావాదేవి, కొండంత కోరికల కోసం గోరంత ముడుపులు కట్టే వ్యాపారం. వారి ప్రత్యర్థులనుకునే మరొకరికి కూడా భక్తి అంటే అదే ఉద్దేశం. ఇద్దరికీ కూడా, ప్రేమకి ఉన్న నానా పర్యాయ రూపాల్లో/అర్థాల్లో 'భక్తి' ఒకానొకటి అని తెలియదు, తెలిసే అవకాశమే లేదు.

ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రతిగా నిలబెట్టే ప్రయత్నం కూడా, తమిళనాట ద్రావిడ ఉద్యమ స్ఫూరితో పోల్చితే మనది చాలా బలహీనం. అరవవాళ్లు కృష్ణుడికి సమాంతరంగా మురుగన్‌ని నిలపాలని చూశారు, చిన్ని కృష్ణుడి చిలిపి చేష్టల వంటివే, బాల మురుగన్‌కి కూడా కల్పిస్తూ. కానీ, వాటిలో తాదాత్మ్యం ఉండదు, తన్మయం ఉండదు. అసలు ఉండాల్సిన ప్రేమే మృగ్యం. తమలపాకుతో నువ్వు ఒకటంటే తలుపు చెక్కతో నేను రెండంటా.. అన్నట్లుగా పంతం, పోటి తప్ప మరేమీ లేదు.

"............ మీగడపెరుగుతో మేళవించిన చల్ది ముద్ద డాపలి చేత మొనయ నునిచి చెలరేగి కొసరి తెచ్చిన యూరుగాయలు వ్రేళ్ళసందులయందు వెలయ నిఱికి సంగడీల నడుమ జక్కగ గూర్చుండి నర్మభాషణముల నగవు నెఱపి యాగభోక్త కృష్ణు దమరులు వెఱగంద శైశవంబు మెఱసి చల్ది గుడిచె ......" అని చిన్నప్పుడు తెలుగు మాష్టారు చెప్పినప్పుడు బోధపడలేదు గానీ, తర్వాత తెలిసొచ్చింది పోతన గొప్పతనం. చెత్త చపాతీలూ, ముక్కిపోయిన బన్ను ముక్కలు తినే ఉత్తరాది కృష్ణుడి చేత మన మీగడా పెరుగన్నం, నోరూరగాయ తినిపించడమే కదా సొంతం చేసుకోవడం అనిపించింది. అదే

దారిలో నడిచాడు అన్నమయ్య– 'ఊరుగాయలును నొద్దికచద్దులును నారగింపుచును నందరిలో సారె బాలుల సరసాల తోడ కోరి చవులు గొంటివి కృష్ణా...' అంటూ.

అప్పటికి అన్నమయ్య తెలియకపోయినా (ఇప్పుడు తెలుసని కాదు గానీ..), 'చిమ్మెడి విషములు చేసిన రొమ్ములు, కొమ్మని యిచ్చిన గుడిచేని బొమ్మర పోవడు పూతకి బొరిగొని, అమ్మరో గయ్యాళి శిశువు' అని మెటికలు విరవడం, 'కాళింగు దొక్కితివట కటకట వుద్దండాలు, వోలిజేయ దొరకొంటివా'అని గగుర్పాటుకు లోనవడం, 'తొల్లె గోవర్ధనమెత్తి దొరతనాలెల్లాజేసి, అల్లవాడె నిలుచున్నాడాతుడీతడా' అని పోల్చుకునే అబ్బురంలో తొట్రుపడటం, 'ఇట్టి ముద్దులాడి బాలుడేడి వాడువాని, బట్టితెచ్చి పొట్టనిండ బాలుపోయరె ' అని అక్కర చూపడం, 'తోయపుం గురులతోడ దూగేటి శిరసు, చింతకాయలవంటి జగడములతోడ మ్రెయుచున్న కనకంపు మువ్వల పాదాలతోడ పాయక యశోదవెంట బాఊడు శిశువు చిన్ని శిశువు, చిన్నిశిశువు ఎన్నడు జూడమమ్మా యిటువంటి శిశువు' అని ఆ సిసింద్రి బంగారు బుగ్గల కారేటి చొంగ తుడవడం..... జరుగుతూనే ఉండేవి.

ఎప్పుడైతే మా నాన్న గారి వైరి భక్తి పుణ్యాన శృంగార మాధవుడి దర్శనమయ్యిందో, జయదేవ జనార్దనుడు తళుక్కుమని మెరిసి మాయమయ్యాడో..... అప్పటి నుంచి తనని తెలుసుకోవాలని వెంపర్లాడాను. అయితే, కుదురుగా కూర్చొని వినడానికి తగిన సాంగత్యం లేక, బుద్ధిగా హఠం వేసుకొని చదువుకోవడాల నుంచి మనసు మళ్లించే నూనూగు ప్రలోభాల వల్ల నా గోపీ కృష్ణాన్వేషణ అంత linear గా సాగలేదు. 'ఛత్రం సమర్పయామి. చామరం సమర్పయామి. గీతం శ్రావయామి, నృత్యం దర్శయామి....' అంటూ అమ్మ దేవుడి ముందు అప్పజెప్పే సర్వోపచారాన్నీ అడపాదడపా వింటూ ఉండటం చేత, ద్వాత్రింశత్–ఉపచారాలలో 'నృత్యం' కూడా ఒకటని తెలుసుకోవడం వల్ల ('సంగీతం కూడా ఒక ఉపచారమే కదా, పోనీ నీది గార్ధభ స్వరమన్న స్వస్వరూప జ్ఞానం ఉన్నట్టైతే వాద్యం అనే మరో ఉపచార మార్గాన్ని అనుసరించక పోయావా' అని చిక్కుప్రశ్నలు వేయకండి), మరీ ముఖ్యంగా నన్ను మోహపాశాలనే మోకులు కట్టి (తన ప్రమేయం లేకుండానే) ఈడ్చుకు పోతున్న ఓ నేస్తురాలు పరిచయ భాగ్యం కోసం తన వెనకే భరత నాట్యం క్లాసులో చేరాను. మా చీరాలలోనే కాదు, చుట్టు పక్కల ప్రాంతాలలో కూడా పేరున్న ప్రఖ్యాత కళాకారిణి దాసరి కోమలి గారు మా గురువు గారు. నాట్యం మీద నా వల్ల మాలిన ప్రేమకి ఆమె తబ్బిబ్బైతే, వాళ్లబ్బాయి సురేష్ గారు (ఆయనా డాన్సరే) ఏదో శంకించినట్టున్నాడు, నన్ను షెడ్యూలు మార్చి, తాను చెప్పే బ్యాచ్‌లో కలపాలని ప్రయత్నించాడు. నటరాజ పూజ అయిన వారం తిరగక ముందే అడుగులన్నీ నేర్చేసుకున్న నా గ్రాహక శక్తికి బహు ముచ్చటపడి నాకు గజ్జె పూజ చేయించిన మా కోమలి గారు నా మదనిక వచ్చే వేళ నుంచి నన్ను తప్పించే కొడుకు ప్రయత్నాలని సాగనివ్వలేదు. ఏతావాతా చెప్పొచ్చేదేమిటంటే, చిత్తం ఎవరి (వేటి) మీద ఉన్నా, మూలాలు తెలియని కొన్ని పదాలు:

'రార వేణూ గోపా బాలా రాజిత సద్గుణ జయశీలా/ సారసాక్షా నేరమేమీ మారు బాధా కోర్వలేరా'; 'శృంగార రసభర సంగీతసాహిత్య గంగాలహరీఖేల సంగం సదా.... బాల కృష్ణం కలయ సఖి సుందరం'; 'పన్నుగ మువ్వ గోపాల బాస లిచ్చి నన్ను కూడి వన్నెలాడికే లోనైన వగ లెల్ల విన్నార నేడు'; 'రార గోపాలబాలా రమించన్ సఖా... చేర రా స్రగ్విణిన్ చిద్విలాసాయిటన్'... మధ్య మెరిసి మురిపించే కృష్ణుడిని ఏమారలేదు. అడ్డమైన ప్రతి చొంగల రాయుడ్నీ రసికావతంసుడనడం, కృష్ణుడితో పోలిక తేవడం మీద మరింత మానసికంగా వాంతులు చేసుకోవడం మానలేదు.

◆◆ ◆◆

'ఉంచుకోవడం' అనే మాటలో male chauvinism కొట్టొచ్చినట్టు కనిపించి, 'స్మరగళ ఖండన మమ శిరసి మండనం... దేహి పద పల్లవముదారం....' అని ఆమె కాలు నెత్తిన పెట్టుకోడానికి కించిత్ కూడా సంశయించని ఆ లీలాదస్యుడు, వలపుల వరాళి ఉంచుకోడు గాక ఉంచుకోడు. ఆమే (ఆమెలెందరో) ఉంచుకుంటుంది ప్రణయుడ్ని. అటువంటి ముద్రలు మనసులో గాఢంగా పడటం వల్ల కాబోలు, ఎవరైనా 'అదే వాడ్ని ఉంచుకుంది...' అని ఎవరి గురించైనా చెప్పుకుంటే, ఆ 'ఆమె'ని చూడాలని తహతహలాడే వాడిని. మా ఊరికి ఐదుమైళ్ల దూరంలో దేవకాంతలు నివసించే ఒక గ్రామం ఉంది. ఏదోక మిషతో ఆ దివ్యక్షేత్రాన్ని తరుచూ దర్శిస్తుండేవాడిని. అక్కడ ఒకామె గురించి అదే చెప్పుకోవడం విని, తనని చూడాలని వెళ్తే అప్పుడు తెలిసింది 'ఆమె ఉంచుకోవడం ' నిందాపూర్వకమైన లోకార్థం. ఆమె డబ్బున్నదైతే, ఆమెకి ఉంచుకోబడే హోదా కల్పిస్తారని ఖరారయ్యింది. అయినా లోకంతో నాకు పని లేదు; నా అర్థం నాదే.

ఎందరినో ప్రేమించడం, పాదాక్రాంతమవడం, మైకం వంటి అలౌకిక స్థితిలో 'ఆమె' తప్ప మరే ఇతర ప్రపంచమూ పట్టకపోవడం, తను కనిపించక పోతే క్షణం నిలవలేకపోవడం, వియోగాలకి విలపించడం...... ఇవన్నీ ఉన్నంత మాత్రాన 'విమోహకృష్ణం' కాదు. ఆ మాటకొస్తే, నేనూ ఎందరినో ఎంతో నిమగ్నతతో ప్రేమించాను, వియోగాలతో దిగులుపడ్డాను (....స్తూనే, పడుతూనే ఉన్నాను). వాళ్లు 'నా' అని అనిపించడమే గానీ, ఏ ఒక్కరికీ (సామాజికపరమైన భద్రతా కారణాల వల్ల కాకుండా నన్ను నన్ను గానే ఇష్టపూర్వకంగా భరించే నా ఉష మినహాయింపు) తనవాడ్నని అనిపించకపోవడమే, నన్ను 'ఆమె' ఉంచుకోవాలన్న ప్రగాఢమైన కోరిక తీరకపోవడమే– విలోమ కృష్ణం!

"ప్రేమము చాలాజేసి పెక్కు సతులతోను।
మోము చూడ సిగ్గుపడి ముసుగుతో నున్నదాన॥
జాముపోయి వచ్చినీవు సరసములాడేవు।
యేమని నేనియ్యకుందు నేటిజన్మమయ్య॥

అనాలి ఆమె, ఎల్లలు లేని మోహంతో. 'మచ్చికతో నిన్నుగూడి మన్నించిన నీతోను । పచ్చిసేయ సిగ్గుపడి వదరక వున్నదాన..'' అని అతనిని 'ఉంచుకోవాలి', తన మదిగదుల్లో. 'చాలుజాలు నికజాలు నీరచనలు.. పోలవు బొంకులు పోవయ్యా' అని విసిరికొట్టినట్టు నటించాలి. 'నీవె నీవె నను నించితి... కౌగిట కైవశమైతిని గదవయ్యా' అని surrender అయిపోవాలి. అదే ప్రణయానంత కేళీకేశవం! "రంగుగ మధురలోని రమణి మెత్తిన నాటి అంగడి గందపు బూతలట్టే వుండీనా?" అని తీరని మోజులతో మురిపెంగా leg pulling చేస్తూనే, ఆ ప్రమదాలోలుడికి సాగిలపడటమే రసిక రాధేయమ్! వివశ విరాళమ్!!

**(02.09.2013)**

# My Banyan's B'Day!

"ఈ రోజు మా ఉష పుట్టినరోజు"

– అయితే ఏంటి? 364 రోజులకి లేనిది, ఈ ఒక్క రోజుకీ అదనంగా add అవుతున్నదీ ఏమిటో....

"శుభాకాంక్షలు...."

– ఎలగా... ఎలగెలగా... 'శుభ.... ఆకాంక్షలు....' బాగుంది! దానికి ఒక రోజు.... 24 గంటలు.... 1440 నిమిషాలు.... 86,400 సెకన్లు... దేనికి దండగ! 'హేపీ బర్త్ డే' అంటూ మూడు ముక్కలు చెప్పేసి, ప్రలోభాల తగరపు రంగుల కాగితంలో చుట్టిన తాయిలం లాంటి గిఫ్ట్ ఏమైనా ఉంటే ఇచ్చేసి, అదీ లేకపోతే చెయ్యి దులిపేసుకునే శ్రమ కూడా లేకుండా, బర్త్ డే వంకతో షడ్రుచుల menu కోసం మరి రెండు, మూడు dishes అదనంగా విధించి, మరింత వంటింటి కుందేలుని చేసేసి, 'ఇల్లే ఇలలో స్వర్గమనీ ఇల్లాలే ఇంటికి దేవతనీ అంటూ, ముఖ్యంగా... 'మగడే శ్రీమతి దైవమనీ.... ఋజువు చేశావూ... నీవు ఋజువు చేశావు.....' అని పాత ట్యూన్‌లో కొత్తగీరతో పాడేస్తే చాలు కదూ..!

"మరి అంతకంటే ఏం చేయను... ఇర్వైయొక్క ఏళ్ల ఉషకి (అంటే మా పెళ్లయ్యాక 21 పుట్టిన రోజులు జరుపుకున్న మా ఉషకి) ఇర్వైయొక్క సందర్భాల్లో 'స్వస్త్యస్తుసుగుణోస్తు' అని 'నిత్యమంగళం నిర్దేశిస్తూ... స్వస్తివాక్యములు సంధానిస్తూ... స్వర్ణ వాద్యములు సంరావిస్తూ...' శుభకామనలు అందించడం కంటే ఏం చేయను?"

– దమ్మిడీ ఖర్చు లేని సూనృతాలు వెర్రిగాలికి రాలిపడే రంగు రంగుల కాగిత్తప్పూలలా గుమ్మరిస్తావు సరే! నీ స్థానంలో ఉష ఏం చేస్తుంది?

"చేస్తుంది కాదు, చేస్తూనే ఉంటుంది. పెదవి చివరి ఒంపులోంచి

కారిపోయే ఆకాంక్షలు కాదు, బారెడు చేతుల్లో ఇమిడిపోయే నిండైన ఆచరణలు! 'సౌభ్రాత్రం... సౌహార్దం.... పునాదులై ఇళ్ళు లేచి.... జనావళికి శుభం పూచి... శాంతి, శాంతి, కాంతి, శాంతి!"

– కొంచెం ఓవర్‌గా లేదు?! నువ్వు ఇల్లూ వాకిలి పట్టనివాడివి కాబట్టి, ఇంటా– బయిటా బాధ్యతలు తానే మోస్తుంది, సరే! ఒప్పుకుంటాం. నీ ఇంటి లోగిలిలో శుభాల తోరణాలు కట్టుకోవడం లోకోద్ధరణ అన్నట్టు..... జనావళికి శుభం పూచి... ఈ స్వప్నం నిజమవుతుంది.... ఈ స్వర్గం ఋజువవుతుంది... అంటూ పెద్ద పెద్ద పద్యం పంక్తుల్ని ఎడాపెడా వాడేయడం కాస్త ఎక్కువైనట్టు అనిపించడంలా!

లేదు, తాను instinctively altruistic అనడం అస్సలు ఎక్కువ అన్పించడం లేదు... ఎందుకంటే–

◆◆ ◆◆

1993 డిసెంబర్ 8న మా పెళ్లయ్యా అవడంతోనే బిరబిరా వచ్చేసింది కొత్త ఏడాది. కొత్తల్లుడు, పెద్ద పండుగ (సంక్రాంతి) మర్యాదల మత్తులో ఉన్నప్పుడు రానే వచ్చింది జనవరి 26. నేనేమన్నా గొప్ప దేశభక్తుడ్నా భారత గణతంత్రదినోత్సవ సంబరాల కోసం ఆరాటపడటానికి! అది ఉష పుట్టిన రోజు, మా పెళ్లైయ్యాక మొదటి పుట్టిన రోజు.

పెళ్లైన కొత్తలు కదా.... రెక్కలు కట్టుకొని వాలాను ఓ రోజు ముందే అత్తగారింట్లో. వచ్చిన వెంటనే బయిల్దేరదీసింది ఉష, తన spiritual home కి. అది కూడా గుంటూరు జిల్లాలోనే, రేపల్లె దగ్గర్లో, కూచినపూడి పరిసరాల్లో. మెయిన్ స్ట్రీమ్‌కి ఎడంగా ఉంటుంది కాబట్టి బస్సు రవాణా తక్కువ; కూచినపూడి చేరేటప్పటికే బాగా చీకటి పడింది. పాకల్లో వెలుగుతున్న గుడ్డి దీపాల వల్ల ఊరు, శుద్ధ త్రయోదశి వెన్నెల మరకలు తారాడి కాలువ, కాల్వ మీద బోడి వంతెన ఉనికి అర్థమౌతున్నాయిగానీ, చిక్కని చీకట్లో కలిసిపోయిన నల్ల తాత్రోడ్డు ఆనమాలు తెలియడం లేదు. ఉష ఆత్మ పెనవేసుకుపోయిన పల్లె అక్కడ్నుంచి మరో రెండు మైళ్లట. ఎలా వెళ్లడం దేవుడా అనుకుంటుంటే, 'ఎంతలోకి... అలా కబుర్లు చెప్పుకుంటూ నడిచేస్తే.. ఇలా ఎదురౌతుంది... పద...' అని చెయ్యిపట్టి నడిపించబోయింది. తన చిటికెన వేలు పట్టుకొని అగ్నిహోత్రం చుట్టూ ప్రదక్షిణ పేరిట మాట వరసకి నడిచానన్న పేరే గానీ, నన్ను నడిపించేది తానేనని నాకు అప్పటికే బోధపడిపోయింది. అయినప్పటికీ, మగ పెళ్లివారి తాలూకూ డాబుసరితనం అంత త్వరగా చతికిలపడిపోవడం చిన్నతనంగా, ఎబ్బెట్టుగా అనిపించి, అప్పుడప్పుడూ నే పట్టిన కుందేలుకి మూడేకాళ్లని మంకుపడుతూ, 'ఈ అద్దానపు అడవిలో వాహ్యాళి ఏమిటీ' అని బిక్కుబిక్కున రుసరుసలాడుతుంటే, బింకం చాటున నా భయాల్ని 'అల్లుడు – అలక పాన్పు' వంటి ముచ్చట్లతో ముడేస్తున్న జాణతనంతో 'ఏం ఫర్లేదు, నేనున్నా కదా' అని తాను అనునయిస్తున్నప్పుడు, యముని మహిషపు లోహఘంటలు మా మాటునే ఖణేల్మన్నాయి.

“ఏమ్మా బుజ్జెమ్మా.... పెళ్లయ్యింది కదంట్రా.... ఇదేనా రాడం? అల్లుడు గోరా... ఆ పెట్టితీయండీ బాబూ... టైరు మీద కాలెట్టి ఎక్కండె...”

“అవును బాబాయ్.. బలే వచ్చావే.... మీ అల్లుడుగారు నడిస్తే కందిపోతారేమో అన్నట్టు..”

– పుష్యమాసపు వెన్నెల కర్పూర ధూళి అంటుకున్న మంచులో టాపులేని ఎడ్లబండి మీద ప్రయాణం... కూచినపూడి మిల్లు డొంక దగ్గర మొదలయ్యాయి పలకరింపులు... పరామర్శలు... కలబోతలు... ఎకసెక్కాలు...

రోడ్డుకి అల్లంత లోనకుండే పులిగడ్డ రామచంద్రరావు హైస్కూల్ కూడా పచ్చిగడ్డి గట్లమీద గడుసు గాలితో పంపుతుంది కుశలాలు, నేను చదివిన హైస్కూలు ఇదేనని చెబుతున్న ఉషకి.

ఊరి చివర మాలపల్లె... ఆ పక్కన బొర్రావారి గవల్లపాలెం.. తండోప తండాలుగా పలకరింపులే, శల్యుడి కళ్లతో నన్ను గుచ్చిగుచ్చి చూడటాలే....

ఉష బండి మీద పట్టుమని పది క్షణాలైనా కూర్చుందా.... అందర్నీ కలేసుకుంటూ... పిల్లలకి బ్యాగుల్లోంచి పందేరం చేస్తూ.... బండి పక్కన నడుస్తూనే ఉంది. మా బండి బాబాయ్ (నాకు మామగారు కామోసు...) ఇదంతా మామూలే అన్నట్టు, ఈ సమూహాల్ని తప్పించుకుంటూ, ఆ సందడిలో గతుకులు ఏమారుతూ చేర్చాడు మమ్మల్ని గమ్యం. ఆయన ‘కోనఫలం’ వెళ్లాలి కాబట్టి, మేం రోడ్డు మీదే దిగేసాము. రోడ్డు మీద నుంచి, డొంక మీద కిలోమీటర్ నడక... ఉష నడవడం లేదు... చెంగు... చెంగు... మంటుంది. నాకు మూడడుగుల ముందు జరజరమంటూ డొంక దాటుతోంది అడ్డంగా ఆరడుగుల పాము. నాకు పై ప్రాణాలు పైనే పోయాయి.

“భయపడకు... అది జెర్రిగొడ్డు.... మన పొలాలకి కాపలా, రైతులకి ఫ్రెండ్.... ఏం చేయదు...” ధైర్యం చెప్పింది ఉష. ఊరి పొలిమేరల్లో దక్షిణాన గూడెంలో ఉండే యానాదులు అల్లంత దూరాన ఉషని చూసి ‘బుజ్జెమ్మా...’ అంటూ పొలాల కడ్డంగా పరిగెత్తుకొచ్చారు, ప్రాణాలిచ్చే ప్రేమతో. కుడివైపు చాకలోళ్ల చెరువు దాటి, మేము ఊళ్లో అడుగు పెట్టేసరికి ‘బుజ్జెమ్మొచ్చింద’ని ఆ 300–గడపల పల్లె మొత్తానికీ తెలిసిపోయింది. ఎడమపక్క ఉష తాతగారు (మాతామహులు) నడిపే ఎయిడెడ్ స్కూల్, ఆ పక్కన పెద్ద మర్రిచెట్టు. మర్రి కొమ్మకి వేలాడుతూ ఒక చిన్న ఎలెక్ట్రికల్ బల్బు.

మర్రిమాను చెప్టా మీదకి నిల్చొన్న ఉషని చూస్తుంటే, నిండా ఇరవై ఏళ్లు లేని ఆ అరిందని చూస్తుంటే, పల్లె మొత్తాన్నీ కొమ్మల కింద పొదువుకున్న

ఆ వటవృక్షాన్ని చూస్తున్నట్టే అన్పించింది.

ఆ స్ఫురణ ఒక revelation... ఆమెకి సంబంధించిన revelation!

చికిలించుకుపోయిన నా కళ్లు పట్టని ఆ మూర్తిని playing second fiddle భార్య పాత్రలో చూడాలంటే ఇప్పటికీ నాకు జంకే. సగటు సామాజిక కౌటుంబిక mundane పొరలు కమ్మిన కళ్లతో చూస్తే, ఉష ఒక మామూలు housewife (పోనీ కాస్త polished మాటల్లో చెప్పాలంటే homemaker). మా పెరట్లో కుదుళ్లున్నట్టుగా కనబడుతున్న మఱ్ఱిమాను, 'చెట్టు నా ఆదర్శం' అని చెప్పుకున్న కవి ఇస్మాయిల్ గారి మాటలు అరువు తెచ్చుకొని చెప్పాలంటే.... 'పురుగు సగం, సగం పిట్ట/ ధరనుచొచ్చి, దివినివిచ్చి/ విరులు తాల్చు తరువు'– మా ఉష. ఇది చెదలంటని చెట్టు, తెగుళ్లు సోకని తరువు, ఈర్ష్యాసూయలు లేని, ఎత్తుజిత్తులు తెలియని, నదురూబెదురూ నంగిరితనాలూ ఎరగని, స్వార్థం దరిచేరని మహా మహీరుహం.

కొన్నిసార్లు నాకు అంతుబట్టదు – ఆడగానో, మగగానో... మన ప్రమేయం లేకుండా పుట్టాము. ఆ జెండర్ తాలూకూ పరిమితులు, విస్తృతులు... దాటుకొని మనిషిగా సహజంగా రూపాంతరించే పరిణితి తనకెలా సాధ్యమైందో నాకు అస్సలు అంతుచిక్కదు. భయమని భ్రమపెట్టే నాజూకుదనం, అభద్రత వల్ల అనుమానం, బిడియంలా అనిపించే కులుకు, వగలు వంటి flaunt, స్వీయమోహం అను narcissism, వంటింటి రాజకీయాలు, పడకింటి ప్రలోభాలు.... అన్నీ సగటు స్త్రీ సహజాభరణాలు. కానీ, ఈ ఆభరణాల విషయంలో కడు పేదరాలు– మా ఉష. సాధారణంగా ఆడవాళ్లకి ఉండే (లేదా ఆపాదించే) బలహీనతలన్నింటికీ తను నిలువెత్తు మినహాయింపు!

ఊడలు దిగిన దీర్ఘబాహువుల్తో చల్లదనాన్ని నీడలా పరిచినంతమేరా తన లోగిలే అనుకునే మా ఇంటి పెరటి మఱ్ఱి మా ఉష. మఱ్ఱిపండులో కంటినలుసంత గింజలోంచి ఆకాశమంత మహావృక్షం ఎదిగిన మహాద్భుతం వంటిదే ఉష being and becoming కూడా.

◆◆ ◆◆

అంతటి ఉషకి, అభిరుచులు కలవని, ఆలోచనలు పొసగని, ఆదర్శాలు ఇమడని నేనెలా సరిజోడి అని ఒక్కోసారి న్యూనత పడటానికీ, నా అంతటి వాడే ఆమెకి సరితూగనప్పుడు, ఇంకెవర్నైనా చేసుకున్నట్లయితే ఇంకేమన్నా ఉండేదా అని మరోసారి గొప్పలు పోడానికీ మధ్య లోలకాన్నై ఊగుతూ చెబుతున్నా తనకి–

Happy Birth Day – బుజ్జమ్మా!

◆◆ ◆◆

**(26.01.2015)**

# Daughter& Dad:

## More Than A Passing Resemblance!

**అక్టోబర్ 19, 2014 మధ్యాహ్నం 1.30:**

“అమ్మా! నాన్నేం చేస్తున్నాడు? బయిల్దేరాడా? మరో పావుగంటలో క్లాస్ ఐపోతుంది.”

“ఈ రోజు మీ నాన్న మనకి దొరుకుతాడా? ఆమెని మొదటిసారిగా చూసిన, కలిసిన రోజు అనుకుంటూ తలపోతల దిగుడుబావిలోకి ఒక్కొక్క మెట్టే దిగుతూ...”

“తొలిప్రేమా.. తోటకూరా.. ముందు నాన్నకివ్వు ఫోను.. హలో నాన్నా..”

“మీ అమ్మ phone speaker- onలోనే పెట్టిందిరా పెద్దోడా... అయినా, నువ్వు కాలేజ్ నుంచి మాట్లాడటానికి ఫోన్ చేయక్కర్లేదు. అది పెట్టేసి మాట్లాడినా ఈ పది కిలోమీటర్ల దూరానికి వినిపించక పోదు...”

“నాన్నా జోకులాపు. అసలే ఆదివారం ఈ స్పెషల్ క్లాస్ తలనొప్పేంటని మహా మంటగా ఉంది. మా నస ఇప్పుడే మమ్మల్ని వదిలి బైటికెళ్లాడు, క్లాస్ రూం లోంచి చిన్నగా మాట్లాడుతున్నా, పొద్దున చెప్పింది గుర్తుచేద్దామని...”

“పెద్దోడా.... ఈ రోజు మూడ్ లేదు, మరో రోజు రా...”

“ఎట్టి పరిస్థితుల్లో వీల్లేదు. రేపు ఊరెళ్తున్నాం, మళ్ళీ నా బర్త్ డే ముందు రోజు వరకూ రాను. ఎప్పుడు షాపింగ్ చేస్తావు?”

“మన గుంటూరులోనో, విజయవాడలోనో అమ్మతో షాపింగ్ చేద్దువులేమ్మా... ఇప్పుడు అక్కడ కూడా మంచి...”

“ఏంటి నాన్నా... చెల్లివి, నావి బట్టల విషయంలో ఎవరి సెలక్షన్‌ని ఒప్పుకోవు, అలాంటిది బర్త్‌డే డ్రస్ విషయంలో ఇలా అంటున్నావేంటి? అయినా ఏంటి నాన్నా.... ఎప్పుడో ముప్పై ఏళ్ల క్రితం... మొదటిసారి పడ్డానని

ఇప్పుడు ఆ మచ్చల్ని తడుముకుంటున్నావా... బాగా ముదిరిపోయింది నీకు, తలకి రోకలి చుట్టాలా?.... అర్థంపర్థంలేని ఆలోచనలు పోకుండా వెంటనే బయిల్దేరు..."

◆◆ ◆◆

ప్రేమలో పడటమేంటిరా పిచ్చితల్లీ, జబ్బుపడినట్టు, ఏదో ట్రాప్‌లో పడినట్టు-

లేచాను, కళ్లు తెరిచినా కరిగిపోని కలలోకి మేల్కొన్నాను!

ఎగిరాను, అంత క్రితం కోటానుకోట్ల సగటు జీవాల్లో ఒకానొకడ్నై జేగురు రంగు మట్టినేలల్లో కుమ్మరిపురుగునై దోగాడిన నేను- హఠాత్తుగా మొలిచిన రెక్కలతో కొత్త రూపాంతరానుభవాన్నై ప్రేమలోకానికి ఎగిరాను!!

ఏడేడు పాతాళాల్లో ఎక్కడో ఉండీ లేనట్టున్న నిలవనీటి స్తబ్ధతలోంచి ఊటనై ఉబికాను, చెలమనై చెలగి ఎగిశాను!!!

అది పువ్వు మాటు ముల్లు చేసిన గాయం కాదు, మచ్చగా మిగిలిపోడానికి. అది తేదీలుగా చిరిగిపోయే కేలెండర్ కాగితం కాదు, నిన్నలలో ఆగిపోడానికి.

ఆ తేదీ అలాంటిలాంటిది కాదు.... నేను కొత్తగా పుట్టిన రోజు! అదెలాగా అన్నట్టు చూస్తావేం? అంతకుముందు, పుట్టామా, దోగాడి, తప్పటడుగులేసి పెరిగామా... ఏమో గానీ, అవన్నీ అక్కరకురాని కొత్త అనుభవం; అంతకుముందు బతికిన లోకానికి పొంతన లేని కొత్త ప్రపంచం- త్రిశంకుస్వర్గంలా పైకీకిందకీ చెందని నడమంత్రపు లోకం కాదు, కొత్తగా పరిచయమయ్యే లోకం: యుగాలుగా ఈ గాలుల్లో ఉన్నా, క్రితం ముందు వినిపించని రాగాలు, కనిపించని రంగులూ మాత్రమే కాదు, అంతరాలు, హెచ్చుతగ్గులు, కులమతాలు, రొచ్చు రొష్టు.... కూడా తెలుస్తాయి, వాటికి అతీతం అయ్యే అంతస్తుకి వాళ్లని చేరుస్తుంది ప్రేమ. అందుకే, ప్రేమలోకి ఎగిరి ఎదిగిన వాళ్ల ప్రవర్తన deceptiveగా అనిపిస్తుంది, వాళ్లిప్పుడు అగ్ని సరసున వికసించిన వజ్రాలై మళ్లీ పుట్టారని అని బొత్తిగా తెలియని బంధుమిత్రులకి.

ప్రళయాగ్ని కాదు, ప్రణయాగ్ని! నేనూ తేలాను ఆ రోజు వజ్రాన్నై.

ఆ రోజుకి ముందు నా లోకంలో ఆమె లేదు, ఆ తర్వాత, ఆమె లేకుండా నా లోకం లేదు!

◆◆ ◆◆

"తేరగా నీకు దొరికిపోయి వింటున్నాను కదా అని కతలు చెప్పకు నాన్నా! 'రాలి? తొలి వెల్తురు కణం?' అని అప్పుడెప్పుడో వెక్కిళ్లు పెట్టావు కదా ఆమె జ్ఞాపకమంటూ. ఆమె నీతోనే ఉంటే, moody షోడశ చంద్రుడిలా ఇలా ముచ్చుముఖాలు పెడుతుంటావేంటి, తారీఖులు దస్తావేజులు తెగ సర్దేసుకుంటూ..."

– నిజమేరా తల్లీ, అదొక స్థితి, ఒకానొక plane! అది అబద్ధం కాదు, అలాగనీ అది– పాతాళగరిగెలకి కూడా అందని దిగులు బావి అట్టడుగున మిగిలిపోయిన స్మృతి అన్నది కూడా– నిజం కాదు!!

◆◆ ◆◆

"సర్లే ఇప్పుడు ఈ లోకంలోకి వచ్చి, నా బర్త్‌డే డ్రెస్ సెలెక్ట్ చెయ్యి! ఇదిగో నాన్నా.... ఈ డ్రస్ ఎలా ఉంది?"

– నాన్ననై మా అమ్మాయిని చూస్తుంటే, మళ్లీ ఆమె గుర్తుకొచ్చింది; నిజానికి ఆమె నాన్నగారు గుర్తుకొచ్చారు.

నాకు భౌతికంగా వందల మైళ్ల దూరాన ఉండే ఆమె ఊరి నుంచి వాళ్ల నాన్నగారు వచ్చారని తెలిసి, ఆమెనే చూడబోతున్న ఆనందంలో పరుగులెత్తాను. అంకుల్ గారిని హాస్టలులో నా రూముకి తీసుకు వచ్చాను, గులాబి రేకులు గుచ్చుకొనే రెడ్ కార్పెట్లు పరచి, చిరుశంఖంలా ఒంపుతిరిగిన చెవిలో కర్ణభేరి కంపించనంత మేరకి మంగళతూర్యారావాలు మోగించి, Opium కలగలిపిన అత్తర్లు చల్లి, జుత్తులో చిక్కుకున్న గంధాక్షితలు చెరిపి, స్వస్తివాక్య సందోహాల మధ్య ఆమె స్వాగతానికి చేసే ఏర్పాట్లు చేయలేదు గానీ, దానికి సరిపడ్డ హైరానా అయితే పడ్డాను.

"Room కంగాళి చేసేది నువ్వు, సర్దేది మేమా...?" అని పని విభజన, దాని న్యాయాన్యాయాలు, సాధ్యాసాధ్యాల మీద గొప్ప debate కి తెగబడుతున్న రూమ్మేట్ల కాళ్లు పట్టుకున్నంత పనిచేసి, మామగారి దృష్టిలో మంచి బాలుడు అనిపించుకోడానికి నానా తంటాలు పడ్డాను. పొందికగా ఉన్న room ని అంతగా చూడలేదాయన, నా పుస్తకాల షెల్ఫ్ పక్కన నిలువెత్తు పోస్టర్ – Gabriela Beatriz Sabatini, అటు ఇంకొంచెం పక్కన రేఖగా celluloid divinity తో మళ్లీ పుట్టిన శూద్రకుడి వసంతసేన profile picture.

వాటిని చూస్తూ 'ఏమిటి', 'ఎందుకు' అన్నట్టు చూశారు, దోషిలా బిక్కచచ్చి నిలబడ్డ నా వంక.

అందం.... అద్భుతం.... ఆరాధన... వంటి విరిగిపోతున్న కొన్ని పదాలతో ఒక వాక్యాన్ని గొణిగాను.

"ఇదంతా బ్యూటీనా? My daughter is real manifestation of beauty..." అన్నారాయన, సందర్భానికి పొసగదన్న స్పృహలేకుండా.

అయితే, ఆయన అన్నదానితో నాకు కొంచెం కూడా dispute లేదు. నిజానికి అంతకంత పెద్దవైన ఆయన కూతురు పోస్టర్లు నా మదిగదుల నిండా నింపేశాను...

"అంటే ఏంట్రా... వాళ్లమ్మాయి పోస్టర్లు పెట్టుకోమంటారా ఆయన....?" – అంకుల్ వెళ్లిపోయాక, విచిత్రపడుతూ అన్న హర్షా గాడి మాటలు గుర్తొచ్చి నవ్వొచ్చింది.

"ఏంటి నీలో నువ్వు నవ్వేసుకుంటున్నావ్... పిచ్చోడిలా. మళ్లీ తప్పిపోయావా... చింతల చిట్టడివిలోకి? ఇక్కడికొచ్చేయ్... నా డ్రెస్ ఎలా ఉందో చెప్పు...."

– పోట్లాడుతున్న మా అమ్మాయిని చూస్తుంటే, ఆనాడు అంకుల్‌లో పుత్రికోత్సాహం సమయసందర్భాలు చూసుకోకుండా ఉబికిరావడంలోని ఔచిత్యం.. నాకిప్పుడు బోధపడింది. క్లాసురూము ఉక్కలో సుక్కి, మధ్యాహ్నం మండుటెండలో వడిలి కూడా స్వయంప్రకాశకంగా వెలుగుతున్న నా కూతుర్ని చూసుకుంటుంటే, 'ఈ లోకంలోకి రావడానికి నన్నెందుకు సాకుగా తీసుకున్నావురా' అని అడగాలన్న దుఃఖానందం పెల్లుబుకుతున్న ఈ సందర్భంలో మరింత స్పష్టంగా అర్థమయ్యింది.

◆◆ ◆◆

**(22.10.2014)**

# ఝరీ ఝర్ఝరీ ప్రహర్షం!

మీ అమ్మాయిలు ముచ్చటగా ఉంటారు, భలే సందడి, మీకు మంచి కాలక్షేపం....” అంటుంటారు ఇరుగుపొరుగు, తెలిసిన వాళ్ళూ.

కాలక్షేపం అన్నమాటకి చర్రున కోపమొచ్చినా, ముందు పొగిడినందుకు కలిగిన సంతోషంతో కోపాన్ని దాచుకుంటాను. ‘టీవీలు... సీరియళ్లు... సినిమాలు... షికార్లు.... శెనక్కాయల కాలక్షేపం ఉంటే పిల్లలక్కర్లేదు’ అని వాళ్ల భావం కాదనీ, పాపం పదాలలేమి అనే poverty వల్లనే అలా మాట్లాడారులెమ్మనీ సరిపుచ్చుకుంటాను.

చిన్నారులు మనల్ని వినోదపరిచే ఆటవస్తువులు కాదనీ, వాళ్లకి మనమే గిలక్కాయలం కావాలని భావ– భాషామాంద్యులైన ఆ పెద్దలకి తెలియదని కాదు.

నా విషయానికొస్తే, మా అమ్మాయిలకి ఆటబొమ్మని అవుతాను గానీ, ఒట్టి లక్కపిడత మల్లే inanimateగా ఉండలేను. వాళ్ల నవ్వులు, అలకలు, కేరింతలు, పోట్లాటలు..... అన్నీ ఒక్క రెప్పపాటు సమయమైనా ఏమారకుండా నిలువెల్లా కళ్లతో విప్పార్చి చూసుకోవాలి.

ప్రస్తుత సందర్భానికి వస్తే, ఇది– ‘నిరంతర గిరినిపతిత నిర్ఝర్ఝర శీకర పరంపరా భాసిత...’ మైన నా చిన్నతల్లి ప్రహర్షకి సంబంధించిన ఊసు కాబట్టి, ‘పవనచలిత కమల కల్హార సరోవర మహాగభీర నదీహ్రద’మైన మా పెద్దమ్మాయి నైమిష గురించి మరొక సందర్భంలో చెబుతాను.

మా చిన్నోడు being and becomingకి మా (అమ్మానాన్నల) ప్రమేయప్రమేయాలు, కార్యకారణ సంబంధాలు ఎంతో నేనైతే ఎంచలేను గానీ, త్యాగరాజ స్వామి వారు నా కోసం నాలోంచే పాడినట్టు.... “తళుకు జెక్కుల ముద్దు బెట్ట కౌసల్య మును తపమేమి చేసెనో తెలియ.. దశరధుడు

శ్రీరామ రారయని బిలువ మును తపమేమి చేసెనో తెలియ..” అని నిరంతరం నిశ్శబ్దంగా నాకు వినబడుతూ ఉంటుంది.

(అబ్బ– కాకి పిల్ల కాకికి ముద్దు లెమ్మంటారా? పోనీ అలా అనుకునే వినండి (చదవండి)!! మా యమ్మకి దిష్టి తగలకుండా అయినా ఉంటుంది)

పైన చెప్పానే, మా ప్రహర్ష ఝరీ ఝర్ఝరీ కోలాహలం లాంటిదని; ఆ సెలపాట ఎటువంటిదంటే సావాస ధర్మంగా సవ్వడి చేసే గులకరాళ్లే కాదు, జన్మజన్మలుగా జడంగా పడిఉన్న బండరాళ్లు కూడా వాద్యవిశేషాలు కావల్సిందే. ఇరుగుపొరుగునైతే ముసలిముతక నుంచి, చంటిపాపల దాకా వయస్సులతో సంబంధం లేకుండా తన ఆప్తులు; స్కూల్లో ఒట్టి క్లాసుమేట్లే కాదు, పంతుళ్లు, పంతులమ్మల నుంచి ఆయమ్మల వరకూ అందరికీ ప్రహర్ష apple of their eye! బస్సులో వెళ్తామా, మేము దిగి వెళ్లేటప్పుడు టాటాలు, బైబైలతో బస్సు బస్సంతా హోరెత్తిపోవల్సిందే. ట్రైన్ అయితే, బోగీ మొత్తం మాతో కదిలి వచ్చేస్తుందేమోనని జంకు. తిరణాలకి వెళ్తే, అది మా చిన్నోడిలో తప్పిపోతుంది. చుట్టాలు పక్కాలు, మిత్రులు, పరిచయస్తులు..... అందరి order of priority లో ముందు మా చిన్నూ పేరే. అందరూ తన ఫ్యాన్స్!

వేనవేల దుఃఖాల్ని నయంచేసే ప్రవక్తల చిర్నవ్వే manifest అయ్యినట్టు ఉండే నా చిట్టితల్లి విషయంలో ‘ఏడుపు..’ ఒక ప్రత్యేక అధ్యాయం. తన షోడశకళల భావావేశాల్లో కారుణ్య పార్శ్వం విభిన్నం. చప్పున చిప్పిల్లుతుంది. అన్నింటిలో అంత సామాజిక, సామూహిక బృందగానలోల కదా, ఏడుపులో మాత్రం పూర్తిగా ఏకాకి, నాన్నని కూడా నెట్టేసే బహు ఒంటరి! ఓ వారం క్రితం, బాత్రూంలో కాలుజారి, చేతిలో వేడినీళ్లు మీద పడి లేలేత చర్మం బొబ్బలెక్కిన బాధలో ఏడ్చేసిన సందర్భంగా రాసిన కవిత– **“నీలాలు కారితే నే చూడలేను”**

ఆ రాత్రి ఈ కవిత రాసేసి, ప్రొద్దుటే వాడికి వినిపించేసి, ‘ఎలా ఉందిరా నాన్నలూ...’ అని అడిగితే, ఇలా చెప్పింది:

మితిమీరిన ప్రేమతో ఏమిచేయాలో తోచక నువ్వు ఫ్రీజ్ అవుతావు, ఈ లోపల ఏమి చేస్తే రిలీఫ్ వస్తుందో అది అమ్మ చేసేస్తుంది. Crisis managementలో నువ్వు జీరో అని నీ కవిత్వంతో నీ బండారం నువ్వే బైటపెట్టుకుంటున్నావు. అయినా, నెత్తి మీద నీళ్లకుండల గంగాభవాన్నని కవిత రాసి మరీ ఎక్కిరించక్కర్లేదులే....!

**(11.12.2014)**

# Falling in Love with YOU, many a time!

ఇర్వైయొక్క ఏళ్ళ క్రితం ఇదే రోజున తలంబ్రాలు (సేసప్రాలు) పోసుకున్న మా ముచ్చట తలుచుకుంటుంటే–

మూసి దాపిరములేల ముందరికి రాగదవే

సేసపాల వెంటనే చిమ్మిరేగె వలపు

...టిపి చక్రపాణి గారి గాత్రంలో అన్నమయ్య పదం గుర్తొచ్చింది.

మూసి దాపిరాల దోబూచులాడే దగ్గరతనం నిజంగానే చిమ్మిరేగే వేడుక వేళ తలంబ్రాలే కాబోలు.

చిన్నప్పట్నుంచీ పెళ్లంటే భలే ఇష్టంగా ఉండేది. పెళ్లిలో ఉండే visual feast ఒకెత్తు, అసలు పెళ్లి తంతే మరొక ఎత్తు. సాదాసీదా బతుకుల్లో మనమొక హీరో అయ్యి, మనకో జతని కుదిర్చి, బంధుమిత్ర సపరివారమంతా ఈ జంట కేంద్రకంగా సందడి చేసే సన్నివేశానికి వేదిక పెళ్లి తప్ప మరేముంటుంది?

అయితే, నాన్న గారు నాస్తికకేంద్రం గోరా గారి అనుయాయులు కావడం, తెనాలి కేంద్రక హేతువాద సిద్ధాంతాలకి అంతేవాసులు కావడం వల్ల ప్రత్యామ్నాయ సాంస్కృతిక సారథుల ఆధ్వర్యంలో జరిగే పెళ్లిళ్లకి హాజరవుతుండేవాడ్ని.

సరసం... సంబరం.... ఉత్సాహం.... ఉల్లాసం .... వంటి బూతు మాటలకి ఆ పరిసరాల్లో ఎక్కడా చోటుండేది కాదు. అందం... అలంకారం.... వంటివైతే అక్కడ పూర్తిగా నిషేధం. విచిత్రమేమంటే, నడిచే నగల దుకాణాలు ఉండే సంప్రదాయక పెళ్లిలోనూ, బోసి మెడలు, మొండి చేతుల ప్రత్యామ్నాయ పెళ్లిలోనూ బంగారం విలువైనదే తప్ప అందమైంది కాదు. అమ్మాయి–అబ్బాయి అవసరం కూడా అట్టే లేని ఈ ఊకదంపుడు ఉపన్యాసాల పెళ్లిలో

‘సోమో దద ద్గంధర్వాయ గంధర్వో దద దగ్నమే రియంచ పుత్రాగ్ శ్చాదా దగ్నిర్మహ్యమథో ఇమాం’– వంటి మంత్రాల్ని బొద్దింకని బయాలజీ స్టూడెంట్లు dissect చేసినట్టు ఖండఖండాలు చేస్తూ– “కాబట్టి ఆ వధువుకి మొదటి మొగుడు సోముడు, గంధర్వుడు మిండడు, అగ్ని రంకుగాడు... నువ్వు నాల్గో వాడివి...” అని అర్థాలు విడమర్చి ఎద్దేవా చేస్తూ, చివరికి వధూవరుల చేత గొప్ప utilitarian స్పృహతో మార్పిస్తారు– కూరగాయల దండలు (పూల దండలు ఉపయోగకరం కావంటూ).

బ్రతుకులోని ప్రతి passing second లోనూ జీవితోత్సవాల్ని నింపాలని గొప్ప సుఖలాలసతో వాంఛించిన సంప్రదాయక భారతీయంలో లోపాల్ని సరిదిద్దే తొందరలో ప్రత్యామ్నాయవాదులు ప్రతి సందర్భాన్నీ ఇంత నిస్సారం చేయడం చూసి కాబోలు నాకు పెళ్లికి సంబంధించి బోల్డు కలలుండేవి.

ఇక కాబోయే ఆమె గురించి కలలకైతే అంతులేదు.

“నిన్ను నిన్నుగా ప్రేమించుటకు.. నీ కోసమే కన్నీరు నించుటకు నేనున్నాని నిండుగ పలికే తోడొకరుండిన అదే భాగ్యమూ.... అదే స్వర్గమూ...” అని ఎన్నాళ్లబట్టో కలగా పలవరించాను. అలాగని నేనేమీ ముదురు బెండకాయని కాదు, ఎన్నేళ్ల నుంచో పెళ్లాం గురించి ఆరాటపడిపోడానికి. 1993 డిసెంబర్ 8 – పెళ్లి రోజు నాటికి 26 ఏళ్లు. తొలిప్రేమలో పడిన విషయాన్ని ఒక సందర్భశుద్ధితో అమ్మానాన్నకి చెప్పాను, కాదు రాశాను– 30 తావుల ఉత్తరం. పట్టుమని పద్దెనిమిదేళ్లు నిండకుండానే – మనసున మనసై బ్రతుకున బ్రతుకై..... అని అరువు తెచ్చుకున్న పాటల ఊతకర్రలతో నిటారుగా నిలబడి చూశాను – ఓ అందమైన కల.

అమ్మా నాన్నా ఏమనలేదు గానీ, మామయ్యలు ఆటపట్టించారు– అర్ధాంగి పిచ్చోడని (ఏఎన్నార్ సినిమాతో ఎక్కిరిస్తూ).

మధుపర్కాలు, ఎదుర్కోలు, సన్నికల్లు తొక్కడాలు, యోక్త్రధారణాలు, జీలకర్ర బెల్లంతో జిడ్డోడే ముఖాలు, మంగళసూత్రధారణంలో తప్పిన ముళ్ల లెక్క, పాణిగ్రహణమం పేరిట చిలిపిగా చెయ్యి చేసుకోవడాలు, ‘సఖాసప్త పదాభవ, సఖాయౌ సప్తపదా బభూవ....’ అని పురోహితుల వారు చదువుతున్న మంత్రాల అర్థం తెలియకపోయినా, పరస్పరం చేసుకున్న బాసల మౌన ప్రసారాల తోడుగా అగ్నిహోత్రం చుట్టూ వేసిన తడబడు అడుగుల గుడిగుడిగుంజం......

.... వీటి గురించే పలవరించిన అర్ధాంగి పిచ్చోడి పెళ్లికి రావడంలో ఒక కుతూహలం కూడా ఉండకపోతుందా?

పెళ్లి మంటపానికి అడుగులు వేస్తున్నప్పటి నా ఫొటో చూసి పొంచుదురాయుళ్లు ఒకటే ఎకసెక్కాలు. ధీమాగా, దిలాసాగా, టెక్కుగా, గీరగా, దర్పంగా, నిమ్మళంగా, ఎచ్చులకారిపిందెలా నడిచానట. “ఈ లోకంలో ఇదే మొదటి పెళ్లి అన్నట్టు, అది ఇతనికే

అన్నట్టు ఎంత పోతరం, ఎంత పోజు....." అనుకున్నారట.

అయితే అది నాణేనికి ఒక వైపే!

నిజమే నేను నడిచాను- అతిశయంలోకి; నిజంగానే నడిచాను.

అంతకు మించిన నిజం, నేనొక అనుమానంలోకీ నడిచాను.

భరోసాలోకే కాదు, ఒక భయంలోకి కూడా నడిచాను.

ఉష అంతటి దాని చిటికెన వేలు నిజంగానే నేనందుకుంటానా అన్న అనుమానం- పెళ్లైయ్యేంత వరకూ!

క్రీస్తుశకం 1993 డిసెంబర్ 8 బుధవారం హస్తా నక్షత్రయుక్త.... లగ్నాలు.... యోగాలు .... కుదిరి, తథాస్తు దేవతలు మూకుమ్మడిగా అక్షింతలు చల్లేశాక, నిలువెత్తు భరోసా ఉష అంతటి దానితో నా సహచరత్వం ఎన్నాళ్లు సాగుతుందో... ఏమోనన్న భయం.

ఆ అతిశయం- అనుమానం; భరోసా- భయం మధ్య roller coaster వంటి 21 ఏళ్లు గడిచిపోయాయి.

Boon & bane జంట పదాలకి మీ పెళ్లి రోజు మించి మరింకేం ఉదాహరణ ఉంటుంది నాన్నా' అంటుంది చిలిపిగా మా చిన్నతల్లి. నిజమే- మా ఉష నాకు ఎన్ని జన్మాల పుణ్యాల వరమో!

**(09.12.2014)**



# Paint the town PINK, it's my daughter's B Day!

నేను పేద పురుగునేం కాదు నా కంటే వెయ్యి రెట్లు బరువుని ఎత్తడానికి. కానీ, 'మనిద్దరం ఇక ముగ్గరం,అంటే మరింత ఒక్కరం' అని ఉష అసంబద్ధంగా చెప్పినప్పుడు, కనుకొొలకుల్లో నిలిచి, నిశ్చలించలేని నీటి బిందువు పెనుభారాన్ని ఎలా ఓపగలిగాను? దుఃఖానందాల బ్లాక్ అండ్ వైట్‌లతో సరిపోల్చలేని కొత్త రంగుల మలిన బాష్ప మౌక్తికమ్ము అది!

మలిన బాష్ప మౌక్తికమ్ము

మిలమిల నీ కనుల మెరియ

తళతళ మని తారలు నటయించునురా పాపి........

...... భరియింపగరాని లజ్జ

శిరము వంగి క్రుంగినంత

తెరలదాటి చందమామ నవ్వునురా పాపి......

అని కృష్ణశాస్త్రి గారు ఈసడిస్తున్నట్టుఅనిపించింది.

'ఇప్పుడు మన వల్ల అవుతుందా.. రా?' అడిగాను, చుక్కాని, పడవ, తెరచాప, లంగరు, చివరికి సరంగు కూడా తానేఅయిన ఉషని. "ఒక చేత్తో నిన్ను పొదువుకోలేదా, మరో చేత్తో తననీ" – చెప్పలేదు గానీ, అలా అన్నట్టు చూసింది, వెన్ను విరిగిన మిన్నుకి వెదురుబద్దల కట్లు వేసే తెంపరి తెగువతో.

పడవ.... సరంగు.... తెగువ అంటుంటే నోవా గుర్తుకు రాకపోతే పోనీ, నిన్నా మొన్నటి శాంటియాగో (హెమ్మింగ్వే 'ఓల్డ్ మన్ అండ్ సీ')అయినా గుర్తుకు రావాలికదా. రావాలి. కానీ, నాకు ఏమీ గుర్తుకు రాలేదు, ఎవరూ గుర్తుకురాలేదు,పురిటి నొప్పులు మొదలై ఆగిపోయినప్పుడు, రప్చర్ వల్ల ఉమ్మనీరు పోయిందని డాక్టర్ కృష్ణకుమారి, ఉష అమ్మమ్మకి కూడా పురుడు పోశానని తన 50 ఏళ్ల అనుభవాన్ని దిలాసాగా బైటపెడుతుంటే నాకు

ఏమీ గుర్తుకు రాలేదు, ఎవరూ గుర్తుకురాలేదు. అక్టోబర్ 28 అర్ధరాత్రి 11.30కి కేసు చాలా క్రిటికల్ అయ్యాక, సిజేరియన్‌కి సిద్ధం చేస్తుంటే, ఎనస్తీషియా ఇవ్వబోతున్నప్పుడునన్ను ఆపరేషన్ థియేటర్‌లోకి పిలిపించింది ఉష. ఏదో పొలిమేర ఫెన్సింగ్ తీగలకి చిక్కుకుపోయిన గాలిపటం రెపరెపలాంటి నవ్వుతో కన్నీరు మున్నీరవుతున్న నాకు ధైర్యం చెప్పింది– 'నాకేమీ కాదు, నువ్వు ఏడవకు'.

జీవన్మరణం లాంటి ప్రసవంకి బిక్కుబిక్కుమంటూ రాలేదామె. ఒక యోధలా వచ్చింది, ఏడేడు స్థైర్యాశ్వాలు పూన్చిన రథంలో. "నువ్వు ఆ అమ్మాయికి ధైర్యం చెప్పాలా, తను నీకు ధైర్యం చెప్పాలా?" అని పక్కుమని వెక్కిరించిన ఆపరేషన్ థియేటరు– ఆమె ముందు కొత్త ఒద్దిక నేర్చుకుంది. కళ్లు చికిలిస్తున్న ఓ చలివిడి ముద్దని అంతే ఒద్దికగా పెట్టింది, 'రెండో జన్మకి స్వాగతాన్ని స్వగతిస్తున్న' నిస్త్రాణమైన నా చేతుల్లో.

పారిజాత పరిమళం, కల్పతరు ఛాయ, కామధేనువు నవ్వు, ఐరావతం బద్ధకం కలగలిసి వెన్నెల తోబుట్టువుతో కూడా తరగలెత్తిన మా ఇంటి మాలచ్చి –పింకి (నైమిష) ఇప్పుడు పెద్ద ఆరిందై, "ఇంజనీరింగ్ కాలేజీలో చేరి కొత్త కొమ్ములు, కనిపించని రెక్కలు వచ్చాక కూడా ఏంటి నాన్నా ఈ పుట్టిన రోజు మెహర్బానీ" అంటుంది.

ప్రసవరోదనని జీవన్మరణ ప్రతీకగా తొలి జ్ఞాపకాన్ని నిలిపిన అమ్మకి; సర్వం తానైన సహచరై, ఆ జ్ఞాపకాన్ని ప్రత్యక్షంచేసిన నా ఉషకి; నాన్నగా నాకు పునర్జన్మనిచ్చి, నా ఆశగా, అంశగా తొలిశ్వాస తీసిన నా చిట్టితల్లికి అని –

1996 లో రాసుకున్న కవిత– **రెండో జన్మకి స్వాగత స్వగతం.**

◆◆ ◆◆

**(30.10.2013)**



# Who Are You?

**నాన్నా... ఎలా ఉన్నాను?**

– పొద్దు పొడిచిన గుర్తుగా చీరలో మెరిసిన నా చిన్నతల్లి (ప్రహర్ష)ని చూసి గాబరా పడ్డాను.

తనకంటే ఐదేళ్లు పెద్దదైన పెద్దోడు (నైమిష) చీర కడితేనే ఇష్టం ఉండదు నాకు. నిన్నామొన్నా పుట్టిందో లేదో, ఆరిందలా చీరలేమిటని నా కంగారు.... They outgrow my lap ఏమో అని నా ఆందోళన.

ఇక చిన్నోడు చీరగడితే ఇంకెంత ఉలుకు నాకు!

'జడుసుకోకు జనకా... ఈ రోజు టీచర్స్ డే.... అందుకని, మా టెన్త్ స్టూడెంట్స్‌ని టీచర్స్ రోల్స్ ప్లే చేయమన్నారు. నేను మా ప్రిన్సిపాల్ మామ్‌లా చేయాలి, అందుకే ఈ చీర...,' చెప్పింది.

ప్రిన్సిపాల్ గారిలా నటించాలా...????!!!!

నా ప్రశ్న,ఆశ్చర్యార్థకాల వెనక ఒక చిన్న కత ఉంది; దానికి మొదలు ఓ ఏడాది పైమాటే.

◆◆ ◆◆

చిన్నోడిని ఈ కొత్త స్కూల్లో చేర్చింది పోయినేడాదే. నైన్త్ స్టాండర్డ్ అడ్మిషన్ కోసం ఇద్దరం వెళ్లాం ఓ రోజు. అప్పుడు చూశాను ప్రిన్సిపాల్ గారిని. స్థైర్యానికి, ధీమాకీ చీర కట్టినట్టి, నిమ్మళమైన చూపు, శాంతమైన నవ్వు సహజంగా అమర్చినట్టు ఉన్నారామె. మా చిన్నోడికి లానే బాబ్డ్ హెయిర్. ఆమె ఆధ్వర్యంలో నడిచే స్కూలులో చదువుతో పాటు, పిల్లలకి భవిష్యత్తు మీద భరోసానీ, నిండైన ఆత్మవిశ్వాసాన్నీ అదనంగా ఇస్తారన్న నమ్మకం కలిగింది తొలిచూపులోనే. ఎంట్రన్స్ టెస్ట్ రాయబోతున్న చిన్నోడికి చెవిలో చెప్పాను– 'ఆల్ ద బెస్ట్'.

మరో గంటన్నరకి తిరిగి స్కూలుకి వెళ్లిన నాకు, ధీర గంభీర ప్రిన్సిపాల్ ధీమతి గారి నుంచి పిలుపు:

“మీ అమ్మాయి– ప్రహర్ష చాలా చురుకైనది, తెలివైనది, తనకి అడ్మిషన్ ఇవ్వడం నాకు సంతోషంగా ఉంది”

– ఆమె చక్కని ఇంగ్లీషులో చెప్పిన మాటల్ని అనువాదం చేస్తే ఇలా చప్పగా ఉండొచ్చు. అదెంత చప్పగా, పోనీ ఉప్పగా ఉన్నా, నా ఉత్సాహం మాత్రం మా గొప్పగా ఉంది.

మా అమ్మాయిల్ని స్కూల్లో దించే బాధ్యత ఎప్పుడూ నేనే లాక్కుంటాను కాబట్టి, స్కూలు దగ్గర దించిన ప్రతిరోజూ ప్రిన్సిపాల్ గారిని విష్ చేస్తూనే ఉన్నాను. ఆకుపచ్చ చెట్టు మీద, ఎండిపోయిన పుట్ట మీదా, కలకబారిన నీటి మీదా, బురద రొచ్చుల గుంట మీదా.... వేటిమీదైనా ఏ భేదాలూ చూపని సూర్య కిరణం వంటి నవ్వే ఆమె ప్రత్యుత్తరం.

ఏడాది గిర్రున తిరిగింది. నైన్త్ స్టాండర్డ్‌లో స్కూల్ టాపర్స్‌లో చిన్నోడూ ఉన్నాడు. టెన్త్ అడ్మిషన్‌కి ఫీజు కన్సెషన్ అడగటం అనే మిషతో ప్రిన్సిపాల్ గారిని కలిసాను.

సంవత్సరం పొడుగూతా నా ద్వారా గుట్టలుగా జమ అయ్యిన నా అభినందనల అభివాదాల ఆరాధనల అభిమానధనాన్ని దాచే జాగా దొరక్క అవస్థ పడుతుంటే, అప్పుడే– ‘ముఖేముఖే సరస్వతి’ అన్నట్టు నేను చటుక్కున ఎదురుపడితే...

“హలో మీరా....” “రండి రండి....” “ఎలా ఉన్నారు....”– వంటి కుశలప్రశ్నల్తో, అతిథి మర్యాదల హైరానాతో నన్ను embarrass చేస్తారా?

ఎన్నెన్నో expectationsతో నాలో ఏవో బాగా కిక్కిరిసిపోతున్నట్టు ఒకటే చిందరవందరల తొందర....

తబ్బిబ్బు కనబడనీయని అభినయ చాకచక్యంతో.... ‘నమస్తే మేడం’ అన్నాను.

అప్పుడు ఆమె చూసారొక చూపు– భృకుటిని పీటముడి వేసి– ‘ఎవరు?’ అన్నట్టు.

అస్సలు అనుకోని ఆ కంటి ఆశ్చర్యార్థకానికి నోట మాట రావడం కష్టమై, ఎలానో గొంతు పకలించుకొని, “ప్రహర్ష మా అమ్మాయి మేడమ్....” చెప్పాను.

“ఓహ్... ప్రహర్ష... She is such a lovely girl.... a brilliant student...

an asset to our school...'

"నేను..."

"అవును మీరు చెప్పారు, ప్రహర్ష డాడీ మీరు... ఎప్పుడూ కలవలేదు కదా, అందుకే మీరు తెలియదు.  Please tell me, what can I do for you...."

◆◆ ◆◆

"ఏరా చిన్నోడా... ప్రిన్సిపాల్ మేడమ్ లాగా బాగా యాక్ట్ చేశావా...," స్కూల్ నుంచి తిరిగి వచ్చాక ఆత్రంగా ఆడిగాను.

భృకుటిని bows లేదా loops లేని ఒక double knot వేస్తూ, దాచడం కష్టమైన తన నవ్వుని మూతి బిగించి దాచేస్తూ అడిగింది చిన్నతల్లి–

"ఎవరు మీరు... ఎప్పుడూ చూసినట్టు లేదే...."

– డౌట్ లేదు.... ప్రిన్సిపాల్ గారి పాత్రలో జీవించేశాడు చిన్నోడు!

**(06.09. 2015)**

# కానుకలేమి నేనివ్వగలను

**"జాబిలి కన్నా నా చెలి మిన్నా పులకింతలకే పూచిన పొన్నా
కానుకలేమి నేనివ్వగలను కన్నుల కాటుక నేనవ్వగలను...."**

"ఓహో... ఈ సారి కూడా ఏమీ తేలేదా.... అబూ ..." పెదవి విరిచాడు పెద్దోడు (నైమిష).

"పసుపైనా కానీవా... పదాలంటుకోనీవా... పాదాలకు పారాణై పరవశించి పోనీవా.."

"చాల్లే ఆపు నాన్నా! పుట్టిన రోజు అంటూ తెగ OA (అంటే ఓవర్ యాక్షన్ అట) చేస్తూ ఎవరెవరో దిక్కుమాలిన వాళ్లకి కూడా గిఫ్టుల్తో తయారైపోతావు కదా, మా అమ్మకి ఇవ్వడానికి చేతులు రావా?" – చికాకు పడ్డాడు చిన్నోడు (ప్రహర్ష).

నిండా 22 ఏళ్లగా ఏనాడు ఏది ఆశించింది కాబట్టి, ఈ రోజు కొత్తగా ఏం ఎదురుచూస్తుంది ఉష నా బహుమతుల కోసం? '...గాలి పెదవులే మెల్లగ సోకిన పూలు నవ్వెలే నిద్దురలో.....' అన్న పాటని గుర్తుకు తెచ్చే మెత్తని నవ్వుల్ని నాకే ఎదురు కానుక చేసింది.

◆◆ ◆◆

మా పెళ్లయ్యాక (డిసెంబర్, 1993) తర్వాత చప్పున వచ్చిన ఉష పుట్టిన రోజు (జనవరి 26, 1994)కి నేనిచ్చిన బహుమతి గుర్తొచ్చింది.

'నీడల్లేని చీకట్లో...' అనే దీర్ఘకవిత రాసి, దానితో పాటు మరికొన్ని నా కవితల్ని కలిపి, అదే పేరుతో ఓ సంకలనం అచ్చొత్తించి, జనవరి 26కి సిద్ధం చేసి ఉషకి తొలి ప్రతి అందించాను–

'జీవన ప్రయాణంలో పరమార్థరాహిత్యపు నా ఒంటరి నడకకి చిటికెన వేలందించిన ఉష'కి కాన్క చేసిన ఆ కవితాసంకలన ప్రచురణ వెనక కొంత 'అశ్లీల' 'అనైతిక' గుంజాటన ఉంది.

నీడల్లేని చీకట్లో ముఖచిత్రం– అనితరసాధ్యమైన తన తంత్రీనాదంతో లోకాల్ని సమ్మోహనం చేసే Orpheus తన ప్రాణాధిక ప్రేయసి, సహచరి Eurydiceని మృత్యుంజయని చేసి దక్కించుకోగలనో లేనో అన్న ఆశ–నిరాశల... విశ్వాసావిశ్వాసాల పెనుగులాటలో ఘోషవతి వంటి తన Lyre మీటుకుంటున్న దృశ్యం – అదీ నా అంతట నేనుగా ఎంచుకున్న కవర్ పేజ్. మొలచుట్టూ కాసింత గుడ్డ కూడా లేకుండా జారిపోవడంలోని అశ్లీలం నచ్చలేదు పబ్లిష్ చేద్దామనుకున్న మిత్రులకి. మో (వేగుంట మోహనప్రసాద్ గారి) చొరవతో తెనాలి మిత్రత్రయం జుగాష్ విలి– పసుపులేటి వెంకట రమణ– బి తిరపతి రావు– వేయడానికి సిద్ధమైనా, వారికి మరో నైతికమైన సమస్య ఎదురయ్యింది. అప్పటిదాకా రేపటి సమాజాల కోసం స్వప్నించే ప్రగతిశీల కవిత్వాలు ఒక ఒరవడిగా తెస్తున్న వారికి నా శారీరకగానాల దేహచింత– కవితావస్తువై ఎదురవ్వడంలోని సైద్ధాంతికమైన గింజులాట. మో సిఫార్సు కాదనలేక ప్రచురణలకి మారు పేరు తగిలించి మరీ వేశారు.

ఏ నీడలూ లేని చీకట్లో సత్యాన్ని సత్యాన్ని నేను నేనుగా నీకు సమర్పించు కుంటున్నానంటూ పుట్టినరోజు కానుకనయ్యాను ఉషకి.

అక్షరాల పొగడమాలికలంటే తనకీ ఇష్టమే కావడం, అది కూడా ఆ పూలు నా గుబురుల్లోంచి ఏరుకున్నవి కావడం తనకి కూడా సంతోషానిచ్చింది.

కానీ....

తమకపు ప్రయాణాల్లో ఓడినదూరం<br>
ఆద్యంతాల్లేని<br>
నీ దాహపుటేరుల<br>
గట్లు ఒరిసే వరద ఒరవడిలో<br>
అశక్తతల గడ్డిపోచని–

వంటి పాదాలు చూసి కంగారు పడిపోయింది, "కవికి, ముఖ్యంగా గుట్టుమట్టూ తెలియని ఇటువంటి బరితెగింపుల కవికి భార్య కావడం కంటే పరువు తక్కువ ఉంటుందా..." అనుకుంటూ–

ఈ అశ్లీల... అనైతిక రాతలు చూస్తే, ఎక్కడ నన్ను ఏ Casanova అనుకుంటారేమోనని బెంగపడే తనకి ఆ తర్వాత మరేమీ ఇవ్వకపోడానికి కారణాలేముంటాయ్, నా దగ్గర అక్షరాలు తప్ప మరేమీ లేకపోవడం, ఏదైనా ఇవ్వడమే తప్ప తీసుకోవడం తెలియని నా ఉష స్థాయికి తగ్గ బహుమతి కోసం నేను ఈ ఇరవై రెండేళ్లుగా వెతుకులాడుతూనే ఉండటం, తప్ప!

**(26.01.2016)**

# బంగారు పతిమవు....
# పాలవెల్లి కూతురవు!

**'లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం...'**

లక్ష్మీ శ్లోకంలో ఈ పాదం వినగానే ఎందుకో చెప్పలేని పులకింత. '... శ్రీరంగ ధామేశ్వరీం... దాసీ భూత సమస్త దేవ వనితాం... 'వగైరా... వగైరా... అవేమీ మనసుకు ఎక్కలేదు ఎప్పుడూ. 'సముద్ర రాజ తనయాం...' అని విన్నప్పుడు అకారణంగా అంతర్లోకం సముద్రమై గంతులేయడమే కాదు, ఎప్పుడు చూసినా కొత్త దృశ్యమై కదలాడే కడలి ముందుకు వెళ్లినప్పుడల్లా 'లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం...' అన్న పాదంలో ఆలాపనలా వినిపించేది. నేను పెరిగిన చీరాల శివార్లలో సముద్రం ఉంది అనాలో, సముద్రం చెలియలికట్టకి చేరువలో చీరాల ఉంది అనాలో తెలియదు! 'లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం...' నన్నెప్పుడు చుట్టుకుందో తెలీదు. ప్రొద్దుటే నిద్రలేస్తామా.... స్వప్నావశేషంలా ఏదో పాటొకటి చుట్టుకొని మనతో పాటే లేస్తుంది; గున్ గునాయిస్తూ ఇక రోజంతా విడిచిపెట్టదు కదా ఎంత ప్రయత్నించినా, అలాగన్నమాట! కొన్నిసార్లు అనిపించేది- నన్నూ- సముద్రాన్నీ ఒకే అర్థానికి జంటపదాలుగా చేసింది ఆ చరణమా అని. వయసు పెరిగేకొద్దీ నూనూగు మీసాలు బిరుసెక్కినట్టు, రుచులు ఘాటెత్తినట్టు, మనసుని కవ్వం చేసే కవిత్వం నానాటికీ చిక్కనవ్వాలి కదా.... పూత మొత్తంగా రాలిపోవాలి కదా.... పాతదంతా మరుపు మాళిగల్లోకి జారిపోవాలి కదా..... 'లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం'- మాత్రం వెన్నంటే వచ్చేస్తుంది.

బహుశా అదొట్టి అక్షరాల చేరుపు ... పదాల పేరుపు కాదేమో! శబ్దానికి ఆయువైన అర్థమో..... అర్థానికి ఆలంబనైన శబ్దమో కాదన్నమాట.

జన్మాంతరంగా సంచితమై నన్ను వెన్నంటుతూనో..... ఆగామి దిక్సూచై రేపటి బాటల్లోకి నాకు దారితీస్తూనో.....

◆◆ ◆◆

పెళ్ళయ్యింది, నది వంటి ఉషతో. నది అంటే, అట్లాంటిట్లాంటి నది కాదు, సముద్రపు ఉప్పటి నిష్క్రియాపరత్వాన్ని వేనవేల తరంగాలతో వెనక్కితోసేసిన అమెజాన్ నది! ఉష పుట్టిపెరిగిన పిల్లలవారిపాలెం (కూచినపూడి)కి కూడా సముద్రం అల్లంత దూరమే.... గుడ్డికాయిలంక నుంచి కొత్తపాలెం దాటుతూ జెర్రిగొడ్డులా మెలికలు తిరిగిన పొడవాటి 'బాడే' కాల్వమీద సముద్రానికి తీసుకెళ్తానంది ఉష. అంత సాహసాలు వద్దన్నాను. అతిథులుగా వచ్చిన కవిమిత్రులు–, సిద్దార్థ, చక్రధర్, శ్రీ, నాయుడు..... ఎడ్లబండిలో వెళ్దామన్నారు. తెల్లవారు జామున నక్షత్రనగర తోవలో సముద్రానికి– అడవులదీవి – ఊబిలా భయపెడుతున్న బురద తీరాల లసలసలో

'లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం...'

◆◆ ◆◆

మెరీనా బీచ్.... గోల్డెన్ బీచ్... మద్రాసులో మా కొత్త కాపురం

తమిళతీరమైతేనేం– నా కూనరాగం పదిలం– 'లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం...'

తర్వాత – ఉష అంటే ఏకవచనం కాదని తెలిసినప్పుడు, జీవన్మరణాల సంధిని ఉష నిండుతున్న నెలల అంగలతో ఉష దాటబోతున్నప్పుడు

'.... పుప్పొడి ఎంగిళ్ల నోటితో సీతాకోకల సీమంతపు ముద్దంటే ఇదేనా

నువ్వు పీల్చిన గాలిలో రెండాశల శ్వాస నువ్వద్దిన ముద్దులో పచ్చమామిడి పులుపు

ఇప్పుడెలా కావలించను నిన్ను ఏకవచనపు బాహువుల్తో....'

– అని ఉష కోసం కవితలల్లినప్పుడు అక్కడెక్కడో ఊరిచివర కొట్టివాక్కం బీచిలో– soliloquy లా వినిపించింది – 'లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం... '!

అప్పుడది ప్రశ్నలా కాదు, సమాధానంలా– ఓ సాక్షాత్కారంలా!

◆◆ ◆◆

బహుశా మరి కొద్ది నెలల తర్వాత–

అక్టోబర్ 28 అర్ధరాత్రి దాటి కాలం మరుసటి రోజు– అక్టోబర్ 29 లోకి మారి గంట గడవలేదు!

పొత్తిళ్లలో 'సముద్ర రాజ తనయ'! నన్ను నాన్నని చేసిన నా పింకితల్లి!

తొలికారు మెఱుగు కైవడి తళతళ మని మేను మెఱయ ధగ ధగ మనుచున్ గలుముల

నేనెడు చూపుల చెలువంబుల మెదలి టెంకి సిరి పుట్టె....

– ఏమిటీ నువ్వు సముద్రుడివా..... నీకు శ్రీలక్ష్మి పుట్టిందా.... దాంతో నీకు పోతన పూనాడా– ఈ పద్యంలో 'టెంకి' అని వినిపించినంత వరకూ కరెక్టే బావా... నీ కూతురు ముదురు టెంకి... రణ పెంకి .. అంటూ వేళాకోళాలు. తెల్ల ఏనుగు (ఐరావతం) కూడా తోడుగా పుట్టింది కదా ఆ బద్ధకమే వచ్చినట్టుంది నీ కూతురికి అని దెప్పుళ్లు. తెల్లని గంగిగోవు (కామధేనువూ)... గుసగుసల సకిలింపులు సహించని గుర్రం (ఉచ్ఛైశ్శ్రవం).... షోడశ కళల సౌందర్యం (రాకాసుధాకరం) ఇంకా.... కల్పవృక్షం.... పారిజాతం... కూడా తనతోనే పుట్టాయి... తనలో ఉన్నాయి!

◆◆ ◆◆

శ్రీమహాలక్ష్మికి తల్లెవరో నాకు తెలియదు (భృగు– ఖ్యాతి అని పాత పురాణాలు నాకొద్దు).

నా మటుకు నాకు ఆమె క్షీర సముద్ర రాజ తనయే. నాన్న కూతురు!

ఈ పొత్తిళ్లలో పసిగుడ్డు కోసం ఉష నిజంగానే చావు పొలిమేరలు తాకి వచ్చింది; అయినా గానీ, మా ఇంటి మాలచ్మి – నా పెద్దతల్లి – నాన్న కూతురే అప్పుడూ... ఇప్పుడూ!

ఈ నాన్నకూచికి పుట్టిన రోజు జేజేలు

**(29.10.2015)**

# A Star Danced & Under That Was She Born

**2001 మే 18 అర్ధరాత్రి:**

నాలోంచి నన్నెవరో అందినంత వరకూ చేద బొక్కెన్లతో తోడేస్తున్నప్పుడు, అనావృత ఆకాశం అపార కృపాపేక్షలతో ఖాళీ అయినంత మేర తన అనంత శూన్యాన్ని నాలో నింపేస్తున్న భయదానందాల అయోమయంలో భీతి మెలమెల్లగా సంప్రీతిగా సజలమౌతున్న సంధిక్షణాల్లో చూస్తుండిపోయానొక నక్షత్రాన్ని.

"కళ్లెదురుగా కనిపిస్తున్న నక్షత్రం అక్కడ ఉన్నట్టని అనుకోనక్కర్లేదు. సెకనుకి లక్షా ఎనభైఆరువేల మైళ్ల వేగంతో కోటానుకోట్ల యోజనాలు ప్రయాణం చేసి నీ కంటిని మిణుకుమిణుకు దీపకాంతై తాకే వేళకి ఆ నక్షత్రం అక్కడే ఉన్నట్టు అనిపిస్తుందంతే..."- అని భౌతిక ఖగోళ పాఠాలెన్ని నిజాలు నూరిపోయలేదూ!

నిజమే! వెల్తురు చుక్క ఇప్పుడక్కడలేదని భౌతిక శాస్త్రం చెబితే, ఆ మిలమిల శోభల మిణుకు మిసిమి నేలకి దిగి పురిటిపొత్తిళ్లలో 'కేర్' మన్న ఆధిభౌతిక సత్యం హర్షంగా 'ప్రహర్షం'గా బోధపడిందప్పటి వేకువజాము బ్రాహ్మీముహూర్తంలో.

◆◆ ◆◆

ఉష కాన్పుకి ఇచ్చిన due date జూలై మొదటి వారంలో. కానీ, మెదడంతా అలుముకున్న ఆలోచనల ఒత్తిడి ఓపలేని ఉష పెద్ద ప్రాణానికి పెనుగండం; దాంతో మే 17 రాత్రి ముషీరాబాద్ లో సాగర్‌లాల్ మెమోరియల్ ఆస్పత్రిలో చేర్చక తప్పలేదు. డాక్టర్ సూరి శ్రీమతి గారు- గొప్ప గైనకాలజిస్ట్, సత్యసాయికి పరమ భక్తురాలు, ప్రఖ్యాత శాస్త్రవేత్త స్వర్గీయ సూరి భగవంతం గారు ఆమె పెదనాన్నగారు. మానవసేవే 'సాయి'మాధవ సేవని మనసా కర్మణా భావించే శ్రీమతి గారు కామరాజు అనిల్ కుమార్ అంకుల్‌తో నా బాంధవ్యం వల్ల నన్నూ సాయి కుటుంబసభ్యుడిగానే చూస్తారు, ప్రత్యేక ప్రేమతో. (అప్పటికే) 70 ఏళ్ల వయసు లో కూడా తగ్గని వేగం- అక్కర వంటి ఆ దూకుడుతోనే వచ్చేశారు ఆస్పత్రికి రాత్రికి రాత్రే. భయపడాల్సింది లేదని నాకు ధైర్యం చెప్పారు, ఉష దిటవుని

దిగజార్చుకుంటే చాలని మరీ ముఖ్యంగా హెచ్చరించి, సిజేరియన్ ఏర్పాట్లలోకి కదిలారు.

నెలలు నిండినా పుట్టలేదు పెద్దోడు (నైమిష), ఈ సారి కాన్పు – ఏడోనెల నిండిందో లేదో లోపల బిడ్డ పద్మవ్యూహ రహస్యాలకి ఊ కొడుతుంది, ఒక ఉలికిపాటుగా. ఏమీ పాలుపోక పచార్లు చేస్తుంటే, ఇద్దరు నర్స్ కుట్టీలు ముసిముసి నవ్వులతో గుసగుసలు పోతూ, నన్నుద్దేశించి మలయాళంలో ఏదో అన్నారు. వారి మాటల్లో 'లిజి' అని విన్పించి, చటుక్కున పాత సంగతులేవో అసంగతంగా తోసుకొచ్చినా మునుపటి ఉత్సాహం మచ్చుకైనా లేని గొంతుతో అడిగాను– 'లిజీ ఎక్కడా?'

నిజానికి పాత అంటే, మరీ అంత పొడవైన గతం ఏమీ కాదు, ఆ హాస్పిటల్ నాకు కొత్త కూడా కాదు. మా నాన్న గారికి ప్రోస్టేట్ గ్లాండ్ ఆపరేషన్ జరిగి డిశ్చార్జ్ అయ్యి నిండా రెండు వారాలు కూడా కాలేదు.

'ఆపరేషన్‌కే బోల్డు డబ్బులైపోయాయి, ఇంకా పోస్ట్ ఆపరేషనల్ సాకులతో ఆస్పత్రిలో ఉండిపోతే ఇంకెంత ఖర్చు..' అని నాన్నగారు అంటున్నా బలవంతాన In-patient గానే ఉంచేశానక్కడే ఆయన్ని.

'పనులన్నీ మానుకొని నువ్వు రాకపోతే ఏమిట్రా, ఇంతమంది ఉన్నారు, వాళ్లు కాకపోయినా ఆస్పత్రి వాళ్లున్నారు...'

– రోజూ ఠంచనుగా వచ్చి నేను శ్రమ పడిపోతున్నానని నాన్నగారి హైరానా.

'అవును నాన్నా! మీరంటున్నట్టు ఆస్పత్రి వాళ్లున్నారు; ఆ ఆస్పత్రి అనంగ రాగాల కోసమే కదా నా ఆరాటమంతా...' – గుండెలో కొట్టాడే మాటల్ని స్వరపేటికలో మూసేయడం భలే కష్టం.

"మా పెద్దబ్బాయికి ఆస్పత్రి వాతావరణమంటే అస్సలు పడదు...." – స్వకీయ పురాణాలు విప్పడానికి అవకాశం కోసం దొరకబుచ్చుకునేంతవరకి మాత్రమే ఎదుటి వాళ్ల సోది భరించే పక్క వార్డు పిన్నిగారి ఫీలింగ్స్‌తో సంబంధం లేకుండా మా అమ్మ చెప్పుకుపోతుంది నా గురించి. ఈ విషయంలో నేనూ మా అమ్మ ముక్కు నుంచి ఊడిపడ్డాను– ఎదుటివాళ్ల సౌకర్యంతో సంబంధం లేకుండా నా ఆటోబయోగ్రఫీలో పేరాలు పేరాలు లేపేసి ఇలా వెదజల్లి కుప్పలు పోస్తూ–

ఆస్పత్రి అంటే పడకపోవడం అన్నది చాలా చిన్న మాట– తెగిపడ్డ అవయవాల వ్యథార్థ యథార్థం, గడ్డగట్టిన నెత్తుటి వాసనల వెగటు దైన్యం,

చావు చాచిన వరండాల్లో పెద్దమ్మోరి ఇనపగజ్జెల మోత కనలేని... వినలేని నిస్సహాయతలోంచి..... కుంగుబాటులోంచి... జుగుప్సలోంచి.... భయంలోంచి.... వైరాగ్యం!

అటువంటి రుజాగ్రస్త ఆస్పత్రి –

లలిత లవంగ లతాపరిశీలన కోమల మలయ సమీరే

మధుకర నికర కరంబిత కోకిల కూజిత కుంజ కుటీరే.... అన్న జయదేవ కవిత్వాన్ని గుర్తుచేసే నికుంజమయ్యిందంటే దానికి కారణం – ఆ ఆవరణ అంతటా కిసలయించిన మలయాళీ మల్లెమొగ్గలు. నాన్నగార్ని అటెండ్ అయ్యే మల్లికలు ఇద్దరుముగ్గురిలో లిజి మాథ్యూ మాత్రం– లిల్లీ పువ్వు– మిగతా అందరినీ అతిశయించే తెల్ల తామర. నాన్న గార్ని చూడటం కేవలం సాకు, లిజీని చూడ్డానికి, కలవడానికి, వినడానికి, మాటాడటానికీ పనికొచ్చే సాకు. అయితే, తన డ్యూటీకి ఒక పద్ధతీ పాడూ ఉండేవి కావు. నర్సింగ్ కాలేజీలో వీళ్లంతా స్టూడెంట్లు కావడం వల్ల ఎప్పుడు క్లాసులు ముంచుకొస్తాయో, ఎప్పుడు తన పగటి షిఫ్టుల్ని కబళిస్తాయో తెలియదు.

నన్ను నేనే మభ్యపెట్టుకునేంత గుట్టుగా తన గురించి తెలుసుకునే సవాలక్ష ప్రయత్నాల్లో చిత్తుగా ఓడి, తను లేకుండా తనకు మారుగా వదిలెళ్లే పరిమళం నన్ను వెక్కిరించినప్పుడు సమాచార వ్యవస్థలన్నీ కుప్పకూలి నా సుదీర్ఘ పాత్రికేయ అనుభవం కుదేలవుతుంది. ఆ దాగుడుమూతలలా సాగుతున్నప్పుడు నా నిశ్శబ్ద రహస్యారాధన మొత్తం – పిల్లి కళ్లు మూస్కొని పాలుతాగడంలాంటిదని అందరికంటే చివర్న లిజీకి తెలిసేటప్పటికి కొలీగ్స్ అందరూ కోళ్లై కూసి, తనని యూరాలజీ డిపార్టుమెంటు నుంచి మరో చోటికి మార్చేసేలా చేశారు. లిజీని గైనకాలజీ సెక్షన్‌కి మార్చారని తెలుసుకునేటప్పటికి నాన్నగారు ఆరోగ్యంగా ఇంటికి చేరుకున్నారు కూడా.

నేనిప్పుడు లిజీ కోసమే తచ్చాడుతున్నాననుకొని కాబోలు ఆ నర్సులిద్దరూ ఇచ్చకాలు పోతుంటే అడిగాను అన్యమనస్కంగానే– 'లిజీ ఎక్కడా?'

ఓ టి (ఆపరేషన్ థియేటర్)లో ఉందని సైగ చేశాయా ఇకిలింతలు.

◆◆ ◆◆

నాలోంచి నన్నెవరో అందినంత వరకూ చేద బొక్కెన్లతో తోడేస్తున్నప్పుడు....... కారిడార్ బాల్కనీలో వేగుచుక్కొకటి పొడుస్తున్న ఆపరేషన్ థియేటర్ తలుపు నొట్టుకొని వచ్చింది లిజీ, పొత్తిళ్లలో పసిగుడ్డుతో. గుర్రాల కొట్టం నుంచి ఏసయ్యని తెచ్చిన రెల్లు పొత్తిళ్లు, చెరసాల నుంచి కిట్టయ్యని పొదివి తెచ్చిన బొంత పొత్తిళ్లు – తెచ్చి నా చేతుల్లో పెట్టిన తెల్ల రెక్కల చిద్రూప– లిజి!

నెల తక్కువ, బరువు తక్కువ చలివిడి ముద్దని తమలపాకుల వాయనంలో పెట్టి

చదివించినట్టు నా చేతుల్లో పెట్టిన లిజీ– నన్ను ఆరాటపెట్టిన గుబుళ్ల గుబాళింపు కాదు, తెలిసి కూడా తెలియనట్టు తెరచాటులకి నక్కే నంగనాచి కాదు....

అంతకుమునుపు ఎన్నడూ వినీవినని, కనీకనని పొగడమాలిక! కూన నవ్వుల నక్షత్రాన్ని స్వీయంప్రకాశకత్వంతో సహా మోసుకొచ్చి నాకు అప్పజెప్పిన మబ్బురెక్కల ప్రియదూతిక మాత్రమే.

◆◆ ◆◆

ఆ తర్వాత వచ్చిన ఈ పద్నాలుగు పుట్టినరోజుల్లో చిన్నతల్లి మా దగ్గర లేనిది ఇదే మొదటిది. ఎప్పుడూ వేసవి సెలవల్లో వస్తుంది కాబట్టి తిథుల ప్రకారం హనుమజ్జయంతి రోజూ, చలం గారి పుట్టిన రోజంటూ మే 18 నాడూ సందడి చేసే చిన్నోడు ఈ సారి రెంటికీ వాళ్ల అమ్మమ్మ గారింట్లోనే ఉండిపోయి, పుట్టిన వెంటనే పారదర్శకపు incubator గాజు గర్భకుహరంలో నెలకి పైగా నక్కినప్పటి రోజుల్ని మళ్లీ గుర్తుకు తెచ్చిన ఈ nostalgic సందర్భంలో...

MANY MANY HAPPY RETURNS OF THE DAY చిన్నోడా!

**(18.05.2015)**



# నా కొరకు చెమ్మగిల్లే నయనం

నా కొరకు చెమ్మగిల నయనమ్ము లేదు– కృష్ణశాస్త్రిగారి ఈ కవితా పంక్తి మొట్టమొదట చదవకముందే అది నన్ను ఎన్ని మార్లు చుట్టేసిందో. నా కోసం చిప్పిల్లే కన్ను కానరాలేదని ఎంత దిగులు పడ్డానో.

ఏం– నువ్వేమైనా అనాథవా? పోనీ ఏకాకివా?

అదేమీ లేదు. నడిస్తే నా కాళ్లు కందిపోతాయేమోనని వాళ్ల అరచేతులు పరిచిన అమ్మానాన్నా గారాం....

జడలు కట్టి విస్తరించిన మఱ్ఱిమానులాంటి శాఖోపశాఖల బంధుజనాల మురిపెం...

నా కంట్లో నలుసు పడితే, ఒక్క కన్ను ఏంటీ .... డజన్ల కొద్దీ ధారకట్టేవి నా కోసం. వాటి గురించి కాదు నా పట్టింపు.

ఏను మరణించుచున్నాను; ఇటు నశించు

నాకొరకు చెమ్మగిల నయనమ్ము లేదు;

పసిడివేకువ పెండ్లిండ్ల పడిన యెవరు

కరగనేర్తురు జరతాంధకారమృతికి...

– అసలు కృష్ణశాస్త్రి గారి context కూడా ఎంతమాత్రం కాదు నా పట్టింపు.

'నాకొరకు చెమ్మగిల నయనమ్ము లేదు'– ఆ ఒక్క వాక్యం వరకే!

ఈ జానాబెత్తెడు వాక్యం నన్ను పట్టి పల్లార్చిన తీరు చెప్పాలంటే అన్నమయ్య సాయం కావల్సిందే.

".. మోమరవంచి పదాంగుటమున నిల నొయ్యన వ్రాయుచు

కోమలి కన్నీరెడనడ గ్రుక్కుచు రెప్పలను

వేమరు నా దెస జూచిటు వీడ్కొన నొల్లని భావము...."

– పెనుగులాట కనిపించనీయకుండా కళ్లు అరమోడ్చి.... కందిన ముఖం అరకొరగా వంచి... కాలి బొటనవేలితో నేల మీద రాసే గజిబిజి రాతల్లో వీడ్కోలు వియోగశోకాల శ్లోకాల్ని ఇమిడ్చి... కన్నీరెడనడ గ్రుక్కే కన్ను!

అటువంటి కన్ను లేదని నా ఏడుపు. కంటి మీద నీటిపొరలు కమ్మేసే అటువంటి సందర్భం గురించే పట్టింపు.

'ప్రేమనిచ్చిన... ప్రేమ వచ్చును..

ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును....' అన్న గురజాడ వారి అడుగుజాడ నా వరకూ అబద్ధం...!

ఆమే శ్వాసై.... ధ్యాసై ఎంత అంగలార్చాను! లిప్తలో రద్దయ్యే దర్శనాలు కూడా సహించలేక రెప్పపాటుని కూడా మర్చానే... ఏ కన్ను అయినా.... తడిబారిందా?

అదేమంటే? నీ 'ఆమె' – ఏకవచనం కాదంటూ నా అవిధేయత మీదే ప్రత్యారోపణలు. అసలు ఆమె ఎవరైనా... ఎక్కడైనా.... ఏకవచనమై ఉంటుందా?

కొరకున్... కై.... వలనన్... కంటెన్... పట్టి అని ఏ గొణుగుడుగుంజాల గుంజాటన లేకుండానే చటుక్కున సాక్షాత్కరించిందా నయనం! నేను తపించి... తల్లడిల్లి... తరుముకులాడిన కన్ను!

పెళ్లైన తర్వాత పట్టుమని పది రోజులు కాకుండానే తిరుగు ముఖం పట్టాను, కొలువుకి. అప్పుడు చూశాను సజలమైన ఆమె కళ్లు! తొలినాళ్ల వ్యామోహాలనే సగటుతనాలకి అతీతమైన ఉష కంట్లో నా కొరకు..... తొణికిసలాడిన నీరు... ఆమెలా స్ఫటిక స్వచ్ఛమైన రంగులో మెరిసిన కన్నీరు. ఉబికీఉబక ముందే నన్ను ఉవ్వెత్తున ముంచిన పన్నీరు.

సగభాగం కాదు... నన్ను నన్నుగా... నా తప్పులు... ఒప్పులతో సహా సర్వంగా తనలో ఇముడ్చుకున్న 'ఉష' అనే ఆ అద్భుతం కోసం రాసుకున్నానప్పుడు కవిత– **'తడి పజ్యమొహటి!'**

ఇరవై రెండేళ్ల తర్వాత ఈ మా పెళ్లి రోజు (డిసెంబర్ 8) సందర్భంగా నా కొరకు చెమ్మగిల్లే నా ఉష నయనాన్ని తలపోస్తూ....

**(08.12.2015)**

# She’s Outgrown My Lap!

దీపావళి అంటే అర్థం తెలియని పసితనం నుంచీ, దీపావళికి ఎవరి అర్థం వారిదేగానీ, నిర్దిష్టమైన అర్థం అంటూ ఏమీ ఉండక్కర్లేదని అనుకునే ఇప్పటి తెలివిమీరిన నాటి వరకూ– దీపావళి పండగ అంటే నాకెంతో ఇష్టం. ఎంత ఇష్టమంటే– దివాలీ అనో దివాలా అనో దాని దినమనో దిక్కుమాలిన నామాంతరాలతో దాన్ని గుర్తిస్తే సహించలేనంత... ఎన్ని టపాసులు కాల్చినా చెవికి ఏనాడూ చిన్న చిల్లు కూడా పడనంత... కార్తీక శుద్ధ పాడ్యమి నుంచీ వచ్చే ఆశ్వీయుజ శుద్ధ బహుళ అమావాస్య వరకూ రోజులు లెక్కబెట్టుకునేంత... అంతకంత ఇష్టం!

నేను చూసిన తొలి శాస్త్రవేత్తలు చిన్నప్పుడు మా వీధి చివర పెంకుటింట్లో ఉల్లిపాయ బాంబులు తయారు చేసేవాళ్ళే. వాళ్లలా మాసిన గడ్డాలతో, కంతల బనియన్లతో వొళ్లంతా మసి దాగులతో గంధకం, సూరేకారం, గన్ పౌడర్ కలుపుతుంటే గొప్ప థ్రిల్లింగ్‌గా ఉండేది. ఓ సారి మందు తయారు చేస్తున్నప్పుడు జరిగిన పెద్ద ప్రమాదంలో ఒకడు చనిపోయి, ఇద్దరికి చేతులు తెగిపోయిన దృశ్యాన్ని నా కళ్ల ముందు పాతికడుగుల దూరంలో చూసి కూడా దీపావళి బాంబులు చేత్తో కాల్చే ఉబలాటాన్ని మానుకోనంత మహాఇష్టం దీపావళి అంటే.

**నాకు తెలిసి నేను జరుపుకోని దీపావళులు రెండే రెండు:**

1. అప్పుడు ఉషకి నిండు నెలలు– పెద్దోడు (నైమిష) కడుపులో ఉంది. Due Date దగ్గర పడి, ఏవో తెలియని క్లేశానందాలు కమ్ముకొని, రేపల్లె ఆస్పత్రి టెర్రాస్ మీద ఒకరికొకరం తోడుగా మేమిద్దరం ముగ్గురం కాబోతున్న ఆశంసల ఆత్రుతలో ఏకాకులమయ్యాం– నేనూ– ఉష! దీపావళి వెల్తురు సందళ్లు కనబడలేదు... వినబడలేదూ–

2. ఇక రెండో సందర్భం: మరుసటి దీపావళి నాటికి, మా తండ్రీ కూతుళ్లం ఒకరి లోకంలో మరొకరం దారితప్పి... మాకు మేమే పట్టుబడి... అలిగి... బుజ్జగించి... బాహ్యంలా నెపమై... అంతరంలా అరూపమైపోయాము. అప్పుడు తప్పనిసరై ఉష ఊరెళ్లింది, సహజంగానే పింకితో పాటు. వాడు పుట్టిన ఆ ఏడాదిలో తనని విడిచి ఒక్క పూటైనా లేను. అట్లాంటిది, నెల రోజులు నేను వెళ్లలేకపోయాను, ఉష తిరిగి రాలేకపోయింది. అప్పుడొచ్చిన దీపావళి కూడా ఎప్పుడు.. ఎలా వచ్చిందో... ఎలా వెళ్ళిపోయిందో కూడా తెలీదు.

అప్పుడు రాసుకున్న కవిత **రెండు అమావాస్యలు** (1997)లో ఆ రెండూ దీపావళి పండుగల నిశ్శబ్ద ఉద్వేగాల్ని చెప్పుకున్నాను:

◆◆ ◆◆

ఈ కవిత రాసుకున్న రెండు మూడు రోజుల్లో తిరిగొచ్చింది ఉష. ట్రైన్ రావడానికి చాలా ముందే రెండు గంటల ఎదుర్చూపు అయ్యాను ప్లాట్ ఫార్మ్ పొడుగూతా. మద్రాస్ సెంట్రల్ స్టేషన్ (అప్పుడు మద్రాసులో కొలువు) నా పచార్ల అసహనానికి కొంచెం గట్టిగానే కంపించింది. రైలు రానే వచ్చింది. వీళ్లున్న బోగీలోకి ఒక్క అంగలో దూకాను, అది టెర్మినస్‌యే ననీ, అక్కడ్నుంచి ట్రైన్ ఎక్కడికీ పారిపోదనీ ఎవరెవరో తమిళ తెలుగు యాసలో అరుస్తున్నారు కూడా. నెల రోజుల తర్వాత పింకిని చూసిన తొందరలో గెంతాను తన వైపు. అప్పుడు జరిగిందొక సంఘటన– బెదురు బెదురుగా పింకమ్మ ఉష వెనక నక్కుతుంది, ఎవరో కొత్తవాడ్ని చూస్తున్నట్టు చూస్తూ. కాళ్ల కింద భూమి లేకున్నా, ఉన్నదేదో తొలుచుకు పోతున్నట్టు, పరిసరాలన్నీ బొంగరంలా తిరిగిపోతున్నట్టు. “నా పంచప్రాణాలు నన్ను గుర్తుపట్టడం లేదా...” ఉష ముప్పుని గమనించి సర్ది సరిచేసేలోపలే అతలాకుతలమైపోయాను. జావగారిపోయాను. అది మొదటిసారి.. నా బిడ్డ నా నుంచి వేరు అన్న స్పృహ ముల్లై గుచ్చిన తొలిక్షణం.

మళ్లీ ఈ రోజు– అక్టోబర్ 29 – పింకి తల్లి పుట్టిన రోజు నాడు– ఇల్లంతా సందడి సందడి చేసిన తన స్నేహితులంతా తన GRE... IELTS తన కెరీర్ ... తన రెక్కలు... తన లోకం అంటూ కొత్త ఆకాశాల వైపు వేలు సాచి

చూపిస్తుంటే, “మళ్లీ పుట్టిన రోజుకి ఎక్కడ ఏ దేశంలో ఉంటుందో.....” అంటుంటే ఆనాటి ఉలికిపాటే కలిగింది మళ్లీ.

తన ఆరిందపు ఓణీ చెంగు ఆనందాతిరేకంగా రెపరెపలాడ్తుంటే Happy Birth Day పింకి తల్లి – అని నోరారా అనలేకపోయాను డగ్గుత్తిక వల్ల.

◆◆ ◆◆

**(29.10.2016)**

# నాన్న అంటేనే గాయం

'గోవిందా' అని పిలిస్తే ఉలికిపడేవాడా కృష్ణుడు?

గోవర్ధనాన్ని గోటితో ఎత్తిన కొండంత కీర్తి గోవింద నామం అయ్యాక, గోవిందా అని పిలిచినప్పుడల్లా అదరిపడేవాడా?

'గొర్రెల కాపరి'గా తనని తలిస్తే తుళ్ళిపడేవాడా ఏసుక్రీస్తుడు?

చిక్కటి చీకటి మృత్యులోయల్లో కూడా నన్ను కాచే కాపరివి అని కీర్తనలు విన్నప్పుడల్లా గగురుపడేవాడా?

అదేమోగానీ, నా చిట్టి తల్లీ! నాన్నా అని వినిపించిన ప్రతిసారీ నేను మాత్రం బెదిరిపోతున్నాను.

నాన్న అంటే చిన్నదో... చితకదో ఓ కూటమికో... కుటుంబానికో.... గోవిందుడు అవ్వాలిగా?

గోవర్ధనం కాకపోయినా గాలివిసురుకి గొడుగునైనా ఓపగలగాలిగా?

కనీసం కూతురుకైనా కాపరి కావాలిగా?

మెత్తని పచ్చిక బయిళ్ల మీద సేదదీర్చక పోయినా కంకర రోడ్డు మీదకి జారిపోకుండానైనా కాపాడుకోగలగాలిగా?

నాన్న అంటే రెక్కల కింద పొదువుకోవడం అయితే, నాన్న అంటే చిటెకెన వేలుపట్టి నడిపించడమైతే, నాన్న అంటే అలజడి అలల తీరాన లంగరైతే, నాన్న అంటే ఊరట... తెరపి... నమ్మకం... భరోసల నానార్థమైతే–

................ నాన్నా అని నువ్ పిలుస్తున్నప్పుడల్లా వణికి పోతున్నాను.

చెయ్యెత్తు నీ దేహం ఎగిరిపడి నడిరోడ్డు మీద జారిపోయినప్పుడు, లేతాకులా చీరుకుపోయి ఒళ్లంతా నెత్తిమయం అయినప్పుడు, నిశ్చేష్టంగా నేను నిలిచిపోయినప్పటి నుంచీ నాన్నా అని వినిపిస్తున్నప్పుడల్లా గడగడలాడుతున్నాను.

నాన్న కన్నీరవుతాడని నొప్పిని పంటికింద నొక్కి, "అట్లగని పెద్ద బాధా ఉండదు '– అనేనా నాన్నా నీ 'మో' అంటారంటావ్..." అంటున్న ఆరింద కన్నా! దెబ్బ తగిలినప్పుడు 'అమ్మా' కాదు, 'నాన్నా' అనే నాన్నకూచీ!

నీకు తెలుసా– అసలు నాన్న అంటేనే గాయం!

**(08.08.16)**

# PROPOSAL DAY:
# వలపు నలుపో తెలుపో?

ఈ రోజు ప్రపోజల్ డే అట, స్వీయ సౌందర్య భారంతో సోయగాల దండలోంచి రాలిపోతున్న గులాబీ రేకుల వంటి metaphoric సందేశాలతో నిన్న ఓ మిత్రురాలు గుర్తు చేసింది, తను ప్రపోజ్ చేస్తానికో, నన్ను ప్రపోజ్ చేయమనో....

– చెప్పాను ఉషకి.

“ఎవరు పెట్టారీ పేర్లు, మన చెవుల్లో పూలు పెట్టినట్టు. ఇది కాలీఫ్లవర్ ఏమిటి, పువ్వుల పరువు తీస్తూ...,” కాలిఫ్లవర్ ముక్కల్ని వేడినీళ్లలో ఉడికించడానికి జారవిడుస్తూ అంటోంది ఉష.

“వేలంటైన్ వారంలో రెండవ రోజు, అంటే ఫిబ్రవరి 8– ఈ రోజు ప్రపోజల్ డే అని నారింజ silhouette వంటి సాంధ్య సంజ్ఞలతో నిన్న ఓ నేస్తురాలు గుర్తు చేసింది, ఆకు మడిచి ఇవ్వడానికో, నన్ను ఇవ్వమనో....”

– మళ్లీ చెప్పాను ఉషకి.

“ఆకు అంటే గుర్తొచ్చింది, ఏమీలేని ఆకు ఎగిరెగిరి పడుతుందనీ, ఆ ఇన్విజిలేటర్ ....” నిన్న స్కూల్లో జరిగిందేదో చెప్పబోయింది తను.

“భూమ్యాకాశాలకి చెందని ఒక త్రిశంకు ప్రణయలోకానికి వేసిన ఏడే ఏడు పచ్చిక మెట్లు... రెండవ మెట్టు మీద తుమ్మెదలకి అందిస్తున్న పుప్పొడి వంటి పరాగాల గుసగుసలతో నిన్న ఓ హితురాలు గుర్తు చేసింది, రెక్కలు తొడగడానికో, నన్ను తొడగమనో...”

– గొణుగుళ్లు, సణుగుళ్లు, నయగారాలూ, నంగిరితనాలూ నిషేధించిన బాహాట రాజ్యానికి ఉష రారాణి కాబట్టి, తను చెవి దగ్గర నా కంఠాన్ని తోలు ఢంకాలా వేదికెక్కించి మరీ మోగించాను, కొంత అసహనంతో.

“బుచ్చిబాబు గారి ‘తనను గురించిన నిజం’ కథ విశాలాంధ్ర వాళ్ల మొదటి

సంకలనంలో ఉందా, రెండవ దాంట్లోనా?" నన్నేదో అడుగుతున్నట్టుగానే అనిపిస్తున్న ప్రశ్న వంకీల కొక్కానికి ఒక కొంటెనవ్వుని తగిలించింది ఉష.

వినలేదో, వినిపించుకోలేదో అని మూడుసార్లు వాగాను గానీ, తను మొట్టమొదటే విన్నదని అర్థమయ్యింది. 'తనను గురించిన నిజం' కథ ప్రస్తావనతో పుండు మీద కారం చల్లినట్టనిపించింది.

కారణం బోధపడలేదు గానీ, బుచ్చిబాబు గారి మీద కోపమొచ్చింది. 'నేను పుట్టిన సంవత్సరమే ఆయన పోయారు (లేదా ఆయన పోయిన ఏడాదే నేను పుట్టాను)' అనుకోవడం ద్వారా ఆయనతో ఏవో దగ్గరతనాలు కలుపుకొనే నాకు, ఈ రోజు మాత్రం ఆయన మీద తెగ కోపమొచ్చేసింది, ఆ కథ ఎందుకు రాశారా అని:

ఆ కథానాయకుడు రామ్మూర్తి– 'గతించి పోతున్న యవ్వనానికి శరీరం ఇచ్చే వీడ్కోలు తాలూకు కోలాహలం'లో ఉన్నప్పుడు, భార్య శాంత, పిల్లా పీచూకి ముఖం తిప్పేసి, తన 'నిజస్వరూపంతో పెనుగులాడుతున్న' సందర్భంలో ప్రియభారతి అనే ఒక చిన్ననాటి నెచ్చెలి ఉత్తరం రాస్తుంది– తనని ఏకాంతసీమలకి లేపుకుపొమ్మని. అతని అర్ధాంగి శాంత చదివి మరీ తెచ్చిస్తుందా ఉత్తరం తనకి. ఆ తర్వాత మరో రెండు మూడు ఉత్తరాలు ఆమె దగ్గర నుంచి. వాటిని కూడా శాంతే భద్రంగా ఇస్తుంది రామ్మూర్తికి; ఇవ్వడమే కాకుండా, దానికి సంబంధించి ఒక్కటంటే ఒక్క మాటైనా మాట్లాడదు. ఇక లాభం లేదని, 'అన్ని బంధాల్ని వదిలి రివ్వున ఎగిరి వచ్చేస్తున్నట్టు..' తానొక రిప్లై రాసి అది కూడా భార్య కంట పడేలా చేస్తాడు. అది చూసి కూడా, 'చాకలి పద్దు దాసుగాణ్ణి చూడమనండి, ఇంకా రెండు తువ్వాళ్లు....' అంటూ ఏదో మాట్లాడుతుందే గానీ, ఉత్తరాల గురించీ, కూలిపోబోతున్న తన కాపురం గురించీ మాట్లాడనే మాట్లాడదు.

నిజానికి ప్రియభారతి పేరిట వచ్చిన ఉత్తరాలు అతను కల్పించినవే కావొచ్చు, కానీ శాంత పట్టించుకోదు, అసూయ కాదు సరికదా, కొంచెం కుతూహలం కూడా లేదు. అంటే....

"ఏ స్త్రీ అయినా తన భర్తను ప్రేమించిందంటే, శాంత నమ్మలేకుండా వుందన్నమాటేగా! ఎంతవరకూ తన భర్త స్త్రీల ప్రేమకి పాత్రుడో, అర్హుడో అని తేల్చుకున్నట్లేగా! దాన్నిబట్టి తనని గురించి ఆమెకి ప్రేమైక జీవిత విషయంలో ఎలాంటి అభిప్రాయం ఉందో..." బోధపడుతుంది, 'తనను గురించిన నిజం' తెలిసిపోయింది.

◆◆ ◆◆

– తన నవ్వుకి నేను ఉడుక్కుంటున్నాననీ, 'తనను గురించిన నిజం' allusion అరణి రాపిళ్ల మీద కల్తీలేని ఆజ్యాన్ని చిలకరించిందనీ తెలిసి తెలిసీ, ఉష మరింత విజృంభించి, అసందర్భం అనిపించే మరో కామెంట్ సంధించింది:

"నువ్వు నిజంగా చీమ లాంటి వాడివి...."

ఒక ఉదయాన్నే కలత కలల నిద్రనుండీ మెలకువలోకి వచ్చిన ట్రావెలింగ్ సేల్స్‌మెన్ Gregor Samsa తన మంచంపై ఒక పెద్ద బొద్దింకగా మారిపోయి ఉండడాన్ని గమనించి ఎంత కంగారు పడతాడో అంతకు వేయింతలు ఎక్కువ బెంబేలు పడిపోయాను, నన్ను చీమల బారులో ఒకటిగా నన్ను ఊహించుకోడానికి. చిన్నప్పటి నుంచీ చీమలంటే నాకెంత అసహ్యమో చెప్పలేను. ఎందుకంత అసహ్యం అంటే కూడా చెప్పలేను. క్రమశిక్షణ, రుజువర్తన... వగైరా గుణాలు దానికి సహజాతం కావడం వల్ల నాకు చీదర కాబోలు అనుకున్నా. పుట్టలు పెట్టి, రేపటికి దాచుకుంటుంది కాబట్టి, నాకు ఎక్కడ లేని రోత కావచ్చులెమ్మని విశ్లేషించుకున్నా. చీమల దండు కనబడితే, మదమెక్కిన మత్తగజాల గుంపు (జస్ట్ ఫర్ ఊహ సేక్) ని చూసినట్టు panic అయిపోతాను.

ఇవన్నీ బాగా తెలిసి కూడా ఉష నన్ను 'చీమ' అనడమేమిటి?

నేను అడిగేలోపే చెప్పింది తను:

"చీమ ఈశ్వర కటాక్షం కోసం ఘోర తపస్సు చేసింది. 'భక్తా ఏమి నీ కోరిక?' అని శంకరుడు చీమ ముందు ప్రత్యక్షమయ్యాడు. 'నేను కుట్టగానే చావాల'ని వరం కోరుకుందా చీమ. 'తథాస్తు' అన్నాడు శంకరుడు. తాను కుట్టిన వాడు చావాలని చీమ కవిభావమైతే, తన వాక్యంలోని ambiguity వల్ల, తాహతుకు మించి ఆశించిన పేరాశ వల్ల ఆనాటి నుండి చీమ కుట్టడం మనిషి దాన్ని నలిపి చంపడం జరుగుతున్న చరిత్ర. అలాగే, 'నేను వలచి వరించగానే పడిపోవాలని 'కోరుకున్నావు శివుడ్ని; ఆయన 'తథాస్తు' అన్నాడు. అప్పటి నుంచీ, నువ్వు వలచి, వరించి, 50 శాతపు ప్రేమ పర్యంకాన నువ్వు బొక్క బోర్లా పడిపోవడం జరుగుతున్న తంతే కదా....."

◆◆ ◆◆

పాత సినిమాల్లోలా తల పగిలేంత దెబ్బ పడితే.... రింగులురింగులుగా తిరుగుతూ గత జన్మలో, పాత జ్ఞాపకాలో గుర్తుకొచ్చినట్టు, నా నూనూగు మీసాల నాటి నుంచి ఇప్పటి వరకీ ఎన్నో కతలు తోసుకొచ్చి, వాటన్నింటినీ గుదిగుచ్చి కలిపి కుట్టే motif దారం ఒకటే మచ్చుగా వియోగ విలాపాల రంగులో మాత్రమే ఉన్నట్టు తెలివొచ్చి–

– ఏడంటే ఏడు మెట్లెక్కేస్తే ... 'అదిగో నవలోకం... వెలసే మన కోసం...' అంటూ యుగళించవచ్చనీ అనుకుంటావా, పాపం రెండో మెట్టు దగ్గరే నీ మొహం మొత్తి...

– మోహించబడటానికి మహా మహా పులికాట్ సరస్సునే కావాలా.... చిరు చిత్తళ్ల నీటి గుంట కూడా నచ్చేయదా ఒక్కోసారి.

– కానీ, నీళ్ల మడుగని భ్రమపెట్టింది ఒట్టి ఎండమావి అని తెలిసిపోతునప్పుడు మొహం మొత్తడం కాదు, దూరపు కొండల నునుపు అద్దం బద్దలైనంత కచ్చి రేగి...

.. నువ్వేమో చీమలా ఇలా అన్నమయ్య అప్పుడెప్పుడో రేకెత్తించిన ఈ సందేహం కింద పడి నలిగి ..

నాకుఁ జెప్పరె వలపు నలుపో తెలుపో

నూకి పోవఁగరాదు నుయ్యో కొండో!

◆◆ ◆◆

**(08.02.2014)**

# కడగనివ్వు చెలీ! నీ క్షమాపాదాలు

తన విషయంలో ఎంపికకి సంబంధించిన సమస్య ఏదైనా పూర్తి నమ్మకంగా నా నెత్తిన పెట్టే మా పెద్దోడు (నైమిష), 'అమ్మాయిల వర నిర్ణయం' అని ఈ మధ్య వచ్చిన ఓ మాటల సందర్భంలో అడిగిందిలా:

"నాన్నా! అచ్చం నీలాంటి వాడే వలచి (నిన్ను కాదు, నన్ను) వచ్చి అల్లుడౌతానంటే, నీ రియాక్షన్ ఏమిటి?"

"ససేమిరా అంటాను, చస్తే ఒప్పుకోను..."

"ఎందుకలా నాన్నా? నువ్వు అమ్మని చూసుకున్నట్టు వాడు అక్కని చూసుకుంటాడు?"– శ్లేషతో వెక్కిరించేంత ఆరింద కాదు చిన్నోడు (ప్రహర్ష)!

"'వాడు' ఏంటే... బొత్తిగా మర్యాద లేకుండా, కాబోయే బావగార్ని పట్టుకొని.." అని కొంటెగా కోప్పడుతున్న పెంకి పెద్దోడ్ని, "virtual reality లో కూడా లేదు కాబట్టి ప్రస్తుతానికి 'వాడు' మాత్రమే వాడతాను..." అంటున్న చిలిపి చిన్నోడ్నీ నా రెండు రెక్కల కింద పొదువుకునే విఫలయత్నం చేస్తూ అన్నాను:

"అదే కదా తల్లులూ, అమ్మ పడ్డవి / పడుతున్నవీ నా బిడ్డలు పడాల్సి వస్తే, పడాల్సి వస్తుందన్న ఆలోచన వచ్చినా భరించగలనా?"

◆◆ ◆◆

ఈ డిసెంబర్ 8కి 23 ఏళ్లు నిండిన సాహచర్యం, 'tip of an iceberg' లా confessions, ప్రకాశంగా కొన్ని, పిల్లలకి చెప్పలేనివీ, చెప్పుకోలేనివీ స్వగతంగా ఇంకొన్ని:

**ప్రకాశంగా:**

పెళ్లి తర్వాత అన్నవరంలో సత్యనారాయణ స్వామి వ్రతం తప్ప మరేమీ చేయడానికి వీలుకాదని అమ్మమ్మ వాళ్లు అన్నారని, వాళ్ల ఆచారం ప్రకారం డిసెంబర్ 8 పెళ్లైన రోజునే అన్నవరం బయిల్దేరాం.

**స్వగతంగా:**

ఈ అపసవ్యాల ఒంటరిదారికి / ఏడడుగుల పారాణి ముద్రలేసావా?/ క్రమసంబంధాల పసుపు బంధనాలకి అక్షింతల్జల్లిన నిర్భయ ఘడియలో/ నీ చిటికెన వేలిటివ్వు / మొక్కుబడి ప్రయాణాల రొచ్చులో/ ఆధ్యాత్మికంగా జారుతూ/ ఒంపునొక్కుల ఓనమాలు దిద్దిన వేళ్ళు/ తమకాన్ని కుదుపుల్లోంచి కొసరి కొసరి (నీడల్లేని చీకట్లో – 1993)

**ప్రకాశంగా:**

డిసెంబర్ 9, 1993– ఏకాదశి: 'మూలతో బ్రహ్మరూపాయ/ మధ్యతశ్చ మహేశ్వరం/ అథతో విష్ణురూపాయ/ త్ర్యైక్య రూపాయతేనమః'

– అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దివ్యక్షేత్రం!

నా ప్రయాణపు పాట్లు... భంగపాట్లు గురించి మీకు తెలియందేముంది తల్లులూ! ఒకటా.... రెండా....... సుమారు 350 కిలోమీటర్ల ప్రయాణం, పెళ్ళికారులో షికారు కావడం వల్ల కారు వాసనే పడని నాకు దారంతా వాంతులు, ఉదయాన్నే అన్నవరం చేరేసరికి నా ఆపసోపాలూ, అసహనం. దానికితోడు హామీ ఇచ్చిన విలేఖరి పత్తా లేదు (ఇంజనీర్ ఉద్యోగం వదిలేసి, పత్రికల్లో చేరా కదా అప్పటికే), పిలిస్తే పలికే దిక్కు లేదు, అసలు పిలిచే ఓపికే లేదు. అప్పుడు దిగింది మీ అమ్మ రంగంలోకి. అప్పటిదాకా 'ఆకులందు అణిగిమణిగి అర్థాంగి కోకిల కూయవలె'నన్న తరతరాల ఆర్యోక్తులకి జంకి నింపాదిగా కనిపించిన మీ అమ్మ, అప్పుడు దిగింది బరిలోకి– '... యజ్ఞాశ్వముల్ గాలులై, తరగలై, తావులై, పుప్పోళ్లు, కుంకుమల్, పొగలి...' నలుదిక్కుల సాగిన నలుగురు 'ఆశాదూతల'కి తానొక్క పెట్టు అయ్యి, దూకింది నలుదెసలు. కొందర్ని అడిగింది, మరి కొందర్ని అదిలించి, కదిలించింది. ఒక వంక రూమ్స్ ఏర్పాటు చేయడం, మరో పక్క వ్రతానికి సిద్ధం చేయడం అన్నీ చకచకా చేసేసింది, ఆ రెండుపదులు దాటీ దాటని అమ్మాయి– మీ అమ్మ! ఆమె వ్యవహార్తత్వం, managerial skills కీ మాత్రమే సంబంధించిన విషయం కాదిది. శత్రుశిబిరంగా కాకపోయినా, ప్రత్యర్థి కూటమిలా ప్రతి విషయాన్నీ పట్టి, భూతద్దంలోంచి పరకాయించి చూసే అత్తవారింటి అంచనాల్లో తాను ఎలా ఎంచబడతానో అన్న జంకు– మెడలో తాళి అంత గుదిబండై అడ్డుపడుతున్నా, కార్యపాలనకి ముందుకు దూకిన ఆమె presence of mindకి సంబంధించి కూడా. అత్తవారంటూ అనుమానించి, వాళ్లని ఆడిపోసుకోడం దాకా ఎందుకు, తన సమర్థతకి సవాళ్లు ఎదురైతే మొగుడు హోదాలో ఉన్నవాడికి ఎక్కడలేని స్వాభిమానం

పొడుచుకొచ్చేయదా? సగటు... సామాన్యతలకి ఓ మెట్టు ఎగువనుంటే, అటువంటి క్రియాశీలక సమయాల్లో పైకి 'ఘటికురాలు' అనొచ్చేమో గానీ, 'గయ్యాలగచ్చు' అనుకోవచ్చు లోపల. పెళ్ళాం పటిక బెల్లం పలుకుగా కాదు, పచ్చ కప్పురం సెగలా తోస్తుంది. ఇటువంటి binary oppositions మధ్య నవ వధువుగా నెట్టుకురావడం, నెగ్గుకురావడం గాలిలో తాడు మీద నడక వంటి విన్యాసం; నాకు harbinger కూజితంగా వినిపించిన సందర్భం, మీ అమ్మ పాలిట మూడో నెంబర్ ప్రమాద సూచికై హెచ్చరించడం వంటి వైరుధ్యం; చిన్నోడా! నువ్వు jovial గా అంటుంటావే – boon and bane అని, అటువంటి ద్వంద్వ విపరీతం అది. అలాంటి సంకట స్థితికి మిమ్మల్ని నెట్టేయగలనా? అటువంటి అసిధారావ్రతాల పాలిట నా బిడ్డల్ని పడేస్తానా?

"అంతేలే, అమ్మంటే ఎవరో కన్నబిడ్డ, ఏ గాలికో ధూళికో పెరిగొచ్చిందేమో, అదే గాలిధూళి పరం చేస్తే ఏమవుతుందిలే?"– కొంచెం ఉక్రోషం పెద్దోడి గొంతులో.

"ఎంత మాటరా పెద్దూ! అత్తెసరు బతుకుల సగటు జీతగాడ్ని, నేనేం పెంచాను, పెంచుతున్నాన్రా మిమ్మల్ని; అమ్మ నిజంగానే అసూర్యంపశ్య, పెళ్లికి ముందు! ఇల్లూ వాకిలీ... గొడ్డూగోదా... పాలేర్లూ పనోళ్లు..! 'అసలు మీకు తూగే సంబంధం కాదు...' అని డోడో తాతయ్య నోరు జారాడని మావైపు వాళ్లంతా ఎంత గింజుకున్నారనీ. ఎవ్వర్నీ తక్కువ చేసే ఉద్దేశంతో అనలేదనీ, ఇరవై ఏళ్ల పాటు ముద్దుల మనవరాల్ని గుండెల మీద వేసుకొని పెంచిన, ఆ ఊసకాళ్ల ఉలిపిగొట్టుని తన మెడల మీద ఉత్సవమూర్తిగా ఊరేగించిన తాత మురిపెమే అదీ అనీ ఎవ్వరికీ అర్థం కాలేదు. మీరు బైటకెళ్లొస్తే చాలు, మీకు దిష్టి తీసేయనూ, అలాగన్నమాట. ఊళ్లోళ్ల కళ్ల మీద నిందలేయడం కాదు, నా వరాల తల్లుల చక్కందనాల్ని మళ్లీ మళ్లీ తలుచుకొని మెటికలిరవడం వంటిదది!"

"నీతో చిక్కే ఇది నాన్నా. 'క్రూరకర్మములు నేరక చేసితి'వి అనడానికి లేదు. అందుకే 'నేరము లెంచకు రామా...' అని మొరలిడటానికీ లేదూ. 'ఇంత తెలిసి యుండీ ఈ గుణమేలరా...' అని మాత్రం నిలదీయాల్సి వస్తుంది. అంత సుకుమారంగా పెరిగొచ్చిన కొత్త పెళ్లికూతురు చేత రెండంతస్తులు నీళ్లు మోయిస్తావా, కొత్త కాపురంలో..."

"కొత్తకాపురం సంగతి తర్వాత గానీ, పెళ్లై పదార్రోజుల పండగైనా అయ్యిందో లేదో, తనని పుట్టింట్లో వదిలి కొలువుకి బయిల్దేరిన భారమైన వియోగ క్షణాల్లో నిస్సిగ్గుగా అడిగేశాను ఖర్చులకి డబ్బులు. నేను– నువ్వు అని తేడాలు అప్పటికీ– ఇప్పటికీ ఎన్నడూ ఎంచని ఆమె, డబ్బులు కోసం చేయి చాసినందుకు బాధపడలేదు. కానీ, చిట్టచివరి రూపాయి వరకీ జేబు ఖాళీ చేసుకోడం మాత్రమే తెలిసిన దుబారా దూలగొండిగాడితో జీవితాంతం నడవాల్సిన అప్రమత్తపు దారుల ఎగుడుదిగుళ్లకి ఆయత్తపడింది.

"ఇంజనీరుగా ఉద్యోగం వదిలేసి, జర్నలిస్టుగా కొత్త కెరీర్ మొదలెట్టడంలో ఆదర్శమే ఉందో, అలా అనిపించే బులపాటమే ఉందో గానీ, తక్కువ జీతం అని చెప్పుకోడానికి

మాత్రం నామోషీ అడ్డొచ్చి అబద్ధం చెప్పాను, అత్త వారికే కాదు, కొత్త కాపురంలో కాడి భుజానేసుకున్న ఆలికి కూడా. ‘ఈలోకం మీదేనండి! మీ రాజ్యం మీరేలండి ...’ అన్నంత డాబుగా, కుటుంబ పగ్గాలన్నీ తనకే ఇచ్చేస్తున్న మెహర్బానీగా ఆకాశమంత ఆమె కొంగులో దిమ్మరించాను, నా బొటాబొటీ సంపాదన. ఓ ఎర్ర యాగాణి చేతిలో పెట్టి, ‘ఇదే వందనుకో... వెయ్యనుకో....’ అన్నాను కదా అని, Tit for Tat గా ఇదే పప్పనుకో.. ఆయనుకో... కూరనుకో.. చారనుకో.. పెరుగనుకో అనలేదు తను. నాతోనే కాదు, ఎంతమందికి వండి వడ్డించాల్సొచ్చినా ఏనాడూ అనలేదలా, నాకు తెలిసిన ఈ డొక్కా సీతమ్మ మీ అమ్మ!”

ఆపై కూతుళ్లకి నోరు విప్పి పైకి చెప్పలేక, లోలోపల గొణుక్కున్నాను, ఆనాటి తలపోతని ఓ సొదలా:

రోజు మార్చి రోజు వచ్చే నీళ్ళు రెండో ఫ్లోరులో ఉన్న ఎమ్ఐజీ ఫ్లాటుకి మోసుకెళ్లాల్సిన కొత్త పెళ్లికూతురు అగచాట్ల వరకే చెప్పాన్రా అమ్మలూ మీకు. మీ అమ్మకి సాయం వెళ్లకపోవడానికి, బలవంతాన KPHB కాలనీ నుంచి దూరంగా వారాసీగూడకి వచ్చేయడానికి కారణం చెబితే క్షమిస్తారా నన్ను? ముక్కూమొఖం తెలీని ఎవరో అమ్మాయి వల్ల మీ అమ్మ నీళ్లు మోస్తున్నా, నా గది దాటి రాలేదనీ, ఆ అమ్మాయి వల్లే ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయామనీ తెలిస్తే అసలు క్షమిస్తారా? నా కతలు... కైతలు.... ఏ రాతలైన ఏమున్నది గర్వకారణం, ‘నీ రాతకోతల చరిత్ర సమస్తం– పరస్త్రీ పరాయణత్వం.... పరకాంత స్మరణోద్యోగం’ అన్న ఒక జనరల్ prejudiceతో నేను రాసినవేవీ చదవలేదు కాబట్టి సరిపోయింది గానీ, లేకపోతే, నేను అప్పుడే కథగా రాసిన ఆ అన్య గురించి ఇప్పుడిలా జనాంతికంగా confess చేసుకునే వీలుండేదా?

ఫస్ట్‌ఫ్లోర్‌లో ఉండే ఆ అన్య నాకప్పటికి (ఇప్పటికి కూడా) ఓ శిల్ప లావణ్యాల silhouette గానే తెలుసు. గుబురు గుబురు మొగిలి పొదల రహస్యాన్ని మత్తుగా చీల్చే గాలి పరిమళమై దిక్కులు లెక్కచేయని రికామీతనమై కమ్మేది తన వెంట ఉన్నా, తన తలపుల వెంట ఉన్నా కూడాను. బంగారపు ద్రావకాన్ని పాలతో రంగరిస్తే వచ్చే లేత పసుపుఛాయని ఆ దైహిక భ్రమకి ఆపాదించి, వయసు అటూఇటూగా ఇరవై ఏళ్లని ఖాయం చేసుకున్నాను.

మొదట్లో తనని చూడాలనుకోడానికి, అస్సలు చూడకూడదనుకోడానికీ మధ్య ఊగిసలాడటానికి కాలలోలకానికి పట్టుమని పదిరోజులు పట్టలేదు. ఈ లోపే అన్యగా అనిపించి, తొందర్లోనే అనన్యగా తోచింది. ఎప్పట్నుంచో

ఎదురుచూస్తూ, ఎక్కడెక్కడో వెతుకులాడిన నా ఆమె కచ్చితంగా తనే, ఇంత చేరువగా, నాకు కొన్ని మెట్లు దిగువున ఉంటుంది అన్న ఊహల్లో ఉయ్యాలలూగాను. తను మసక చీకట్లలో మెట్లు దిగుతుంటే– 'రెక్కలతొ పైకెగిరి సుక్కల్లే దిగుతాది' అనుకున్నాను. 'కొత్త నవ్వులకులుకు కొత్త మెరుపుల తళుకు....' నా ఊహాపోహల్లో ఆమెకి అద్దుకున్నాను. ఇక అప్పుడు మిగిలిందేమిటి? 'తెలివి రానీయకే కల కరిగిపోతాది..' అనే కదా వేడుకోవాలి, మెలకువకి దూరంగా పారిపోవాలి! నేను చేసిందీ అదే. వంతుల వారీగా వచ్చే మంజీరా నీళ్లు మరుసటి నెల తెల్లారాక వచ్చేవి. నేను అప్పుడు కిందకి వెళితే, ఆమె కనిపిస్తుంది; పగటి రేకుల వెల్తురు ఖడ్గం నేను చెక్కుకున్న మంచుశిల్పాన్ని ఛిద్రం చేసేస్తుంది. కల కరిగిపోడమే కాదు, ముక్కలవుతుంది. అందుకే నేను గదిలో ఒక్కడినే సుక్కి, అల్లారు ముద్దుగా పెరిగిన ఉష చేత నీళ్లు మోయించాను. నీళ్ల నెపమే పెట్టి, అక్కడ నుంచి బిచాణా ఎత్తేసి వారాసీగూడ వెళ్ళిపోయాం.

**ప్రకాశంగా:**

"నెపాలకీ... నిజాలకీ తేడా తెలియని బేల కాదు...."

"లోపల్లోపల సణుక్కుంటూ పైకే అనేశావా, మా అమ్మ గురించేగా! ఏ దాచిన నిజాల నీడల్లో దాగని నెపాల జాడలు చూసింది?" నిలదీసింది పెద్దోడు.

"ఇదనీ అదనీ ఏముంది? అన్నీ... ఏవైనా.... నా కళ్లలోకి చూసి పసిగట్టేస్తుంది నిజానిజాల్ని. కానీ, పట్టుబడిన న్యూనత నుంచి దొంగని తప్పిస్తుంది, అంతా తనలో దాచేస్తూ. ఎన్ని కాకి బంగారపు భుజకీర్తులు తొడిగినా, స్త్రీ సహింపులో, భరింపులో గత్యంతరం లేని, మరో మార్గాంతరం ఉండని నిస్సహాయత, అభద్రత ఉంటాయి. మీ అమ్మది భరింపు, సహింపు కాదు, క్షమ, ప్రేమ. అంతే కాదు, అడిగి మరీ నా నుండి విధేయతని దేబిరించడం ఇష్టంలేని రోషమనిపించే స్వాభిమానం. 'ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును, ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును...' తరహా లావాదేవీలు నచ్చని స్వాతిశయం."

"నీ convenience కోసం అరకొర చెప్పి manipulate చేయకు నాన్నా? 'మాయామర్మం లేని నేస్తము/ మగువలకు మగవారి కొక్కటే/ బతుకు సుకమునకు రాజమార్గము/ ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును, ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును' అని కదా గురజాడ వారు చెప్పింది. నిష్కామమైన ప్రేమే కదా నిజమైన loyalty అంటే; అది కూడా ఆడా–మగా తేడా లేకుండా పరస్పరం ఇచ్చిపుచ్చుకోవల్సిందని కదా అక్కడ అర్థం. అసలు ఒకరి మీద ఇష్టం ఉంటే, వేరొకరి మీదకి చూపు ఎలా పోతుంది," అని మా ముదినాపసాని అడుగుతుంటే ఏం చెప్పను?

నాకు తెలిస్తేగా చెప్పడానికి! అప్పట్లో ఓ యూనివర్సిటీ అకవి కవితాసంకలనాన్ని వదరుబోత్తనం అనిపించే సూటైన ఘాటు విమర్శ చేసిన ఫలితంగా ఉద్యోగం పోగొట్టుకొని,

ఉష దగ్గర ఉన్న డబ్బులన్నీ ఊడ్చేసి, ఇంటి సామానంతా ఇల్లుగల్ల వాళ్ల అటకమీదకి సర్ది, తనని ఊళ్లో దింపి మరో ఉద్యోగం వెదుకులాటకి తిరిగి హైద్రాబాదు వచ్చాను. ఉషని వదిలి వస్తుంటే, నా ప్రాణాన్నే అక్కడ విడిచి ఒట్టి శరీరమాత్రంగా వచ్చేసినంత దిగులు. నీళ్లూరే కళ్లు మసకబరిచాయి దారి దారంతా. చిత్రంగా, సికింద్రాబాదులో రైలు దిగీదిగగానే, బస్టాపులో పాతస్నేహితురాలు కనబడి, కళ్లు వెలిగి, కబుర్లాడుతూ తన వెంట తోకూపుకుంటూ సెంట్రల్ యూనివర్సిటీ హాస్టల్ దాకా వెళ్లి తిరిగొస్తుంటే నన్ను వెన్నంటి వెంబడిస్తున్న అపరాధభావం ఎత్తిచూపిన నా అవిధేయతనే ఒక పశ్చాత్తాప కవిత **(గొలుసూడిన లంగరు - ఓ కొయ్యముక్క- నవంబర్, 1994)**గా ఉషకి ఉత్తరం రాశాను.

◆◆ ◆◆

**డిసెంబర్ 8, 2016:**

Wedding Anniversary Condolences To Usha!

పనికిమాలిన పశ్చాత్తాపాల పెళ్ళిరోజు పండగకి 23 ఏళ్లు. Happy Wedding Anniversary అని 23 సార్లు అన్నానే గానీ, 'to you' అనలేక పోయాను, 'to me' అని నిండుగా అనుకున్నానే గాని. బిటెక్ 4-1 సెమిస్టర్ చివరి exam కోసం ఏ అపరాత్రి దాకానో చదివిన పెద్దోడు, అక్కకి తోడుగా ఉన్న చిన్నోడూ ఇంకా నిద్రబోతున్నారు. అందుకే వాళ్ల wishes తో ఇల్లు ఇంకా హోరెత్తలేదు.

మార్గశిర రెండవ లక్ష్మీవారం కాబట్టి ఉష నోట కూడా అప్రాచ్యమైన wedding anniversary శుభకామనలు అప్పటికి లేవు. తెల్లవారుజామునే అట్లు, పాయసం నైవేద్యాలుగా పెట్టి, నాకోసం తెచ్చిన కొత్తబట్టలకి పసుపు పెట్టి, పూజ చేస్తోంది, 'ఆదౌ పూజ్యో గణాధిపః' అని మొదలుపెట్టి-

ధగద్ధగాయమానంగా, ఉత్థానపతనాలెరగని నిశ్చలత్వంతో వెలుగుతున్న దీపకళికని చూస్తుంటే, తరతమ భేదాలెంచని ఆ జ్యోతి ప్రజ్వలన ప్రదానాలు గమనిస్తుంటే, ఉషని చూస్తున్నట్టే ఉంది. జగమంత కుటుంబం చేసుకోగలిగిన పరహితేచ్ఛ వల్లే కాదు, ఆ దీపశిఖని ఎత్తిపట్టిన సెమ్మె కింద కీనీడ వంటి ఏకాకితనం వల్ల కూడా!

అందుకే నా యీ అనుశోక గీతం, నిన్నటి పుటల్లోంచి:

ఏడడగులుగా కందిన
ఒంటరి నీ గాయాల్లోంచైనా
వెదురు వెదురు గానే వీస్తున్న మురళీరవాలు

చెక్క చీలికలూ లేని తలుపుల బధిర బంధనాల్లోకి
నిష్ప్రవేశ శోకసంగీతాలు

కావలించిన వయోలిన్‌కు
అంటనే అంటని దీనతంత్రుల స్వరసప్తమి

ఏడు రంగుల మురిపెమిప్పుడు పాలిపోయిన
శ్వేత వైఫల్యం–

ఆరున్నొక శ్రుతిలో ముఖం తిప్పుకున్న
బాట

దోషమంటిన కన్నీళ్ల
కన్‌ఫెషనల్ దోసిళ్లు
కడగనివ్వు చెలీ!
నీ క్షమాపాదాలు–

◆◆ ◆◆

**(13.12.2016)**

Ame

*Naresh Nunna*



ఎంతచుట్టమో నీకునిదివో ఆపె
సంతసపు వలపుల జడిసీ నాపె

\- అన్నమయ్య